www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

## కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు 4% డీఏ

50 శాతానికి చేరనున్న కరువు భత్యం.. జనవరి నుంచి వర్తింపు 12

49 లక్షల మంది ఉద్యోగులు, 67 లక్షల మంది పింఛనర్లకు మేలు

ఉజ్వల లబ్ధిదారులకు రూ.300 రాయితీ మరో ఏడాది.. కేంద్ర కేబినెట్ నిర్ణయాలు

శుక్రవారం | 8-3-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 323 | శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, మాఘమాసం, బహుళపక్షం; తిథి: త్రయోదశి రా. 9.59 తదుపరి చతుర్దశి; నక్షత్రం: శ్రవణం ఉ. 10.42 తదుపరి ధనిష్ఠ; వర్జ్యం: మ. 2.14-3.39; దుర్ముహూర్తం: ఉ. 8.54-9.41, మ. 12.50-1.37; అమృతఘడియలు: రా. 10.43-12.08; రాహుకాలం: ఉ. 10.30-12.00; సూర్యోదయం: 6.32; సూర్యాస్తమయం: 6.21 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



గురువారం రాత్రి అమిత్ షాతో చంద్రబాబు, పవన్

# ‘కలిసి’ గెలుద్దాం!

### కీలక దశకు టీడీపీ-జనసేన-బీజేపీ పొత్తు

### చంద్రబాబు, పవన్‌తో అమిత్ షా, నడ్డా భేటీ

అసెంబ్లీలో గెలవడం మీకు ముఖ్యమే

మాకు ఎక్కువ ఎంపీ సీట్లు ఇవ్వండి

370 స్థానాలు లక్ష్యంగా పెట్టుకున్నాం

అమిత్ షా, నడ్డా ప్రతిపాదన

4 ఎంపీ, 6 అసెంబ్లీల్లో గెలుపు పక్కా

ఇంకా ఎక్కువైతే వైసీపీకి అయాచిత లబ్ధి

మనసులో మాట చెప్పిన చంద్రబాబు!?

ఎన్డీయేలో చేరికపై సుముఖత

న్యూఢిల్లీ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఎన్డీయేలో తెలుగుదేశం, జనసేన చేరిక ఖరారైంది. బీజేపీతో పొత్తు కీలక దశకు చేరుకుంది. పొత్తులో భాగంగా బీజేపీకి ఎన్ని స్థానాలు ఇవ్వాలనే అంశంపై ఢిల్లీలో సుదీర్ఘ చర్చలు జరిగాయి. బీజేపీ అగ్ర నేత, కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆహ్వానం మేరకు తెలుగుదేశం అధ్యక్షుడు చంద్రబాబు గురువారం

మిగతా 12వ పేజీలో...

## జగన్ గుర్తుపెట్టుకో

ఇది 2009 కాదు.. 2024.. రౌడీయిజానికి భయపడే వ్యక్తిని కాదు 11

జగన్ గుంపు నుంచి రాయలసీమను రక్షించుకుందాం: పవన్ కల్యాణ్

# ప్రజనరీకి విజనా?

### ఇది ప్రపంచంలో ఎనిమిదో వింత: లోకేశ్

### జగన్ చూపిన డిజైన్.. కోడికత్తి గ్రాఫిక్



విశాఖలో బస్‌షెల్టర్ కడితే గట్టి గాలికే కూలిపోయింది

ఫ్లోటింగ్ బ్రిడ్జి ఒక్క రోజులోనే

చిత్తూరును పెద్దిరెడ్డి దోచేశారు

ఇప్పుడు సత్యసాయిపై కన్నేశారు

గనులు, ఇసుక మింగేస్తారు

అందరి జాతకాలూ రెడ్‌బుక్‌లో

మొదట జైలుకెళ్లేది పాపాల పెద్దిరెడ్డే

తల్లికి, చెల్లికే న్యాయం చేయలేదు

ఈ సీఎం ప్రజలకేం చేస్తాడు? 11

టీడీపీ-జనసేన మధ్య చిచ్చుకు యత్నం

వైసీపీ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి

శంఖారావం సభల్లో యువ నేత పిలుపు

### హోదాపై ఏపీకీ, ఫ్యామిలీలో నాకూ

## జగన్ వెన్నుపోటు



రాష్ట్రాన్ని మోసగించిన బీజేపీకి మద్దతు ఇస్తున్న జగన్ కూడా ఫోర్ ట్వంటీయే

హోదా లేక 15 లక్షల కోట్ల నష్టం

పది పరిశ్రమలు కూడా రాలేదు

హోదా సాధన ప్రతిజ్ఞ సభలో షర్మిల భావోద్వేగం

వేదికపైనే కన్నీళ్లు పెట్టుకున్న పీసీసీ చీఫ్

11



అనంతపురం జిల్లా తాడిపత్రిలో వైసీపీ జెండాతో వలంటీర్ చిట్టిబాబు

# వీధినపడ్డ వలంటీర్!

### యథేచ్ఛగా వాడేస్తున్న వైసీపీ సర్కారు

### జగన్‌కు ఓటేయాలని ప్రచారం

### ఇంటింటా కరపత్రాలు పంపిణీ

సోషల్ మీడియాలోనూ ప్రచారం

జగన్ వస్తేనే పథకాలు ఉంటాయట

బాబు వస్తే ఇవ్వరంటూ దుష్ప్రచారం

ప్రభుత్వం నుంచి జీతాలు తీసుకుని అధికార పార్టీకి ప్రచారమా?

గెలుపుపై నమ్మకం లేక అడ్డదారులు

మరోవైపు చెలరేగుతున్న సైబర్‌దొంగలు

లబ్ధిదారుల ఖాతాల్లోని డబ్బు మాయం

‘వలంటీర్లంతా మన వాళ్లే’ అన్న మాటను సీఎం జగన్ నిజం చేస్తున్నారు. ప్రభుత్వం, పార్టీ మధ్య గీతను చెరిపేసి వలంటీర్లను పూర్తిస్థాయి వైసీపీ కార్యకర్తల్లా మార్చేశారు. ప్రభుత్వ ఖజానా నుంచి జీతాలు ఇస్తూ సొంత ప్రచారం చేయించుకుంటున్నారు.

ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందజేసేందుకు నియమించిన వలంటీర్లను వైసీపీ ప్రచారం కోసం వాడుకుంటున్నారు. ‘జగనన్న మళ్లీ వస్తేనే పథకాలు అందుతాయి. చంద్రబాబు వస్తే ఈ పథకాలు రద్దవుతాయి’ అంటూ వారి ద్వారా దుష్ప్రచారం చేయిస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

వచ్చే ఎన్నికల్లో మళ్లీ గెలిచేందుకు వైసీపీ సర్కారు వలంటీర్లను అడ్డగోలుగా వాడుకుంటోంది. ఆ పార్టీ నేతలు రాష్ట్ర వ్యాప్తంగా వలంటీర్లను తమ పరిధిలోని కుటుంబాల వద్దకు పంపించి జగన్‌కు అనుకూలంగా అచ్చంగా ఎన్నికల ప్రచారం చేయిస్తున్నారు. ‘జగనన్న చలువతో కుటుంబానికి ఇంత లబ్ధి జరిగింది. ఇన్ని డబ్బులు ఇచ్చాం’ అంటూ అప్పులోళ్ల లెక్కలు చెప్పినట్లుగా వలంటీర్లతో చెప్పిస్తున్నారు. ప్రత్యేకంగా కరపత్రాలు పంపిణీ చేయిస్తున్నారు. ‘వైనాట్ 175’ అంటూ తరచూ బీరాలు పలుకుతున్న ముఖ్యమంత్రి జగన్‌కు నిజంగానే అంత నమ్మకం ఉంటే అడ్డదారులు

మిగతా 2వ పేజీలో...



## రోజా తాయిలాలు!

మహిళా టీచర్లకు చీరలు, కానుకలు

అంగన్‌వాడీ, మెప్మాలకు కూడా

అందరికీ స్వీట్లు, గిఫ్ట్ బాక్సులు 11

పుత్తూరులో ఉపాధ్యాయినులకు కానుకలు పంపిణీ చేస్తున్న మంత్రి రోజా



## ‘పరపతి’ కోసం పాట్లు

### సర్కారువారి సీఆర్డీయే ‘బ్యాండ్’.. 2వేల కోట్లు తామే కడతామన్న ప్రభుత్వం

ఇన్వెస్టర్లతో దువ్వూరి కృష్ణ వెబినార్.. సీఆర్డీయేకు ఆదాయ మార్గంలేదని వెల్లడి

సర్కారు ఎన్నడూ డిఫాల్ట్ కాలేదని అసత్యాలు.. సీఆర్డీయే సరే.. మరి కార్పొరేషన్ల అప్పులెలా?

2.50 లక్షల కోట్లూ తమ ఖాతాలో వేసుకుంటారా? 2

## మాజీ మంత్రి నారాయణను అరెస్టు చేయొద్దని పోలీసులకు సూచిస్తాం

- హైకోర్టుకు అదనపు పీపీ మౌఖిక హామీ
- ముందస్తు బెయిల్‌పై విచారణ 11కి వాయిదా

అమరావతి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): తనను వేధింపులకు గురిచేస్తున్నారని తన మరదలు పొంగూరు కృష్ణప్రియ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా నెల్లూరు బాలాజీ నగర్ పోలీసులు నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ మాజీ మంత్రి పొంగూరు నారాయణ దాఖలు చేసిన పిటిషన్ గురువారం హైకోర్టులో విచారణకు వచ్చింది. సెక్షన్ 498 కింద కేసు నమోదు చేసినందున నారాయణ అరెస్టుతోపాటు తొందరపాటు చర్యలు తీసుకోవద్దని పోలీసులకు సూచిస్తామని అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ దుష్యంత్‌రెడ్డి మౌఖికంగా హామీ ఇచ్చారు. దీనిని పరిగణనలోకి తీసుకున్న కోర్టు ఈ వ్యవహారంపై పూర్తి వివరాలు సమర్పించాలని పోలీసులను ఆదేశిస్తూ... విచారణను సోమవారానికి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు గురువారం ఆదేశాలిచ్చారు. అంతకుముందు నారాయణ తరఫు సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు వాదనలు వినిపిస్తూ.. సంబంధం లేని కేసులో ఆయనపై సెక్షన్ 498ఏ కింద కేసు నమోదు చేశారని.. దీని వెనుక రాజకీయ కారణాలు ఉన్నాయని తెలిపారు. రానున్న ఎన్నికల్లో నారాయణ పోటీ చేయబోతున్నారని.. ఆయన్ను అరెస్టు చేస్తారనే ఆందోళన ఉందని.. రక్షణ కల్పిస్తూ ఉత్తర్వులివ్వాలని కోరారు.

## మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ రాజీనామా

అమరావతి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ పదవికి వాసిరెడ్డి పద్మ రాజీనామా చేశారు. ఈమేరకు సీఎం జగన్‌కు రాజీనామా లేఖను పంపారు. వైసీపీ కోసం ఎన్నికల్లో పని చేయడం కోసమే రాజీనామా చేస్తున్నట్లు తన రాజీనామా లేఖలో పేర్కొన్నారు. మహిళా సాధికారతకు అర్థం చెప్పిన పాలన గురించి ప్రచారం చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. గురువారం విజయవాడలో ఏపీ జేఏసీ అమరావతి మహిళా విభాగం ఆధ్వర్యంలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న అనంతరం మీడియాతో ఆమె మాట్లాడారు. పేద ప్రజలు బాగుపడాలంటే జగన్ కలకాలం సీఎంగా ఉండాలని ప్రజలకు చెప్పాలనే సదుద్దేశంతో మహిళా కమిషన్ చైర్‌పర్సన్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యేగా పోటీ చేయాలని పార్టీ ఆదేశిస్తే తన స్వస్థలం జగ్గయ్యపేట నుంచి పోటీ చేస్తానని చెప్పారు.

## దళితులపై వైసీపీ దౌర్జన్యం

- రాప్తాడులో పేదల గుడిసెలకు నిప్పు
- అడ్డొచ్చినవారిపై విచక్షణారహిత దాడి
- స్థలం ఖాళీ చేసి వెళ్లిపోవాలని బెదిరింపు
- ఎమ్మెల్యే తోపుదుర్తి అనుచరుల బరితెగింపు

రాప్తాడు, మార్చి 7: రాష్ట్రంలో దళితులపై వైసీపీ నాయకుల దౌర్జన్యాలు ఆగడం లేదు. అనంతపురం జిల్లా రాప్తాడు నియోజకర్గంలో వైసీపీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డి అనరుచులు దళితుల గుడిసెలపై పెట్రోల్ పోసి నిప్పంటించారు. అడ్డొచ్చినవారిపై విచక్షణారహితంగా దాడికి తెగబడ్డారు. ఈ దాడిలో పలువురు జై భీమ్ పార్టీ కార్యకర్తలు గాయపడ్డారు. రాప్తాడు మండల పరిధిలోని ప్రసన్నాయపల్లిలో బుధవారం రాత్రి ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. ప్రసన్నాయపల్లి రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 123-2బీలోని రెండెకరాల స్థలంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన దళితులు సుమారు వంద మంది మూడు రోజుల క్రితం గుడిసెలు వేసుకున్నారు. అప్పటి నుంచి ఆ స్థలం తమదేనని, ఖాళీ చేయాలని వైసీపీ నాయకులు బెదిరిస్తున్నారని దళితులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో వారు గుడిసెలు వేసుకున్న స్థలాలను వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో అప్రూవర్, జై భీమ్ పార్టీ పులివెందుల నియోజకవర్గ ఇన్‌చార్జి దస్తగిరి బుధవారం పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ... పోలీసులను అడ్డుపెట్టుకొని సీఎం జగన్ దళితులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. రాజకీయ నాయకులు భూకబ్జాలకు పాల్పడినా పట్టించుకోరు కానీ, దళితులు గుడిసెలు వేస్తే మాత్రం వారిని అడ్డుకుంటారా అని ప్రశ్నించారు. దస్తగిరి వెళ్లిపోయిన తర్వాత ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి అనుచరులు.. సుమారు 40 మంది కార్లు, ద్విచక్రవాహనాల్లో వచ్చి తమపై కట్టెలు, రాడ్లతో దాడి చేశారని బాధితులు ఆరోపించారు. ఆ తర్వాత తమ గుడిసెలపై పెట్రోలు చల్లి నిప్పంటించారని తెలిపారు. అడ్డొచ్చిన జై భీమ్ పార్టీ రాప్తాడు నియోజకవర్గ ఇన్‌చార్జి నరేశ్, కార్యకర్త విజయ్‌పై దాడి చేశారని, రెండు ద్విచక్రవాహనాలకు నిప్పు పెట్టారని చెప్పారు.

### పోలీసులు పట్టించుకోలేదు

వైసీపీ మూకల దాడిలో గాయపడ్డ నరేశ్, విజయ్‌ని చికిత్స నిమిత్తం అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విజయ్ తీవ్రంగా గాయపడి, లేవలేని స్థితిలో ఉన్నారు. నరేష్ స్వల్పంగా గాయపడ్డారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ.. రాప్తాడు ఎమ్మెల్యే అనుచరులే ఈ దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. వైసీపీ నాయకులు గుడిసెలకు నిప్పు పెడుతున్నప్పుడు బాధితులు రాప్తాడు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారని, కానీ, డ్యూటీలో ఇటుకలపల్లి సీఐ నరేంద్రరెడ్డి పట్టించుకోలేదని వాపోయారు. 'మిమ్మల్ని అక్కడ గు డిసెలు ఎవరు వేయమన్నారు..? మీ ఇష్టానుసారం గుడిసెలు వేస్తారా..? ఇక్కడి నుంచి వెళ్లిపోండి..' అంటూ సీఐ అసభ్యంగా మాట్లాడారని ఆరోపించారు.

## వైసీపీ దళిత సర్పంచ్‌కు అవమానం

- ఫ్లెక్సీ పీకేసిన వైసీపీ అగ్రవర్ణ నేతలు
- పోలీసులకు ఫిర్యాదు చేసినా.. కేసు నమోదు కాని వైనం

నల్లజర్ల, మార్చి 7: వాటర్ ట్యాంక్ ప్రారంభోత్సవం సందర్భంగా హోంమంత్రి తానేటి వనిత ఫొటోతో కూడిన ఫ్లెక్సీ కట్టిన వైసీపీ దళిత సర్పంచ్‌కు అవమానం జరిగింది. అదే గ్రామానికి చెందిన వైసీపీ అగ్రవర్ణ నేతలు ఆ ఫ్లెక్సీని పీకేసి ధ్వంసం చేయడం వివాదాస్పదమైంది. తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండల కేంద్రంలో గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జి, హోంమంత్రి వనిత వాటర్ ట్యాంకును మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన దళిత మహిళా సర్పంచ్ పల్లి జ్యోతి.. హోంమంత్రి తానేటి వనిత ఫొటోతో ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఆ ఫ్లెక్సీని అగ్రవర్ణ నేతలు ధ్వంసం చేశారు. దీనిపై సర్పంచ్ వర్గీయులు మండిపడ్డారు. సర్పంచ్ పల్లి జ్యోతి, ఆమె భర్త సుబ్బారావు వాటర్ ట్యాంక్ వద్ద బైఠాయించి రెండు గంటలపాటు నిరసనకు దిగారు. దళితులను అవమానించిన వారు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల ఎస్సీ నాయకులందరితో కలిసి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. వైసీపీ పెద్దల ఒత్తిడి మేరకు పోలీసులు కేసు నమోదు చేయలేదు.

## డీఈడీ అభ్యర్థులకే ఎస్జీటీ పోస్టులు

- కోర్టు మొట్టికాయలతో వెనక్కి తగ్గిన ప్రభుత్వం
- హైకోర్టు ఆదేశాలతో అర్హతల్లో మార్పులు

అమరావతి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్జీటీ) పోస్టులకు డీఈడీ అభ్యర్థులు మాత్రమే అర్హులని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు గత నెలలో ఇచ్చిన డీఎస్సీ నోటిఫికేషన్‌కు సవరణలు చేస్తూ పాఠశాల విద్యాశాఖ గురువారం ఉత్తర్వులు జారీచేసింది. గత నోటిఫికేషన్‌లో ఎస్జీటీ పోస్టులకు బీఈడీ అభ్యర్థులు అర్హులని పేర్కొంది. ఇది సుప్రీం కోర్టు తీర్పునకు విరుద్ధమని కొందరు హైకోర్టును ఆశ్రయించారు. సుప్రీం ఆదేశాలు పాటించాలని హైకోర్టు స్పష్టం చేయడంతో నిర్ణయం మార్చుకుంది. తదనుగుణంగా సవరణలు చేసింది. ఎస్జీటీ పోస్టులకు బీఈడీ అభ్యర్థుల అర్హతను తొలగించింది. దీంతో డీఈడీ అభ్యర్థులు ఎస్జీటీ పోస్టులు, బీఈడీ అభ్యర్థులు స్కూల్ అసిస్టెంట్ (ఎస్ఏ) పోస్టులకు అర్హులుగా మారారు. ఇప్పటికే టెట్‌లోనూ ఈ మేరకు మార్పులు చేసింది. కాగా ఎస్జీటీ పోస్టులకు ఎవరు అర్హులు అనే విషయంలో జగన్ ప్రభుత్వం నిలకడలేని విధానాన్ని ప్రదర్శించింది. డీఎస్సీ నోటిఫికేషన్ జారీకి 20 రోజుల ముందు ఎస్జీటీ పోస్టులకు డీఈడీ అభ్యర్థులే అర్హులని, సుప్రీం తీర్పు ప్రకారం ఈ ఉత్తర్వులు జారీచేస్తున్నామని ఆదేశాలిచ్చింది. కానీ ఇరవై రోజుల్లోనే మనసు మార్చుకుని అకస్మాత్తుగా బీఈడీ అభ్యర్థులకూ అవకాశం కల్పించింది. అదేంటని ప్రశ్నించగా 'సుప్రీంకోర్టు డీఈడీ అభ్యర్థులు మాత్రమే అర్హులని చెప్పలేదు. బీఈడీ అభ్యర్థులను అర్హులు కారని పేర్కొనలేదు' అంటూ సొంత భాష్యం చెప్పింది. దీనిపై అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు ఆదేశాలతో తప్పనిసరి పరిస్థితుల్లో మొదటి నిర్ణయాన్నే అమలుచేస్తామని ప్రకటించింది. ఇదంతా ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే చేసిందన్న విమర్శలున్నాయి. టీచర్ పోస్టుల భర్తీపై తొలినుంచీ జగన్ ప్రభుత్వానికి ఆసక్తి లేదు. ఎన్నికలు కావడంతోనే చివర్లో ఆగమేఘాలపై డీఎస్సీ ప్రకటించింది. దాన్ని ఎలాగైనా జాప్యం చేసే ఉద్దేశంతోనే కావాలని మెలికలు పెట్టిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

# 'పరపతి' కోసం పాట్లు

- సర్కారువారి సీఆర్డీయే 'బ్యాండ్'
- 2వేల కోట్లు తామే కడతామన్న ప్రభుత్వం
- ఇన్వెస్టర్లతో దువ్వూరి కృష్ణ వెబినార్
- సీఆర్డీయేకు ఆదాయ మార్గంలేదని వెల్లడి
- సర్కారు ఎన్నడూ డిఫాల్ట్ కాలేదని అసత్యాలు
- సీఆర్డీయే సరే... మరి కార్పొరేషన్ల అప్పులెలా?
- 2.50 లక్షల కోట్లూ తమ ఖాతాలో వేసుకుంటారా?

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

తాను దూర కంత లేదు కానీ... మెడకో డోలు! అని సామెత! జగన్ సర్కారు తీరు కూడా అచ్చం అలాగే ఉంది. నిత్యం అప్పులు తెస్తూ, అప్పుల మీదే బతుకుతూ, ఆ అప్పులు తీర్చేందుకు మళ్లీ అప్పులు చేస్తున్న ప్రభుత్వం... సీఆర్డీయే(రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ) అప్పులు కూడా తీర్చేస్తానని బొంకుతోంది. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ ఇన్వెస్టర్లకు హామీ కూడా ఇచ్చేసింది. గురువారం సీఆర్డీయే కమిషనర్ వివేక్‌యాదవ్, సీఎం స్పెషల్ సెక్రటరీ దువ్వూరి కృష్ణ ఇన్వెస్టర్లతో వెబినార్ నిర్వహించారు. ఇండియా బాండ్స్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. 2018లో చంద్రబాబు హయాంలో సీఆర్డీయే బాండ్లు జారీచేశారు. వీటికి క్రిసిల్ ఏఏ+ రేటింగ్ ఇవ్వడంతో... హాట్‌కేకుల్లా అమ్ముడుపోయాయి. ఆ డబ్బును ప్రభుత్వం అమరావతి నిర్మాణం కోసం వాడింది. జగన్ వచ్చాక అమరావతిని అటకెక్కించారు. సీఆర్డీయేకు ఆదాయమార్గం లేకుండా చేశారు. దీంతో క్రిసిల్ రెండుసార్లు అమరావతి బాండ్ల రేటింగ్‌ను తగ్గించేసింది. ఆ ప్రభావం జగన్ సర్కార్ విడుదల చేసిన బేవరేజెస్ బాండ్లపైనా పడుతోంది. ఇప్పుడు బేవరేజెస్ బాండ్లు కూడా తక్కువ రేటింగ్ వద్ద ట్రేడ్ అవుతున్నాయి. సెకండరీ మార్కెట్లో వీటిపై ఎవ్వరూ ఆసక్తి చూపడం లేదు. గత ఏడాది మే, ఆగస్టులో ప్రభుత్వం బేవరేజెస్ బాండ్లు మరోసారి విడుదల చేసినప్పటికీ ఒక్క ఇన్వెస్టర్ కూడా వాటిని కొనలేదు. దీంతో పోయిన పరపతిని పెంచుకోవాలంటే... సీఆర్డీయే బాండ్ల రేటింగ్‌ను పునరుద్ధరించుకోక తప్పదని గ్రహించారు. అందులో భాగంగానే... ఇన్వెస్టర్లతో వెబినార్ ఏర్పాటు చేశారు. సీఆర్డీయే బాండ్లకు సంబంధించిన చెల్లింపులన్నీ ఇకపై ప్రభుత్వమే చేస్తుందని, అందువల్ల డీఎస్ఆర్ఏ అవసరం ఉండదని, టీఎస్ఏలో కూడా ఒక క్వార్టర్‌కు సరిపడా డబ్బులు ఉండేలా ఏర్పాట్లు చేస్తామని ప్రభుత్వం తరఫున సీఎం స్పెషల్ సెక్రటరీగా ఉన్న ప్రైవేటు వ్యక్తి దువ్వూరి కృష్ణ హామీ ఇచ్చారు. సీఆర్డీయేకు ఆదాయం మార్గం లేనందున, ప్రభుత్వమే ఈ బాండ్లు చెల్లింపులు చేస్తుందన్నారు. అసలు విషయం ఏమిటంటే... ఆర్థిక శాఖ నుంచి ఒక్క అధికారి కూడా ఈ వెబినార్‌లో పాల్గొనలేదు. ఆ శాఖ తరఫున దువ్వూరి కృష్ణే హామీలు ఇచ్చేశారు.

### ఇన్వెస్టర్లకు అబద్ధాలు

మీడియాలో రాష్ట్ర ఆర్థిక దుస్థితిపై కథనాలు వచ్చినప్పుడల్లా ప్రెస్‌మీట్ పెట్టి అబద్ధాలు చెప్పే దువ్వూరి కృష్ణ ఇన్వెస్టర్లకు కూడా అలవోకగా అబద్ధాలు చెప్పేశారు. ఏపీ ప్రభుత్వం ఎప్పుడైనా సరైన సమయంలో అప్పు కట్టలేక డిఫాల్ట్ అయిందా అని వెబినార్‌లో ఒకరు ప్రశ్నించారు. 'ఎప్పుడూ అలా జరగలేదు' అని కృష్ణ అబద్ధం చెప్పారు. నిజానికి రాష్ట్ర ప్రభుత్వం పలు సందర్భాల్లో 'డిఫాల్టర్'గా మారింది. సోలార్ పవర్ కార్పొరేషన్‌కు సంబంధించిన దాదాపు రూ.260 కోట్లను 15 రోజుల్లోగా చెల్లించాలంటూ 2020 జూన్ 1న కేంద్ర విద్యుత్ శాఖ లేఖ రాసింది. 15వ తేదీ నాటికి జగన్ సర్కార్ ఆ డబ్బు కట్టకపోవడంతో ప్రభుత్వంపై ఫిర్యాదు చేస్తూ ఆ ఏడాది జూన్ 18న ఆర్‌బీఐకి కేంద్ర విద్యుత్ శాఖ మరో లేఖ రాసింది. సోలార్ పవర్ కార్పొరేషన్‌కు ఇచ్చిన అప్పునకు ప్రభుత్వం హామీ ఇచ్చిందని, గడువు దాటిపోయినా, తాము హెచ్చరించినా ఏపీ ప్రభుత్వం కట్టలేదు కాబట్టి గ్యారెంటీ ఇన్‌వోక్ చేసి తమ డబ్బులు తమ ఖాతాలో వేయమని కేంద్ర విద్యుత్ శాఖ ఆర్‌బీఐని కోరింది. దీంతో ప్రభుత్వానికి తెలియకుండానే రాష్ట్ర ఖాతా నుంచి దాదాపు రూ.260 కోట్లను ఆర్‌బీఐ నేరుగా తీసి కేంద్ర విద్యుత్ శాఖకు ఇచ్చింది. అకస్మాత్తుగా డబ్బులు మాయమవడంపై ఆర్‌బీఐని సంప్రదించిన ప్రభుత్వం విషయం తెలుసుకుని గప్‌చుప్ అయిపోయింది. అలాగే, అదే ఏడాది ఢిల్లీ, ముంబై నుంచి పీఎఫ్‌సీ, ఆర్‌ఈసీ అధికారులు నేరుగా రాష్ట్రానికి వచ్చి తమ అప్పు కట్టాలంటూ సీఎంతో సహా ఇతర అధికారులను కలిశారు. అప్పటికప్పుడు ఏపీ మారిటైమ్ బోర్డు ద్వారా ఎస్‌బీఐ నుంచి రూ.1500 కోట్ల అప్పు తెచ్చి ప్రభుత్వం పీఎఫ్‌సీ, ఆర్‌ఈసీకి జమ చేసింది. దువ్వూరి కృష్ణ ఇవన్నీ దాచి ఇన్వెస్టర్లకు చక్కగా అబద్ధాలు చెప్పారు.

### రూ.2.50 లక్షల కోట్లూ చూపిస్తారా...

ప్రస్తుతం సీఆర్డీయే బాండ్ల అప్పు రూ.2,000 కోట్లను తామే కడతామని, ఆ మొత్తాన్ని 'పబ్లిక్ డెట్'లో చూపేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. సీఆర్డీఏ బాండ్ల ద్వారా తెచ్చిన అప్పును అమరావతి కోసం వాడారు. కానీ, రాష్ట్రంలో ఉన్న దాదాపు 30 కార్పొరేషన్ల ద్వారా ప్రభుత్వం రూ.2.5 లక్షల కోట్ల అప్పు తెచ్చుకుని సొంత అవసరాలకు వాడుకుంది. కార్పొరేషన్ల మొత్తం అప్పు రూ.3.5 లక్షల కోట్లకు చేరుకుందని అంచనా. ఇందులో కేవలం రూ.లక్ష కోట్లను మాత్రమే ఆయా కార్పొరేషన్లు వాటి అవసరాల కోసం వాడుకున్నాయి. మిగిలిన రూ.2.5 లక్షల కోట్లు ప్రభుత్వమే వాడుకున్నా వాటిని ఇంకా కార్పొరేషన్ల ఖాతాలోనే చూపిస్తున్నారు. ఇందులో ప్రధానంగా ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్, ఏపీఎస్‌డీసీ లాంటి వాటికి ఆదాయ మార్గమనేది లేదు. ఉన్నట్టు ప్రభుత్వం కనికట్టు చేస్తోంది. సీఆర్డీయే తరహాలో ఆ కార్పొరేషన్ల అప్పులు రూ.2.50 లక్షల కోట్లు ప్రభుత్వం భరించక తప్పదు.

# ఈసీ మార్గదర్శకాలపై అవగాహన పెంచుకోవాలి

- ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు సహకరించండి
- రాజకీయ పార్టీల ప్రతినిధులతో వర్క్‌షాప్‌లో మీనా



అమరావతి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రక్రియపై రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు, వాటి ప్రతినిధులు సమగ్ర అవగాహన ఏర్పరుచుకోవాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేశ్‌కుమార్ మీనా సూచించారు. రాబోయే ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా నిర్వహించేందుకు సహకరించాలని కోరారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆయన అధ్యక్షతన గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో గురువారం అమరావతి సచివాలయంలో వర్క్‌షాప్ నిర్వహిచారు. ఈ సందర్భంగా మీనా మాట్లాడుతూ... కేంద్ర ఎన్నికల సంఘం తాజా మార్గదర్శకాలు, సూచనలపై అవగాహనతో ఉంటే ఎన్నికల్లో ఎటువంటి సందేహాలకు, గందరగోళానికి తావుండదని పేర్కొన్నారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటన, ప్రవర్తనా నియమావళి అమలు, నామినేషన్ల ప్రక్రియ, వ్యయ పర్యవేక్షణ ఎంతో కీలకమైన అంశాలని తెలిపారు. వీటిపై సమగ్ర అవగాహన ఏర్పరుచుకుని ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు సహకరించాలని కోరారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు చేసే ఎన్నికల వ్యయంపై పూర్తిస్థాయిలో నిఘా ఉంటుందని చెప్పారు. ప్రతి లోక్‌సభ అభ్యర్థికి రూ.95లక్షలు, శాసనసభ అభ్యర్థికి రూ.40లక్షల మేర వ్యయం చేసేందుకు అనుమతి ఉంటుందని వివరించారు. ఓటర్లను ప్రభావితం చేసే విధంగా నగదు, బహుమతులు, లిక్కర్, ఇతర వస్తువులు పంపిణీ చేయడాన్ని చట్టవిరుద్ధమైన వ్యయంగా పరిగణిస్తామని మీనా తెలిపారు. సమావేశంలో టీడీపీ తరఫున మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యే ఆలపాటి రాజేంద్రప్రసాద్, వైసీపీ ప్రతినిధులు గౌతంరెడ్డి, నారాయణమూర్తి, బీజేపీ నాయకురాలు అన్నపూర్ణ, సీపీఎం నేత వైవీ రావు తదితరులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం కొందరు నేతలు మీడియాతో మాట్లాడారు. ఎన్నికల సమయంలో రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేసినట్లే ఎన్నికల్లో మతాన్ని వాడుకోవడాన్ని కూడా నిషేధించాలని కోరామని సీపీఎం నేత వైవీ రావు చెప్పారు. కోడ్ వచ్చిన తర్వాత చర్యలు తీసుకుంటామని మీనా చెప్పారన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు వలంటీర్లకు బహుమతులు ఇస్తూ వారిని ఎన్నికల్లో వాడుకోవడానికి ప్రయత్నిస్తున్నారని, దీనిపైనా చర్యలు తీసుకోవాలని కోరామని వివరించారు.

# వీధినపడ్డ వలంటీర్!

(మొదటి పేజీ తరువాయి)

తొక్కాల్సిన పని ఉండదు. వలంటీర్లను వాడుకోవాల్సిన అవసరమూ ఉండదు. ప్రజలకు సేవలు అందించేందుకు నియమించిన వలంటీర్లను యథేచ్ఛగా వాడుకుంటున్నారంటే.. విజయంపై నమ్మకం లేకనే? అనే విమర్శలు వస్తున్నాయి.

### అన్నింటికీ సమాధానం 'ఎస్'

ప్రతి వలంటీర్ తమ పరిధిలోని కుటుంబాల వద్దకు జగన్ దూతగా వెళ్లి ఎన్నికల్లో మళ్లీ ఆయనకు ఓటు వేయాలంటూ అభ్యర్థిస్తున్నారు. జగన్ నాలుగు ప్రశ్నలు అడగమన్నారని, వాటికి సమాధానాలు చెప్పాలని కోరుతున్నారు. ట్యాబ్ ఓపెన్ చేసి ఏయే పథకాల ద్వారా ఎంత మొత్తం లబ్ధి కలిగిందన్న విషయం తెలియజేస్తున్నారు. వలంటీర్లు తమ పరిధిలోని కుటుంబాలకు ప్రశ్నలు వేసి, వారికి ఇష్టమున్నా లేకున్నా అన్నింటికీ సమాధానం 'అవును' అని టిక్ కొట్టిస్తున్నారు. కాదని చెబితే పథకాలు ఆపేస్తారనే భయంతో లబ్ధిదారులు మౌనంగా ఉంటున్నారు. వలంటీర్లు ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి వినిపించి ఆ లేఖను అందజేస్తున్నారు. లేఖ అందజేసినట్లు ఈకేవైసీ చేయిస్తున్నారు. వలంటీర్లు అడుగుతున్న ప్రశ్నలివీ..

- జగనన్న ప్రభుత్వం ఐదేళ్లుగా అమలు చేస్తున్న నవరత్నాలను రాబోయే ఐదేళ్లు కూడా కొనసాగిస్తుంది. ఇది జగనన్న మాట. మీకు, మీ కుటుంబానికి ఈ పథకాలతో మంచి జరిగిందనుకుంటున్నారా?
- జగనన్న ప్రభుత్వం మీ ఇంటి వద్దకే సేవలందించేందుకు ప్రవేశపెట్టిన గ్రామ/వార్డు వలంటీర్లు, సచివాలయాల వ్యవస్థను ఇక ముందు కూడా కొనసాగిస్తుంది. ఇది జగనన్న మాట. ఈ వ్యవస్థ వల్ల మీకు మంచి జరిగిందనుకుంటున్నారా?
- జగనన్న ఆరోగ్య సురక్ష, జగనన్న సురక్ష, నాడు-నేడు పాఠశాలలు,ప్రతి పాఠశాలలో ఇంగ్లిష్ మీడియం బోధన వంటి ప్రత్యేక కార్యక్రమాలను అమలు చేస్తూనే ఉంటుంది. ఇది జగనన్న మాట. ఈ కార్యక్రమాలతో మీరు, మీ కుటుంబం ప్రయోజనం పొందారా?
- జగనన్న నవరత్నాలు, ఇతర అన్ని పథకాలు ఇలాగే కొనసాగేందుకు జగనన్నకు మద్దతివ్వడానికి మీరు సిద్ధంగా ఉన్నారా?

### వలంటీర్లపై పర్యవేక్షణ

వలంటీర్లు ఇంటింటా ప్రచార కార్యక్రమాన్ని మొక్కుబడిగా చేయకుండా పర్యవేక్షిస్తున్నారు. ఇందుకోసం సచివాలయ ఉద్యోగుల సేవలను కూడా ఉపయోగించుకుంటున్నారు. ఆయా సచివాలయాల పరిధిలో వలంటీర్ల ప్రచార కార్యక్రమాన్ని ఉద్యోగులు పర్యవేక్షించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. గ్రామ, వార్డు సచివాలయ శాఖ ఉన్నతాధికారులు ఏకంగా సర్క్యులర్ కూడా జారీ చేశారు. ట్యాబ్‌ల ద్వారా ఈకేవైసీ చేయడమే కాకుండా ప్రచారం చేసినట్లు అవసరమైతే వీడియో కూడా తీసి స్థానిక వైసీపీ నేతలకు పెట్టాలని పలుచోట్ల వలంటీర్లకు సూచిస్తున్నారు.

### ఎన్నికల ప్రయోజనం కోసమే..

వలంటీర్లను కేవలం ఎన్నికల ప్రయోజనాల కోసమే నియమించారంటూ సాగుతున్న ప్రచారాన్ని జగన్ నిజం చేశారు. ఇంటింటికీ పెన్షన్ ఇస్తామంటూ ఊదరగొట్టి ఆ ముసుగులో పార్టీ ప్రచారం చేయిస్తున్నారు. ఎన్నికల సమయంలో వారిని నేరుగా వాడుకుంటున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అయిన తర్వాత వారిని విధుల్లో నుంచి తొలగించే అవకాశం ఉంది. దీంతో రెండు నెలల పాటు వారికి ప్రభుత్వం వేతనాలు ఇవ్వకపోయినా వైసీపీ తరఫున చెల్లించాలని నిర్ణయించారు. అందుకు ప్రతిఫలంగా వలంటీర్లు ఎన్నికల సమయంలో వైసీపీ అభ్యర్థుల గెలుపు కోసం సేవలందించాలి. ఇప్పుడిస్తున్న జీతం రూ.5 వేల కంటే రెట్టింపు, అంతకంటే ఎక్కువగా ఆయా అభ్యర్థుల నుంచి ఇప్పిస్తామని ఆశలు పెట్టారు. ఇప్పటికే పలు చోట్ల ఎమ్మెల్యేలు వలంటీర్లకు తాయిలాలు పంపిణీ చేశారు.

### వలంటీర్లపైనే వైసీపీ ఆశలు

రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ పరిపాలన పట్ల జనాల్లో తీవ్ర వ్యతిరేకత వస్తోంది. సొంత పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు పార్టీ వీడుతున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా అధికార పార్టీలో ఎమ్మెల్యేలను ఇతర నియోజకవర్గాలకు బదిలీ చేస్తున్నారు. అభ్యర్థులను ఇష్టానుసారం మార్చేస్తున్నారు. చివరకు ఎవరు బరిలో ఉంటారో తెలియని పరిస్థితి. దీంతో సొంత పార్టీ నేతల్లో కూడా తీవ్ర వ్యతిరేకత, అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఈ పరిస్థితుల్లో జగన్ పూర్తిగా వలంటీర్ల మీదనే ఆధారపడ్డారు. వలంటీర్లను ఉపయోగించుకుని మళ్లీ ఎన్నికల్లో గెలవాలని భావిస్తున్నారు. ఇప్పటి వరకు జగన్ పేరు మరచిపోకుండా నిత్యం ఏదో ఒక కరపత్రం, బుక్‌లెట్‌లు పంపిణీ చేయడం, జగన్ బొమ్మలు ఇళ్ల తలుపులపైన అంటించడం వంటి ప్రచార కార్యక్రమాలు నిర్వహించారు. వలంటీర్ల కోసం సుమారు రూ.8 వేల కోట్లు ప్రజాధనం ఖర్చు చేసి జగన్ సొంత పార్టీ కోసం వాడుకోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్నికలు దగ్గర పడుతున్న సమయంలో వలంటీర్లను బహిరంగంగా పార్టీ ప్రచారం కోసం వాడుకుంటున్నా ఎన్నికల కమిషన్ స్పందించకపోవడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి.



అనంతపురం జిల్లా రాయదుర్గం మండలం వడ్రవన్నూరులో ప్రచారంలో పాల్గొన్న వలంటీర్ ధనుంజయ. ఫొటోలో నమస్కరిస్తున్న వ్యక్తి మెట్టు గోవిందరెడ్డి కుమారుడు విశ్వనాథ్‌రెడ్డి




వైసీపీకి ఓటు వేయాలని వీడియోలో మాట్లాడుతున్న కర్నూలు జిల్లా కోసిగి-2 వలంటీర్ వెంకటేశ్

### సైబర్‌దొంగల దోపిడీ

జగన్‌కు అనుకూలంగా ఎన్నికల ప్రచారం చేయడానికి వలంటీర్లు ఇంటింటికీ వెళ్లడాన్ని.. సైబర్‌దొంగలు అవకాశంగా తీసుకుని చెలరేగిపోతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా పలువురు పేదల కుటుంబాల ఖాతాల్లోని డబ్బులు మాయం చేస్తున్నారు. వలంటీర్లను కూడా మోసం చేసి డబ్బులు కాజేస్తున్నారు. సైబర్ దొంగలు మొదట అమరావతి నుంచి మాట్లాడుతున్నామంటూ లబ్ధిదారుల కుటుంబాలకు ఫోన్లు చేస్తారు. 'మీకు చేయూత అందిందా? ఆసరా అందిందా? నవరత్నాలు అందుతున్నాయా?' అంటూ ఆరా తీస్తారు. లబ్ధిదారులకు నమ్మకం కలిగించేందుకు వలంటీర్ల ఫోన్ నంబర్లను వెబ్‌సైట్ ద్వారా తీసుకుని కాన్ఫరెన్స్ కలుపుతారు. అమరావతి గ్రామ, వార్డు సచివాలయ శాఖ నుంచి ఫోన్ చేస్తున్నామంటూ... లబ్ధిదారుల కుటుంబాలను సందర్శిస్తున్నారా? లేదా? అంటూ వలంటీర్లను గదమాయిస్తాయి. ఆయా కుటుంబాల వారు తమ ఇళ్లకు వస్తున్నారని చెప్పిన తర్వాత వలంటీర్లకు ఫోన్ కట్ అవుతుంది. ఆ తర్వాత సైబర్ దొంగలు డబ్బులు గుంజే కార్యక్రమం మొదలుపెడతారు. 'చేయూత, ఇతర పథకాల డబ్బులు మీకు రావాలంటే మేం చెప్పినట్టు మీరు ఫోన్ పేలో చేయాలి' అని లబ్ధిదారులకు చెబుతూ ఫోన్ పే రిక్వెస్ట్‌ను ఆపరేట్ చేయడం ద్వారా డబ్బులు లాగేస్తున్నారు. ఫోన్ పే లేని వాళ్లకు.. 'కొంత సొమ్ము ఫలానా ఖాతాలో వేయండి. అలా వేస్తేనే మీకు నవరత్నాల నిధులు ఖాతాల్లో పడతాయి' అని చెప్పి మోసం చేస్తున్నారు. కొన్ని చోట్ల వలంటీర్లను కూడా మోసం చేశారు. గురువారం ఒక్క నెల్లూరు నగరంలోనే సుమారు 10మంది సైబర్ క్రైమ్‌కు ఫిర్యాదుచేశారు. ఈకేసుల సంఖ్య ఎక్కువకావడంతో బ్యాంకు స్టేట్‌మెంట్లుతేవాలని అధికారులు చెబుతున్నారు.

### వైసీపీ జెండాలు.. కరపత్రాలు

అనంతపురం జిల్లాలోని రాయదుర్గంలో వైసీపీ అభ్యర్థి మెట్టు గోవింద రెడ్డి ఎన్నికల ప్రచారంలో వలంటీర్లు, స్టోర్ డీలర్లు పాల్గొన్నారు. రాయదుర్గం మండలంలోని వడ్రవన్నూరు గ్రామంలో వలంటీర్ ధనుంజయ కరపత్రాలను పంపిణీ చేశారు. రాయదుర్గం 27వ వార్డులో ఆ ప్రాంత స్టోర్ డీలర్ వైసీపీ కండువా వేసుకుని మరీ ప్రచారం చేశారు. కాగా, ఎవరికి మీ ఓటు అంటూ.. పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడులో గురువారం వలంటీర్లు సర్వే ప్రారంభించారు.

### సోషల్ మీడియాలో వీడియోలు

కర్నూలు జిల్లాలో వలంటీర్లు వైసీపీకి ఓటు వేయాలని సోషల్ మీడియా వేదికగా విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. కోసిగి మండలంలోని సచివాలయం-2లో వలంటీర్లుగా పనిచేస్తున్న పెండేకల్లు వెంకటేశ్, సంజీపోగు సునందరాజులు.. వైసీపీకి ఓటు వేసి రెండోసారి జగన్‌ను సీఎంగా చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందంటూ ప్రచారం చేస్తున్నారు. వీడియోలు విడుదల చేస్తున్నారు.

## లోకం తీరు




జెలెన్‌స్కీ, గ్రీస్ ప్రధాని కిరియాకోస్ సమీపంలో

## రష్యా క్షిపణి దాడి

- కాన్వాయ్‌కు 500 మీటర్ల దూరంలోనే ఘటన
- ఐదుగురి మృతి.. పలువురికి తీవ్ర గాయాలు

ఒడెస్సా, మార్చి 7: ఉక్రెయిన్-రష్యా యుద్ధం మరింత ఉద్రిక్తతలకు దారితీసే పరిణామం త్రుటిలో తప్పింది. నాటో సభ్య దేశమైన గ్రీస్ ప్రధాని కిరియాకోస్ మిత్సోటకిస్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ కాన్వాయ్‌కి 500మీటర్ల దూరంలో క్షిపణి దాడి జరిగింది. ఈ ఘటనలో ఐదుగురు మృతి చెందగా, పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. రష్యా తమపై యుద్ధానికి దిగి రెండేళ్లయిన సందర్భంగా జెలెన్‌స్కీ మిత్రదేశాల నాయకులను పిలిచి జరిగిన నష్టాన్ని వారికి వివరిస్తున్నారు. ఈ క్రమంలో కిరియాకోస్‌ను నల్ల సముద్ర తీర నగరం ఒడెస్సా సందర్శనకు తీసుకెళ్లారు. పర్యటన ముగించుకుని దేశాధినేతలిద్దరూ వాహనాల్లోకి ఎక్కబోతుండగా సమీపంలో క్షిపణి దాడి జరిగింది. వీరికి ఎలాంటి గాయాలు కాలేదు. దీనిపై జెలెన్‌స్కీ స్పందిస్తూ..ఎంతటి బలమైన శత్రువుతో పోరాడుతున్నామో గమనించాలని కోరారు. గగనతల రక్షణ వ్యవస్థ ద్వారానే తమను తాము రక్షించుకోగలమన్నారు. కాగా, క్షిపణితో ఒడెస్సాలోని హ్యాంగర్‌పై దాడి చేశామని, అక్కడ యుద్ధంలో వాడేందుకు మానవరహిత బోట్ల తయారీ జరుగుతోందని రష్యా వెల్లడించింది. ఒడెస్సా.. దక్షిణ ఉక్రెయిన్ నౌకా దళానికి ప్రధాన స్థావరం. ధాన్యం ఎగుమతులకు కీలక కేంద్రం. దీంతో యుద్ధం మొదటినుంచీ రష్యా ఈ నగరంపై భీకర దాడులకు పాల్పడుతోంది. అద్భుతమైన కట్టడాలు, బీచ్‌తో అందమైన నగరంగా పేరున్న ఒడెస్సా ఇప్పుడు రూపురేఖలు కోల్పోయింది. గత ఆదివారం ఓ అపార్ట్‌మెంట్‌పై రష్యా క్షిపణి దాడిలో ఐదుగురు పిల్లలు సహా 12మంది చనిపోయారు. వీరికి నివాళి అర్పించేందుకే గ్రీస్ ప్రధానిని జెలెన్‌స్కీ ఆహ్వానించడం గమనార్హం.

## జీఎస్‌టీ కేసులో ముందస్తు బెయిలివ్వండి

- హైకోర్టులో మాజీ మంత్రి ప్రత్తిపాటి పిటిషన్
- కుటుంబ సభ్యులు, తదితరులు కూడా..

అమరావతి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): జీఎస్‌టీ ఎగవేత, బోగస్ ఇన్వాయిస్‌లతో నిధులు మళ్లించారన్న ఆరోపణలపై విజయవాడ మాచవరం పోలీసులు నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు, ఆయన సతీమణి వెంకాయమ్మ, కుమార్తె స్వాతి హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలు సమర్పించాలని పోలీసులను గురువారం హైకోర్టు ఆదేశించింది. విచారణను 11వ తేదీకి వాయిదా వేసింది. ఈమేరకు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు ఆదేశాలిచ్చారు. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది బి.ఆదినారాయణరావు, న్యాయవాది జవ్వాజి శరత్‌చంద్ర, కిలారు నితిన్‌కృష్ణ, వీవీ సతీశ్ వాదనలు వినిపించారు. రాజకీయ కారణాలతో పిటిషనర్లపై తప్పుడు కేసు నమోదు చేశారని.. వారిని అరెస్టు చేసే ప్రమాదం ఉందని, తమ వ్యాజ్యాలపై సాధ్యమైనంత త్వరగా విచారణ జరపాలని అభ్యర్థించారు. కాగా.. ఇదే కేసులో పుల్లారావు కుమారుడు ప్రత్తిపాటి శరత్‌ను విచారణ నిమిత్తం పదిరోజులు కస్టడీకి ఇవ్వాలని వేసిన పిటిషన్‌ను విజయవాడ మొదటి అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు తిరస్కరించడాన్ని సవాల్ చేస్తూ పోలీసులు దాఖలు చేసిన అత్యవసర అప్పీల్‌పైనా హైకోర్టు విచారణ జరిపింది. సదరు కోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై స్టే ఇవ్వాలని అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోరారు. ఈ దశలో తాను ఎలాంటి ఉత్తర్వులూ ఇవ్వలేనన్నారు. అప్పీల్‌పై 11వ తేదీన విచారణ జరుపుతానని స్పష్టం చేశారు.

### బెయిల్ పిటిషన్‌పై కోర్టు విచారణ 11కి వాయిదా

విజయవాడ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): జీఎస్‌టీ కేసులో మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు కుమారుడు శరత్ సాక్షులను బెదిరించే అవకాశం లేదని ఆయన తరఫు న్యాయవాది కిలారు బెనర్జీ పేర్కొన్నారు. అవెక్సా కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ కార్యకలాపాలకు సంబంధించి అన్ని రికార్డులూ ఉన్నాయని తెలిపారు. బెయిల్ కోరుతూ శరత్ దాఖలుచేసిన పిటిషన్‌పై గురువారం విజయవాడ మొదటి అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో విచారణ జరిగింది. 'ఈ కేసులో సాక్షులంతా ప్రభుత్వ అధికారులే. కాబట్టి శరత్ వారిని బెదిరించే అవకాశం లేదు. ఈ కేసు జీఎస్‌టీ చట్టం పరిధిలోకి వస్తుంది. దీనికి ఐపీసీ సెక్షన్లు వర్తించవు. శరత్ అదనపు డైరెక్టర్‌గా ఉన్న సమయంలో జరిగిన లావాదేవీలన్నిటికీ రికార్డులు ఉన్నాయి. ఎక్కడా నకిలీ ఇన్వాయిస్‌లు, బిల్లులు ఇవ్వలేదు. శరత్ రాష్ట్రం, దేశం విడిచి పారిపోయే అవకాశం లేదు' అని స్పష్టం చేశారు. కౌంటర్ దాఖలు చేయడానికి మరికొంత సమయం కావాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఉమాదేవి విజ్ఞప్తి చేయగా.. కిలారు బెనర్జీ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇంకెన్ని రోజులు సమయం తీసుకుంటారని ప్రశ్నించారు. దీనిపై న్యాయాధికారి కరీముల్లా స్పందిస్తూ.. సాయంత్రంలోగా కౌంటర్ దాఖలు చేయాలని, లేకపోతే ఆర్డర్ ఇచ్చేస్తానని తేల్చిచెప్పారు. దీంతో ఉమాదేవి కౌంటర్ దాఖలు చేశారు. హైకోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వచ్చి వాదనలు వినిపించాల్సి ఉన్నందున తదుపరి విచారణను న్యాయాధికారి 11వ తేదీకి వాయిదా వేశారు.

# శివరాత్రి వేడుకలకు శ్రీగిరి ముస్తాబు

**స్వామివారికి ఘనంగా గజ వాహనసేవ.. నేడు పాగాలంకరణ, మల్లన్న కల్యాణం**



గజవాహనంపై విహరిస్తున్న భ్రమరాంబ సమేత మల్లికార్జునుడు

శ్రీశైలం, మార్చి 7: మహాశివరాత్రి పర్వదినానికి ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఒకటైన శ్రీశైల మహా క్షేత్రం ముస్తాబైంది. వివిధ రకాల పూలతో, విద్యుద్దీపాలతో ప్రధాన ఆలయాన్ని అలంకరించారు. శివరాత్రి సందర్భంగా స్వామి వారికి నిర్వహించే పూజా కార్యక్రమాలకు ప్రధాన పూజారులు సర్వం సిద్ధం చేశారు. శుక్రవారం రాత్రి 10 గంటలకు లింగోద్భవ మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పాగాలంకరణ, అనంతరం స్వామి వారికి కల్యాణోత్సవం నిర్వహిస్తారు. భక్తుల రద్దీకి అనుగుణంగా దేవస్థాన అధికారులు ఏర్పాట్లు చేశారు. లింగోద్భవం, పాగాలంకరణ కార్యక్రమం సందర్భంగా దాదాపు పరిమిత సంఖ్యలో భక్తులను లోపలికి అనుమతించనున్నట్లు అధికారులు ముందుగానే తెలిపారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం భ్రమరాంబ సమేత మల్లికార్జునుడు గజవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. శుక్రవారం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని సాయంత్రం 5 గంటలకు ప్రభోత్సవం, రాత్రి 7 గంటలకు నందివాహన సేవ నిర్వహిస్తారు.



విద్యుత్ దీపాలంకరణలో త్రికోటేశ్వరస్వామి ఆలయం

శ్రీ త్రికోటేశ్వర స్వామి మూల విరాట్

# నేడు కోటప్పకొండ తిరునాళ్లు

**తరలి రానున్న లక్షలాది మంది భక్తులు**

కోటప్పకొండ(నరసరావుపేట), మార్చి 7: మహాశివరాత్రిని పురస్కరించుకుని పల్నాడు జిల్లా నరసరావుపేట మండలంలోని ప్రముఖ శైవ క్షేత్రం కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వర స్వామి తిరునాళ్ల శుక్రవారం కన్నుల పండువగా జరగనున్నాయి. ఇందుకోసం కోటప్పకొండ ముస్తాబైంది. దేశం నలుమూలల నుంచి లక్షలాది మంది యాత్రికులు తిరునాళ్లకు తరలిరానున్నారు. యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా విస్తృత ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వం ఈ తిరునాళ్లకు రాష్ట్ర పండుగ హోదా కల్పించిన నేపథ్యంలో ప్రభుత్వం తరుపున శ్రీ త్రికోటేశ్వర స్వామికి నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పట్టు వస్త్రాలను సమర్పించనున్నారు. ఇందు కోసం దేవాదాయ శాఖ ఏర్పాట్లు చేసింది. తిరునాళ్లలో 3,000 మంది పోలీసులతో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. నరసరావుపేట, చిలకలూరిపేట, వినుకొండ పట్టణాల నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులు నిర్వహిస్తోంది. ఈ తిరునాళ్ళనే ప్రభల పండుగగా పిలుస్తారు.



అన్నవరంలో ప్రసాద్ పథకాన్ని వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని

## అన్నవరంలో అభివృద్ధి కార్యక్రమాలకు ప్రధాని శ్రీకారం

- ప్రసాద్ పథకంలో 20 కోట్ల పనులకు వర్చువల్‌గా శంకుస్థాపన

అన్నవరం, మార్చి 7: కాకినాడ జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో భక్తుల సౌకర్యాల కల్పనకు కేంద్ర ప్రభుత్వం ప్రసాద్ పథకంలో మంజూరు చేసిన రూ.20.06 కోట్ల పనులకు గురువారం దేశప్రధాని నరేంద్రమోదీ జమ్మూ కాశ్మీర్ నుంచి వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో ప్రధాని ఈ పనులను ప్రారంభించగా కాకినాడ ఎంపీ వంగా గీత, ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత ప్రసాద్ శిలాఫలకం ఆవిష్కరించారు. ఈ పథకంలో భాగంగా రూ.11.50 కోట్లతో 50 వేల చదరపు అడుగులల్లో 1600 మంది ఒకేసారి అన్నప్రసాదం స్వీకరించే విధంగా నూతన అన్నదాన భవనం టీటీడీ సత్రం ప్రదేశంలో నిర్మించనున్నట్లు పర్యాటకశాఖ ఈఈ మూర్తి తెలిపారు. భక్తులు వేచిఉండేందుకు రూ.5.94 కోట్లతో క్యూకాంప్లెక్స్, రూ.61.85 లక్షలతో మరుగుదొడ్లు, స్నానపు గదులు, రూ.1.02 కోట్లతో 4 ఎలక్ట్రికల్ బస్సులు, రెండు చార్జింగ్ స్టేషన్‌లను ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.

## ఏపీ జేఏసీ చైర్మన్‌గా కేవీ శివారెడ్డి

విజయవాడ (ధర్నాచౌక్), మార్చి 7: ఏపీ జేఏసీ చైర్మన్‌గా ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు కేవీ.శివారెడ్డి ఎన్నికయ్యారు. విజయవాడలోని ఏపీ ఎన్జీవో హోంలో జేఏసీ అనుబంధ సంఘాల సమావేశం గురువారం జరిగింది. మాజీ చైర్మన్ బండి శ్రీనివాసరావు పదవీ విరమణ చేసిన నేపథ్యంలో ఆయన స్థానంలో శివారెడ్డిని ఎన్నుకున్నట్లు జేఏసీ ప్రధాన కార్యదర్శి జి.హృదయరాజు ప్రకటించారు. ఈ సందర్భంగా శివారెడ్డి మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల ప్రయోజనాలను పరిరక్షించే దిశగా జేఏసీ కృషి చేస్తుందన్నారు. జేఏసీ డిప్యూటీ సెక్రటరీ జనరల్‌గా సీహెచ్.పురుషోత్తం నాయుడు ఎన్నికయ్యారు.

# జగన్ చెడు మాత్రమే చేశాడు!

- తల్లినీ చెల్లినీ తరిమేశాడు
- తెలుగు తల్లినీ అమ్మేస్తాడు: నారా భువనేశ్వరి
- కర్నూలు, అనంతపురం జిల్లాల్లో 'నిజం గెలవాలి' యాత్ర

గుంతకల్లు, పత్తికొండ, మార్చి7: 'జగన్ తన పరిపాలనలో చెడు మాత్రమే చేశాడు. ప్రజలకు చెడును నేర్పాడు. తల్లినీ చెల్లినీ తరిమేసిన అతను తెలుగు తల్లినీ తరిమేస్తాడు.. లేదా అమ్మేస్తాడు' అని టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి విమర్శించారు. రానున్నది కురుక్షేత్ర సంగ్రామమని, అరాచక వైసీపీ ప్రభుత్వాన్ని ఓటు అనే ఆయుధంతో కూల్చేద్దామని పిలుపునిచ్చారు. చంద్రబాబు అక్రమ అరెస్టును తట్టుకోలేక మరణించినవారి కుటుంబాలను పరామర్శించేందుకు ఆమె చేపట్టిన 'నిజం గెలవాలి' యాత్ర గురువారం అనంతపురం, కర్నూలు జిల్లాల్లో కొనసాగింది. అనంతపురం జిల్లా గుత్తి మండలం ధర్మాపురంలో మరణించిన వార్డు మెంబరు ఆంజనేయులు, బేతాపల్లి గ్రామంలో మరణించిన టీడీపీ కార్యకర్త జయమ్మ కుటుంబ సభ్యులను ఆమె పరామర్శించారు. ఆంజనేయులు కుమార్తె సుంకమ్మను, జయమ్మ కుమార్తె జయలక్ష్మిని ఓదార్చారు.



అనంతపురం జిల్లా ధర్మాపురంలో ఆంజనేయులు కూతురు సుంకమ్మను పరామర్శిస్తున్న నారా భువనేశ్వరి

అలాగే, కర్నూలు జిల్లా తుగ్గలి మండలం మీటేతండాలో మృతి చెందిన మాజీ ఎంపీటీసీ రమావత్ లక్ష్మి, అదే మండలంలోని కడమకుంట్లలో మృతి చెందిన వడ్డే చిన్న రంగన్న, కృష్ణగిరి మండలం ఎస్‌హెచ్ ఎర్రగుడి గ్రామంలో మృతిచెందిన సుబహాన్, ఆస్పరి మండలం హలిగేర గ్రామంలో మృతిచెందిన బోయ ఉరుకుంద కుటుంబాలను భువనేశ్వరి పరామర్శించారు. సుబహాన్ కూతురు ఆత్మకు పుట్టుకతోనే కళ్లు కనిపించవని నేతలు తెలపడంతో ఆ చిన్నారి కంటిచూపు బాధ్యత తీసుకుంటామని, సుబహాన్ ముగ్గురు పిల్లలకూ ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా చదువు చెప్పించే బాధ్యత తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆ కుటుంబాలకు రూ.3 లక్షలు చొప్పున ఆర్థిక సాయం అందించారు. ఆయా గ్రామాలలో ప్రజలనుద్దేశించి భువనేశ్వరి మాట్లాడుతూ జగన్ పాలనలో రాష్ట్ర ప్రజలందరూ వెతలు అనుభవిస్తున్నార న్నారు. ప్రజల కోసం పాటుపడే వ్యక్తి లీడర్ అవుతాడని, ప్రజలను వేపుకుతింటున్న జగన్ నాయకుడు కాదని విమర్శించారు.

## ఉచితంగా విద్య, వైద్యం చాలు!

- రాష్ట్ర ఆర్థిక స్థితిని నేతలు మరిచిపోతున్నారు
- రాజకీయ హామీల చట్టబద్ధతకు చర్యలు చేపట్టాలి
- హామీల అమలుపై ప్రజలు ప్రశ్నించాలి: వెంకయ్యనాయుడు



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), మార్చి 7: ప్రజలకు ఉచితంగా విద్య, వైద్యం అందిస్తే చాలని, మిగతావి ఉచితంగా ఇచ్చే వ్యవస్థను తాను వ్యతిరేకిస్తున్నానని మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు చెప్పారు. స్వాతంత్ర్య సమర యోధుడు వంగల్లు కోదండరామిరెడ్డి జీవిత విశేషాలతో ముద్రించిన పుస్తకాన్ని గురువారం నెల్లూరులోని డాక్టర్ రవీంద్రనాథ్ ఠాగూర్ ఫంక్షన్ హాలులో వెంకయ్యనాయుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాయకులు తమ సొంత డబ్బును ఉచితంగా ఇస్తే తప్పు లేదని, అయితే, ప్రజాధనాన్ని ప్రజలకే ఇవ్వడాన్ని తాను వ్యతిరేకిస్తున్నానని చెప్పారు. రాజకీయ పార్టీల నాయకులు ఉచితాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ఎలా ఉందో మరిచిపోతున్నారని విమర్శించారు. ప్రజలకు చేయూత ఇచ్చే కార్యక్రమాలను చేపట్టేలా అడుగులు వేయాలని సూచించారు. ఎన్నికలకు ముందు రాజకీయ పార్టీలు ఇచ్చే హామీలను ఏవిధంగా అమలు పరుస్తారో ప్రజలు ఆయా పార్టీలను ప్రశ్నించాలన్నారు. ప్రజలకు రాజకీయ నేతలు ఇచ్చే హామీలకు చట్టబద్ధత కల్పించేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. నాడు విలువలతో కూడిన రాజకీయాలు ఉండేవని, ఇవాళ రాజకీయాల్లో విలువలు కొరవడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయాల్లో వ్యక్తిగత దూషణలు ఎక్కువయ్యాయని, అది మంచి పద్ధతి కాదని హితవు పలికారు. కార్యక్రమంలో టీడీపీ నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, సీవీ శేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 'వెలిగొండ' ప్రారంభం ఓ బూటకం!

- పూర్తికాని ప్రాజెక్టును ప్రారంభించిన సీఎంకు సిగ్గుండాలి
- వెలిగొండ ప్రాజెక్టు వద్ద టీడీపీ నేతల ధ్వజం
- రైతులను జగన్ మోసం చేశారని విమర్శ
- పైలాన్ వద్ద చెవిలో పూలతో నిరసన



బిందెలతో తెచ్చిన నీటిని వెలిగొండ ప్రాజెక్టులో పోస్తున్న టీడీపీ నేతలు

పెద్దదోర్నాల, మార్చి 7: వెలిగొండ ప్రాజెక్టును పూర్తి కాకుండానే ప్రారంభించిన ముఖ్యమంత్రి జగన్‌కు సిగ్గుండాలని టీడీపీ నేతలు మండిపడ్డారు. నమ్మి ఓట్లేసిన రైతులు, ప్రజలను ఆయన నిలువునా మోసం చేశారని ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి బుధవారం అట్టహాసంగా ప్రకాశం జిల్లాలో ప్రారంభించిన వెలిగొండ ప్రాజెక్టును గురువారం టీడీపీ ఎర్రగొండపాలెం ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు, మార్కాపురం ఇన్‌చార్జి కందుల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీ నేతల బృందం సందర్శించింది. ప్రాజెక్టు నిర్మాణం పూర్తి కాకపోవడం, అస్తవ్యస్తంగా ఉన్న కాలువలు, ఫీడర్ కెనాల్‌లోని ఊటనీరు సొరంగాల్లోకి రాకుండా వేసిన అడ్డుకట్ట తదితరాలను పరిశీలించిన టీడీపీ నేతలు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. సీఎం ఆవిష్కరించిన పైలాన్ వద్ద చెవిలో పూలతో నిరసన తెలిపారు. బయటి నుంచి బిందెలతో నీరు తెచ్చి ప్రాజెక్టులో పోశారు. అనంతరం కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రాజెక్టు ప్రారంభమంతా బూటకమన్నారు. ఇదంతా రాజకీయ లబ్ధి కోసం జగన్ ఆడిన నాటకమని విమర్శించారు. ముంపు బాధితులకు పరిహారం చెల్లించకుండా, పునరావాసం కల్పించకుండా ఉత్తకుండను ప్రారంభించినందుకు జగన్ సిగ్గుపడాలని హితవు పలికారు. నిర్వాసితులు ప్రశ్నించకుండా పోలీసులతో కట్టడి చేశారన్నారు. గూడూరి ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ టీడీపీ హయాంలో నిర్వాసితులకు రూ.12లక్షలు ఇస్తామంటే, అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న ఇప్పటి మంత్రి సురేశ్, ఇతర వైసీపీ నాయకులు తాము అధికారంలోకి వస్తే రూ.18లక్షలు ఇస్తామంటూ నమ్మబలికి, తీరా అధికారంలోకి వచ్చాక మోసం చేశారని విమర్శించారు. ప్రాజెక్టు పనులకు టీడీపీ హయాంలో రూ.1,450 కోట్లు ఖర్చు చేస్తే వైసీపీ ప్రభుత్వం రూ.950 కోట్లు మాత్రమే వెచ్చించిందన్నారు. ప్రాజెక్టు పూర్తికి ఇంకా రూ.4వేల కోట్లు అవసరమని, నిర్వాసితులకు రూ.1,200 కోట్లు ఇవ్వాల్సి ఉందని తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో ప్రజలను మాయ చేస్తున్నారని విమర్శించారు.




- జగన్‌తో మహాత్ముడి ముచ్చటా?.. పరాకాష్టకు చేరిన వైసీపీ ప్రచార పిచ్చి

వైసీపీ నేతల ప్రచార పిచ్చి పీక్స్‌కు చేరింది. గ్రామ స్వరాజ్యం గురించి సీఎం జగన్‌తో మహాత్ముడు ముచ్చటిస్తున్నట్లు ఫ్లెక్సీ ఏర్పాటు చేసి.. జనం ముక్కున వేలేసుకునేలా చేశారు. విజయనగరం జిల్లా కుమరాం గ్రామంలో గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామ వైసీపీ నాయకులు గాంధీ మహాత్ముడు సీఎం జగన్‌తో ముచ్చటిస్తున్నట్లు ఫ్లెక్సీ పెట్టారు. – జామి



గవర్నర్ అబ్దుల్ నజీర్ నుంచి డాక్టరేట్ అందుకుంటున్న పి.సుశీల

## గాయని సుశీలకు గౌరవ డాక్టరేట్ ప్రదానం

- వేడుకగా శ్రీ పద్మావతి మహిళా వర్సిటీ స్నాతకోత్సవం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 7: ప్రఖ్యాత గాయని పి. సుశీలకు తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. గురువారం నిర్వహించిన యూనివర్సిటీ 21వ స్నాతకోత్సవంలో గవర్నర్ అబ్దుల్ నజీర్ సుశీలకు డాక్టరేట్‌ను అందజేశారు. జ్ఞాపిక, ధ్రువీకరణ పత్రం, శాలువాతో సుశీలను గవర్నర్, పద్మావతి వర్సిటీ వైస్ చాన్సలర్ భారతి, రిజిస్ట్రార్ రజని సత్కరించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. అన్ని రంగాల్లో మహిళల భాగస్వామ్యం ఇటీవల పెరుగుతోందన్నారు. విద్య ద్వారా సమాజంలో మంచి సంస్కరణలు తీసుకురావచ్చని సూచించారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన 57మందికి బంగారు పతకాలు, 12మందికి పుస్తక, నలుగురికి నగదు బహుమతులను గవర్నర్ అందజేసి అభినందించారు.

## పోలీసుల నోటీసులపై హైకోర్టుకు రమణదీక్షితులు

- వివరాలు సమర్పించాలని పోలీసులను ఆదేశించిన కోర్టు

అమరావతి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): తనపై నమోదైన కేసులో విచారణకు హాజరు కావాలంటూ పోలీసులు నోటీసులు ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ టీటీడీ గౌరవ మాజీ ప్రధాన అర్చకులు రమణదీక్షితులు దాఖలు చేసిన పిటిషన్ హైకోర్టులో విచారణకు వచ్చింది. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలు సమర్పించాలని న్యాయస్థానం పోలీసులను ఆదేశించింది. విచారణను వారం రోజుల పాటు వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి గురువారం ఆదేశాలిచ్చారు. శ్రీవారి ఆలయం, టీటీడీ అధికారుల ప్రతిష్ఠను దిగజార్చేలా సామాజిక మాధ్యమాల్లో వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ టీటీడీ ఐటీ శాఖ జీఎం సందీప్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రమణదీక్షితులపై తిరుమల వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో విచారణకు హాజరుకావాలంటూ సీఆర్పీసీ సెక్షన్ 160 కింద పోలీసులు తనకు నోటీసులు ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ ఆయన హైకోర్టును ఆశ్రయించారు. పిటిషనర్ తరఫు న్యాయవాది సీహెచ్ లక్ష్మీనారాయణ వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్‌కు సీఆర్పీసీ సెక్షన్ 160 కింద నోటీసులు ఇవ్వలేరని పేర్కొన్నారు. ఆయన వయసు 76 ఏళ్లు అని, 65ఏళ్లు దాటిన నిందితులను ఇంటి వద్దే విచారించాలని నిబంధనల్లో స్పష్టంగా ఉందని వివరించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

# నిర్దోషి సాయిబాబా

ఢిల్లీ విశ్వవిద్యాలయం మాజీ ప్రొఫెసర్, కవి, రచయిత జి.ఎన్. సాయిబాబా గురువారం ఉదయం నాగపూర్ జైలు నుంచి విడుదలైనప్పుడు, ఆయన అభిమానులలో, మిత్రులలో, ఉద్యమసహచరులలో రెండురోజులుగా భయకలవరాలతో సాగుతున్న నిరీక్షణ ముగిసినట్టయింది. నిజానికి గత మంగళవారం నాడు మహారాష్ట్ర హైకోర్టు నాగపూర్ బెంచి సాయిబాబాను, ఆయనతో పాటు మరో అయిదుగురిని నిర్దోషులుగా ప్రకటించినప్పుడే, నిర్బంధితుల ఆత్మీయులతో పాటు, దేశవ్యాప్తంగా వారి విడుదల కోసం ఉద్యమించిన ప్రజాస్వామిక వాదులంతా పెద్ద ఊరట పొంది ఉండాలి. కానీ, ఆ సంతోషం వెనుక ఒక భయం కత్తిలాగా వేలాడింది. 2022 అక్టోబర్‌లో జరిగినట్టు మళ్లీ జరుగుతుందా? ఈసారి కూడా విడుదలకు సుప్రీంకోర్టు చక్రం అడ్డు వేస్తుందా? అన్న ప్రశ్నలు ఉపశమనాన్ని ఉద్రిక్తతతో నింపివేశాయి.

నిందితుడు హైకోర్టుకు అపీలు చేసుకున్నప్పుడు, విచారణ పూర్తయ్యేదాకా కిందికోర్టు శిక్ష అమలును నిలిపివేయడం సాధారణంగా జరిగే పని. కేసు కొట్టివేసినప్పుడు ప్రాసిక్యూషన్ కూడా అపీలుకు వెళ్లవచ్చు కానీ, నిర్దోషిత్వ ప్రకటనను నిలిపివేయడం ఆనవాయితీ కాదు. కానీ, ఏడాదిన్నర కిందట, ఇదే హైకోర్టు ప్రక్రియాపరమైన కారణాలతో ఇదే కేసును కొట్టివేసినప్పుడు, మహారాష్ట్ర ప్రభుత్వం ఆగమేఘాల మీద సుప్రీంకోర్టును ఆశ్రయించడం, అత్యున్నత న్యాయస్థానం అంతే వేగంతో తీర్పును నిలిపివేయడం జరిగాయి. ప్రమాదకరమైన అభియోగాలున్న కేసులో ప్రక్రియా కారణాలతో కేసును ఎట్లా కొట్టివేస్తారు అని సుప్రీంకోర్టు అప్పుడు ప్రశ్నించింది. సాంకేతిక అంశాల ఆధారంగా కాక, ఈ సారి కేసులోని అంశాల ఆధారంగానే తీర్పు వచ్చినప్పటికీ, మరేదో మెలిక ముందుకు వచ్చి, సుప్రీంకోర్టులో అపీలు విచారణ ముగిసేదాకా నిర్బంధంలోనే కొనసాగాలన్న ఆదేశం వస్తుందేమోనన్న అనుమానం, భయం అందరిలో ఏర్పడ్డాయి. పదేళ్ల పాటు నడిచిన కేసులో, సుమారు ఎనిమిదేండ్లకు పైగా జైలు జీవితం గడిపి, న్యాయం దక్కించుకున్న సాయిబాబా విడుదలైన సందర్భంలో దేశంలో నెలకొని ఉన్న భయానక వాతావరణానికి ఈ రెండురోజుల ఉత్కంఠ ఒక గుర్తు. న్యాయస్థానం తీర్పు అమలు జరుగుతుందన్న నమ్మకం లేదు. ఏ తీర్పు తరువాతైనా ప్రభుత్వం తాను అనుకున్నది చేయగలదన్న భయం ఉన్నది. చట్టబద్ధపాలనపై పాలకులకు ఉండవలసిన విశ్వాసం ప్రజాస్వామ్యానికి ఒక ముఖ్యమైన షరతు. ప్రజాస్వామిక వ్యవస్థలన్నీ అస్వతంత్రంగా మారిపోయినప్పుడు, ఆ పరిపాలనకు నియంతృత్వమనో, ఫాసిజమనో ఏదో ఒక పేరుతో విమర్శలు రావడం సహజం.

సాయిబాబా ఆలోచనాపరుడు. తనదైన మంచీచెడ్డా విచక్షణ కలిగినవాడు. ఇప్పుడున్న సమాజం, పరిపాలన, విలువలు బాగాలేవని, వీటిని మార్చుకోవాలని తపించే వ్యక్తి. తన విద్యార్థులతో కూడా జ్ఞానాన్ని, వివేచనను పంచుకునేవాడు. ప్రశ్నలను ప్రోత్సహించేవాడు. అటువంటి వ్యక్తికి మావోయిస్టు సంబంధాలను ఆపాదించి, ఊపా చట్టం కింద తీవ్రమైన అభియోగాలను మోపి మహారాష్ట్ర ప్రభుత్వం ఆయనను నిందితుడిని చేసింది. రాష్ట్రప్రభుత్వం నిమిత్తమాత్రమే, తెరవెనుక నడిపించిందంతా కేంద్రప్రభుత్వమే. ప్రజాఉద్యమాలతో కలసి నడిచే మేధావులను అర్బన్ నక్సలైట్లని పిలుస్తూ, వారిమీద తీవ్రనిర్బంధాన్ని ప్రయోగించాలన్న జాతీయ విధానం ఆధారంగానే సాయిబాబా కేసు కానీ, ఆ తరువాత రూపొందించిన బీమాకోరేగావ్ కేసు గానీ నడిచాయి, నడుస్తున్నాయి. చక్రాల కుర్చీ ద్వారానే కదలగలిగిన 90 శాతం వికలాంగుడిగా సాయిబాబా శారీరక పరిస్థితి, ఆయనను అండాసెల్‌లో నిర్బంధించడానికి కానీ, జైలులో కనీస సదుపాయాల కల్పనకు నిరాకరించడానికి కానీ, సెషన్స్ న్యాయస్థానం తీర్పు అనంతర అపీళ్ల విచారణలో జాప్యంలో కానీ అడ్డు కాలేదు. ఈ క్రమంలో భారతదేశంలో మానవహక్కుల పరిస్థితికి సాయిబాబా ఒక అంతర్జాతీయ చిహ్నంగా మారిపోయారు. కేంద్రప్రభుత్వం కూడా స్వతంత్రంగా, హేతుబద్ధంగా ఆలోచించగలిగేవారందరికీ ఒక హెచ్చరికగా ఉండాలని సాయిబాబా కేసులో తీవ్రకాఠిన్యాన్ని ప్రదర్శించింది. బీమాకోరేగావ్ కేసులో స్టాన్‌స్వామి మరణించినట్టే, ఈ కేసులో కూడా పాండు నరోటే అనే నిందితుడు మరణించారు. మంగళవారం నాటి తీర్పుతో మరణానంతర నిర్దోషిత్వాన్ని పొందాడు.

ఈ తీర్పు మీద మహారాష్ట్ర ప్రభుత్వం అపీలుకువెళ్లింది, నిర్దోషిత్వ తీర్పు మీద స్టే ఇవ్వమని కూడా అడిగింది. కానీ మరోసారి బాహాటపు అన్యాయానికి ఆస్కారం లేకుండా ఏదో అడ్డుపడి, విడుదల జరిగింది. 'స్టే' సంగతి ఇంకా తెలియదు కానీ, అపీలు మీద సుప్రీంకోర్టులో విచారణ జరుగుతుంది. నాగపూర్ బెంచ్ న్యాయమూర్తులు జస్టిస్ వాల్మీకి మెనెజెస్, వినయ్ జోషి తమ తీర్పుకు ఇచ్చిన వివరణలను చూస్తే, సాయిబాబా మీద మోపిన అభియోగాలన్నీ తప్పుల తడక అని, మానవ, ఎలక్ట్రానిక్ సాక్ష్యాలు, అనుమతులు ఏవీ సక్రమంగా లేవని అర్థమవుతుంది.

ప్రజల హక్కులను అనుమతించని పాలనల్లో, కర్కశమైన నిర్బంధ విధానాలు కొనసాగుతూనే ఉంటాయి. వాటికి ప్రజలు తమ ప్రతిస్పందనలను సహనంతో, సాహసంతో, సృజనాత్మకతతో రూపొందించుకుంటారు. ప్రజాస్వామ్యం సామాన్య ప్రజలకే ఎక్కువ అవసరం.

---

# దక్షిణాదిని బీజేపీ గెలుచుకోగలదా?

లక్షద్వీప్ సముద్ర తీరంలో విహారాలు, కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లో గుడులు, గోపురాల సందర్శన, ఆలయ సేవలు...! ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గత రెండు నెలల్లో దక్షిణ భారతీయ రాష్ట్రాలలో నాలుగుసార్లు విస్తృత పర్యటనలు జరపడం కేవలం యాదృచ్ఛికమేనా? ఉత్తర, పశ్చిమ భారత రాష్ట్రాలలో ఎన్నికల విజయాలలో బీజేపీ ఒక గరిష్ఠ స్థాయికి చేరుకోవడంతో, దక్షిణాది రాష్ట్రాలపై దృష్టి కేంద్రీకరించి, సార్వత్రిక ఎన్నికలలో సాధించే స్థానాల సంఖ్యా బలాన్ని మరింతగా పెంపొందించుకునేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దృఢ సంకల్పంతో కృషి చేస్తున్నారు. ఉత్తర–దక్షిణ భారత రాష్ట్రాల మధ్య ఆందోళనకరంగా పెరుగుతున్న రాజకీయ అంతరాలను 2024 సార్వత్రిక సమరం అంతమొందిస్తుందా?

2019 సార్వత్రిక ఎన్నికలకు ముందు 'యాక్సిస్ మై ఇండియా' నిర్వహించిన ఒపీనియన్ పోల్‌లో తదుపరి ప్రధానమంత్రి ఎవరు కావాలని కోరుకుంటున్నారన్న ప్రశ్నకు ప్రతిస్పందనగా ఒక్క దక్షిణాది మినహా దేశ వ్యాప్తంగా అన్ని ప్రాంతాలలోనూ అత్యధికులు రాహుల్ గాంధీ కంటే నరేంద్ర మోదీనే ఇష్టపడ్డారు. దక్షిణాది రాష్ట్రాలలో 40 శాతం మంది రాహుల్ గాంధీ వైపు మొగ్గు చూపగా అధికారంలో ఉన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి కేవలం 37 శాతం మంది మాత్రమే మద్దతునిచ్చారు. కర్ణాటకలో మటుకు మోదీకే ఎక్కువ మద్దతు లభించింది. ఆ రాష్ట్రంలోని 28 లోక్‌సభ స్థానాలలో 25ను బీజేపీ కైవసం చేసుకున్నది. తెలంగాణలో బీజేపీ ఆశ్చర్యకరంగా నాలుగు స్థానాలను గెలుచుకున్నది. వింధ్య పర్వత శ్రేణులకు దిగువున ఉన్న మరే రాష్ట్రంలోనూ బీజేపీ ఒక్కటంటే ఒక్క సీటునూ గెలుచుకోలేకపోయింది.

కాలాన్ని లంఘించి 2024కి వద్దాం. త్వరలో మళ్లీ సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి. ప్రతి దక్షిణాది రాష్ట్రంలోనూ ఒక ప్రత్యేక వ్యూహాన్ని బీజేపీ అనుసరిస్తోంది. కర్ణాటకలో దేవెగౌడ నాయకత్వంలోని జనతాదళ్ (సెక్యులర్ )పార్టీతో బీజేపీ పొత్తు పెట్టుకున్నది. గత ఏడాది అసెంబ్లీ ఎన్నికలలో అదే పార్టీని 'తండ్రీ – తనయుడి' కుటుంబ నిర్వహణ సంస్థగా బీజేపీ పదే పదే పరిహసించింది. మాజీ ముఖ్యమంత్రి బిఎస్ యడ్యూరప్ప, ఆయన కుమారులకు పార్టీలో మళ్లీ కీలక పదవులు కట్టబెట్టడం ద్వారా గతంలో వలే లింగాయత్ సామాజిక వర్గానికి మళ్లీ అధిక ప్రాధాన్యమిచ్చేందుకు బీజేపీ పూనుకున్నదని స్పష్టమయింది. యడ్యూరప్ప ఇప్పుడు అష్టపదులకు పైబడిన వయసున్న వృద్ధ నాయకుడు. అయినప్పటికీ మార్గదర్శక్ మండల్ పదవీ విరమణ నియమాలను ఆయనకు వర్తింపచేసేందుకు బీజేపీ కేంద్ర నాయకత్వం సంసిద్ధంగా లేదు. ఎందుకంటే కర్ణాటకలో బీజేపీకి ప్రజల మద్దతు పొందగల ఏకైక నాయకుడు యడ్యూరప్ప మాత్రమే.

కేరళ విషయానికి వస్తే గత సార్వత్రిక ఎన్నికలలో ఆ రాష్ట్రంలో బీజేపీ ఒక్క సీటును కూడ గెలుచుకోలేకపోయింది. అయితే 12.9 శాతం ఓట్లను మాత్రం మూట గట్టుకున్నది. ఈ సారి కేరళలో తమ పార్టీ పదికి పైగా సీట్లను గెలుచుకోగలదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఢంకా బజాయించి చెబుతున్నారు. దీన్ని ఒక బడాయి మాటగా కొట్టివేసినప్పటికీ వామపక్షాలు–కాంగ్రెస్ ప్రాబల్య ద్విధ్రువ రాజకీయ రంగంతో ఒక ప్రభావశీల ప్రతిపక్షంగా రూపొందడం ద్వారా ఓట్ల శాతాన్ని గణనీయంగా పెంపొందించుకునేందుకు బీజేపీ స్పష్టంగా ప్రయత్నిస్తోంది. ప్రతిపక్ష 'ఇండియా' కూటమిలో వామపక్షాలు, కాంగ్రెస్ భాగస్వాములుగా ఉన్నాయి. మరి, అధికారం కోసం తిరువనంతపురంలో తీవ్రంగా పోటీ పడుతూ, కేంద్రంలో జట్టు కట్టడంలో అసంబద్ధంగా లేదా అని బీజేపీ ప్రశ్నిస్తోంది.

ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ ఇప్పటికీ సరైన ఉనికి లేని పార్టీగా మాత్రమే ఉన్నది. దేశంలో ప్రాంతీయ స్థాయిలో రెండు పార్టీల మధ్య నిజమైన పోరు జరుగుతున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ మాత్రమేనని చెప్పాలి. జగన్మోహన్ రెడ్డి, చంద్రబాబునాయుడులలో ఎవరు గెలిచినా గెలిచినవారి పక్షంతో బీజేపీ పొత్తు పెట్టుకుంటుంది. తెలంగాణలో బీజేపీ ఎదుర్కొంటున్న చిక్కులు మరింత తీవ్రమైనవి. గత సార్వత్రిక ఎన్నికలలో ఆ రాష్ట్రంలో బీజేపీ నాలుగు సీట్లను గెలుచుకున్నది. గత ఏడాది అసెంబ్లీ ఎన్నికల ఫలితాలలో బీజేపీ మూడో స్థానంలో ఉన్నది. అయితే లోక్‌సభ ఎన్నికలు ఆ పార్టీకి కొత్త అవకాశాలు కల్పించనున్నాయి. అసెంబ్లీ ఎన్నికలలో పరాజయం నుంచి భారత రాష్ట్ర సమితి ఇప్పటికీ కోలుకోకపోవడంతో బీజేపీ విజయావకాశాలు మెరుగుయ్యాయని చెప్పవచ్చు.

ఇక మిగిలింది తమిళనాడు. ఈ రాష్ట్రంలో అధికారంలోకి రావడమనేది బీజేపీకి పలు విధాల ముఖ్యం. ఎందుకంటే ఒక విశిష్ట రాజకీయ సంస్కృతి ఉన్న రాష్ట్రం తమిళనాడు. ఆ విలక్షణ రాజకీయ సంస్కృతి బీజేపీ ప్రపంచ దృక్పథానికి సైద్ధాంతిక సవాళ్లను విసురుతోంది. ఉదాహరణకు ఇటీవల 'సనాతన ధర్మాన్ని నిర్మూలించాలని' ముఖ్యమంత్రి స్టాలిన్ కుమారుడు, రాష్ట్ర మంత్రి ఉదయనిధి స్టాలిన్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలనే తీసుకోండి. తమ ఓటు బ్యాంకును మరింతగా పటిష్ఠం చేసుకోవడంతో పాటు బీజేపీ హిందూత్వకు తమ బ్రాహ్మణేతర ద్రావిడియన్ గుర్తింపును దీటుగా నిలబెట్టడమే ఉదయనిధి లక్ష్యం. ద్రావిడ రాజకీయ సంస్కృతి ప్రకారం బీజేపీ రాజకీయాలు అగ్రవర్ణ బ్రాహ్మణ హిందూ ధర్మానికి ప్రాతినిధ్యం వహించేవి. నిచ్చెనమెట్ల కుల వ్యవస్థలో సామాజిక న్యాయం అసాధ్యమని, ఆ భావనకు బీజేపీ రాజకీయాలలో తావులేదని డీఎంకే విశ్వసిస్తోంది.

హిందూత్వ వ్యతిరేక, బ్రాహ్మణ వాద విరుద్ధ ద్రావిడ ఉద్యమ సైద్ధాంతిక దృక్పథం కాల పరీక్షకు నిలిచి గెలిచింది. అయితే క్రమంగా కొత్త తరాలు కొత్త ఆలోచనలు చేస్తున్నాయి. రాజకీయాలు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. రాజకీయాలలోకి ప్రవేశించిన 39 ఏళ్ల ఐపీఎస్ అధికారి కె.అన్నామలై ఈ కొత్త మార్పులకు ఒక నిదర్శనం తమిళనాడు బీజేపీ అధ్యక్షుడుగా 'కుటుంబ పాలన, అవినీతికి వ్యతిరేకంగా' ఆయన పోరాడుతున్నారు. ఆయన రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన 100 రోజుల యాత్ర రాష్ట్ర రాజకీయాలో మౌలిక మార్పులను తీసుకురాలేదుగానీ రాష్ట్రంలో బీజేపీ మనుగడను సుస్థిరం చేసింది. ప్రధాన ప్రతిపక్షమైన అన్నాడీఎంకె జయలలిత మరణానంతరం అంతర్గత కుమ్ములాటలతో కూలిపోయిన తరుణంలో అన్నామలై బీజేపీకి ఎనలేని ప్రాధాన్యాన్ని సాధించారు. రానున్న లోక్‌సభ ఎన్నికలలో తమిళనాడులో పోలయ్యే ఓట్లలో సగటికీ 20 శాతానికి పైగా ఓట్లను బీజేపీ గెలుచుకోగలదని ఇటీవల ఒక సర్వేలో వెలువడడం గమనార్హం.

దక్షిణాది రాష్ట్రాలలో అధికారాన్ని స్వాయత్తం చేసుకోవడానికి బీజేపీ చేస్తున్న ప్రయత్నాలు కాంగ్రెస్ వలే అఖిల భారత రాజకీయ పక్షంగా ఆవిర్భవించాలని ఆ పార్టీ ఎంత ప్రగాఢంగా ఆకాంక్షిస్తుందో స్పష్టం చేస్తున్నాయి. సంఘ్ పరివార్ రాజకీయంగా, సైద్ధాంతికంగా ఒక సహనశీల దృక్పథాన్ని అలవరచుకునేందుకు కూడా ఇది దోహదం చేస్తుంది. 'ఒకే జాతి, ఒకే నాయకుడు, ఒకే మతం' అన్న విశ్వాసం నుంచి సంఘ్ పరివార్ దూరం జరగడానికి ఇది తప్పక దోహదం చేస్తుంది.

లోక్‌సభ ఎన్నికలలో వరుసగా రెండుసార్లు గెలిచినప్పటికీ బీజేపీ మూలాలు ఇప్పటికీ ఉత్తర భారతావని హిందీ–హిందూ–హిందుస్థాన్ రాజకీయాలలో ఉన్నాయి. కర్ణాటకతో పాటు అన్ని దక్షిణాది రాష్ట్రాలలోనూ జయపతాక ఎగురవేయాలంటే బహుళ సంస్కృతులకు ప్రాధాన్యమిచ్చే భారతీయ నాగరికతా ధర్మం వర్ధిల్లేందుకు మరింత సమ్మిళిత ప్రపంచ దృక్పథాన్ని బీజేపీ అనుసరించవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. హిందూత్వ జాతీయ వాదం తమిళ ఉప జాతీయ వాదంతో సర్దుబాటు చేసుకొని దానికి స్థానం కల్పిస్తుందా? కొత్త పార్లమెంటు భవనంలో ఒక సెంగోల్ (రాజదండం)ను ప్రతిష్ఠించడమనే ప్రతీకాత్మక చర్యకు మాత్రమే పరిమితం కాకుండా హిందీ భాషను దేశ ప్రజలు అందరిపై ఏ విధంగాను రుద్దకుండా భాషా వైవిధ్యాన్ని గుర్తిస్తుందా?

మరీ ముఖ్యంగా అధికార కేంద్రీకరణకు ఆరాటపడే ఢిల్లీ పెత్తందారీ ధోరణులను విడనాడి సమాఖ్య పాలనా విధాన స్ఫూర్తికి బీజేపీ చిత్తశుద్ధితో నిబద్ధమవ్వాల్సిన అవసరమున్నది. తద్వారా మాత్రమే దక్షిణాది రాష్ట్రాలలో ఆ పార్టీ రాజకీయ పురోగతి సుసాధ్యమవగలదు. ఆర్థిక వనరులను కేటాయించడంలో తమ రాష్ట్రాల పట్ల కేంద్రం వివక్ష చూపుతుందని దక్షిణాది ముఖ్యమంత్రులు తరచూ చేస్తున్న ఫిర్యాదులను నిష్పాక్షికంగా పరిగణనలోకి తీసుకోవాలి. ఎన్నికల ప్రయోజనాల నిమిత్తమే ఆ ముఖ్యమంత్రులు అలా మాట్లాడుతున్నారని కొట్టి పారవేయడం వల్ల ఆ ఫిర్యాదులు సమసిపోవు. కుటుంబ నియంత్రణ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలుపరిచిన పాపానికి, భవిష్యత్తులో చేపట్టే నియోజకవర్గాల పునర్విభజనలో దక్షిణాది రాష్ట్రాలకు పార్లమెంటులో ప్రాతినిధ్యాన్ని తగ్గించే అసంబద్ధ చర్యలకు ఎట్టి పరిస్థితులలోను పాల్పడకూడదు. నిజమేమిటంటే అక్షరాస్య, విద్యా సంపన్న, ఆర్థికంగా అభివృద్ధి చెందిన, సామాజికంగా ప్రగతిశీల దక్షిణాది రాష్ట్రాలు ఇప్పటికే 'వికసిత' సమాజాలుగా వర్ధిల్లుతున్నాయి. విశాల భారతదేశంలోని ఇతర రాష్ట్రాలూ ఇప్పుడు దక్షిణాది రాష్ట్రాలతో సమాన స్థాయికి చేరేందుకు దృఢ సంకల్పంతో, పటిష్ఠ కార్యాచరణతో ముందడుగు వేయాలి.

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)




దక్షిణ భారతావనిలో సంపూర్ణంగా విస్తరించేందుకు భారతీయ జనతా పార్టీ చేయవలసిందేమిటి? అధికార కేంద్రీకరణకు ఆరాటపడే ఢిల్లీ పెత్తందారీ ధోరణులను విడనాడి సమాఖ్య పాలనా విధాన స్ఫూర్తికి చిత్తశుద్ధితో నిబద్ధమవ్వాలి. తద్వారా మాత్రమే దక్షిణాది రాష్ట్రాలలో ఆ పార్టీ రాజకీయ పురోగతి సుసాధ్యమవగలదు. ఆర్థిక వనరులను కేటాయించడంలో తమ రాష్ట్రాల పట్ల కేంద్రం వివక్ష చూపుతోందని దక్షిణాది ముఖ్యమంత్రులు తరచూ చేస్తున్న ఫిర్యాదును నిష్పాక్షికంగా పరిగణనలోకి తీసుకోవాలి.



■ రాజ్‌దీప్ సర్దేశాయి

దీపశిఖ

---

# బూటకపు బటన్ మాటున దగా దీవెన

గత ప్రభుత్వాలు పేద విద్యార్థులకు అందించిన ఫీజు రీయింబర్స్‌మెంట్, మెయింటెనెన్స్ ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలను జగనన్న విద్యా దీవెన, వసతి దీవెనగా పేర్లు మార్చి తానేదో కొత్తగా ఇస్తున్నట్లు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చెప్పుకోవడం హాస్యాస్పదం. టీడీపీ ప్రభుత్వం ఏటా 16 లక్షల మంది విద్యార్థులకు ఫీజ్ రీయింబర్స్‌మెంట్ చేస్తే, నేడు వైసీపీ కేవలం 8 లక్షల మందికి... అది కూడా విడతల వారీగా అందిస్తోంది. అంటే సగం మంది పేద విద్యార్థులను మోసగించారు.

గడిచిన అయిదేళ్లుగా ప్రభుత్వ ఫీజు రీయింబర్స్‌మెంట్ అంటే తల్లిదండ్రులతో పాటు కళాశాల యాజమాన్యం భయభ్రాంతులకు గురయ్యేలా చేశారు. ఏడాదికి 4 విడతల చొప్పున అని గొప్పలు చెప్పి తల్లిదండ్రులతో అప్పులు చేయిస్తూ విద్యార్థులను ముప్పుతిప్పలు పెట్టారు. ప్రభుత్వం ఏ విడత ఎప్పుడు విడుదల చేస్తుందో తెలియదు. కళాశాలల యాజమాన్యాలకు ఎప్పుడు డబ్బులు జమ అవుతాయో తెలియదు. డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్, ట్రిపుల్ ఐటీ, ఇతర కోర్సులు పూర్తి చేసిన దాదాపు 2 లక్షల మందికి పైగా విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వలేదు. దీంతో ఉన్నత విద్య చదివే అవకాశంతో పాటు ఉద్యోగావకాశాలు కూడా కోల్పోయారు.

నాలుగు విడతలు బకాయిపెట్టిన విద్యాదీవెన సొమ్ము రూ.2,800కోట్లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద పీజీ విద్యార్థులకు ఎగ్గొట్టినది రూ.450కోట్లు, విద్యాదీవెన కింద గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది తగ్గించినది రూ.120 కోట్లతో... మొత్తం ఇప్పటివరకు జగన్మోహన్ రెడ్డి విద్యార్థులకు రూ.3,400 కోట్లు బాకీ పెట్టారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యాదీవెన సొమ్మును, ఏ త్రైమాసికం ఫీజు ఆ త్రైమాసికం అయిన వెంటనే క్రమం తప్పకుండా ఠంఛన్‌గా చెల్లిస్తున్నానని జగన్మోహన్ రెడ్డి అబద్ధపు ప్రచారం చేస్తున్నారు. జూలై 2023 త్రైమాసికానికి (2023–24 విద్యాసంవత్సరం) సంబంధించి 8,09,039 మంది విద్యార్థులకు లబ్ధి చేకూరుస్తూ డిసెంబర్ 28న రూ.584 కోట్లను నేరుగా తల్లుల ఖాతాల్లోకి జమచేస్తున్నానని డిసెంబర్ 29న పత్రికల్లో భారీ ప్రకటనలు ఇచ్చారు. 2020–21 విద్యా సంవత్సరానికి సంబంధించి విద్యాదీవెన ఒక త్రైమాసికం సొమ్ము సుమారుగా రూ.700 కోట్లు పూర్తిగా ఎగ్గొట్టారు. అలానే 2022–23 విద్యా సంవత్సరానికి కూడా ఒక త్రైమాసికం సొమ్ము ఎగ్గొట్టింది నిజం కాదా? ఈ విద్యాసంవత్సరం (2023–24) ఇప్పటికే మూడు త్రైమాసికాల ఫీజు విద్యార్థులకు చెల్లించాల్సి ఉంది. కానీ ఇప్పటివరకు ఒక విడత మాత్రమే చెల్లించారు. మొత్తంగా జగన్మోహన్ రెడ్డి నాలుగు విడతల విద్యాదీవెన సొమ్ము విద్యార్థులకు బాకీ ఉన్నారు. వాటితో పాటు ప్రైవేట్ కళాశాలల్లో పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ 2020–21 నుంచి రద్దు చేశారు.

విద్యాదీవెన, ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులకు సంబంధించి విద్యార్థుల సంఖ్యలో కూడా ఏటికేడు భారీగా కోత పెడుతున్నారు. నవంబర్ 30, 2021న 11.03 లక్షల మంది విద్యార్థులకు రూ.686కోట్లు ఇస్తే, డిసెంబర్ 29, 2023న 8,09,039 మంది విద్యార్థులకు రూ.584కోట్లు చెల్లించారు. అమ్మఒడి పేరుతో తల్లుల్ని మోసం చేయడం.. విద్యాదీవెన పేరుతో విద్యార్థుల్ని వంచించడం ఇదీ జగన్మోహన్ రెడ్డి బూటకపు బటన్ నొక్కుడు కాదా? త్వరలో ఎన్నికల నోటిఫికేషన్ వస్తే 2023–24 విద్యా సంవత్సరం విద్యాదీవెన కింద చెల్లించాల్సిన మరో రెండు విడతల సొమ్ము కూడా ఎగ్గొట్టినట్టే.

టీడీపీ హయాంలో కళాశాల, విశ్వవిద్యాలయాల విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా నేరుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ కళాశాల యాజమాన్యాలకే అందేది. జగన్మోహన్ రెడ్డి వచ్చాక తల్లులకు ఇస్తున్నానని చెప్పి ఈ విధంగా కోతలతో భావిభారత పౌరుల్ని బలితీసుకుంటున్నారు. 2022 ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రాలేదని శ్రీకాకుళంలో ఒక యువతి స్థానిక ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ ఎదుట కిరోసిన్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేసింది. 2021–22 విద్యాసంవత్సరం నాలుగో త్రైమాసికం విద్యాదీవెన సొమ్ము ఇప్పటికీ చెల్లించకపోవడంతో విజయవాడలోని ఒక కళాశాల రూ.60వేల ఫీజు కట్టాలని ఒక విద్యార్థికి నోటీసులు ఇచ్చి, పరీక్షలు రాయకుండా అడ్డుకుంది. నెల్లూరు జిల్లా కావలిలో డిసెంబర్ 17, 2023న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ప్రభుత్వం నుంచి అందలేదంటూ నర్సింగ్ కళాశాల యాజమాన్యం దాదాపు 30మంది ఫైనల్ ఇయర్ విద్యార్థుల్ని బయటకు పంపింది. ఫీజులు చెల్లించలేదని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో 24 మంది విద్యార్థుల్ని 2022 ఆగస్టులో నాలుగో సెమిస్టర్ పరీక్షలకు అనుమతించలేదు. విడతల వారీ చెల్లింపులను కాలేజీలు అంగీకరించకపోవడంతో విద్యార్థులు కాలేజీలకు దూరం అవుతున్నారు.

ప్రైవేట్, ఎయిడెడ్, అన్‌ఎయిడెడ్ కళాశాలల్లో చదివే పీజీ విద్యార్థులకు 2020–21 విద్యా సంవత్సరం నుంచి జగనన్న విద్యాదీవెన, వసతి దీవెనలు నిలిపివేశారు. దీనితో 1.7 లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, అగ్రవర్ణ పేద విద్యార్థులకు ఈ పథకం నిలిచిపోయి వారి ఉన్నత చదువుల కల చెదిరింది. అధికారంలోకి వచ్చిన వెంటనే యూనివర్సిటీ, హయ్యర్ ఎడ్యుకేషన్, అఫిలియేషన్ ఫీజులు, ఎగ్జామ్ ఫీజులు, ఏపీహెచ్ఈఆర్ఎంసీ ఫీజులు 40 నుంచి 50 శాతం పెంచేశారు. క్వాలిటీ విద్యను దూరం చేశారు.

కళాశాలలకు కట్టాల్సిన ఫీజులను తల్లుల ఖాతాల్లో వేసి... మళ్లీ వారు కళాశాలలకు కట్టే పద్ధతి వద్దు అని హైకోర్టు చెప్పినా ప్రభుత్వం పెడచెవిన పెట్టి నవంబర్ 30, 2021 తల్లుల ఖాతాలో నిధులు జమచేస్తూ జీవోను విడుదల చేసింది. విద్యా దీవెన పథకానికి ఒక విడతకి రూ.20కోట్లు చొప్పున నాలుగు విడతలకు రూ.100 కోట్లు ఖర్చు చేస్తున్నారు. దీంతో దాదాపు 40 వేల మంది విద్యార్థులకు మేలు జరిగి ఉండేది. విద్యార్థుల భవిష్యత్‌కు ఉపయోగపడే ఫీజ్ రీయింబర్స్‌మెంట్ చెల్లించకుండా జగన్ తన మీడియా సంస్థలకు మళ్లించుకుంటున్నారు.





గడిచిన అయిదేళ్లుగా ప్రభుత్వ ఫీజు రీయింబర్స్‌మెంట్ అంటే తల్లిదండ్రులతో పాటు కళాశాల యాజమాన్యం భయభ్రాంతులకు గురయ్యేలా చేశారు. ఏడాదికి 4 విడతల చొప్పున అని గొప్పలు చెప్పి తల్లిదండ్రులతో అప్పులు చేయిస్తూ విద్యార్థులను ముప్పుతిప్పలు పెట్టారు.

■ మానం ప్రణవ్ గోపాల్
టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు

---

**వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా**
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి,ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033. మెయిల్: editpage@andhrajyothy.com

---

# మహిళా దినోత్సవాన్ని వృథాపోనీయద్దు!

అంతర్జాతీయ మహిళా దినం సందర్భంగా చర్చించుకోవాల్సిన అంశాలు అనేకం ఉన్నాయి. ప్రతిరోజు స్త్రీల మీద హింస పెరిగిపోతోంది. ఎందరో స్త్రీలు చనిపోతున్నారు, లేదా చనిపోతామన్న భయంతో బతుకుతున్నారు. ఇంకెంతోమంది మహిళలు మానసిక జబ్బులకు గురౌతున్నారు. వీటికి పైకి కనిపించే కారణాలు ఏవైనా అంతర్లీనంగా ఏదో విధమైన హింస ఉమ్మడి కారణంగా ఉంది. ఈ తరుణంలో మహిళా దినోత్సవాన్ని సెలబ్రేట్ చేసుకోవటం కంటే దృష్టి పెట్టాల్సిన అంశాలు ఎన్నో ఉన్నాయి. ఈ సందర్భాన్ని మహిళలుగా మనం మన లక్ష్యాన్ని నిర్వచించుకునే వేళగానూ, మన పురోగతిని సమీక్షించుకునే అవకాశంగానూ చూడాలి. అంతేతప్ప, వంటల పోటీలు, ప్యాషన్ షోలతో ఎంజాయ్ చేసే సందర్భంగా చూడకూడదు.

ప్రధానంగా ఇవాళ స్త్రీలపై జరుగుతున్న హింసను నాలుగు రకాలుగా చెప్పవచ్చు: కుటుంబ హింస, లైంగిక హింస, రాజకీయ హింస, రాజ్యహింస. ఈ హింస నాలుగు గోడల మధ్య, సమాజంలో, రాజ్య యంత్రాంగంలో ఎక్కడైనా జరుగుతోంది. స్త్రీలకు లైంగికంగా, మానసికంగా హాని చేయడం, హాని చేస్తామని బెదిరించడం, బలవంతం చేయడం, వాళ్ల స్వేచ్ఛను అడ్డుకోవటం, కదలికలను నియంత్రించడం ఇవన్నీ పబ్లిక్‌గా జరిగినా, ప్రయివేట్‌గా జరిగినా హింసగానే పరిగణించాలి.

సాయుధ ఘర్షణలు జరిగిన సందర్భాల్లో మహిళలను రేప్ చేస్తున్నారు. స్త్రీలను బలాత్కరించడం ద్వారా ఒక కమ్యూనిటీని మొత్తంగా అవమానించవచ్చు అన్న దుష్ట ఆలోచన దీని వెనక కారణంగా ఉన్నది. ఇక్కడ ప్రధానంగా రాజ్య స్వభావాన్ని, కుట్రలను పసిగట్టాలి. దేశవ్యాప్తంగా విధ్వంసకర అభివృద్ధి, ప్రాజెక్టుల కారణంగా నిర్వాసితులవుతున్న ప్రజలు ముఖ్యంగా ఆదివాసీ ప్రజలు రాజ్యంపై పోరాడుతున్నారు. వారిపై రాజ్యం తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగిస్తోంది. వేలాది మందిని జైళ్లల్లో నిర్బంధిస్తున్నది. పాలకుల విధానాలను ప్రశ్నిస్తున్న, ఎదిరిస్తున్న ప్రజలపై, ముఖ్యంగా స్త్రీలపై రాజ్యం అత్యాచారాలనే ఆయుధంగా ఎంచుకుంటున్నది. కశ్మీర్, ఈశాన్య రాష్ట్రాలు, దండకారణ్యంలో మహిళల మాన ప్రాణాలను తోడేస్తున్నారు.

మహిళా సాధికారత, మహిళా స్వతంత్రం అంటూ ఆకర్షణీయమైన మాటలు వల్లించే పాలకులు మరొక వైపు మహిళల పట్ల సమాజ దృక్పథం ఏ మాత్రం మారకుండా ఉండేందుకు తగిన భావజాలాన్ని పెంచి పోషిస్తున్నారు. బతుకమ్మ, సమ్మక్క, సారక్క, మైసమ్మ, దుర్గమ్మ, లక్ష్మీ, సరస్వతి, పార్వతి, రాజేశ్వరి వంటి దేవతల పూజలను, పండుగలను విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. కానీ నిజజీవితాల్లో మాత్రం మహిళల్ని దేవతల్లా చూడటం అటుంచి కనీసం మనుషుల్లాగ కూడా చూడటం లేదు.

మహిళలకు వివక్ష లేని చదువు అందిస్తే వారు కొన్ని అంశాల్లో తమ పోరాటాల్ని తామే చేసుకోగలుగుతారు. నిర్భయ చట్టం, లింగ నిర్ధారణ పరీక్షలు నిరోధించే చట్టం, ఆస్తి హక్కు చట్టంపై వారిలో అవగాహన కలిగించాలి. వీటిని ఉపయోగించుకొని వారు తమపై జరుగుతున్న హింసను కొంతైనా నిరోధించగలుగుతారు. మహిళల మీద అమలవుతున్న సమస్త పీడనలకు మూలాలు దోపిడీ సమాజంలోనే ఉన్నాయి. కనుక తమ మీద జరుగుతున్న సమస్త పీడనాలను తొలగించుకోవడానికి మహిళలు దోపిడీ సమాజానికి వ్యతిరేకంగా జరిగే పోరాటంలో భాగం కావాలి. అప్పుడే నిజమైన సాధికారత, స్వేచ్ఛ పొందగలరు.

– బండి శ్రామిక

---

# నూట అరవై ఏడేళ్ల క్రితం...

అమెరికాలోని న్యూయార్క్ నగరంలో పనిగంటల తగ్గింపు కోసం, పని ప్రదేశాల్లో సౌకర్యాల కల్పన కోసం, పురుషులతో సమానంగా వేతనం ఇవ్వాలని 1857 మార్చి 8న యువతులు తొలి అడుగు వేశారు. ఇది 146 మంది కాల్చివేతకు దారి తీసింది. ఈ వీర నారీమణుల బలిదానం ఆధునిక మహిళల అభ్యున్నతికి, తదుపరి సాధించిన సాధికారతకి, విజయాలకి, విశ్వాసాలకి స్ఫూర్తిగా నిలిచింది.

'కమ్యూనిస్టు భూతాన్ని' ప్రపంచం నుంచే తరిమేయాలని భావించిన అమెరికా గడ్డపైనే స్త్రీ కార్మికులు చేసిన గర్జన విజయం సాధించటమే గాక, అంతర్జాతీయంగా మహిళా ఉద్యమాలకు స్ఫూర్తిదాయకమైన రోజుగా మార్చి 8ని నిలిపింది. ఇవే సమస్యలపై పురుష కార్మికులు చేసిన ఉద్యమానికి మే 1– ప్రపంచ కార్మిక దినోత్సవం (మే డే)గా అవతరించింది. ఇలా స్త్రీ, పురుష కార్మికుల దీక్షా దినాలకి అమెరికా గడ్డ వేదికగా మారింది.

ఆకలి కడుపులతో చావటం కన్నా పోరాడుతూ చావటం మేలు అంటూ తెగువ ప్రదర్శించిన ఈ యువతుల్ని బయటకు వెళ్లకుండా గేట్లు మూసివేసి కాల్పులు జరిపిన యాజమాన్యాల కర్కశత్వం చూసి మహిళాలోకమే కాదు యావత్ మానవజాతి నివ్వెరపోయింది. భవిష్యత్ పోరాటాలకు స్త్రీ జాతిని ఈ సంఘటన సమాయత్తం చేసింది. 1910లో కోపెన్‌హెగెన్‌లో జరిగిన అంతర్జాతీయ మహిళా సదస్సు ఈ రోజుని శ్రామిక మహిళా దినోత్సవంగా జరపాలని పిలుపునిచ్చింది. చాలాకాలం తర్వాత 1975లో దీన్ని ఆమోదించి మార్చి 8ని అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా ఐక్యరాజ్యసమితి ప్రకటించగా, భారతదేశం కూడా దీన్ని పాటిస్తోంది. సుదీర్ఘకాలం జరిగిన ఈ కృషిలో జర్మన్ కమ్యూనిస్టు నాయకురాళ్లు క్లారా జెట్కిన్, రోజా లగ్జెంబర్గ్, కారల్ మార్క్స్ కుమార్తె ఎలినార్, సోవియట్ తొలి మహిళా మంత్రి కొల్లంతోయ్‌ల పాత్ర ఉంది. 1917లో జారు పతనంతో ఏర్పడిన సోవియట్ యూనియన్ మహిళలకు ఓటు హక్కు ఇవ్వటంతో పాటు చట్టసభలకు కూడా వారిని ఎన్నిక చేసింది.


దీంతో 1917లోనే నార్వే, డెన్మార్క్‌లు, 1918లో ఇంగ్లండ్, 1920లో అమెరికా మహిళలకు ఓటుహక్కు కల్పించాయి. అయినా చట్టసభల్లో స్త్రీల ప్రాతినిధ్యం అభివృద్ధి చెందిన దేశాలుగా చెప్పుకొనే వాటిలో ఆశించిన స్థాయిలో పెరగలేదు. మనదేశం అయితే గత సంవత్సరం గణాంకాలలో 193 దేశాల సూచీలో 143వ స్థానంలో ఉంది. 1996లో రాజ్యసభ ఆమోదించిన మూడోవంతు రిజర్వేషన్ బిల్లు లోక్‌సభలో నెగ్గటానికి 27 సంవత్సరాలు పట్టటం మహిళల పట్ల మన అధికార రాజకీయ పక్షాలకున్న అభిమానంలోని డొల్లతనాన్ని ఎత్తి చూపుతుంది.

మహిళల అభ్యున్నతికోసంగా చెప్పబడే అనేక చట్టాలు – బాల్య వివాహాల నిషేధ చట్టం (1922), ప్రత్యేక వివాహ చట్టం (1955), వరకట్న నిరోధక చట్టం (1961), సమాన పనికి సమాన వేతనం చట్టం (1976), కుటుంబ కోర్టు చట్టం (1984), మహిళల్ని అసభ్యంగా చిత్రించటాన్ని నిరోధించే చట్టం (1986), ఆస్తి హక్కులో సమాన హక్కు (1986), భ్రూణ హత్యల నిరోధక చట్టం (1994), ర్యాగింగ్ నిరోధక చట్టం (1997), గృహహింస నిరోధక చట్టం (2005), ఇవిగాక ఐపీసీలో 498(ఎ), 376, 354 లాంటి చట్టాలేగాక, 73, 74 రాజ్యాంగ సవరణల ద్వారా స్త్రీలకు రిజర్వేషన్ కల్పించటం లాంటి అనేక చట్టాలు రూపొందించినా కార్యనిర్వాహక వ్యవస్థ, న్యాయవ్యవస్థల్లో ఏర్పడిన జడత్వం కారణంగా స్త్రీలకు ఆశించిన ప్రయోజనాలు అందటం లేదు.


శాసనాలు చేయటం నాణేనికి ఒకవైపు కన్పడుతున్నా మరోవైపు ఆచరణలో వైఫల్యాలు గణనీయంగా కన్పిస్తున్నాయి. రాజ్యాంగం (14వ అధికరణ) లింగ వివక్షతని నిషేధిస్తున్నా అడుగడుగునా అది దర్శనమిస్తుంది. వైద్యరంగం ఎంతో ఆధునికతను, సాంకేతికతను సంతరించుకున్నా ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం ఐదు లక్షల ప్రసూతి, ఇతర గర్భ సంబంధ సమస్యలతో మహిళలు మృతి చెందుతున్నారు. ఈ రేషియో యూరప్, ఆఫ్రికాల మధ్య 1:180గా ఉండటం ప్రపంచం ఎలా అసమతుల్యతతో ఉందో అర్థమవుతుంది. గత దశాబ్దకాలంలో మన దేశంలో మహిళలకు వ్యతిరేకంగా జరిగిన నేరాలు 22 లక్షల 40 వేలు అని గణాంకాలు చెబుతున్నాయి. 2022లో 4 లక్షల 4 వేల కేసులు నమోదైతే, 2023లో 4 లక్షల 45 వేల కేసులు నమోదయ్యాయి. ఈ 22 లక్షల కేసుల్లో 498(ఎ) వరకట్న వేధింపుల కేసులే 9 లక్షలున్నాయి. స్త్రీకి ఏ మాత్రం రక్షణలేని రాష్ట్రాలుగా ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్, మధ్యప్రదేశ్, మహారాష్ట్రలు ఉండగా; నాగాలాండ్, కేరళ, తమిళనాడులు సేఫ్‌జోన్‌లో ఉన్నాయి. మన తెలుగు రాష్ట్రాలు మధ్యస్థంగా 15, 16 స్థానాల్లో ఉన్నాయి. నగరాల విషయంలో ఢిల్లీ రక్షణ లేమిలో ప్రథమస్థానంలో నిలవగా, చెన్నై సేఫ్‌జోన్‌లో ఉంది. జాతీయ నేర సమాచార బ్యూరో తెలుపుతున్న ఈ వివరాలు చట్టాల వల్ల స్త్రీలకు రక్షణ జరగదనే వాస్తవాన్ని నిరూపిస్తున్నాయి. చట్టం అమలుపరిచే విధానం క్రియాశీలకమై, నిజాయితీ కూడి ఉండాలి. అలా ఆ వ్యవస్థ మారేంతగా స్త్రీ జనం జాగృతం కావాలి. మన దేశంలో రోడ్డు ప్రమాదాల్లో కంటే ఎక్కువగా గృహహింస కారణంగానే మహిళలు గాయపడుతున్నారని వింటుంటే మహిళా సాధికారికత అనేది ఎంత అర్థరహితమైనదో తెలుస్తుంది. పుట్టబోయేది ఆడపిల్ల అని తెలిసి భ్రూణ హత్యలకు పాల్పడటం ఇంకా కొనసాగుతూనే ఉంది.

మహిళలపై అత్యాచారాల మీద ఉక్కుపాదం మోపుతున్నాం అనే ప్రకటనల పక్కనే నిర్భయ (ఢిల్లీ), దిశ (హైదరాబాద్), హత్రాస్, ఉన్నావ్, వాకపల్లి లాంటి ఘటనలు కుప్పలు తెప్పలుగా ప్రచురితమవుతున్నాయి. ఇలాంటి స్థితిలో ఒక మహిళ దేశానికి ప్రథమ మహిళగా వుందని, ఎప్పుడో 2027లో ఓ 35 రోజులు జస్టిస్ నాగరత్న దేశ ప్రథమ ప్రధాన న్యాయమూర్తి కాబోతున్నారని, ఏడున్నర దశాబ్దాల తర్వాత ముగ్గురు మహిళా న్యాయమూర్తులు సుప్రీంకోర్టులో ఉన్నారని ఉబ్బిపోవటం కాదు. ఒక మహిళ హైకోర్టు సాధారణ న్యాయమూర్తిగా, ప్రధాన న్యాయమూర్తిగా నియమితులవటానికి స్వతంత్ర భారత్‌లో మూడు దశాబ్దాలు పట్టిందని మనం సిగ్గుపడాలి. ఈ స్థితి నుండి మహిళలు ఉన్నతంగా ఎదగాలి, మానవ హక్కులంటే మహిళల హక్కులే అనే స్పృహ పెరగాలి. ప్రపంచ సంపద, సమాజానికి అవసరమైన సంపద సృష్టిలో పురుషునికన్నా స్త్రీ పాత్ర ఎక్కువనేది నిస్సందేహం. కాని పితృస్వామిక క్షీణ విలువల కారణంగా ఇది విస్మరించబడుతున్నది. 365 రోజుల్లో ఈ ఒక్కరోజేనా? అనుకోవద్దు. ఈ రోజు గొప్పతనాన్ని గుర్తించాక 364 రోజులు వాటంతటవే దాని దగ్గరకు నడుచుకుంటూ వస్తాయి.

ప్రపంచ సంపద, సమాజానికి అవసరమైన సంపద సృష్టిలో పురుషునికన్నా స్త్రీ పాత్ర ఎక్కువనేది నిస్సందేహం. కాని పితృస్వామిక క్షీణ విలువల కారణంగా ఇది విస్మరించబడుతున్నది. 365 రోజుల్లో ఈ ఒక్కరోజేనా? అనుకోవద్దు. ఈ రోజు గొప్పతనాన్ని గుర్తించాక 364 రోజులు వాటంతటవే దాని దగ్గరకు నడుచుకుంటూ వస్తాయి.



● చెరుకూరి సత్యనారాయణ
(మార్చి 8 – అంతర్జాతీయ మహిళా దినోత్సవం)







## భూకైలాస్

మహాశివరాత్రి వేడుకలకు జిల్లాలోని శైవక్షేత్రాలు ముస్తాబయ్యాయి. ఉత్సవ వెలుగులతో మెరిసిపోతున్న ఇంద్రకీలాద్రిపై శివాలయం (ఇన్‌సెట్‌లో) యనమలకుదురులో సిద్ధమవుతున్న భారీ ప్రభలు



## మహిళా శక్తి

అనురాగం.. ఆత్మీయత.. అనుబంధాల కలబోత ఆమె. తల్లిగా.. చెల్లిగా.. సహధర్మ చారిణిగా స్త్రీ పోషించే ప్రతి పాత్ర అద్వితీయం. బేషజాలకు తావులేని మమకారం.. కష్టసుఖాల్లో ఒకేరకంగా స్పందించే స్థితప్రజ్ఞత మహిళకు పెట్టని ఆభరణాలు. ఆకాశంలో సగంగా, అవకాశాల్లో అద్భుతంగా సాగుతూ మహిళ అంటే మహారాణిగా ఎదిగిన స్త్రీమూర్తులందరికీ నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు..

రైల్వే డివిజన్ కార్యాలయంలో జరిగిన మహిళా దినోత్సవంలో శక్తిస్వరూపిణిగా ఓ కళాకారిణి

# రెచ్చగొట్టి రణరంగం

శాంతియుతంగా టీడీపీ నిరసన



కావాలని కవ్వింపు చర్యలకు పాల్పడటం.. రెచ్చగొట్టి తమాషా చూడటం.. చివరికి ఎదురెళ్లి దాడులు చేయడం.. గన్నవరంలో టీడీపీ నాయకులపై వైసీపీ నేతలు, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ చేస్తున్న అరాచకాలివి. తమపై దాడులను నిరసిస్తూ గురువారం టీడీపీ-జనసేన శ్రేణులు చేపట్టిన నిరసన దీక్షలోనూ వంశీ, ఆయన అనుచరుల వింత వైఖరి.. వారికి వంత పాడుతూ పోలీసులు చేసిన హడావిడితో శాంతియుత దీక్షా ప్రాంగణం రణరంగంలా మారింది.

## ఎనికేపాడులో ఉద్రిక్త వాతావరణం

- వైసీపీ దాడులను నిరసిస్తూ టీడీపీ-జనసేన దీక్ష
- యార్లగడ్డ వెంకట్రావు ఆధ్వర్యంలో శాంతియుత నిరసన
- దీక్షా శిబిరం వద్దకు వచ్చి మాజీ ఎమ్మెల్యే వంశీ కవ్వింపు
- ఒక్కసారిగా బయటకు వచ్చిన టీడీపీ కార్యకర్తలు
- అడ్డుకున్న పోలీసులు.. తిరగబడిన కార్యకర్తలు..

**వంశీ వెనక్కి వెళ్లిపోవడంతో శాంతించిన వాతావరణం**

(ఆంధ్రజ్యోతి-విజయవాడ/గుణదల) : గన్నవరంలో టీడీపీ నేతలను లక్ష్యంగా చేసుకుని దాడులకు పాల్పడుతున్న మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ చర్యలను నిరసిస్తూ గురువారం ఎనికేపాడులో పార్టీ గన్నవరం ఇన్‌చార్జి యార్లగడ్డ వెంకట్రావు ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్ష ఉద్రిక్తతకు దారితీసింది. టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు నల్ల కండువాలు ధరించి పెద్ద ఎత్తున దీక్షలో పాల్గొనగా, ఎమ్మెల్యే వంశీ, ఆయన అనుచరులతో పాటు పోలీసులు ప్రవర్తించిన తీరు ఘర్షణకు దారితీసింది. శిబిరంలో నాయకుల ప్రసంగాలు కొనసాగుతుండగా, ఆకస్మికంగా పెద్ద సంఖ్యలో పోలీసులు వచ్చారు. భద్రతా దళాలు శిబిరం వద్దకు చేరుకోవడం రోప్ పార్టీ సైతం చకచకా ఏర్పాట్లు చేస్తుండటంతో కార్యకర్తలు, నాయకులు ఏదో జరుగుతోందని, దాన్ని ఎదుర్కోవడానికి సిద్ధమయ్యారు. పోలీసులు శిబిరం వద్ద హడావిడి చేసిన కొద్దిసేపటికే గన్నవరం మాజీ ఎమ్మెల్యే వంశీ, తన అనుచరులతో ఐదు కార్లలో శిబిరం వద్దకు చేరుకున్నారు. శిబిరం ముందు నుంచి వెళ్లిన ఆయన తన కారును యూటర్న్ తీసుకుని వెనక్కి వచ్చారు. రోడ్డుకు అవతల పక్కన కార్లను ఆపి కవ్వింపు చర్యలకు పాల్పడుతున్న వంశీని పోలీసులు నిలువరించే ప్రయత్నం చేయలేదు. వంశీ కవ్వింపు చర్యలతో ఆగ్రహానికి గురైన శిబిరంలోని టీడీపీ, జనసేన కార్యకర్తలు, నాయకులు ఒక్కసారిగా పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ బయటకు వచ్చే ప్రయత్నం చేశారు. అప్పటి వరకు నిమ్మకు నీరెత్తినట్లు ఉన్న పోలీసులు అప్రమత్తమయ్యారు. శిబిరం వద్ద ఉద్రిక్త పరిస్థితి నెలకొనడంతో పోలీసులు టీడీపీ, జనసేన కార్యకర్తలను శిబిరం నుంచి బయకు రాకుండా నిలువరించే ప్రయత్నం చేశారు. దీంతో పోలీసులకు, కార్యకర్తలకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. కవ్వింపు చర్యలకు పాల్పడ్డ వంశీకి మద్దతుగా వస్తారా.. అంటూ కార్యకర్తలు పోలీసులకు ఎదురుతిరిగారు. యార్లగడ్డ వెంకట్రావు జోక్యం చేసుకుని టీడీపీ, జనసేన శ్రేణులను శాంతపరిచి దీక్ష కొనసాగించారు. వంశీ, ఆయన అనుచరులను పోలీసులు అక్కడి నుంచి పంపించివేశారు.

నిరసన దీక్ష శాంతియుతంగా జరుగుతుండగా, పోలీసుల సహకారంతో వంశీ కవ్వింపు చర్యలకు పాల్పడటం చూస్తుంటే రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఉందా అనే అనుమానం వ్యక్తమవుతోందంటూ కార్యకర్తలు పోలీసుల తీరును తీవ్రంగా ఖండించారు.



మాజీ ఎమ్మెల్యే వంశీ రాకతో రణరంగంలా మారిన టీడీపీ-జనసేన దీక్షా శిబిరం

### దాడులు కొనసాగితే ఆత్మరక్షణకు దిగుతాం : యార్లగడ్డ వెంకట్రావు

టీడీపీ శ్రేణులపై దాడులు చేస్తున్న వైసీపీ నాయకులను వదిలేసి బాధితులపై పోలీసులు కేసులు పెట్టి ఇబ్బందులు పెడుతున్నారని యార్లగడ్డ వెంకట్రావు ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ నాయకులకు అండగా ఉంటూ దాడులను ప్రోత్సహిస్తున్న పోలీసులు భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. వైసీపీ నేతల అరాచకాలకు అడ్డుకట్ట వేయడంలో పోలీసులు పూర్తిగా విఫలమయ్యారన్నారు. పాము కన్నా ఎక్కువ విషం ఉన్న వ్యక్తి వంశీ అని, తాము దీక్ష చేసే చోట ఆయనకేం పని అని ప్రశ్నించారు. ఓటమి భయంతోనే దాడులు, కవ్వింపు చర్యలకు తెగబడుతున్నారని ఆరోపించారు. 'నేను జగన్‌తో కలిసి నడిచా. అన్యాయం చేశారనే బయటికి వచ్చా. వచ్చే ఎన్నికల్లో గన్నవరంలో టీడీపీ విజయం ఖాయం. మమ్మల్ని అన్యాయంగా ఇబ్బంది పెట్టిన వారి లెక్కలు సరిచేస్తాం' అని హెచ్చరించారు. ఎన్నికల్లో పోలీసులు మాపై దాడులు ఆపేలా చర్యలు తీసుకోవాలన్నారు. లేదంటే మాపైకి వచ్చిన వారిపై ఆత్మరక్షణ కోసం తామే ప్రతి దాడులు చేస్తామన్నారు. ఈ నిరసన దీక్షలో టీడీపీ నాయకులు గొడ్డళ్ల చినరామారావు, గూడవల్లి నరసయ్య, కొల్లా ఆనంద్, సర్నాల బాలాజీ, కోనేరు శివరామకృష్ణ, కోనేరు సందీప్, గుజ్జర్లపూడి బాబూరావు, చాగంటిపాటి వెంకటకృష్ణ, ఆళ్ల గోపాలకృష్ణ, చలమలశెట్టి రమేష్, పొదిలి లలిత, చిక్కవరపు నాగమణి, తుపాకుల శివలీల, జూపల్లి సురేష్, దండు సుబ్రమ్మణ్యరాజు, అద్దేపల్లి సాంబు, బోడపాటి రవికుమార్, పరుచూరి నరేష్, మూల్పూరి సాయికల్యాణి, మండవ లక్ష్మి, మండవ రమ్య, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

# అభ్యర్థులు అటు.. ఇటు..



సింహాద్రి చంద్రశేఖర్



సింహాద్రి రమేశ్

- మచిలీపట్నం వైసీపీ ఎంపీ అభ్యర్థిగా సింహాద్రి చంద్రశేఖర్
- అవనిగడ్డ అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తగా సింహాద్రి రమేష్

**అవనిగడ్డ, మార్చి 7 :** అవనిగడ్డ అసెంబ్లీ, మచిలీపట్నం పార్లమెంట్ నియోజకవర్గాల అభ్యర్థులను ఆ పార్టీ అధిష్టానం తారుమారు చేసింది. అవనిగడ్డ ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించిన డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్‌ను మచిలీపట్నం ఎంపీ అభ్యర్థిగా మార్పు చేసింది. తొలుత అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబును మచిలీపట్నం ఎంపీ అభ్యర్థిగా ప్రకటించింది. కారణాలు ఏవైతేనేం అభ్యర్థిని మార్చాల్సి వచ్చింది. గురువారం సాయంత్రం తాడేపల్లిలో జరిగిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే పేర్ని నాని మాట్లాడుతూ చంద్రశేఖర్‌ను ఎంపీ అభ్యర్థిగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నిర్ణయించినట్టు తెలిపారు. డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్‌రావు తండ్రి సింహాద్రి సత్యనారాయణరావు మూడుసార్లు అవనిగడ్డ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొంది మంత్రిగా పని చేశారని, మచిలీపట్నంతో డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్, వారి కుటుంబానికి విడదీయలేని అనుబంధం ఉందని, 35 ఏళ్లుగా ఆయన అంకాలజిస్టుగా ప్రజలకు వైద్య సేవలందించారని చెప్పారు. చంద్రశేఖర్ మాట్లాడుతూ తనను అవనిగడ్డ నుంచి అసెంబ్లీకి పోటీ చేయాలని అవకాశమిచ్చారని, తాను అసెంబ్లీకి పోటీ చేయనని చెప్పానని, సీఎం జగన్మోహన్‌రెడ్డి స్వయంగా తనను పిలిపించి ఎంపీగా పోటీ చేయాలని కోరారని చెప్పారు. కాగా, అవనిగడ్డ అసెంబ్లీ నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్తగా సిటింగ్ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబును నియమిస్తూ ఆ పార్టీ గురువారం ప్రకటన జారీ చేసింది. మచిలీపట్నం పార్లమెంటు అభ్యర్థి చంద్రశేఖర్, అవనిగడ్డ అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త రమేష్‌బాబు ఒకే అవనిగడ్డ నియోజకవర్గంవారే కాక ఒకే గ్రామం అయిన బందలాయిచెరువుకు చెందినవారు.

# పోర్టు పనులు ఎప్పటికో..!

- 16 బెర్తులకు బదులుగా 4 బెర్తులతో బందరు పోర్టు నిర్మాణ పనులు
- తొమ్మిది నెలల్లో చేసింది 15 శాతం పనులే..
- 30 నెలల్లో పూర్తిచేయాలని ఒప్పందం
- పోర్టు పూర్తికాకుండానే అనుబంధ పరిశ్రమల కోసం భారత్ సాల్ట్ భూములు కావాలని నోటీసులు

- 6లో..

మచిలీపట్నం పోర్టు పనులు ఎన్నికల స్టంట్‌గా మారాయా? ఎన్నికలకు ఏడాది ముందు పోర్టు పనులు ప్రారంభించి అధికార పార్టీ నాయకులు ప్రజలను మభ్యపెడుతున్నారా? అనే సందేహాలు వస్తున్నాయి. మచిలీపట్నం పోర్టు నుంచి సరుకుల ఎగుమతులు, దిగుమతులకు కీలకమైన బెర్తుల నిర్మాణం ఎప్పటికి పూర్తవుతుందో తెలియడం లేదు. మరికొద్ది రోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానున్న నేపథ్యంలో పోర్టు పనులు కొనసాగుతాయా లేక నిలిచిపోతాయా అనే చర్చ జరుగుతోంది. గడిచిన తొమ్మిది నెలల్లో కేవలం 15 శాతం పనులు మాత్రమే పూర్తవడం గమనార్హం.

సౌత్‌బ్రేక్ వాటర్ తొలిదశ పనులు



# వస్తారు.. వెళ్తారు..
## సమస్యలు పరిష్కరించరు..!

- ఎవరొచ్చినా.. ఎన్నిసార్లు వచ్చినా ఏం లాభం..?
- ఎమ్మెల్యే వెలంపల్లిని నిలదీసిన 29వ డివిజన్‌వాసులు
- దోమలు, తాగునీరు, డ్రెయినేజీ సమస్యలపై అసహనం
- సమాధానం చెప్పలేక జారుకున్న వెలంపల్లి



ఎమ్మెల్యే వెలంపల్లిని నిలదీస్తున్న స్థానికుడు కిరణ్

**అజిత్‌సింగ్‌నగర్/మధురానగర్, మార్చి 7 :** 'గడప గడపకు మన ప్రభుత్వం అని ఈ ప్రాంత ఎమ్మెల్యే మల్లాది విష్ణు, స్థానిక కార్పొరేటర్ ఎన్నోసార్లు వచ్చారు. వారికి మా సమస్యలను స్వయంగా దగ్గరుండి చూపించినా ఒక్కటి కూడా పరిష్కరించలేదు. ఇప్పుడు వారిని కాదని కొత్తగా నేనే ఎమ్మెల్యే అభ్యర్థినంటూ మీరొచ్చారు. చూసి వెళ్లిపోతారు తప్ప మా సమస్యలకు పరిష్కారం చూపించరు.' అంటూ నగరంలోని 29వ డివిజన్ వాసులు వైసీపీ విజయవాడ సెంట్రల్ అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావును నిలదీశారు. 'ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించలేనప్పుడు, మేము చెప్పిన సమస్యలను పరిష్కరించలేనప్పుడు ఎవరొచ్చినా, ఎన్నిసార్లు వచ్చినా మాకేంటి లాభం' అంటూ వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. 29వ డివిజన్ కొబ్బరితోట, యూపీ నరసరాజు రోడ్డు ప్రాంతంలో గురువారం ఉదయం 'జగనన్న కావాలి.. శీనన్న రావాలి..' కార్యక్రమంలో భాగంగా వెలంపల్లి శ్రీనివాసరావు గడప గడపకు వెళ్లి వైసీపీ కార్యక్రమాలు, సంక్షేమ పథకాల గురించి వివరించే ప్రయత్నం చేశారు. గద్దె బాబూరావు రోడ్డులో అత్తూరి కిరణ్ అనే వ్యక్తితో పాటు ఆయన కుటుంబ సభ్యులు తమ ఇంటి వద్దకు వచ్చిన వెలంపల్లి శ్రీనివాసరావును ప్రశ్నించారు. ఐదేళ్లుగా రోడ్డు అండర్ బ్రిడ్జి (ఆర్‌యూబీ) నిర్మాణం పూర్తికాకపోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉందని, ఏదైనా ప్రమాదం జరిగితే 108 అంబులెన్స్ డివిజన్‌లోకి రావడానికి ఇబ్బందిగా ఉందని, గతంలో సిటీ బస్సు వచ్చేదని, ఆర్‌యూబీ పూర్తి కాకపోవడంతో బస్సులు రావడం లేదని, రోడ్లు బాగాలేదని, డ్రెయినేజీ సరిగ్గా లేదని, మంచినీరు, దోమల సమస్య తీవ్రంగా ఉందని.. ఒకదాని తర్వాత ఒకటి ఏకరువు పెట్టారు. దీనికి వెలంపల్లి స్పందిస్తూ.. కొన్ని కారణాల వల్ల ఆర్‌యూబీ ఆలస్యమైనా రెండు నెలల నుంచి యుద్ధ ప్రాతిపదికన పనులు చేస్తున్నారని, మిగిలిన సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. ఎమ్మెల్యే విష్ణు కూడా ఇలాగే చెబుతున్నారని, ఇప్పుడు మీరు కూడా అలాగే చెబుతున్నారన్నారు. దీంతో సహనం కోల్పోయిన ఆయన వాస్తవ పరిస్థితులు తెలిసినా ఇంకా ఇలా ప్రవర్తించడం సరికాదని, మీరు నాకు ఓటు వేయకపోయినా పర్లేదని చెప్పి వెళ్లిపోయారు. ఈ పర్యటనలో ఆయనతో పాటు స్థానిక వైసీపీ కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

### మా ఎమ్మెల్యేనే ప్రశ్నిస్తారా?

'మా ఎమ్మెల్యేనే ప్రశ్నిస్తారా.. సమస్యలేమైనా ఇప్పుడే వచ్చాయా... ముందు నుంచి లేవా' అంటూ ఎమ్మెల్యే వెలంపల్లి అనుచరులు స్థానికులను బెదిరించే ప్రయత్నం చేశారు. వారిపై తిట్ల పురాణంతో విరుచుకుపడ్డారు. మరికొందరు అనుచరులు ఏకంగా ప్రశ్నించిన వ్యక్తిపై దాడి చేసేందుకు సిద్ధమయ్యారు. పరిస్థితి అదుపు తప్పుతుండటంతో అక్కడే ఉన్న పోలీసులు ఇరువర్గాలను అదుపు చేశారు.

# నోడల్ ఆఫీసర్ల నియామకం

16 మందిని నియమిస్తూ ఉత్తర్వులు

- 6లో..



చాందిని టెంట్లతో డెకరేషన్ చేసిన దుర్గానాగేశ్వరస్వామి ఆలయం

## పెదకళ్లేపల్లిలో దుర్గా నాగేశ్వర స్వామి కల్యాణోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి



**మోపిదేవి, మార్చి 7 :** మహాశివరాత్రి పురస్కరించుకుని దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన పెదకళ్లేపల్లిలో దుర్గానాగేశ్వరస్వామి వార్షిక కళ్యాణోత్సవాలకు ఏర్పాట్లు సిద్ధం చేశారు. పలు ప్రాంతాలనుంచి లక్షమందికిపైగా భక్తులు వస్తారని అంచనా. పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు వీలుగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా గజ ఈతగాళ్లు, పడవలు ఏర్పాటుచేసి నిరంతరం ఘాట్లవద్ద గస్తీ ఉండేలా ఏర్పాట్లు చేశారు. మచిలీపట్నం డీఎల్‌పీవో జ్యోతిర్మయి, ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ శ్రీవిద్యల ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల నుంచి డిప్యూటేషన్‌పై వచ్చిన పంచాయతీరాజ్ శాఖ సిబ్బంది గ్రామంలో పారిశుధ్య చర్యలు వేగవంతం చేశారు. రహదారుల వెంబడి బ్లీచింగ్, ఘాట్ల వద్ద శానిటేషన్ చర్యలు చేపట్టారు. భక్తులు దుస్తులు మార్చుకునేందుకు వీలుగా ప్రత్యేక గదులు, మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేశారు. దుర్గానాగేశ్వరస్వామి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. ఈవో ఎన్.ఎస్.చక్రధరరావు ఆధ్వర్యంలో భక్తులకు ఉచిత ప్రసాదం, మంచినీరు అందించనున్నట్టు తెలిపారు. అవనిగడ్డ డీఎస్పీ మురళీధర్, చల్లపల్లి అవనిగడ్డ సీఐలు నాగప్రసాద్, త్రినాథ్‌ల ఆధ్వర్యంలో 250మంది పోలీసు సిబ్బందిచే బందోబస్తు నిర్వహించనున్నారు.

## దుర్గగుడి ట్రస్ట్‌బోర్డులో ప్రధాన అర్చకునికి దక్కని చోటు!

**వన్‌టౌన్, మార్చి 7 :** దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం ట్రస్ట్‌బోర్డుకు సభ్యులను నియమించే క్రమంలో ప్రధాన అర్చకుడికి చోటు కల్పించలేదు. గతేడాది వైసీపీ ప్రభుత్వం తొలుత కర్నాటి రాంబాబు అధ్యక్షతన 15మంది సభ్యులను నియమించింది. తొలిజాబితాలో ప్రధాన అర్చకుడి పేరును విస్మరించారు. ఇటీవల ముగ్గురిని ప్రత్యేక ఆహ్వానితులుగా నియమించారు. మూడు రోజుల క్రితం ఒక ప్రత్యేకఆహ్వానితుడు, ఒక సభ్యుడిని నియమించారు. ట్రస్ట్‌బోర్డులో ప్రధాన అర్చకుడికి కూడా స్థానం కల్పించే సంప్రదాయం కొనసాగుతుంది. ప్రధాన అర్చకుడు దుర్గాప్రసాద్ గతంలో మూడు పర్యాయాలు దేవస్థానం తరఫున ప్రతినిధిగా కొనసాగారు. బద్రీనాథ్‌బాబుపై కొన్ని ఆరోపణలు ఉండటంతో ఆయనను పక్కన పెట్టారు. మరొక ప్రధాన అర్చకుడు సుందరం తనకు బోర్డులో సభ్యత్వం అవసరం లేదని రాసి ఇచ్చినట్టు సమాచారం. ట్రస్ట్‌బోర్డు సమావేశాలల్లో వైదిక కార్యక్రమాలు, ఉత్సవాలను గురించి తీర్మానాలు చేసేటపుడు సలహాలు ఇచ్చేందుకు దేవస్థానం తరఫున ప్రాతినిధ్యం ఉండాల్సిన అవసరం ఉంది. వీరిని ఎక్స్ అఫిషియో సభ్యుడిగా వ్యవహరిస్తారు. మరోవైపు తీర్మానాలు ఆమోదం కావాలంటే కోరం ఉండటంతో పాటు ఓటింగ్ సమయంలో కూడా ఎక్స్ అఫిషియో సభ్యుడి అవసరం ఉంటుంది. ప్రత్యేక అహ్వానితులకు ఓటు ఉండదు. ట్రస్‌బోర్డులో ప్రస్తుతం 16 మంది సభ్యులు ఉన్నారు.

## సుస్థిర ఆర్థిక సాధికారతకు చేయూత

» నాలుగో విడతగా రూ.179.17 కోట్ల లబ్ధి : జేసీ సంపత్‌కుమార్

**కృష్ణలంక, మార్చి 7 :** మహిళలకు ఆర్థిక సహకారం అందించి, ఆపై సుస్థిర జీవనోపాధి మార్గాలను చూపి వారికి సాధికారిత కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ చేయూత పథకాన్ని అమలుచేస్తోందని జాయింట్ కలెక్టర్ పి.సంపత్‌కుమార్ అన్నారు. వైఎస్సార్ చేయూత పథకం ఆర్థిక సహాయాన్ని బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా జమచేసే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి అనకాపల్లి జిల్లా, కశింకోట మండలం, పిసినికాడలో గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కలెక్టరేట్ నుంచి జాయింట్ కలెక్టర్ పి.సంపత్‌కుమార్, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ ఎం.శివరామకృష్ణ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ టి.జమలపూర్ణమ్మ, లబ్ధిదారులతో కలిసి హాజరయ్యారు. లబ్ధిదారులకు మెగా చెక్ అందజేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ, మహిళల సమగ్రాభివృద్ధి, సాధికారత లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాలు, కార్యక్రమాలను అమలుచేస్తోందని తెలిపారు. నాలుగో విడతలో జిల్లాకు సంబంధించి 95556 మందికి రూ.179.17 కోట్ల మేర లబ్ధి జరుగుతోందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ సహకారాన్ని సద్వినియోగం చేసుకొని తమ కుటుంబాలను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, డ్వామా పీడీ జె.సునీత లబ్ధిదారులు పాల్గొన్నారు.




విద్యార్థులకు ప్రశంసా పత్రం అందజేస్తున్న మిజోరం గవర్నర్

## లయోలలో ఘనంగా ప్లాటినమ్ జూబ్లీ వేడుకలు

**భారతీనగర్ :** ఆంధ్రాలయోలా కళాశాల స్థాపించి 70 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కళాశాలలో ప్లాటినమ్ జూబ్లీ వేడుకలు గురువారం హాకీ గ్రౌండ్‌లో ఘనంగా నిర్వహించారు. వేడుకలకు ముఖ్యఅతిథిగా కళాశాల పూర్వ విద్యార్థి, మిజోరం గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కంభంపాటి మాట్లాడుతూ, భవిష్యత్తును మెరుగుపరచడం కోసం సాంకేతికతను ఉపయోగించుకోవాలని విద్యార్థులకు వివరించారు. వేడుకల్లో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన కూచిపూడి శాస్త్రీయ నృత్యం, తెలుగు జానపద నృత్యం చూపరులను ఆకట్టుకున్నాయి. అనంతరం 2005, 2016లో పద్మశ్రీ అవార్డులు అందుకున్న ప్రొఫెసర్ భాగవతుల దత్తగురు, డాక్టర్ వైనాయుడమ్మను కళాశాల ప్రిన్సిపల్స్ సత్కరించారు. ప్రిన్సిపల్ ఫాదర్ కిషోర్, కో-ఆర్డినేటర్ డాక్టర్ జి.సహాయ భాస్కరన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పాడిరైతుల అభివృద్ధి చలసాని సేవలు భేష్

» తానా కార్యదర్శి కసుకుర్తి రాజా


**హనుమాన్‌జంక్షన్‌రూరల్, మార్చి 7 :** పాడి రైతుల సర్వతోముఖాభివృద్ధికి కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు అందిస్తున్న సేవలు నిరుపమానమని తానా కార్యదర్శి కసుకుర్తి రాజా అన్నారు. వీరవల్లిలోని విజయ(కృష్ణామిల్క్ యూనియన్)పాల ఉత్పత్తుల నూతన ప్యాక్టరీని గురువారం ఆయన సందర్శించారు. అత్యాధునిక సాంకేతికత, నాణ్యతా ప్రమాణాలతో జరుగుతున్న పాల ఉత్పత్తులను ఆయన పరిశీలించారు. వీరవల్లి ప్రాంతంలో ఫ్యాక్టరీ స్థాపించడం గ్రామవాసిగా గర్వపడుతున్నానని కసుకుర్తి రాజా తెలిపారు. తనవంతు సహకారంగా.. తానా ద్వారా పాడిరైతులకు సాంకేతిక సహకారంతో పాటు మినీడెయిరీల ఏర్పాటుకు సహకారమందిస్తామని రాజా హామీ ఇచ్చారు. అనంతరం చలసాని అంజనేయులు రాజాను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వీరవల్లి పాల సొసైటీ అధ్యక్షుడు కసుకుర్తి నిరంజనరావు తదితరులు పాల్గొన్నారు.



తానా కార్యదర్శి కసుకుర్తి రాజాను సత్కరిస్తున్న చలసాని ఆంజనేయులు

## పీజీ పరీక్షలు వాయిదా

**పెదకాకాని, మార్చి 7:** ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సుల నాలుగో సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి రెడ్డి ప్రకాష్‌రావు గురువారం తెలిపారు. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 27 నుంచి ప్రారంభం కావాల్సిన పరీక్షలను వాయిదా వేశామన్నారు. తిరిగి పరీక్షలు ఏప్రిల్ 2 నుంచి యథావిధిగా కొనసాగుతాయన్నారు. పరీక్షల సమయంలో ఎటువంటి మార్పు లేదని ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు నిర్వహిస్తామని తెలిపారు.



# మహా శివరాత్రికి ముస్తాబు

- నేడు యనమలకుదురు రామలింగేశ్వరస్వామి, పార్వతి అమ్మవార్ల కల్యాణ మహోత్సవం
- గ్రామంలో 50కి పైగా ప్రభల ఏర్పాటు
- వేలాదిగా భక్తులు హాజరవుతారని అంచనా
- భారీ బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీసు శాఖ

**పెనమలూరు, మార్చి7 :** మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా యనమలకుదురు రామలింగేశ్వర స్వామి ఆలయంలో వేడుకలు ఘనంగా జరగనున్నాయి. శుక్రవారం నాడు ఆలయంలో రామలింగేశ్వరస్వామి, పార్వతీ దేవి అమ్మవార్ల కళ్యాణం కన్నుల పండువగా జరగనుంది. గ్రామంలో ఏభైకి పైగా ప్రభలను ఏర్పాటు చేశారు. లక్షమందికి పైగా భక్తులు హాజరయ్యే ఉత్సవాలను దృష్టిలో ఉంచుకొని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఐదుగురు డీఎస్పీలు, 12మంది సీఐలు, 30మంది ఎస్ఐలు, ఐదువందల మందికిపైగా సిబ్బందితో భారీ భద్రతా ఏర్పాట్లు చేసినట్టు అదనపు ఎస్పీ జి.వెంకటేశ్వరరావు తెలిపారు. గన్నవరం డీఎస్పీ స్వయంగా భద్రతా ఏర్పాట్లు పరిశీలిస్తున్నారు. గురువారం దుర్గామల్లేశ్వరస్వామి ఈవో కేఎస్ రామారావు, ఆలయ అభివృద్ధి దాత సంగా నరసింహరావులు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు.

### నేటి కార్యక్రమ వివరాలు

శుక్రవారం మహాశివరాత్రి సందర్భంగా స్వామివారికి విశేష అభిషేకాల అనంతరం బిల్వార్చన, పార్వతీ దేవికి కుంకుమ పూజ నిర్వహించనున్నారు. ఉదయం 11గంటలకు గ్రామ మంటపం వద్ద దేవస్థాన ప్రభకు ఎడ్లు కట్టి ఊరేగించేందుకు పాట కార్యక్రమం నిర్వహిస్తారు. మధ్యాహ్నం నుంచి రాధాకృష్ణ కోలాటాలు, భజనలు కోయనృత్యాలు, బేతాళ వేషాలు, హిరాణి నృత్యాలు, మేళతాళాలతో గ్రామ ప్రభను అత్యంత వైభవంగా గ్రామోత్సవం నిర్వహిస్తారు. రాత్రి 2.25గంటలకు రావి ఉదయకిరణ్, దీప్తి దంపతులచే కళ్యాణం నిర్వహిస్తారు.

## దుర్గా ఘాట్ల వద్ద పటిష్ట ఏర్పాట్లు

### పరిశీలించిన దుర్గగుడి ఈవో రామారావు

**వన్‌టౌన్ :** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని కృష్ణానదిలో స్నానాలు చేసేందుకు అత్యధిక సంఖ్యలో వచ్చే భక్తు కోసం దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం, పోలీసు అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. శుక్రవారం వేకువ జాము నుంచే భక్తులు తరలిరానున్నారు. బ్యారేజీ దిగువన స్నానాలకు నదిలో నీరు లేకపోవడంతో జల్లు స్నానాలకు ఏర్పాట్లు చేశారు. దుర్గాఘాట్‌లోకి విస్తృతంగా భక్తులు దిగకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు. ప్రముఖ పాత శివాలయంగా పేరున్న భ్రమరాంబ మల్లేశ్వలరాలయానికి భక్తులు అత్యధిక సంఖ్యలో రానున్న దృష్ట్యా ప్రత్యేక క్యూలను దేవస్థానం ఏర్పాటు చేసింది. మరోవైపు ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వరస్వామి ఆలయాన్ని పునరుద్ధరించి ఇటీవలే భక్తులను అనుమతించారు. స్వామివారిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు వస్తారని అంచనా. శివాలయాలలో వేకువ జామునుంచే అభిషేకాదులను ప్రారంభించనున్నారు. ఘాట్ల వద్ద పరిస్థితిని దుర్గగుడి ఈవో రామారావు స్వయంగా పరిశీలించారు. ఇదే క్రమంలో ఘాట్ల వద్ద, ఆలయాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. మొత్తం అన్ని ఘాట్ల వద్ద వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో సుమారు 300 మంది. భవానీపురం పోలీసుస్టేషన్ పరిధిలో 65 మంది. కృష్ణలంక పోలీసు స్టేషన్ పరిధిలోని ఘాట్ల వద్ద 25 మందిని నియమించారు.



దుర్గాఘాట్ వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న దుర్గగుడి ఈవో రామారావు

# పోర్టు పనులు ఎప్పటికో!

**ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం :** మచిలీపట్నం పోర్టును 16 బెర్తులతో నిర్మించాలి. ఇందుకోసం రూ.11,994 కోట్లకుపైగా వినియోగించాలి. అంత పెద్దమొత్తంలో నిధులను సమకూర్చకుండా వ్యూహాత్మకంగా అధికారపార్టీ నాయకులు పోర్టు పనులను రెండు ఫేజ్‌లుగా విభజించారు. మొదటి ఫేజ్‌లో రూ.3,683.83 కోట్లతో నాలుగు బెర్తులతో పనులు చేయాలని నిర్ణయించారు. కేంద్రప్రభుత్వ సంస్థ పవర్‌ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి పోర్టు నిర్మాణం కోసం రుణం తీసుకుంది. రాష్ట ప్రభుత్వం నుంచి నిధులు విడుదల చేయకుండానే రుణం తీసుకున్న నగదుతో పోర్టు పనులను ప్రారంభించారు. గత ఏడాది మేలో పనులు ప్రారంభించగా ఇప్పటివరకు రూ.350 కోట్ల విలువైన పనులు మాత్రమే పూర్తి చేశారు. అధికారుల లెక్కల ప్రకారం 15 శాతం పనులు మాత్రమే జరిగాయి. నాలుగు బెర్తుల నిర్మాణంలో భాగంగా ఒక్కో బెర్తుకు 300 పిల్లర్ల చొప్పున 1200 పిల్లర్లు నిర్మించాలి. ఈ పిల్లర్లు 200 అడుగుల లోతు నుంచి నిర్మించాలి. ఇప్పటివరకు మూడు బెర్తులకు సంబంధించి 250 పిల్లర్ల పనులే ప్రారంభించారు. నాలుగో బెర్తుకు పిల్లర్లు పోసే పనులు ఇంకా ప్రారంభం కాలేదు. ఫిబ్రవరి నెలాఖరుకు ఒకటో నెంబరు బెర్తు పనులకు పిల్లర్లు పోసే పనులు పూర్తిచేస్తామని, జూన్ నెలాఖరు నాటికి పిల్లర్లపై బీమ్‌లువేసి, శ్లాబ్ పనులు పూర్తి చేస్తామని చెప్పినా అనుకున్న స్థాయిలో పనులు జరగడం లేదు.

### డ్రెడ్జింగ్ పనుల ప్రారంభం ఎప్పుడో

సముద్రంలో నుంచి పోర్టు వరకు ఓడల రాకపోకల కోసం డ్రెడ్జింగ్ పనులు చేయాలి. ఓడల రాకపోకల కోసం ఏర్పాటు చేసిన టర్నింగ్ సర్కిల్‌కు సమీపంలో మంగళవారం నాటికి నాలుగు డ్రెడ్జర్లను తీసుకువచ్చి సముద్రంలో నిలిపి ఉంచారు. వీటి ద్వారా పనులు ఎప్పటికి ప్రారంభిస్తారో తెలియదు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో అధికారపార్టీ నాయకుల సూచనలతో ఈ డ్రెడ్జర్లను తీసుకువచ్చి హడావుడి చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. పోర్టు వద్ద సౌత్‌బ్రేక్‌వాటర్, నార్త్ బ్రేక్‌వాటర్‌కు మధ్య 450 మీటర్ల మేర ఉన్న ఖాళీలో నుంచి 80వేల టన్నుల సామర్థ్యంతో సరుకులతో ఉన్న ఓడలు రాకపోకలు సాగించాల్సి ఉంది. ఓడల రాకపోకల కోసం 20 మీటర్ల లోతున మట్టిని డ్రెడ్జింగ్ చేయాలి. ఈ పనులు ఇంకా ప్రారంభం కాలేదు.

### బ్రేక్ వాటర్ తొలిదశ పనులు తుదిదశకు

పోర్టు పనులు కొంతమేర జరిగాయంటే అవి సౌత్, నార్త్ బ్రేక్‌వాటర్‌ల తొలిదశ పనులే. సౌత్ బ్రేక్ వాటర్ నిర్మాణం 2,050 మీటర్లమేర జరగాలి. ఇప్పటివరకు 1900 మీటర్ల పనులు జరిగాయి. నార్త్‌బ్రేక్ వాటర్ నిర్మాణం 270 మీటర్లు. రెండు బ్రేక్ వాటర్ నిర్మాణాలకు తొలివిడత పనులు పూర్తయ్యేదశలో ఉన్నాయి. ఈ రెండు బ్రేక్‌వాటర్‌ల తొలిదశ పనులను పరిశీలించి మరింతగా పటిష్టవంతంగా నిర్మించేందుకు చెన్నయ్‌కు చెందిన ట్రిపుల్‌ఐటీ నిపుణులకు బాధ్యతలను అప్పగించారు. వారు ఈ రెండు బ్రేక్‌వాటర్‌ల తొలివిడత నిర్మాణం పనులు పూర్తయిన తరువాత పరిశీలన చేసి, ఇక్కడి సముద్రంలో అలల ఉధృతి, ఇతర పరిస్థితులపై అధ్యయనం చేసి దీర్ఘకాలంపాటు బ్రేక్‌వాటర్‌లు దెబ్బతినకుండా తీసుకోవాల్సిన చర్యలపై నివేదిక ఇవ్వాల్సి ఉంది. ఇది అందిన తరువాత మళ్లీ బ్రేక్ వాటర్‌లను పటిష్టం చేయడం, వీటి ఎత్తుపెంచడం వంటి పనులు చేయాలి.

### భూ బాధితులకు అందని పరిహారం

మచిలీపట్నం-విజయవాడ జాతీయ రహదారి 65, కత్తిపూడి-ఒంగోలు 216-ఏ జాతీయ రహదారులకు, మచిలీపట్నంలోని రైలు మార్గానికి అనుసంధానం చేస్తూ పోర్టు నుంచి రోడ్‌కం రైలు మార్గాన్ని నిర్మించాలి. రోడ్డు కంరైలు మార్గాల నిర్మాణం కోసం 280 ఎకరాల భూమి అవసరమని గుర్తించారు. ఈ భూములను రైతుల నుంచి తీసుకున్నారు. కానీ రైతులకు ఇవ్వాల్సిన నగదును ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారు. కరగ్రహారం నుంచి మేకావానిపాలెం వరకు ముందస్తుగా భూములిచ్చిన రైతులకు తొలివిడతగా అసైన్డ్ భూములకు ఎకరానికి రూ.31.25 లక్షలు చొప్పున, పట్టా భూములకు రూ.45లక్షలు చొప్పున నగదు జమచేశారు. మరికొందరు రైతులకు భూపత్రాలు సక్రమంగా లేవనే కారణంతో వారికి నగదు జమచేయలేదు. మంగినపూడి బీచ్ రోడ్డులో పోర్టు పాత శిలాఫలకం నుంచి పోతేపల్లి వరకు రోడ్‌కం రైలు మార్గాలకు భూములిచ్చే రైతులకు రూ.55లక్షలు ఇస్తామని అధికారులు అంగీకరించినా, రైతులకు నగదు జమచేసే అంశంపై సాంకేతికపరమైన కారణాలు చూపి ఇంతవరకు నగదు జమ చేయలేదు. పోర్టు పనులు ఒకవైపు నత్తనడకన సాగుతుండగా పోర్టు అనుబంధ పరిశ్రమల స్థాపన కోసం మరో రెండువేల ఎకరాలు అవసరమని చెప్పి పల్లెతుమ్మలపాలెంలోని భారత్‌సాల్ట్ భూములను తీసునేందుకు ప్రభుత్వం నోటీసులు జారీ చేయడం గమనించదగ్గ అంశం.

## 10న గురుకుల విద్యాలయాల ప్రవేశ పరీక్ష

**వన్‌టౌన్, మార్చి 7 :** డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల ప్రవేశపరీక్ష ఈనెల 10న నిర్వహించనున్నట్టు ఉమ్మడి కృష్ణాజిల్లాల సమన్వయ అధికారిణి బి.సమిత్రాదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-2025 విద్యాసంవత్సరానికి 5వ తరగతి, ఇంటర్ మొదటి ఏడాదిలో ప్రవేశాలకు అర్హత పరీక్ష జరుగుతుందని తెలిపారు. ఐదో తరగతిలో ప్రవేశాలకు 10వ తేదీన ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. కృష్ణా జిల్లాలో ఆరు కేంద్రాల్లో 712 మంది ఐదోతరగతి ప్రవేశపరీక్ష, 1022 మంది ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్ష రాయనున్నారని తెలిపారు. ఎన్టీఆర్ జిల్లాలోని ఏడు కేంద్రాల్లో 5వతరగతి ప్రవేశపరీక్షకు 1662 మంది, మొదటి సంవత్సరం ఇంటర్‌ప్రవేశపరీక్షకు 1733మంది హాజరుకానున్నారని తెలిపారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు ఆరగంట ముందుగా చేరుకోవాలన్నారు.



నివాళులు అర్పిస్తున్న చైర్మన్ రాఘవేంద్ర

## మాజీ మునిసిపల్ చైర్మన్ ముత్యాల వెంకటాచలం మృతి

**జగ్గయ్యపేట :** జగ్గయ్యపేట మాజీ మునిసిపల్ చైర్మన్ ముత్యాల వెంకటాచలం (55) హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. కొద్ది సంవత్సరాలుగా బ్రెయిన్ ట్యూమర్‌తో బాధ పడుతున్న ఆయన హైదరబాద్‌లో చికిత్స పొందుతున్నారు. ఇటీవల పరిస్థితి విషమించటంతో ఆసుపత్రికి తీసుకెళ్లగా గురువారం మధ్యాహ్నం ఆయన మృతి చెందారు. ఆయన 2006 నుంచి ఐదేళ్ల పాటు వైస్‌చైర్మన్‌గా, ఆర్నెల్లు ఇన్‌చార్జ్ చైర్మన్‌గా పని చేశారు. మునిసిపల్ కార్యాలయంలో చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, వైస్‌చైర్మన్‌లు తుమ్మల ప్రభాకర్, హఫీజున్నీసా ఫిరోజ్, అధికారులు చలం చిత్రపటానికి నివాళులు అర్పించి, సంతాపం ప్రకటించారు. ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను, ఎంపీ కేసినేని నానిలు నివాళులు అర్పించారు.

# ఎన్నికలకు సన్నద్ధం కావాలి

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ దిల్లీరావు

**కృష్ణలంక, మార్చి 7 :** నిష్పక్షపాత ఎన్నికల నిర్వహణకు జిల్లా యంత్రాంగం సర్వసన్నద్ధంపై ఎన్నికల ప్రక్రియ, ఈసీఐ మార్గదర్శకాలపై రాజకీయ పార్టీలు పూర్తి అవగాహన కలిగి వుండాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.దిల్లీరావు అన్నారు. రానున్న సాధారణ ఎన్నికల ప్రక్రియ, పోలింగ్ కేంద్రాల లొకేషన్ మార్పు, కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, కేంద్రాల పేర్ల మార్పు తదితర అంశాలపై కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో గురువారం కలెక్టర్ రాజకీయ పార్టీల ప్రతినిధులకు అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో పోలింగ్ స్టేషన్ల లొకేషన్ మార్పు, కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, పోలింగ్ కేంద్రాల పేర్ల మార్పు సంబంధించి ప్రతిపాదనలను రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించి వారి ఆమోదంతో ఎన్నికల సంఘానికి పంపడం జరుగుతుందన్నారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో ప్రస్తుతమున్న పోలింగ్ స్టేషన్లలో 39 పోలింగ్ స్టేషన్ల లొకేషన్ మార్పు, 286 పోలింగ్ స్టేషన్ల పేర్ల మార్పు (నామెన్ క్లేచర్), 11 కొత్త పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు ప్రతిపాదనలను ఎన్నికల కమిషన్‌కు పంపించడం జరుగుతుందన్నారు.



రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమైన కలెక్టర్

నోటిఫికేషన్ షెడ్యూల్ ప్రకటించిన నాటినుంచి ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లో వుంటుందన్నారు. రాజకీయ పార్టీలు పాటించవలసిన విధివిధానాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. పార్లమెంట్‌కు పోటీచేసే అభ్యర్థి రూ.95 లక్షలు, శాసనసభకు పోటీ చేసే అభ్యర్థి రూ.40 లక్షలు వ్యయ పరిమితిని ఎన్నికల కమిషన్ విధించిందన్నారు. పోటీలో వున్న అభ్యర్థులు ప్రతిరోజు వ్యయానికి సంబంధించిన నివేదికలను సమర్పించవలసి వుంటుందన్నారు. ప్రతి అభ్యర్థి ప్రత్యేకంగా బ్యాంకు ఖాతా తెరవాల్సి వుంటుందన్నారు. ప్రచారం, నామినేషన్లు దాఖలు చేసేందుకు వాహనాల వినియోగంపై పరిమితి వుందన్నారు. సోషల్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియాలో అభ్యర్థుల ప్రచారానికి ఎంసీఎంసీ నుంచి అనుమతి పత్రం తప్పనిసరన్నారు. రాజకీయ పార్టీలు నేరచరిత్ర లేని అభ్యర్థులను మాత్రమే ఎలక్షన్, పోలింగ్, కౌంటింగ్ ఏజెంట్లుగా నియమించుకోవాలన్నారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను అవగాహన కల్పించుకొని నిష్పక్షపాత, పారదర్శకంగా ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేలా అధికారులకు సహకరించాలని కలెక్టర్ కోరారు. సమావేశంలో డీఆర్‌వో వి.శ్రీనివాసరావు, బ్యాలెట్ పేపర్ నోడల్ ఆఫీసర్ కె.శ్రీనివాసరావు, శిక్షణ కార్యక్రమాల నోడల్ ఆఫీసర్ ఎస్.వి.శివప్రసాద్ యాదవ్, ఎం.వినోద్‌కుమార్, కె.పి.దాస్ (బీఎస్పీ), డీవీ కృష్ణ, ఎస్.రమేష్ బాబు (సీపీఎం), వై.రామయ్య, బి.అనిల్ (తెదేపా), షేక్ కరీం (బీజేపీ), కె.పరమేశ్వరరావు (ఆప్), బుర్రా కిరణ్, అశోక్ శరన్ (ఐఎన్‌సీ), వై.అంజనేయరెడ్డి, అప్సర్ మహ్మద్, వి.యశోధర్ (వైసీపీ), ఎన్నికల సూపరింటెండెంట్ ఎం.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ జిల్లా నోడల్ ఆఫీసర్ల నియామకం



**(ఆంధ్రజ్యోతి, విజయవాడ)**

ఎన్నికల నిర్వహణకు అత్యంత కీలకమైన నోడల్ ఆఫీసర్ల నియామకాలను ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం పూర్తిచేసింది. ఇప్పటికే కొంత మంది ఆఫీసర్లను నియమించిన జిల్లా ఎన్నికల యంత్రాంగం త్వరలో నోటిఫికేషన్ వెలువడనున్న తరుణంలో కీలక అవసరాలను దృష్టిలో ఉంచుకుని నోడల్ ఆఫీసర్లందరినీ నియమించింది. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎన్టీఆర్ జిల్లాలో 16మంది నోడల్ ఆఫీసర్లను జిల్లా యంత్రాంగం నియమించింది. వీరు మ్యాన్‌పవర్ మేనేజ్‌మెంట్, ట్రెయినింగ్ మేనేజ్‌మెంట్, మెటీరియల్ మేనేజ్‌మెంట్, ట్రాన్స్‌పోర్ట్ మేనేజ్‌మెంట్, కంప్యూటరైజేషన్, సైబర్ సెక్యూరిటీ, స్వీప్, లా అండ్ ఆర్డర్, ఈవీఎం మేనేజ్‌మెంట్, మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ (ఎంసీసీ), ఎక్స్‌పెండిచర్ మానిటరింగ్, బ్యాలెట్, మీడియా మానిటరింగ్, కమ్యూనికేషన్, ఎలక్ట్రోరల్ రోల్స్, ఓటర్ హెల్ప్‌లైన్, ఆబ్జర్వర్స్‌గా విధులను ఆయా నోడల్ అధికారులు పర్యవేక్షిస్తారు. వీరు ఎన్నికల విధుల్లో పోలింగ్ సిబ్బందిని సన్నద్ధం చేయడం, జిల్లావ్యాప్తంగా పోలింగ్, కౌంటింగ్, ఇతర ప్రక్రియలకు సంబంధించి ఎప్పటి కప్పుడు అంచనా వేసుకుంటూ పనిచేయాల్సి ఉంటుంది. ఉద్యోగులకు శిక్షణా కార్యక్రమాలు మెటీరియల్‌ను సిద్ధం చేయడం.. మెటీరియల్ ప్రొక్యూర్‌చేయటం నుంచి వాటిని సరఫరా చేసేవరకు బాధ్యత తీసుకోవాల్సి ఉంటుంది. రవాణా సదుపాయాలన్నింటినీ చూసుకోవాల్సి ఉంటుంది. అలాగే ఎన్నికల ప్రక్రియకు సంబంధించి వెబ్‌సైట్‌కు అనుసంధానించాల్సిన డేటా మానిటరింగ్‌తో పాటు, వెబ్‌సైట్ల ఫంక్షనింగ్, యాప్స్‌ల పనితీరు, అవవసరమైన సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ వంటివి సన్నద్ధం సిస్టమ్స్ ట్రబుల్ షూటింగ్స్, మానిటరింగ్ వంటి వ్యవహారాలను పర్యవేక్షిస్తారు.

జిల్లాస్థాయిలో ఓటర్ల నమోదు అవగాహనా కార్యక్రమాలు, పోలింగ్ శాతం పెంచేందుకు విస్తృత కార్యక్రమాచేపడతారు. శాంతిభద్రతలపై దృష్టి సారించి బలగాలు ఎక్కడ అవసరమో గుర్తించాలి. జిల్లాలో ఈవీఎంలు, వీవీప్యాట్స్ వంటివి పర్యవేక్షించటంతో పాటు ఫస్ట్‌లెవల్ చెకింగ్, వాటి భద్రత, ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సర్వీసింగ్, బీఈఎల్, ఈసీఐఎల్ కంపెనీల ప్రతినిధులతో సమన్వయం చేసుకోవటం, ఈవీఎంల పర్యవేక్షణ, లీగల్ అంశాలన్నింటినీ పర్యవేక్షించాల్సి ఉంటుంది. అధికారులు, రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, నేతలు, మీడియా సంస్థలు, ప్రతినిధులు పనిచేస్తున్నదీ లేనిదీ పర్యవేక్షించి ఉల్లంఘనలు జరిగితే తక్షణం చర్యలు తీసుకోవటానికి సిద్ధం కావటం, సీ-విజిల్ యాప్ ద్వారా వచ్చే ఫిర్యాదులపై విచారణ జరపటం వంటివి పర్యవేక్షిస్తారు. అధికారులు, రాజకీయ పార్టీలు, అభ్యర్థులు పెట్టే ఖర్చులను ఎప్పటికప్పుడు నమోదు చేస్తు ఎక్స్‌పెండిచర్ అబ్జర్వర్స్ నుంచి ఎప్పటి కప్పుడు సమాచారాన్ని తెప్పించుకుని రిపోర్టులు సిద్ధం చేయాల్సి ఉంటుంది.

బ్యాలెట్ పేపర్ల ముద్రణ, ప్రింటింగ్ ప్రెస్‌ల నుంచి స్టోరేజ్ పాయింట్లకు, అదేవిధంగా డిస్ట్రిబ్యూషన్ సెంటర్లకు రవాణా వంటివి చేయాల్సి ఉంటుంది.

ఎన్నికల సమాచారాన్ని ఎప్పటికప్పుడు మీడియాకు అందించటం, ప్రెస్ కాన్ఫరెన్స్‌లు నిర్వహించటం, మీడియాను పర్యవేక్షిస్తుండాలి. పత్రికల్లో పెయిడ్ న్యూస్‌కు సంబంధించి నిఘా ఉంచటం, సోషల్ మీడియాలో నిఘా ఉంచటం వంటివి చూడాల్సి ఉంటుంది. ఈసీఐ వెబ్‌సైట్‌కు అప్‌లోడింగ్ బాధ్యతలను పర్యవేక్షంచాలి. ఎలక్షన్ రిటర్నింగ్ ఆఫీసర్స్ (ఈఆర్‌ఓ)లతో సమన్వయం చేసుకుంటూ ఎస్ఎస్ఆర్ పర్యవేక్షణ, ఓటరు జాబితాల రూపకల్పన, ఓటరు కార్డుల ముద్రణ తదితర కార్యకలాపాలు నిర్వహించాల్సి ఉంటుంది. గ్రీవెన్స్ సర్వీసెస్ పోర్టల్, టెలిఫోన్ ద్వారా వచ్చే ఫిర్యాదులను నమోదు చేయాలి. అలాగే ఓటరు హెల్ప్‌లైన్ నెంబర్ 1951 ద్వారా వచ్చే ఫిర్యాదుల పైనా దృష్టి సారించాల్సి ఉంటుంది. ఆబ్జర్వర్లు సూచించిన అంశాలను ఎప్పటికప్పుడు రికార్డు చేయిస్తుండాలి.

**బ్రాయిలర్ ధరలు**



| అమరావతి | (రూ.లలో) |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 115, 124, 135 |
| చికెన్ విత్ స్కిన్ | 216 |
| చికెన్ స్కిన్‌లెస్ | 226 |

**నెక్ కోడిగుడ్డు ధర**

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.63

## గంజాయి అక్రమంగా తరలిస్తున్న యువకుడి అరెస్టు

**రైల్వేస్టేషన్, మార్చి 7:** రైళ్లలో గంజాయి అక్రమంగా తరలిస్తున్న ఒరిస్సా రాష్ట్రానికి చెందిన సల్మాన్‌ఖాన్ (27)ను గురువారం రైల్వే పోలీసులు అరెస్టు చేసి అతని వద్ద 20 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం ఒరిస్సా రాష్ట్రం ఖుర్ధా గ్రామానికి చెందిన సల్మాన్‌ఖాన్ ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా రైళ్లలో గంజాయిని తరలిస్తున్నాడు. విజయవాడ రైల్వే పోలీసులు రైల్వేస్టేషన్‌లో గంజాయి, మద్యం, బంగారం, నగదు అక్రమ రవాణా తనిఖీలను చేపట్టారు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం 9 గంటలకు విజయవాడ రైల్వేస్టేషన్ 7వ ప్లాట్‌ఫారం వద్ద ఉన్న ప్రయాణీకుల బ్యాగులను తనిఖీ చేశారు. ఈ సమయంలో సల్మాన్‌ఖాన్ వద్ద ప్యాకెట్‌లు ఉన్నట్లు గుర్తించి అతని వద్ద నుంచి 20 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

## ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు పరికరాలు వితరణ

**భారతీనగర్:** ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో హైడ్రాలిక్స్ ల్యాబ్‌కు హైదారాబాద్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, ఆర్చిడ్‌ఫార్మా ల్యాబ్ కొండపల్లి వారి సౌజన్యంతో ఆరు లక్షల రూపాయల విలువ గల పరికరాలను సంస్థ సీఈవో కె.శివశంకరరావు ఆధ్వర్యంలో గురువారం కళాశాల ప్రిన్సిపాల్ ఎం. విజయసారధికి అందజేశారు. విభాగాధిపతులు శ్రీనివాసరావు, రమణ, శోభనబాబు, మధు, సాయికుమార్, వెంకట లక్ష్మీ, శ్రావ్య పాల్గొన్నారు.



ప్రతిభావంతులైన మహిళామణులను

# స్ఫూర్తిగా తీసుకోవాలి

**మొగల్రాజపురం, మార్చి 7:** విద్య, వైద్య, క్రీడలు, సాంస్కృతిక, సాంకేతిక, సాహిత్యం, పారిశ్రామిక వంటి రంగాల్లో తమలోని ప్రతిభతో సమాజంలో దేశ, అంతర్జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతులు పొందిన మహిళలను చూసి ప్రతి ఒక్కరూ స్ఫూర్తి పొందాలని బ్లూమింగ్ డేల్ ఇంటర్నేషనల్ స్కూల్ ఛైర్మన్ ఏ.విజయ బాబు అన్నారు. మొగల్రాజపురంలో ఒక హోటల్‌లో స్కూల్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరిగింది. ఈ వేడుకల్లో నగరానికి చెందిన ప్రముఖ గైనకాలజిస్టు డాక్టర్ చదలవాడ సుధ, క్రైం బ్రాంచ్ ఏసీపీ డాక్టర్ కె.స్రవంతిరాయ్, టేబుల్ టెన్నిస్ ప్రపంచ చాంపియన్ డాక్టర్ కె. స్ఫూర్తి, పారిశ్రామికవేత్త రాధారాణిని ఘనంగా సత్కరించారు. సత్కార గ్రహీతలు మాట్లాడుతూ ఆడపిల్లలో ఉన్న ప్రతిభను గుర్తించి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని సూచించారు. స్కూల్ ప్రిన్సిపాల్ హరి సిమ్రాన్ కౌర్, సేఫ్ అధ్యక్షురాలు జ్యోత్స్న దారా కరుణశ్రీ, సమనా మూసవి పాల్గొన్నారు.

● మొగల్రాజపురం సిద్ధార్థ నగర్‌లో ఉన్న లిటిల్ బ్రెయిన్స్ పాఠశాలలో జరిగిన వేడుకల్లో ప్రముఖ ప్రసూతి వైద్యురాలు డాక్టర్ టి. అపర్ణ మహిళలకు గర్భాశయ కేన్సర్ వ్యాధి నివారణ మార్గాలు అనే అంశంపై అవగాహన నిర్వహించారు. పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ అనీల, ప్రిన్సిపాల్ సుధా ప్రవీణ ముక్తేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లులు పాల్గొన్నారు.● మొగల్రాజపురం జనశిక్షణా సంస్థాన్‌లో ఛైర్‌పర్సన్ నాగళ్ల విద్యాఖన్నా ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో వక్తలు మాట్లాడారు.



పేరు ప్రఖ్యాతులు పొందిన మహిళలకు సత్కారం

### ఘనంగా మహిళా దినోత్సవం

సంస్థాన్ డైరెక్టర్ పూర్ణిమ, సేఫ్ సంస్థ డైరెక్టర్ జ్యోత్స్న, కె. స్వరూపరాణి, ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు వి. సరోజ, కార్యదర్శి టి. జానకి, సభ్యులు రాధిక, సంస్థాన్ సిబ్బంది, శిక్షకులు పాల్గొన్నారు. ● మొగల్రాజపురం సిద్ధార్థ ఫార్మసీ కళాశాలలో జరిగిన వేడుకల్లో అభివృద్ధిలో మహిళల పాత్ర అనే అంశం పై వక్తృత్వ, నృత్య, వంటల పోటీలు నిర్వహించారు. విశాఖపట్నం డాక్టర్ వీఎస్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ కే. పద్మ, సేఫ్ ఫౌండేషన్ అధ్యక్షురాలు జ్యోత్స్న ముఖ్య అతిథులుగా పాల్గొనగా ప్రిన్సిపాల్ ఎ. సునీత అధ్యక్షత వహించగా డాక్టర్ విజయలక్ష్మి పర్యవేక్షించారు. **పాయకాపురం:** 62వ డివిజన్ కోదండ రామాలయం వీధిలో టీడీపీ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం ఘనంగా జరిగింది. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు స్థానిక మహిళలనుద్దేశించి ప్రసంగించారు. నేతలు పైడి శ్రీను, రవిచంద్ర, పాల్గొన్నారు. **పటమట :** వాసవ్య మహిళా మండలి, హెచ్‌సీ యూత్ ఫౌండేషన్, ఐఏడీవీఎల్, క్యాపిటల్ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా బెంజిసర్కిల్ వద్ద వాసవ్య మహిళా మండలిలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఏపీ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్యులు, సెషన్స్ జడ్జి యు.బబిత, క్యాపిటల్ హాస్పిటల్ స్త్రీల వైద్య నిపుణురాలు డాక్టర్ అశ్విని మాట్లాడారు. వాసవ్య మహిళా మండలి అధ్యక్షురాలు బి. కీర్తి, చర్మవ్యాధి నిపుణురాలు డాక్టర్ దీక్ష పాల్గొన్నారు.

## చంద్రబాబు-పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం

**విద్యాధరపురం, మార్చి 7:** తెలుగుదేశం-జనసేన ఉమ్మడి సభలో బీసీ డిక్లరేషన్ చేసి బీసీలకు అండగా నిలబడతామని ఎన్నికల హామీలు ఇచ్చిన చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్‌ల చిత్రపటాలకు కృతజ్ఞతపూర్వకంగా టీడీపీ బీసీ శ్రేణులు గురువారం పాలాభిషేకం నిర్వహించారు. ● చంద్రబాబునాయుడు-పవన్‌కల్యాణ్‌లు చేసిన డిక్లరేషన్ అత్యంత ఆమోదకరమని టీడీపీ సీనియర్ నాయకుడు ఎంఎస్ బేగ్ అన్నారు. వన్‌టౌన్ టీడీపీ కార్యాలయంలో గురువారం జరిగిన ఒక కార్యక్రమంలో చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌ల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ● 42వ డివిజన్‌లో జరిగిన కార్యక్రమంలో టీడీపీ నేతలు జయహో బీసీ డిక్లరేషన్‌పై హర్షం వ్యక్తం చేస్తూ ఎన్‌టీఆర్, చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌ల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు.● ఆటోనగర్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్‌ల చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ బీసీ సాధికార సమితి ప్రధాన కార్యదర్శి వీరంకి వెంకటగురుమూర్తి , టీడీపీ సీనియర్ నేత కనకాచారి, లుక్కా సాయిరాం ప్రసాద్‌గౌడ్, ఎర్రబోతు రమణారావు, కొత్త నాగేంద్ర కుమార్, మరుపిళ్ల తిరుమలేష్, షేక్ ఆశా, తలశిల స్వర్ణలత పాల్గొన్నారు.



చంద్రబాబు, పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న ఎంఎస్ బేగ్

**భవానీపురం:** ఊర్మిళానగర్ పార్కు సెంటర్ టీడీపీ స్థూపం వద్ద జయహో బీసీ సభ విజయవంతం అయిన సందర్భంగా టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ చిత్రపటాలకు గురువారం రాత్రి 43వ డి విజన్ సీనియర్ నాయకులు మోరబోయిన రాంబాబు ఆధ్వర్యంలో పాలాభిషేకం నిర్వహించారు.

## చంద్రబాబుతోనే బీసీలకు బంగారు భవిష్యత్తు

### తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

**కృష్ణలంక, మార్చి 7 :** బీసీల భవిష్యత్తు బంగారు భవిష్యత్తుగా మారాలంటే చంద్రబాబు నాయుడిని మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించాలని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పేర్కొన్నారు. గురువారం 21వ డివిజన్ టీడీపీ కార్యాలయంలో జరిగిన మత్స్యకారుల ఆత్మీయ సమావేశంలో జనసేన నాయకులతో కలిసి గద్దె రామ్మోహన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గద్దె మాట్లాడుతూ సంపూర్ణ మద్యపాన నిషేధం చేసి ఓట్లు అడుగుతానని జగన్ చెప్పారని, ఆయన ఇప్పుడెలా ఓట్లు అడుగుతారని ప్రశ్నించారు. మత్స్యకారుల సంఘం నాయకులు లంకే నారాయణ ప్రసాద్ మాట్లాడుతూ ఈసారి గద్దె తెలిస్తే హ్యాట్రిక్ సాధిస్తారని, తూర్పులో గద్దెని, కేశినేని చిన్నిని గెలిపిస్తే ప్రజలు ప్రశాంతంగా జీవిస్తారని తెలిపారు. అమరావతిని జగన్‌మోహన్‌రెడ్డి ఎలా సర్వనాశనం చేశాడో గమనించి ఓటు వేయాలని భవకుమార్ పిలుపునిచ్చారు. కార్పొరేటర్ ముమ్మానేని ప్రసాద్, టీడీపీ నాయకులు వేములపల్లి రంగారావు, గొరిపర్తి నామేశ్వరరావు, కేశనం భావన్నారాయణ, మండల మల్లేష్ యాదవ్, జనసేన నాయకురాలు పోతిరెడ్డి అనిత, కొప్పూరి కిరణ్, ఆర్యవైశ్య సంఘ నాయకులు పాల్గొన్నారు.

**లబ్బీపేట:** లబ్బీపేటలోని దర్స్‌గాహ్-ఏ-ఇస్లామీ హైస్కూల్‌ను గురువారం టీడీపీ -జనసేన ఉమ్మడి అభ్యర్థి కేశినేని శివనాథ్‌తో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో టీడీపీ- జనసేన విజయం సాధించి ప్రభుత్వం ఏర్పాటు చేసిన వెంటనే పాఠశాలను అన్ని విధాల ఆదుకుంటామని అన్నారు. కేశినేని శివనాథ్ మాట్లాడుతూ మనిషి జీవన ప్రమాణాలను విద్య ద్వారానే మెరుగుపరుచుకోగలమని అన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో పదో తరగతి ప్రీ ఫైనల్ పరీక్షలో ప్రతిభ చూపిన విద్యార్థులకు, కరాటేలో ప్రతిభ చూపిన విద్యార్థులకు భహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ గౌస్‌భాషా, నాయకులు ఎస్.ఫీరోజ్ పాల్గొన్నారు. ● 16వ డివిజన్ కళానగర్‌లో గద్దె పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకోవడంతో పాటు టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత అమలు చేసే సంక్షేమ పథకాల కరపత్రాలు పంపిణీ చేశారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న శివనాథ్, గద్దె

**పటమట:** అశోక్‌నగర్‌లోని టీడీపీ తూర్పు కార్యాలయంలో బొర్రా డీలేష్ నేతృత్వంలో కొందరు యువకులు టీడీపీలో చేరారు. వారందరికి యువ నాయకుడు క్రాంతి కుమార్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

**భారతీనగర్:** తూర్పు పరిధిలోని మూడవ డివిజన్ శ్రీ రామ చంద్ర నగర్‌లో గురువారం గద్దె రామ్మోహన్ తనయుడు గద్దె క్రాంతి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి రాబోయే ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేసే సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్, డివిజన్ పార్టీ అధ్యక్షుడు తాడి బాబురావు, పేరేపి ఈశ్వర్, గద్దె రమేష్, భాస్కర్‌రావు పాల్గొన్నారు.

## ఘనంగా అయ్యంకి వర్ధంతి

**గవర్నర్‌పేట, మార్చి 7:** గ్రంథాలయ ఉద్యమాన్ని గ్రామ స్థాయి వరకు తీసుకువెళ్లడంలో అయ్యంకి వెంకట రమణయ్య చేసిన కృషి వెలకట్టలేనిదని ఉమ్మడి కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ టి. జమలపూర్ణమ్మ అన్నారు. గ్రంథాయాభివృద్ధికి కృషి చేసిన అయ్యంకి వెంకట రమణయ్య వర్ధంతి కార్యక్రమం గురువారం ఎంజీ రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో నిర్వహించారు. సంస్థ కార్యదర్శి ఎంవీడీటీ నగేష్, సరస్వతీ సామ్రాజ్యం సంస్థ అధ్యక్షుడు అయ్యంకి మురళీకృష్ణలతో కలిసి జమలపూర్ణమ్మ లైబ్రరీ ప్రాంగణంలోని రమణయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సరస్వతీ సామ్రాజ్యం సంస్థ ద్వారా వారి కుటుంబ సభ్యులు గ్రంథాలయాలకు కావలసిన అనేక సదుపాయాలు సమకూర్చడం పట్ల వక్తలు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఠాగూర్ గ్రంథాలయాధికారిణి కె. రమాదేవి, అయ్యంకి కుటుంబ సభ్యులు, సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు. అనంతరం గ్రంథాలయాలపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

## జనసేన- తెలుగుదేశం కలయికతో వైసీపీ నేతల్లో భయం

**సత్యనారాయణపురం, మార్చి 7:** జనసేన- తెలుగుదేశం కలయికతో వైసీపీ నేతలకు గుండెల్లో దడ మొదలైందని టీడీపీ నాయకుడు బొండా సిద్ధార్థ అన్నారు. 31వ డివిజన్ ముత్యాలంపాడు దేవాలయం వీధి నుంచి గురువారం సాయంత్రం బొండా ఉమా అన్న రావాలి-సెంట్రల్ గెలవాలి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన బొండా సిద్ధార్థ ఇంటింటికి వెళ్లి టీడీపీ వస్తే చేపట్టే పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎప్పుడు ఎన్నికలు జరిగినా టీడీపీ అధికారంలోకి రావడం ఖాయం అన్నారు. టీడీపీ రాష్ట్రకార్యదర్శి నవనీతం సాంబశివరావు, మాజీ కార్పొరేటర్ పిన్నంరాజు త్రిమూర్తిరాజు, సంధిరెడ్డి గాయత్రి, డివిజన్ అధ్యక్షుడు పడమటి రామకృష్ణ, దెందుకూరి మురళీకృష్ణంరాజు, దేవరపు మాల్యాద్రి, కె.దుర్గారావు జనసేన, స్థానిక టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**గవర్నర్‌పేట:** 23వ డివిజన్ కార్పొరేటర్ నెల్లిబండ్ల బాలస్వామి నేతృత్వంలో టీడీపీ శ్రేణులు గురువారం ఓటర్లను చైతన్యం చేసే కార్యక్రమాన్ని చేపట్టారు. సూర్యారావుపేటలోని ప్రతి ఇంటికీ తిరుగుతూ ఓటర్ల వెరిఫికేషన్‌తో పాటు ఓటర్లకు స్లిప్‌లు పంపిణీ చేశారు. డివిజన్ అధ్యక్షుడు చింతా దుర్గారావు, జిల్లా తెలుగు యువత కార్యదర్శి కటిక కోటేశ్వరరావు , వసంతరావు, రత్న పాల్గొన్నారు. **పాయకాపురం:** 62వ డివిజన్ వైసీపీకి చెందిన కార్యకర్తలు, అభిమానులు గురువారం టీడీపీలో చేరారు. అజిత్‌సింగ్‌నగర్‌లోని సెంట్రల్ టీడీపీ కార్యాలయంలో ఉమాతో సమావేశమయ్యారు. డివిజన్ ఇన్‌చార్జ్ పైడి శ్రీను, సాంబమూర్తి, రాజేష్‌ల ఆధ్వర్యంలో 100 మంది కుటుంబాలు పార్టీలో చేరారు. బొండా ఉమా కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

## ప్రయాణికురాలి గొలుసు దొంగిలించిన నేరస్తుడు అరెస్ట్

**రైల్వేస్టేషన్, మార్చి 7:** ప్రయాణికురాలి హ్యాండ్ బ్యాగులో ఉన్న బంగారు గొలుసు దొంగిలించిన ఏలూరుకు చెందిన వీరస్వామి (25)ని రైల్వేపోలీసులు గురువారం అరెస్టు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం ఫిబ్రవరి 27న భువనేశ్వర్ నుంచి సికింద్రాబాద్ వెళ్లు విశాఖ ఎక్స్‌ప్రెస్ ఏసీ కోచ్‌లో ప్రయాణిస్తున్న మహిళ వద్ద బంగారు గొలుసు ఉన్న హ్యాండ్‌బ్యాగ్ చోరీకి గురైంది. బాధితురాలు రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేసింది. విజయవాడ రైల్వేస్టేషన్ క్లాక్‌టవర్ వద్ద వీరస్వామి అనుమానాస్పదంగా తిరుగుతుండగా రైల్వే పోలీసులు పట్టుకుని విచారించారు. ప్రయాణికురాలి బంగారు గొలుసును దొంగిలించినట్లు నిర్ధారణ అయ్యింది. పోలీసులు అతని వద్ద నుంచి లక్షా 35వేల విలువగల బంగారు నగలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పోలీసులు అతనిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

## ఆర్వోబీ వంతెన పనులు తక్షణమే ప్రారంభించాలి

### సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాబూరావు



నిరసన దీక్ష చేపట్టిన సీపీఎం నాయకులు, కార్యకర్తలు

**గుణదల, మార్చి 7:** 15 సంవత్సరాలుగా నిలిచిపోయిన ఆర్వోబీ వంతెన పనులు తక్షణమే ప్రారంభించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గుణదల్లో ఆర్వోబీ వంతెన పనులు నిలిచిపోయిన ప్రదేశంలో గురువారం సీపీఎం నాయకులు నిరసన దీక్ష చేపట్టారు. మీడియాను ఉద్దేశించి సిహెచ్.బాబూరావు మాట్లాడుతూ 15 ఏళ్లుగా మొండి గోడలతో నిలిచిపోయిన గుణదల ఆర్వోబీ వంతెన నిర్మాణానికి ఎన్నికల నోటిఫికేషన్ లోపే నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కాల్వకట్లపై నివాసాలు ఉండేవారికి పట్టాలు ఇవ్వాలని కోరారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం బ్రిడ్జి పనులు ప్రారంభం కాకుండా ప్రజా ప్రతినిధులే అడ్డుపడుతున్నారని ఆరోపించారు. సీపీఎం నేతలు బి.రమణారావు, కోట కల్యాణ్, షకీలా, గోవిందు, అజయ్, ప్రసన్న, లక్ష్మణ, లక్ష్మి సాగర్, ప్రవీణ్, సుప్రజ పాల్గొన్నారు.

## పారామిలటరీ దళాల కవాతు

**సత్యనారాయణపురం, మార్చి 7:** త్వరలో ఎన్నికలు సమీపిస్తున్న సందర్భంగా ప్రజలు నిర్భయంగా ఓటు వేసేందుకు భరోసా కల్పిస్తూ సీఐఎస్ఎఫ్ సిబ్బంది, పోలీసులు కవాతు నిర్వహించారు. సత్యనారాయణపురం పోలీసు స్టేషన్ పరిధిలో ఎర్రకట్ట దిగువ నుంచి సీఐఎస్ఎఫ్ సిబ్బంది. పోలీసులు, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. సత్యనారాయణపురం సీఐ వెంకట నారాయణ సిబ్బంది పాల్గొన్నారు.

## ఫీడింగ్ బాటిల్స్, రెండు కుక్కర్లు వితరణ

**చిట్టినగర్, మార్చి 7:** జక్కంపూడి కాలనీలోని 219 నంబరు అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు దేవీ కరుమూరి అమ్మన్ శక్తి పీఠాధిపతి కరుమూరి దాసు ఫీడింగ్ బాటిల్స్, రెండు కుక్కర్లు ఉచితంగా ఇచ్చారు. అర్చకుడు దీక్షితులు ఫణికుమార్, జ్ఞానేష్ పాల్గొన్నారు.

## పోతిన విజయలక్ష్మి ప్రచారం

**భవానీపురం, మార్చి 7 :** 43వ డివిజన్ జనసేన అధ్యక్షుడు జెల్లి రమేష్ ఆధ్వర్యంలో హెచ్‌బీ కాలనీలోని ఎంఐజీ, ఎల్ఐజీ కాలనీల పరిధిలో గురువారం జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి పోతిన మహేష్ సతీమణి విజయలక్ష్మి విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. అధికారంలోకి వస్తే ఏమేమి చేస్తామో వివరించారు. మల్లెపు విజయలక్ష్మి, మాకినేని శ్రీనివాస్,దుండి శ్రీనివాస్, రెడ్డిపల్లి అనిత వసంతలు పాల్గొన్నారు.

## వెంకటసుబ్బయ్యకు నియామక పత్రం అందజేత

**అజిత్‌సింగ్‌నగర్:** టీడీపీ జిల్లా ఎస్సీ ఉపాధ్యక్షుడిగా వెంకటసుబ్బయ్య నియమితుడైన సందర్భంగా అజిత్‌సింగ్‌నగర్‌లోని సెంట్రల్ టీడీపీ కార్యాలయంలో గురువారం టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు ఆయనకు నియామకపత్రాన్ని అందజేశారు. అనంతరం బొండా ఉమా మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి రాగానే రాష్ట్రంలో దళితులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

## మర్యాదపూర్వక కలయిక

**పటమట:** తూర్పు నియోజకవర్గ ఐటీడీపీ అధ్యక్షుడిగా ఎన్నికైన సిద్దెల వివేక్ గురువారం అశోక్‌నగర్‌లోని టీడీపీ కార్యాలయంలో తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వివేక్‌ను గద్దె అభినందించారు. ఈ సందర్భంగా గద్దె మాట్లాడుతూ 2024లో టీడీపీని అధికారంలోకి తీసుకురావడమే ధ్యేయంగా, పార్టీకి ఉజ్వల భవిష్యత్ కల్పించేందుకు కృషి చేయాలని సూచించారు.

**వన్‌టౌన్:** టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం మహిళా కార్యదర్శిగా నియామకమైన వల్లభనేని ప్రసన్నలక్ష్మి గురువారం మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్నను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనను ఎంపిక చేసిన బుద్దా వెంకన్నకు, పార్టీ అధినేత చంద్రబాబుకు, యువనేత లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వెంకన్నకు దుశ్శాలువా కప్పి సత్కరించారు. ● 54వ డివిజన్‌లోని నైజాంగేట్ వద్ద ఉంటున్న షేక్ బషీరా షా వివాహం నిమిత్తం గురువారం బుద్దా వెంకన్న రూ.10వేలు ఆర్థిక సహాయం అందజేశారు.




## నాకు నేనే కొత్తగా అనిపించా


సుహాస్

సుహాస్ హీరోగా రూపొందుతున్న సస్పెన్స్ థ్రిల్లర్ 'ప్రసన్నవదనం'. పాయల్ రాధాకృష్ణ, రాశీసింగ్ కథానాయికలు. డైరెక్టర్ సుకుమార్ శిష్యుడు అర్జున్ వై.కె. దర్శకుడిగా పరిచయమవుతున్నారు. కె.ఎస్.మణికంఠ, టి.ఆర్.ప్రసాద్‌రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. గురువారం జరిగిన టీజర్ రిలీజ్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న దర్శకుడు సాయిరాజేశ్ మాట్లాడుతూ 'సుహాస్‌కి చాలా కీలకమైన సినిమా ఇది. కథలోని పాయింట్ అదిరిపోయింది. టీజర్ చాలా బాగుంది. తప్పకుండా హిట్ అవుతుంది' అన్నారు. హీరో సుహాస్ మాట్లాడుతూ 'ఫేస్ బ్లైండ్ నెస్ మీద తీస్తున్న మంచి థ్రిల్లర్ ఇది. బాగా వచ్చింది. ఇందులో నాకు నేనే కొత్తగా అనిపించాను. నిర్మాతలు మణికంఠ, ప్రసాద్ ఎంతో కష్టపడ్డారు. ఇది పక్కాగా బ్లాక్‌బస్టర్ అయ్యే సినిమా. అందులో డౌట్ లేదు' అన్నారు. ఈ కథకు సుహాస్ యాప్ట్ అని దర్శకుడు అర్జున్ తెలిపారు. త్వరలో సినిమాను విడుదల చేస్తామని నిర్మాతలు చెప్పారు. హీరోయిన్లు పాయల్ రాధాకృష్ణ, రాశీసింగ్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## రాధికకు విశిష్ట మహిళా పురస్కారం



సీనియర్ నటి రాధికకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం 2024 విశిష్ట మహిళ పురస్కారాన్ని ప్రదానం చేయనుంది. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం రాధికను సన్మానించి పురస్కారం ప్రదానం చేస్తామని వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ గురువారం తెలిపారు. మంచి నటిగానే కాకుండా నిర్మాతగా కూడా పేరు తెచ్చుకున్న రాధిక తెలుగు, తమిళ చిత్రాలతో పాటు బుల్లి తెరపై కూడా రాణిస్తున్నారు.

**- ఆంధ్రజ్యోతి, పెదకాకాని**

## అన్ని రకాల ఎమోషన్స్‌తో...



యూత్‌ఫుల్ చిత్రాల నిర్మాత బెక్కెం వేణుగోపాల్, సృజన్ కుమార్ బొజ్జంతో కలసి రూపొందిస్తున్న చిత్రం 'రోటీ కపడా రొమాన్స్'. హర్ష నర్రా, సందీప్ సరోజ్, తరుణ్, సుప్రజ్ రంగా, సోనూ ఠాకూర్, నువేక్ష, మేఘ లేఖ, ఖుష్బూ చౌదరి హీరో హీరోయిన్లు. విక్రమ్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన ప్రచార చిత్రాలకు మంచి స్పందన వచ్చింది. తాజాగా, ఈ చిత్రం రిలీజ్ డేట్‌ను ఖరారు చేస్తూ బుధవారం ప్రెస్ మీట్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్మాత బెక్కెం వేణుగోపాల్ మాట్లాడుతూ "కథను నమ్మి ఎమోషనల్‌గా ఫీల్ అయి చేసిన సినిమా ఇది. ఏప్రిల్ 12న చిత్రాన్ని విడుదల చేస్తున్నాం" అని అన్నారు. దర్శకుడు విక్రమ్ మాట్లాడుతూ "దర్శకుడిని కావాలన్న నా 15 ఏళ్ల కల ఈ చిత్రంతో తీరుతోంది. ఇది అందరూ అనుకున్నట్లు కేవలం ఎంటర్టైనర్ మాత్రమే కాదు.. అన్ని రకాల ఎమోషన్స్ ఇందులో ఉన్నాయి" అని అన్నారు.


















**అనాదిగా ఆధ్యాత్మిక మార్గంలో మహిళలు సాగించిన ప్రయాణం విశిష్టమైనది. అలాగే దేశంలోని వివిధ ఆధ్యాత్మిక సంస్థల మీద, ఉద్యమాల మీద తమదైన ముద్ర వేసిన వారు ఎందరో. మహిళా దినోత్సవం సందర్భంగా అటువంటి కొందరు మహిళలను గుర్తు చేసుకుందాం:**

# వారు చూపిన దారిలో...




## దివ్య జనని

దివ్యజననిగా ఖ్యాతి పొందిన శ్రీశారదాదేవి... రామకృష్ణ పరమహంసకు ఆధ్యాత్మిక సహధర్మచారిణి. ఆమె 1853 డిసెంబర్ 22న పశ్చిమబెంగాల్‌లోని ఒక కుగ్రామంలో జన్మించారు. బాల్యం నుంచి దైవారాధనలో నిమగ్నమై ఉండేవారు. ఆరేళ్ళ వయసులో శ్రీ రామకృష్ణులతో ఆమెకు వివాహం జరిగింది. ఆ తరువాత సుమారు పన్నెండేళ్ళపాటు తల్లితండ్రుల దగ్గరే ఉండి, దైవ చింతనలో కాలం గడిపారు. పద్దెనిమిదేళ్ళ వయసులో కాలినడకన దక్షిణేశ్వర్ వెళ్ళి... భర్తను కలుసుకున్నారు అప్పటికే శ్రీరామకృష్ణులు ఆధ్యాత్మికంగా అత్యున్నత స్థితికి చేరుకున్నారు. ఇంట్లో దేవతార్చన, కుటుంబ నిర్వహణ తదితర అంశాలను ఆమెకు నేర్పారు. ఆయన బోధలతో ఆమె కూడా సంపూర్ణమైన భక్తిమార్గంలో గడిపారు. శారదాదేవిని అమ్మవారి అవతారంగా శ్రీరామకృష్ణులు సంభావించారు. ఆయన భక్తులను, శిష్యులను శారదాదేవి కన్నబిడ్డలుగా భావించి, ఆదరించారు. భగవంతుడి సాక్షాత్కారాన్ని ఆశించిన ఆమె భౌతిక బంధాలకు అతీతంగా జీవించారు. రామకృష్ణుల పరిచర్యకే అంకితమయ్యారు. శ్రీ రామకృష్ణులు అనారోగ్యానికి గురైనప్పుడు... ఆయన సంరక్షణ బాధ్యతలకే అంకితమయ్యారు. శ్రీ రామకృష్ణుల మరణానంతరం కొన్నాళ్ళపాటు తీర్థయాత్రలు చేశారు. అనంతరం శిష్యుల అభ్యర్థన మేరకు శ్రీరామకృష్ణుల ఆధ్యాత్మిక మార్గ సారథ్యాన్ని చేపట్టారు. కోల్‌కతాలో నివేదిత పాఠశాలను స్థాపించి, మహిళా విద్యకు పునాదులు వేశారు. ఇది ఒక విధంగా... ఆ తరువాత ఏర్పడిన రామకృష్ణ మఠ సేవా కార్యక్రమాలకు ఆరంభంగా చెప్పవచ్చు. అలాగే శ్రీ రామకృష్ణ మార్గంలో మహిళల ప్రవేశానికి నాందిగా పేర్కొనవచ్చు. 1897లో రామకృష్ణ మిషన్‌ను స్థాపించిన తరువాత, దానికి అధిపతిగా శ్రీశారదాదేవిని స్వామి వివేకానంద ప్రకటించారు. తన మార్గదర్శకత్వం కోరుతూ... భక్తితో తనను దర్శించుకున్నవారిని అమ్మగా ఆమె అక్కున చేర్చుకున్నారు. దివ్యజననిగా మన్ననలు అందుకున్న శారదాదేవి 1920 జూలై ఇరవై ఒకటిన ఈ లోకాన్ని వదిలి వెళ్ళారు. త్రికరణశుద్ధిగా నిజాయితీగా ఉన్నవారికే భగవంతుడి ఆశీస్సులు లభిస్తాయని ఆమె చెప్పేవారు. "నేను అందరికీ తల్లినే. ఎప్పుడూ భయపడకండి. మీరు బాధలో ఉన్నప్పుడు నాకు తల్లి ఉందని గుర్తుచేసుకోండి" అని బోధించారు. శ్రీరామకృష్ణ మఠం పాటించే విలువలకు... మాతృస్థానంలో శారదాదేవి వేసిన పునాదులు చాలా గొప్పవి.

## దివ్య జ్ఞానమణి

క్రైస్తవ మతాచార్యుడితో వివాహం, సమాజంపై చర్చి జోక్యంపై తిరుగుబాటు, మహిళలు, కార్మికుల హక్కుల కోసం ఉద్యమాలు, భారతీయ ఆధ్యాత్మిక మార్గంపై ఆసక్తి, భారత దేశ స్వాతంత్ర్య పోరాటంలో గణనీయమైన పాత్ర... ఇలా అనీబిసెంట్ జీవితంలో అడుగడుగునా వైరుధ్యాలే. ఏ బాధ్యతను చేపట్టినా దాన్ని అద్వితీయంగా నిర్వహించడం ఆమె ప్రత్యేకత. 1847 అక్టోబర్ ఒకటిన ఇంగ్లండ్‌లో ఆమె జన్మించారు. ఆమెది ఐరిష్ మూలాలున్న కుటుంబం. ఇరవయ్యేళ్ళ వయసులో ఒక క్రైస్తవ మతాచార్యుడితో పెళ్ళయింది. చర్చి వైఖరిని నిరసిస్తూ పోరాటాలు సాగించిన ఆమె భర్తనుంచి విడాకులు తీసుకున్నారు. 'నేషనల్ రిఫార్మర్' పత్రికలో చేరి... పలు సామాజిక అంశాలపై రచనలు చేశారు. అదే సమయంలో మహిళా కార్మికులు, రేవు కార్మికుల సంక్షేమం కోసం సమ్మెలు జరిపారు. 1875లో... లండన్‌లో ప్రారంభమైన 'దివ్యజ్ఞాన సమాజం' (థియోసాఫికల్ సొసైటీ) 1882 నుంచి మద్రాసు (ప్రస్తుతం చెన్నై) కేంద్రంగా తన కార్యకలాపాలను సాగించింది. వివిధ మతాల ప్రాచీన సంప్రదాయాలు ఆధారంగా రూపుదిద్దుకున్న ఈ ఉద్యమం అనీబిసెంట్‌ను ఆకర్షించింది. సొసైటీ కార్యకలాపాల్లో భాగంగా 1893లో తొలిసారి భారతదేశానికి వచ్చిన ఆమె ఆ తరువాత ఇక్కడే స్థిరపడ్డారు. జ్ఞానసంపదకు నిలయమైన భారతదేశం పరాయి పాలన నుంచి విముక్తి కావాలనీ, అప్పుడే అది ప్రపంచానికి మార్గదర్శిగా నిలుస్తుందనీ ఆమె విశ్వసించారు. భారత స్వాతంత్ర్య సమరంలో, కాంగ్రెస్ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొన్నారు. లోకమాన్య తిలక్‌తో కలిసి 'హోమ్ రూల్' ఉద్యమం ప్రారంభించి, బ్రిటిష్ వారి నిర్బంధానికి గురయ్యారు. ఆ తరువాత భారత జాతీయ కాంగ్రెస్‌కు అధ్యక్షురాలుగా ఎన్నికయ్యారు. అయితే మహాత్మా గాంధీ నేతృత్వంలో చేపడుతున్న ఉద్యమ రూపాలు ఆమెకు నచ్చలేదు. దాంతో క్రమంగా కాంగ్రెస్‌నుంచి వేరుపడ్డారు. తదనంతరం దివ్యజ్ఞాన సమాజం కార్యకలాపాలను విస్తరించారు. జిడ్డు కృష్ణమూర్తిలో తత్త్వవేత్తను లోకానికి పరిచయం చేసింది కూడా అనీబిసెంటే. భారతదేశాన్ని తన ఆధ్యాత్మిక ఉన్నతికి కేంద్రంగా ఎంచుకున్న ఆమె 1933లో చెన్నైలో మరణించారు. ఈ భూమి మీద జన్మించిన దివ్యమూర్తులలో ప్రముఖురాలుగా ఆమె పేరుపొందారు. మన దేశంలో ఆధునిక విద్యా వ్యాప్తి కోసం పలు సంస్థలు స్థాపించారు. ఆంధ్రప్రదేశ్‌లోని మదనపల్లి కాలేజీ వాటిలో ఒకటి. అలాగే ఆమె ఏర్పాటు చేసిన సెంట్రల్ హిందూ స్కూల్ అండ్ కాలేజీ ఆ తరువాత బెనారస్ హిందూ యూనివర్సిటీగా మారింది.

## ది మదర్

భిన్నత్వంలో ఏకత్వాన్ని మానవాళి సాకారం చేసుకోవాలనే లక్ష్యంతో రూపుదిద్దుకున్న విశ్వనగరం ఆరోవిల్. దాని రూపకర్త... 'ది మదర్' మిర్రా అల్ఫాస్సా. 1878 ఫిబ్రవరి 21న ప్యారిస్‌లో జన్మించారు. సంపన్న యూదు కుటుంబంలో పుట్టిన ఆమె బాల్యం నుంచి బహుముఖ ప్రజ్ఞావంతురాలు. చిత్రలేఖనంలో, సంగీతంలో విశేష కృషి చేశారు. ఆధ్యాత్మిక బృందాలు నిర్వహించే వివిధ కార్యక్రమాల్లో పాల్గొనేవారు. 1910లో భారతదేశం వచ్చిన ఆమె పుదుచ్చేరిలోని శ్రీ అరవిందుల గురించి విన్నారు. ఆ తరువాత 1914లో ఆయనను దర్శించుకున్నాక... తనకు దారి చూపించే గురువు ఆయనేననీ, తన ఆధ్యాత్మిక ప్రగతి భారతదేశంలోనే సాధ్యమనీ నిర్ణయించుకున్నారు. కానీ ప్రపంచ యుద్ధం కారణంగా ఆమె తిరిగి ప్యారిస్ వెళ్ళాల్సి వచ్చింది. చివరకు 1920లో భారత్‌కు తిరిగి వచ్చి... అరవిందాశ్రమంలో స్థిరపడ్డారు. ఆమె ప్రత్యేకతను గుర్తించిన శ్రీ అరవిందులు యోగ స్థాయిలో ఆమె తనతో సమానమని చెబుతూ 'ది మదర్'గా అభివర్ణించారు. ప్రతి ఒక్కరూ ఆమెను అనుసరించాలని సూచించారు. క్రమంగా ఆశ్రమ కార్యనిర్వహణ బాధ్యత మిర్రా చేపట్టాల్సి వచ్చింది. అప్పటివరకూ అసంఘటితంగా సాగుతున్న ఆశ్రమ కార్యకలాపాలను ఆమె క్రమబద్ధం చేశారు. శ్రీ అరవిందులను అనుసరిస్తున్న అనుచరులను బృందాలుగా ఏర్పాటు చేశారు. వాటన్నిటినీ అరబిందో సొసైటీ పరిధిలోకి తెచ్చారు. ఆయన ఆశయాలను బోధించడం కోసం 1943లో ఒక పాఠశాలను ఏర్పాటు చేశారు. ఇప్పుడది 'శ్రీ అరబిందో ఇంటర్నేషనల్ సెంటర్ ఆఫ్ ఎడ్యుకేషన్'గా మారింది. అలాగే శ్రీ అరవిందులు ప్రతిపాదించిన సమగ్ర యోగ ప్రచారంలో మిర్రా కీలకపాత్ర పోషించారు. 1950లో శ్రీ అరవిందుల మరణం ఆమెను తీవ్రంగా కలచివేసింది. ఆ విచారం నుంచి కోలుకొని... ఆశ్రమాన్ని మరింత అంకితభావంతో ఆమె నడిపించారు. 1968లో తమిళనాడులో ఆరోవిల్ అంతర్జాతీయ టౌన్‌షిప్ ప్రాజెక్ట్‌కు ఆమె శ్రీకారం చుట్టారు. అన్ని దేశాల పురుషులు, మహిళలు శాంతియుతంగా - జాతులు, జాతీయతలు, రాజకీయాలకు అతీతంగా సామరస్యంతో జీవనం సాగించాలనేది దీని వెనుక ఆమె ఆశయం. ఆ ప్రాజెక్ట్ పూర్తయ్యాక ఆశ్రమ నిర్వహణ బాధ్యతలు విడిచిపెట్టి, యోగ సాధనలో కాలం గడిపారు. 1973 నవంబర్ 17న కన్ను మూశారు. ఆరోవిల్‌లోని మాతృమందిరం ఆమె స్మృతి చిహ్నంగా ఆరాధనలు అందుకుంటోంది.

## అన్నపూర్ణ

సిక్కు సంప్రదాయంలో లంగర్ (సామాజిక భోజనశాల)కు ఎనలేని ప్రాధాన్యం ఉంది. కులం, మతం, మతం లేదా సామాజిక హోదాతో సంబంధం లేకుండా అన్ని వర్గాల ప్రజలకు ఆహారాన్ని అందించే లంగర్‌లకు ఆద్యులుగా మాతా ఖీవీని, ఆమె భర్త గురు అంగద్‌ను పేర్కొంటారు. అంతేకాదు... సిక్కు మత గ్రంథమైన 'గురు గ్రంథ్ సాహెబ్‌జీ'లో ప్రస్తావన ఉన్న ఏకైక మహిళ కూడా ఆమే కావడం విశేషం. ఆమెను గొప్ప స్త్రీగా, అందరికీ ఓదార్పును, నీడను ఇచ్చే వృక్షంగా, అమృతంలాంటి ఆహారాన్ని పంచే మహిళగా అందులో ప్రశంసించారు. ప్రస్తుతం పాకిస్తాన్‌లో ఉన్న సంఘర్ ప్రాంతంలో 1506లో ఖీవీ జన్మించారు. ఆమె తండ్రి ఒక దుకాణాన్ని నడిపేవారు. లెహ్నా అనే వ్యక్తితో ఆమెకు వివాహం చేసి, తన దుకాణాన్ని ఆ దంపతులకు అప్పగించారు. కొన్నాళ్ళ తరువాత లెహ్నా, ఖీవీ తీర్థయాత్రలకు బయలుదేరారు. మార్గమధ్యంలో గురునానక్ బోధలను లెహ్నా విన్నాడు. తనను శిష్యునిగా చేర్చుకోవాలని నానక్‌ను వేడుకున్నాడు. హిందువైన అతను నానక్ ధర్మంలోకి మారాడు. అతనికి అంగద్ అని నానక్ కొత్త పేరు పెట్టారు. భర్తను అనుసరిస్తూ ఖీవీ కూడా నానక్ మార్గంలోకి అడుగుపెట్టింది. గురునానక్ మరణం తరువాత... రెండవ సిక్కు గురువుగా (గురు అంగద్ దేవ్‌జీగా) అంగద్ బాధ్యతలు స్వీకరించారు. గురువు భార్యగా కొత్త పాత్రలోకి ఖీవీ అడుగుపెట్టింది. తన ఇంటికి వచ్చిన అతిథులందరికీ ఎలాంటి పక్షపాతం లేకుండా... ఏ సమయంలోనైనా చక్కని ఆహారాన్ని వండిపెట్టేది. అలా తొలి లంగర్ మొదలయింది. సిక్కు మతాన్ని పిల్లలకు సైతం అందుబాటులో ఉంచాలని గురు అంగద్ నిర్ణయించారు. దానికోసం గురుముఖి అనే లిపిని ఎంచుకున్నారు. గురునానక్ జీవిత చరిత్రను రచించారు. వీటన్నిటివెనుకా ఖీవీ ప్రోత్సాహం ఎంతగానో ఉంది. ఆదర్శవంతమైన గృహిణిగా, మన్ననలందుకున్న ఆమె సిక్కు మత ప్రాచుర్యానికి తనదైన పాత్రను పోషించారు. గురు స్థానంలో ఉన్న తన భర్తను దర్శించడానికి వచ్చేవారి ఆకలి తీర్చడానికి ఆమె ప్రారంభించిన లంగర్ ఈనాటికీ కొనసాగుతూ... ఒక మంచి సంప్రదాయంగా మరింత విస్తరించింది.



## పర్వదినం

### శివతత్త్వం అంటే...

దైవానికి ఒక ఆకారం లేదు. ఒక పరిమితి లేదు. దైవం అనంతవ్యాప్తం. అయినప్పటికీ దైవాన్ని గుర్తించడానికి ఏదో ఒక గుర్తు అవసరం. అందుకోసమే శిలా మూర్తులను, విగ్రహాలను తయారు చేశారు. అయితే విగ్రహాలు దైవం కాదు. అవి మనకు దైవం వైపు దారి చూపుతాయి. శివుణ్ణి లింగ రూపంలో కొలుస్తారు. స్థూల ప్రపంచంలో చిక్కుకొని... సూక్ష్మమైన దివ్యత్వాన్ని గ్రహించలేని వారికోసం పెద్ద పెద్ద విగ్రహాల రూపకల్పన జరిగింది. యోగులు స్థూల ప్రపంచం నుంచి సూక్ష్మమైన దానివైపు ప్రయాణిస్తూ ఉంటారు. వారు తమ మనస్సును సూక్ష్మమైన వాటి



మీద లగ్నం చెయ్యాలి. కాబట్టి పెద్ద పెద్ద విగ్రహాలు వారికి అవసరం లేదు. ద్వాదశ జ్యోతిర్లింగాలను చూస్తే... అవన్నీ చాలా చిన్నవిగానే కనిపిస్తాయి. దేవాలయాల్లో స్థాపించే దేవతా మూర్తి... మనుషుల ఆకారం కన్నా చిన్నదిగానే ఉండాలని ఆగమశాస్త్రం చెబుతుంది. ప్రాచీన దేవాలయాల్లోని కొన్నిటిలో, చాలా కొద్ది దేవాలయాల్లో మాత్రమే అటువంటి పెద్ద విగ్రహాలు మనకు కనిపిస్తాయి. వీటిలో చాలావరకూ రాజులు స్థాపించినవే. రాచరికం అంటే పెద్ద అహంకారం. ఎక్కువ అహంకారం ఉన్నవారు దాన్ని పోగొట్టుకొని... చిన్నగా కావాలనుకుంటారు. కాబట్టి తమ కన్నా పెద్దదైన విగ్రహాన్ని చూసినప్పుడే వాళ్ళు తమను తాము చిన్నగా భావించుకోగలరు.

వాస్తవానికి శివలింగానికి ముఖాలు ఉండవు. కానీ వాటికి కూడా ముఖాల్ని పెట్టేస్తున్నాం. శివుణ్ణి ఒక రూపంగా ఆరాధించడాన్ని శాస్త్రాలు నిషేధించాయి. కేవలం నటరాజ స్వరూపం మాత్రమే... అది కూడా కొన్ని ప్రదేశాల్లో మాత్రమే ఆరాధనీయం. శివలింగాన్ని బ్రహ్మ, విష్ణు, మహేశ్వర అనే మూడు విభాగాలుగా స్థాపిస్తారు. ఒక భాగం మాత్రమే కళ్ళకు కనిపిస్తుంది. శివతత్త్వం అంటే కంటికి కనిపించేది మాత్రమే కాదనీ, మనకు కనిపించేదానికన్నా (తెలిసినదానికన్నా) రెండు రెట్లు ఎక్కువ ఉన్నదనీ దీని అర్థం. కాబట్టి కన్నులు మూసుకొని... నీలో ఉన్న శివతత్త్వాన్ని దర్శించమని సూచన. ధ్యానంలోకి వెళ్ళండి. శివుణ్ణి తెలుసుకోండి. స్థూలం నుంచి సూక్ష్మానికి ప్రయాణించండి. ఈ ప్రయాణంలో సాలగ్రామం కన్నా మంత్రాలు ఉత్తమం. మంత్రాలకన్నా మౌనం అత్యుత్తమం.

• శ్రీశ్రీరవిశంకర్

## నేడు మహాశివరాత్రి

### అఖండ చైతన్యమే శివం

మాఘ కృష్ణ చతుర్దశ్యా మాదిదేవో మహానిశి
శివలింగ తయోద్భూతః కోటి సూర్య సమప్రభః

కోటి సూర్యుల వెలుగుతో సమానమైన ప్రకాశంతో... మాఘ శుక్ల చతుర్దశి నాడు అర్ధరాత్రి వేళ... బ్రహ్మ, విష్ణువుల మధ్య అగ్నిర్జోతిర్లింగం ప్రభవించిన రోజు... మహా శివరాత్రి. పరాశక్తి సృష్టించిన బ్రహ్మ, విష్ణు, రుద్రుల సమన్వయ స్వరూపం పరమశివుడు. ఆయన లింగరూపంలో సాక్షాత్కరించాడు. సమస్త జగత్తు ఆయనలో నిబిడీకృతమై ఉంది. నిరాకార, నిరంజన, నిరామయమైన శివతత్త్వమే ఆ లింగరూపం. శివుణ్ణి ఆ రూపంలోనే కాదు, మూర్తి రూపంలోనూ... అంటే



చంద్రశేఖర, అర్ధనారీశ్వరాది రూపాల్లోనూ ఆరాధిస్తున్నాం. అయితే బ్రహ్మరుద్రాదులు కూడా అర్చించినది లింగాకృతినేనని 'లింగాష్టకం'లోని తొలి శ్లోకం స్పష్టం చేస్తుంది. శివలింగం పానవట్టంతో ఆవృతమై ఉంటుంది. అది శివలింగానికి పీఠం. పానవట్టం శక్తికి ప్రతీక. అంటే ఇది అర్ధనారీశ్వర తత్త్వానికి సంకేతం. శివుడు జ్యోతిస్వరూపుడు. ఆ జ్యోతి ప్రసరించే కిరణాలు శక్తికి చిహ్నాలు. ఈ రెండూ అభిన్నం... అంటే విడదీయలేనివి. ఈ తత్త్వాన్ని ఆదిశంకరులు 'శివశక్త్యాయుక్తో యది భవతి శక్తః ప్రభవితుమ్' అంటూ విశ్లేషించారు. పీఠంలోని శక్తినీ, లింగాకృతిలోని ఈశ్వర శక్తినీ సమ్మిశ్రితం చేస్తూ ఆరాధించడమే... శివలింగార్చనలోని అంతర్యం.

పంచభూత లింగాలలో ఒకటైన (అరుణాచలంలోని) అగ్నిలింగం అనే మాటకు 'అగ్రమునందు ఉన్నవాడు' అని అర్థం. సృష్టికి పూర్వమే ఉన్నవాడనేది విశ్లేషణ. అతడు కాలాగ్ని రుద్రస్వరూపం. కాలం అపరిచ్ఛిన్నం... అంటే 'ఇంత' అనే పరిమితి లేనిది. అనంతమైనది. మన అవగాహనకోసం దాన్ని భూత, భవిష్యత్, వర్తమానాలుగా విభజించుకున్నాం. ఆద్యంతాలు లేని అఖండ చైతన్య స్వరూపమే శివం... మహాకాల స్వరూపమైన శివతత్త్వం. శ్మశానవాసి అయిన శివుడు ఒళ్ళంతా భస్మం ధరిస్తాడు. అది బూడిద కాదు, విభూది. అంటే ఐశ్వర్యం. భోళాశంకరుణ్ణి భక్తితో అర్చిస్తే... విభూదిని అందిస్తాడు. శివరాత్రి పర్వదినాన శివుణ్ణి అభిషేకించి, పంచాక్షరీ మంత్రం జపిస్తూ, జాగరణ చేసి, లింగోద్భవ సమయంలో శివ దర్శనం చేస్తే... ఆయన తన అనుగ్రహాన్ని కురిపిస్తాడు.

• అయపిళ్ళ రాజపాప

## సందేశం

# శుభ మాసానికి ఆహ్వానం

సకల శుభాలను చేకూర్చే అత్యంత పవిత్రమైన మాసం రంజాన్. దైవ విశ్వాసులైన వారికి శ్రేయస్సును అందించడానికి, కారుణ్యాన్ని వర్షించడానికి త్వరలోనే ఈ మాసం ఆరంభమవుతోంది.

రజబ్, షాబాన్ మాసాల్లో నెలవంకను చూస్తూ "ఓ అల్లాహ్! మమ్మల్ని రంజాన్ మాసం వరకూ చేర్చు" అని అంతిమ దైవప్రవక్త మహమ్మద్ ప్రార్థించేవారు. ఇస్లాం ధర్మశాస్త్రంలో రంజాన్‌కు... మరి ఏ నెలకూ లేని ప్రాధాన్యత ఉంది. ఈ మాసాన్ని ఘనంగా, హృదయపూర్వకంగా స్వాగతించడం కోసం... ముందు నెల అయిన షాబాన్ నుంచే సంసిద్ధులు కావాలని మహాప్రవక్త పిలుపునిచ్చేవారు. "ఒక శుభప్రదమైన మాసం రాబోతోంది. ఈ నెలలో ఉపవాసాలను అల్లాహ్ మీకు తప్పనిసరి విధిగా చేశాడు. ఈ మాసంలో స్వర్గ ద్వారాలు తెరుచుకుంటాయి. నరక ద్వారాలు మూసుకుంటాయి. సైతాన్లు సంకెళ్ళతో బందీలవుతారు. వెయ్యి నెలల కన్నా శ్రేష్ఠమైన రాత్రి... లైలతుల్ ఖద్ర్ (మహోన్నతమైన శుభరాత్రి) ఈ మాసంలోనే ఉంది. పూర్తి విశ్వాసంతో కూడిన ఉత్సాహంతో వరాల రంజాన్ మాసానికి స్వాగతం చెప్పేవారు గొప్ప అదృష్టవంతులు. ఆరాధనకు ఇది ఎంతో ముఖ్యమైన నెల. ఈ మాసంలో ఎవరైనా ఒక సత్కార్యాన్ని సంతోషంగా, అంతర్ ప్రేరణతో చేసినట్టయితే... ఆ సత్కార్యం ఇతర మాసాల్లో విధిగా చెయ్యవలసిన ఒక కార్యంతో సమానంగా పరిగణన పొందుతుంది. అలాగే ఎవరైనా విధిగా చెయ్యవలసిన కార్యాన్ని ఆచరిస్తే... అది ఇతర మాసాల్లో డెబ్బై విధులను ఆచరించడంతో సమానంగా పరిగణన పొందుతుంది" అని ఆయన పేర్కొన్నారు. రంజాన్ మాసంలో నెలవంకను చూడగానే "ఓ అల్లాహ్! ఈ చంద్రుణ్ణి మాకు శాంతిని, విశ్వాసాన్ని, శ్రేయస్సును కలిగించే నెలవంకగా ఉదయింపజెయ్యి. నీకు అభీష్టమైన, ప్రీతికరమైన పనులు చేసేలా మమ్మల్ని కటాక్షించు" అని ప్రార్థించాలని ఆయన చెప్పేవారు.

రంజాన్ మాసంలో అల్లాహ్ ప్రీతి కోసం అయిదు పనులను ముఖ్యంగా చెయ్యాలి. మొదటిది: కలిమా ఎ తయ్యిబహ్ (దేవుడొక్కడే. ఆయన ప్రవక్త మహమ్మద్ అని విశ్వసించడం). రెండోది: ఇస్తిగ్‌ఫార్ (క్షమాపణ కోరడం), మూడోది: అల్లాహ్‌ను ప్రార్థించి... స్వర్గ ప్రవేశాన్ని కోరడం. నాలుగోది: నరకం నుంచి కాపాడాలని వేడుకోవడం. అయిదోది: అంతిమ దివ్య గ్రంథమైన ఎక్కువసార్లు చదవడం. దానిలోని ధర్మాలను అమలుపరచడం. ఇతరులకు ఆ సందేశాన్ని చేరవెయ్యడం.



అనంత కరుణామయుడు, అపార కృపాశీలి అయిన అల్లాహ్ మానవులకు అందించిన పవిత్ర మాసంగా, సమస్త శుభాలకు నిలయంగా, సర్వ కారుణ్యాలకు ఆలవాలంగా, సహనాన్ని, దాతృత్వాన్ని పెంచే పుణ్యమాసంగా, పేద, గొప్ప తారతమ్యాలను తొలగించే మాసంగా, సర్వమానవ సమానత్వాన్ని, సౌభ్రాతృత్వాన్ని, పరస్పర ప్రేమాభిమానాలను ద్విగుణీకృతం చేసే మాసంగా రంజాన్‌ను పవిత్ర గ్రంథాలు ప్రస్తుతించాయి. విశ్వాసులందరూ రంజాన్ మాసంలో రోజూ దివ్య ఖుర్‌ఆన్‌లో ఒక భాగం పారాయణ చెయ్యాలి. రాత్రివేళల్లో తరావీహ్, తహజ్జుద్ నమాజులు చెయ్యాలి. జకాత్, ఫిత్రా దానాలు, తాఖ్ రాత్రులు (బేసి రాత్రులు) ఏతేకాఫ్ (తపో నిష్ఠ), దుఆ (వేడికోలు) లాంటి ఆధ్యాత్మిక అంశాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి. ఫర్జ్, సున్నత్, నఫీల్ నమాజులు ఎక్కువగా చెయ్యాలి. సహరీ, ఇఫ్తార్‌లలో ఇతరులను భాగస్వాములుగా చేసుకోవాలి. ఇవన్నీ తప్పకుండా ఆచరించాలనే గట్టి సంకల్పంతో... పవిత్రమైన రంజాన్ మాసాన్ని హృదయపూర్వకంగా, సంతోషంగా స్వాగతించాలి.

• మహమ్మద్ వహీదుద్దీన్

'దిక్సూచి' వెబ్ పేజీలో...
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/zcY2CuSలో చదవండి.

## సహజయోగ

# మీ విలువ గ్రహించండి

సహజ యోగ ఆవిష్కరణ ద్వారా... భారతీయ యోగ విజ్ఞానాన్ని విశ్వవ్యాప్తం చేసిన మహనీయురాలు శ్రీమాతాజీ నిర్మలాదేవి. ప్రపంచాన్ని శాంతి మార్గంలోకి తీసుకువెళ్ళడానికి ఆమె అహర్నిశలు శ్రమించారు. ఎంతోమందికి సంపూర్ణమైన భౌతిక, మానసిక ఆరోగ్య సాధన కోసం ఉచితంగా సహజయోగాన్ని అందించారు. అలాగే మహిళాభ్యుదయం కోసం, మహిళా సాధికారత కోసం ఆమె ఎంతగానో తపనపడ్డారు. వాటికోసం అహర్నిశలూ కృషి చేశారు. ప్రపంచంలో, సమాజంలో, కుటుంబంలో మహిళల పాత్ర, వారి బాధ్యతల గురించి వివిధ సందర్భాల్లో ప్రసంగాలు చేశారు. చైనాలోని బీజింగ్‌లో జరిగిన అంతర్జాతీయ మహిళా సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని, అద్వితీయమైన ప్రసంగం చేశారు. ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా వాటిలో కొన్ని అంశాలను ప్రస్తావించుకుందాం:

"యావత్ ప్రపంచ చరిత్రలోనే ఉత్కృష్టమైన ప్రస్తుత కాలంలో... మహిళా సమస్యల గురించి ఇంత గొప్ప చైతన్యాన్ని నేను ఊహించలేదు. మానవ సమాజంలో మహిళల సముచిత పాత్రను, ప్రాధాన్యాన్ని మనం పూర్తిగా అర్థం చేసుకోలేకపోవడం వల్ల... ఎన్నో సంవత్సరాలుగా స్త్రీ జాతి సమస్తం అనేక బాధలకు గురయింది. మహిళల ద్వారా ఉద్భవించిన సమాజమే మహిళలను అణచివేస్తోంది. వారిపై ఆధిపత్యానికి ప్రయత్నిస్తోంది. ప్రతి దేశానికి లేదా ప్రతి నాగరికతకు అంతర్గత శక్తి మహిళలేననేది వాస్తవం. సమస్త మానవజాతి నిర్మాతలు, సంరక్షకులు స్త్రీలు అనేది నిర్వివాదాంశం. సర్వరక్షకుడైన భగవంతుడు వారికి ఇచ్చిన పాత్ర ఇది. విస్తనాలు వాటంతట అవే దేన్నీ సృష్టించలేవు. ఎంతో ఒత్తిడిని భరిస్తూ మొత్తం లోకం అంతటికీ ఫలపుష్పాలను భూమాత అందిస్తుంది. మహిళ కూడా భూమాత లాంటిదే. శిశువుకు జన్మనిచ్చి, పెంచి, పోషించి, రేపటి పౌరుడిగా తీర్చిదిద్దుతుంది. మహిళలు తమ శక్తిని తాము గుర్తిస్తే... ఈ ప్రపంచాన్ని అత్యంత సుందరంగా మార్చగలరు. ఒక శక్తిమంతుడైన పురుషుణ్ణి చూసినప్పుడు... అతని వెనుక ఒక స్త్రీ ఉందని మనం గుర్తించవచ్చు. ఆమె కావాలనుకుంటే పురుషులకన్నా ఎక్కువ పని చెయ్యగలదు. అయితే మొదట నమ్రతతో, అణకువతో, హుందాతనంతో, చక్కటి అవగాహనతో, వాత్సల్యపూరితంగా ఉండి... తనలోని శక్తులను గౌరవించుకుంటూ శాంతిని నెలకొల్పడం, కవచంలా రక్షణ కల్పించడం మహిళల బాధ్యత.

ప్రస్తుతం మన సమాజాన్ని లంచగొండితనం, హింస అనే భూతాలు పీడిస్తున్నాయి. ఈ జాడ్యాలు తలెత్తకుండా... బాల్యంలోనే పిల్లల నడవడికను సరిదిద్ది, పిల్లలను సన్మార్గంలో పెట్టడం తమ బాధ్యత అని మహిళలు గుర్తుంచుకోవాలి. ప్రస్తుత కాలంలో కొందరు మహిళలను విలువలను, ఆధ్యాత్మిక ఔన్నత్యాన్ని పోగొట్టుకుంటున్నారు. పోటీతత్వం, ధనాశ, విజయం సాధించడం మీదే ధ్యాస లాంటి నిరర్థకమైన విషయాల్లో ఆసక్తి పెరిగింది. ఆధ్యాత్మిక ఎదుగుదల మీద శ్రద్ధ లోపిస్తోంది. మహిళకు ఎక్కడ గౌరవం లభిస్తుందో అక్కడ దేవతలుంటారన్నారు పూర్వులు. అయితే అలా గౌరవం పొందే స్థాయిలో మహిళలు ఉండాలి. తాళాలు మీ చేతుల్లోనే ఉన్నాయి. మీ విలువను మీరు అర్థం చేసుకొని, మిమ్మల్ని మీరు లోకువ చేసుకోకుండా, చౌకబారు పేరు ప్రతిష్ఠలకు పాకులాడకుండా... నిబద్ధతతో ఉంటే, సునాయాసంగా సమస్యలను పరిష్కరించగలరు. మొత్తం ప్రపంచాన్ని మీ స్వాధీనంలోకి తెచ్చుకోగలరు. అప్పుడు సమస్త మానవాళికీ సంపూర్ణ రక్షణ కలుగుతుంది. మరి ఆ సమతుల్యమైన స్థితిని ఎలా సాధించాలి? రోగాలు, అవినీతి, లంచగొండితనం, నైతిక పతనం, అజ్ఞానం అనే ఈ కెరటాలకు మనం ఏ విధంగా అడ్డుకట్ట వేయగలం? ప్రస్తుత సంఘర్షణను, గందరగోళ పరిస్థితిని ఏ విధంగా అంతం చెయ్యగలం? ప్రతివారి హృదయంలో, మనస్సులో శాంతిని ఏ విధంగా స్థాపించగలం? ఈ ప్రశ్నలన్నిటికీ సమాధానమైన మార్గం సహజయోగ. మనలోని కుండలినీ శక్తిని జాగృతం చేసుకొని, సర్వవ్యాపక శక్తి అయిన పరమాత్ముని ప్రేమ శక్తితో మనల్ని అనుసంధానించుకోవాలి. అప్పుడు ఆ దివ్యశక్తి మీలో ప్రవహించి, మిమ్మల్ని ఉత్సాహవంతుల్ని చేస్తుంది. మీరు అత్యంత శక్తిమంతులుగా, శాంతిస్వరూపులుగా మారుతారు. మీ వ్యక్తిత్వం సంపూర్ణంగా వికసిస్తుంది" అని శ్రీ మాతాజీ వెల్లడించారు.



తాను చెప్పిన వాటిని ఆమె స్వయంగా పాటించి, నిరూపించి... సహజయోగ మహిళలకు ఆదర్శంగా నిలిచారు. నిస్సహాయులైన మహిళలు, బాలికల సంరక్షణే ధ్యేయంగా ఢిల్లీలో విశ్వ నిర్మల ప్రేమ ఆశ్రమాన్ని ప్రారంభించారు. రేపటి సమాజంలో ఎదురయ్యే సవాళ్ళను స్వతంత్రంగా ఎదుర్కొని... ఆనందమయమైన, గౌరవప్రదమైన జీవితాన్ని గడిపేలా మహిళలు తయారు కావాలన్నదే శ్రీమాతాజీ ఆశయం.



డాక్టర్ పి. రాకేష్, 8988982200
'పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి, సహజయోగ ట్రస్ట్', తెలంగాణ

# కుల్దీప్ కమాల్

## ఐదు వికెట్లతో రాణింపు ● అశ్విన్‌కు నాలుగు

**ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ 218**

భారత్ తొలి ఇన్నింగ్స్ 135/1

జైస్వాల్, రోహిత్ అర్ధసెంచరీలు



కుల్దీప్ యాదవ్ (5/72)

**ధర్మశాల:** నామమాత్ర పోరే అయినా భారత జట్టు మొదటి రోజే అటు బంతితో.. ఇటు బ్యాట్‌తో ఇంగ్లండ్‌పై విరుచుకుపడింది. చల్లని వాతావరణంతో పాటు వికెట్‌పై తేమ కారణంగా మొదట పేసర్లకు పండగే అనుకున్నారు. అటు బ్యాటింగ్‌కు కూడా ఇబ్బందేమీ లేదని భావించారు. కానీ ధర్మశాలలో భారత స్పిన్నర్లు అంతా తారుమారు చేశారు. ముఖ్యంగా కుల్దీప్ యాదవ్ (5/72) సుడులు తిరిగే బంతులకు స్టోక్స్ సేన దాసోహమైంది. వారి టాప్-6 బ్యాటర్లలో ఐదుగురిని తనే పెవిలియన్‌కు చేర్చడంతో పర్యాటక జట్టు వెన్నువిరిగింది. అటు వందో టెస్టు ఆడుతున్న అశ్విన్ (4/51) టెయిలెండర్ల పనిబట్టడంతో తొలి రోజు గురువారం 57.4 ఓవర్లలో ఇంగ్లండ్ 218 పరుగుల వద్ద మొదటి ఇన్నింగ్స్‌ను ముగించింది. ఓపెనర్ జాక్ క్రాలే (79) మాత్రమే దీటుగా నిలబడినా, సహచరులంతా విఫలమయ్యారు. జడేజా పొదుపైన బౌలింగ్‌తో ఓ వికెట్ తీయడంతో ప్రత్యర్థి మొత్తం స్పిన్‌కే కుప్పకూలినట్టయ్యింది. ఆ తర్వాత భారత్ రోజు ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో 30 ఓవర్లలో వికెట్ నష్టానికి 135 పరుగులు చేసింది. ఓపెనర్ యశస్వీ (58 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్సర్లతో 57) వన్డే తరహా ఆటతీరును ప్రదర్శించగా, క్రీజులో రోహిత్ (52 బ్యాటింగ్), గిల్ (26 బ్యాటింగ్) ఉన్నారు.

**తొలి సెషన్‌లో జాగ్రత్తగా..:** టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ బజ్‌బాల్ గేమ్‌తో భారీ స్కోరు సాధించి ప్రత్యర్థిపై ఒత్తిడి పెంచాలని ఆలోచించింది. కానీ పేసర్లు బుమ్రా, సిరాజ్ తొలి సెషన్ ఆరంభంలో చక్కటి సీమ్ బౌలింగ్‌తో కట్టడి చేశారు. అయితే ఈ జోడీ వికెట్లు మాత్రం తీయలేకపోయింది. పేసర్లతో 14 ఓవర్లు వేయించాక కెప్టెన్ రోహిత్ స్పిన్నర్లను దించాడు. కుల్దీప్ తన తొలి ఓవర్‌లోనే డకెట్ (27) వికెట్ తీసి 64 పరుగుల భాగస్వామ్యానికి తెర దించాడు. ఎక్స్‌ట్రా కవర్ వైపు గాల్లోకి లేచిన బంతిని గిల్ కవర్స్ నుంచి పరిగెత్తుకెళ్లి డైవింగ్ క్యాచ్‌తో అందుకున్న తీరు వహ్వా.. అనిపించింది. అటు క్రీజులో పాతుకుపోయిన క్రాలే ఫిఫ్టీ పూర్తి చేసుకున్నాడు. కుల్దీప్ ఐదో ఓవర్‌లో పోప్ (11) స్టంపౌట్ కావడంతో జట్టు లంచ్‌కు వెళ్లింది. అప్పటికి 100/2 స్కోరుతో ఇంగ్లండ్ పటిష్టంగానే కనిపించింది.

**కుల్దీప్ మాయ:** రెండో సెషన్‌లో ఇంగ్లండ్ మరింత తడబడి ఆరు వికెట్లు కోల్పోగా.. స్పిన్నర్ కుల్దీప్ ఇందులో ముగ్గురిని పెవిలియన్‌కు చేర్చాడు. టాపార్డర్‌నే కాకుండా మిడిలార్డర్‌ను కూడా తను కుదురుకోనీయలేదు. దీంతో 137/2 నుంచి ఒక్కసారిగా స్కోరు 183/8కి పడిపోయింది. సెషన్‌లో తొలి గంట తర్వాత కీలక క్రాలేను కుల్దీప్ క్లీన్‌బౌల్డ్ చేశాడు. ఆ తర్వాత తన వరుస ఓవర్లలో బెయిర్‌స్టో (29), కెప్టెన్ స్టోక్స్ (0)లను సైతం అవుట్ చేశాడు. మధ్యలో రూట్ (26)ను జడేజా అవుట్ చేయడంతో 175 రన్స్ వద్దే జట్టు ఈ మూడు వికెట్లను కోల్పోయి కష్టాల్లో పడింది. ఇక అశ్విన్ ఒకే ఓవర్‌లో హార్ట్‌లీ (6), ఉడ్ (0) వికెట్లు తీయడంతో 194/8తో ఆఖరి సెషన్‌కు వెళ్లింది. ఆ తర్వాత మూడు ఓవర్లలోపే వీరి ఇన్నింగ్స్ ముగిసింది. ఫోక్స్ (24), అండర్సన్ (0)ల వికెట్లను అశ్విన్ ఒకే ఓవర్లో తీశాడు.

**శతక భాగస్వామ్యం :** ఇంగ్లండ్ బ్యాటర్లు బెదిరిన ట్రాక్‌పై భారత ఓపెనర్లు అదరగొట్టారు. సాధికారిక బ్యాటింగ్‌తో తొలి వికెట్‌కు 104 రన్స్ అందించారు. ఉడ్ ఓవర్‌లో రోహిత్ 6,4 బాదగా జైస్వాల్ అయితే చెలరేగాడు. స్పిన్నర్ బషీర్ తొలి ఓవర్‌లోనే మూడు సిక్సర్లతో 18 రన్స్ అందించాడు. ఇక తననే లక్ష్యంగా చేసుకుని వరుస ఫోర్లతో ఆకట్టుకున్నాడు. అయితే 21వ ఓవర్‌లో రెండు వరుస ఫోర్లతో 50 పరుగులు పూర్తి చేసినా మరో భారీ షాట్‌కు ముందుకెళ్లడంతో స్టంపయ్యాడు. ఆ తర్వాత రోహిత్ సైతం ఫిఫ్టీ పూర్తి చేయగా.. గిల్ నిలకడగా ఆడి రోజును ముగించారు.

**స్కోరుబోర్డు**

**ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్:** క్రాలే (బి) కుల్దీప్ 79; డకెట్ (సి) గిల్ (బి) కుల్దీప్ 27; పోప్ (స్టంప్) జురెల్ (బి) కుల్దీప్ 11; రూట్ (ఎల్బీ) జడేజా 26; బెయిర్‌స్టో (సి) జురెల్ (బి) కుల్దీప్ 29; స్టోక్స్ (ఎల్బీ) కుల్దీప్ 0; ఫోక్స్ (బి) అశ్విన్ 24; హార్ట్‌లీ (సి) దేవ్‌దత్ (బి) అశ్విన్ 6; ఉడ్ (సి) రోహిత్ (బి) అశ్విన్ 0; బషీర్ (నాటౌట్) 11; అండర్సన్ (సి) దేవ్‌దత్ (బి) అశ్విన్ 0; **ఎక్స్‌ట్రాలు: 5; మొత్తం: 57.4 ఓవర్లలో 218 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-64, 2-100, 3-137, 4-175, 5-175, 6-175, 7-183, 8-183, 9-218, 10-218; **బౌలింగ్:** బుమ్రా 13-2-51-0; సిరాజ్ 8-1-24-0; అశ్విన్ 11.4-1-51-4; కుల్దీప్ 15-1-72-5; జడేజా 10-2-17-1.

**భారత్ తొలి ఇన్నింగ్స్:** జైస్వాల్ (స్టంప్) ఫోక్స్ (బి) బషీర్ 57; రోహిత్ (బ్యాటింగ్) 52; గిల్ (బ్యాటింగ్) 26; **ఎక్స్‌ట్రాలు: 0; మొత్తం: 30 ఓవర్లలో 135/1. వికెట్ల పతనం:** 1-104; **బౌలింగ్:** అండర్సన్ 4-1-4-0; ఉడ్ 3-0-21-0; హార్ట్‌లీ 12-0-46-0; బషీర్ 11-2-64-1.



100 వ మ్యాచ్ సందర్భంగా కుటుంబంతో అశ్విన్

### ఈ బంతి నీదే.. కాదు నీదే

తొలి రోజు ఆట ముగిశాక కుల్దీప్, అశ్విన్ మధ్య జరిగిన సరదా సంఘటన ఫ్యాన్స్‌ను ఆకట్టుకుంది. సహజంగా టెస్టుల్లో ఐదు వికెట్లు తీసిన బౌలర్ మ్యాచ్ తర్వాత అంపైర్ దగ్గర నుంచి బంతి తీసుకుంటాడు. అలాగే గురువారం కుల్దీప్ ఈ ఫీట్ సాధించాక బంతిని తీసుకున్నా.. కెరీర్‌లో వందో టెస్టు ఆడుతున్న అశ్విన్‌ను ముందు నడిపిద్దామని బంతిని అతడి వైపు విసిరాడు. కానీ అశ్విన్ మాత్రం వెంటనే తిరిగి బంతిని అతడి వైపే వేశాడు. అటు కుల్దీప్ మాత్రం వద్దు.. నీకే అన్నట్టుగా మళ్లీ వేయగా, మధ్యలో సిరాజ్ అందుకుని అశ్విన్‌కు అందించాడు. అయినా అశ్విన్ మాత్రం ససేమిరా అన్నట్టుగా కుల్దీప్‌నకే ఇవ్వడంతో తను బంతిని చూపిస్తూ అందరి కంటే ముందు నడిచాడు.





జైస్వాల్ (57)

**1** ఇంగ్లండ్‌పై టెస్టు సిరీస్‌లో అత్యధిక పరుగులు (712) సాధించిన భారత బ్యాటర్‌గా జైస్వాల్. అలాగే ఒకే జట్టు (ఇంగ్లండ్)పై ఎక్కువ సిక్సర్లు (26) బాదిన భారత బ్యాటర్‌గానూ నిలిచాడు. ఈ క్రమంలో సచిన్ (ఆసీస్‌పై 25)ను అధిగమించాడు.

తక్కువ బంతుల్లోనే (1871) 50 వికెట్లు పూర్తి చేసిన భారత బౌలర్‌గా కుల్దీప్. అక్షర్ (2205)ను అధిగమించాడు. గత 100 సంవత్సరాలలో వరల్డ్ క్రికెట్‌లో ఇన్ని తక్కువ బంతుల్లో ఏ స్పిన్నరూ 50 వికెట్ల మైలురాయి చేరలేదు.

**2** టెస్టుల్లో తక్కువ ఇన్నింగ్స్ (16)లో వెయ్యి పరుగులు పూర్తి చేసిన రెండో భారత బ్యాటర్‌గా జైస్వాల్. వినోద్ కాంబ్లీ (14) టాప్‌లో ఉన్నాడు. అంతేకాకుండా ఒకే టెస్టు సిరీస్‌లో భారత్ తరఫున ఎక్కువ పరుగులు (712) సాధించిన రెండో బ్యాటర్. గవాస్కర్ (విండీస్‌పై 774, 732) ముందున్నాడు.

## క్వార్టర్స్‌లో సింధు

● గాయత్రి జోడీ కూడా
● శ్రీకాంత్ అవుట్



**పారిస్:** ఫ్రెంచ్ ఓపెన్‌లో ఏస్ షట్లర్ పీవీ సింధు, గాయత్రి జోడీ క్వార్టర్స్‌కు దూసుకెళ్లగా.. కిడాంబి శ్రీకాంత్ ఓటమితో ఇంటిముఖం పట్టాడు. మహిళల సింగిల్స్‌లో గురువారం జరిగిన ప్రీక్వార్టర్స్ మ్యాచ్‌లో సింధు 13-21, 21-10, 21-14తో వరల్డ్ నెం:10 బీవెన్ జాంగ్ (అమెరికా) గెలిచింది. తొలి గేమ్‌లో తడబడినా.. ఆ తర్వాత సింధు బలంగా పుంజుకొంది. కాగా, పురుషుల రెండో రౌండ్‌లో శ్రీకాంత్ 21-19, 12-21, 20-22తో లు గువాంగ్ జు (చైనా) చేతిలో ఓడాడు. మహిళల డబుల్స్‌లో ట్రీసా జాలీ-గాయత్రి జంట 21-18, 21-13తో జపాన్ ద్వయం యుకీ ఫుకుషిమా-సయాక హిరోటాపై వరుస గేముల్లో గెలిచింది.

### రిత్విక్‌కు రజతం



**నాసిక్:** జాతీయ బ్లిట్జ్ చెస్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ గ్రాండ్ మాస్టర్ రాజా రిత్విక్ రజతం సాధించాడు. గురువారంతో ముగిసిన పోటీల్లో రిత్విక్ మొత్తం 11 రౌండ్ల నుంచి 9 పాయింట్లతో రెండో స్థానం దక్కించుకొన్నాడు. బెంగాల్‌కు చెందిన జీఎం దీప్తయన్ ఘోష్ 9.5 పాయింట్లతో విజేతగా నిలిచాడు. ర్యాపిడ్ విభాగంలో రిత్విక్ కాంస్యం గెలిచిన సంగతి తెలిసిందే.

### సన్‌రైజర్స్ కొత్త జెర్సీ



**న్యూఢిల్లీ:** ఐపీఎల్ జట్టు సన్‌రైజర్స్ హైదరాబాద్ తమ కొత్త జెర్సీని గురువారం విడుదల చేసింది. గత జెర్సీ తరహాలో కాషాయ రంగులోనే ఉన్నా.. పైన నలుపు రంగులో డిజైన్ వేశారు. ఈ జెర్సీకి 'రగిలే జ్వాల' అని పేరు పెట్టారు. భువనేశ్వర్ కుమార్ ధరించిన ఈ కొత్త జెర్సీ ఫొటోను ఫ్రాంచైజీ పోస్టు చేసింది. ఈ జెర్సీ అచ్చం సౌతాఫ్రికా టీ20 లీగ్‌లో వరుసగా రెండుసార్లు విజేతగా నిలిచిన సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్ (ఎస్ఈసీ) జెర్సీని పోలినట్టుగా ఉంది.

### అంపైరింగ్‌కు ఎరాస్మస్ గుడ్‌బై



**దుబాయ్:** దక్షిణాఫ్రికాకు చెందిన అంపైర్ మరైస్ ఎరాస్మస్ (60) అంతర్జాతీయ కెరీర్‌కు వీడ్కోలు పలకనున్నాడు. క్రైస్ట్‌చర్చ్‌లో శుక్రవారం నుంచి న్యూజిలాండ్, ఆస్ట్రేలియా మధ్య జరిగే రెండో, ఆఖరి టెస్ట్ అతడికి చివరి మ్యాచ్. నాలుగు వన్డే వరల్డ్‌కప్‌లు, ఏడు టీ20 ప్రపంచకప్‌లు, మూడు మహిళల టీ20 విశ్వకప్‌లతోపాటు 2013, 2017 చాంపియన్స్‌ట్రోఫీల్లో అంపైర్‌గా బాధ్యతలు నిర్వర్తించాడు. 2006లో కెరీర్ ఆరంభించిన ఎరాస్మస్ 81 టెస్ట్‌లు, 124 వన్డేలు, 43 టీ20లు, 18 మహిళల టీ20లకు అంపైరింగ్ చేశాడు. 131 మ్యాచ్‌లకు టీవీ రెఫరీగా వ్యవహరించాడు. 2010లో ఐసీసీ ఎలిట్ ప్యానల్ అంపైర్‌గా నియమితుడయ్యాడు.

## ముంబై.. దెబ్బకు దెబ్బ

● మెరిసిన బ్రంట్, ఇషాక్
● 42 పరుగులతో యూపీ చిత్తు

దీప్తి అర్ధ శతకం వృథా



బ్రంట్ (45, 2/14)

**నేటి మ్యాచ్**
ఢిల్లీ x యూపీ
రాత్రి 7.30 గం. నుంచి

**న్యూఢిల్లీ:** స్పిన్నర్ సైకా ఇషాక్ (3/27)కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' సివర్ బ్రంట్ (45, 2/14) ఆల్‌రౌండ్ ప్రదర్శన తోడుకావడంతో.. డబ్ల్యూపీఎల్‌లో డిఫెండింగ్ చాంప్ ముంబై ఇండియన్స్ నాలుగో విజయాన్ని నమోదు చేసింది. గురువారం జరిగిన మ్యాచ్‌లో ముంబై 42 పరుగుల తేడాతో యూపీ వారియర్స్‌ను చిత్తు చేసింది. బెంగళూరులో ఎదురైన పరాజయానికి గట్టిగా బదులు తీర్చుకొంది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన ముంబై నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 160 పరుగులు చేసింది. ఓపెనర్లు హేలీ మాథ్యూస్ (4), యాస్తిక భాటియా (9)ను అవుట్ చేసిన చమరి అటపట్టు (2/27) ఆదిలోనే దెబ్బతీసింది. కానీ, బ్రంట్, కెప్టెన్ హర్మన్ (33) మూడో వికెట్‌కు 59 పరుగుల భాగస్వామ్యంతో ఆదుకొనే ప్రయత్నం చేశారు. బ్రంట్‌ను రాజేశ్వరి బౌల్డ్ చేయగా.. హర్మన్‌ను సైమా పెవిలియన్ చేర్చింది. డెత్ ఓవర్లలో అమెలియా కెర్ (39), సజన (22 నాటౌట్) దూకుడుగా ఆడడంతో.. ముంబై స్కోరు 160 మార్క్‌ను అందుకొంది. అనంతరం ఛేదనలో యూపీ ఓవర్లన్నీ ఆడి 118/9 స్కోరు మాత్రమే చేసింది. ముంబై బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో.. దీప్తి శర్మ (53 నాటౌట్) మినహా మిగతా బ్యాటర్లు ఎక్కువసేపు క్రీజులో నిలవలేక పోయారు. 15 పరుగులకే టాపార్డర్ బ్యాటర్లు కిరణ్ నవ్‌గిరె (7), అటపట్టు (3), కెప్టెన్ అలిస్సా హీలీ (3) వికెట్లు చేజార్చుకొన్న యూపీ ఏ దశలోనూ మ్యాచ్‌లోకి రాలేక పోయింది.

**సంక్షిప్త స్కోర్లు**
**ముంబై:** 20 ఓవర్లలో 160/6 (సివర్ బ్రంట్ 45, కెర్ 39, హర్మన్ 33; అటపట్టు 2/27).
**యూపీ:** 20 ఓవర్లలో 118/9 (దీప్తి 53 నాటౌట్; ఇషాక్ 3/27, బ్రంట్ 2/14).

# బిజినెస్

JM FINANCIAL

## జేఎం ఫైనాన్షియల్‌పై సెబీ ఆంక్షలు

డెట్ సెక్యూరిటీ ఇష్యూలకు లీడ్ మేనేజర్‌గా వ్యవహరించకుండా సంస్థపై నిషేధం

న్యూఢిల్లీ: ప్రముఖ ఆర్థిక సేవల సంస్థ జేఎం ఫైనాన్షియల్ లిమిటెడ్‌పై క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ ఆంక్షలు విధించింది. నియంత్రణ నియమావళిని ఉల్లంఘించినందుకు గాను కొత్తగా డెట్ సెక్యూరిటీ ఇష్యూలకు లీడ్ మేనేజర్‌గా వ్యవహరించకుండా సంస్థపై నిషేధం విధించింది. అయితే, ఇప్పటికే సంస్థ చేపట్టిన ఇష్యూలకు మాత్రం 60 రోజుల పాటు లీడ్ మేనేజర్‌గా వ్యవహరించేందుకు వెసులుబాటు కల్పిస్తున్నట్లు గురువారం విడుదల చేసిన మధ్యంతర ఉత్తర్వుల్లో సెబీ పేర్కొంది. ఈ వారంలో జేఎం ఫైనాన్షియల్ గ్రూప్ కంపెనీలపై నియంత్రణ మండళ్ల వేటు వేయడం ఇది రెండోసారి. ఐపీఓలకు రుణాల మంజూరు సహా షేర్లు, డిబెంచర్లపై ఎలాంటి ఫైనాన్సింగ్ అందించకుండా జేఎం ఫైనాన్షియల్ ప్రొడక్ట్స్ లిమిటెడ్‌పై ఆర్‌బీఐ మంగళవారం నిషేధం విధించింది. గత ఏడాదిలో నాన్ కన్వర్టబుల్ డిబెంచర్ల (ఎన్‌సీడీ) ఇష్యూలపై జరిపిన తనిఖీల ఆధారంగా సెబీ తాజా ఆదేశాలు జారీ చేసింది. ఈ తనిఖీల్లో భాగంగా జేఎం ఫైనాన్షియల్ గ్రూప్ సంస్థల ఆధ్వర్యంలో జరిగిన డెట్ ఇష్యూలపై నియంత్రణ మండలి దృష్టి సారించింది. ఈ గ్రూప్ సంస్థలు డెట్ ఇష్యూలను నిర్వహించిన తీరు షాక్‌కు గురిచేసిందని సెబీ తన ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ వ్యవహారంపై దర్యాప్తును ఆరు నెలల్లో పూర్తి చేయనున్నట్లు తెలిపింది.

### అంతర్జాతీయ మార్కెట్లపై కోహన్స్ దృష్టి

హైదరాబాద్: ఔషధ, స్పెషాలిటీ కెమికల్స్ రంగంలో గట్టి పట్టున్న కోహన్స్ లైఫ్‌సైన్సెస్.. అంతర్జాతీయ మార్కెట్లపై దృష్టి పెడుతోంది. ఇందుకోసం సువెన్ ఫార్మాతో సహా దేశంలోని తన ఏడు ప్లాంట్లలో కాంట్రాక్ట్ డెవలప్‌మెంట్ అండ్ ఉత్పత్తి విభాగాలు (సీడీఎంఓ), ఏపీఐల ఉత్పత్తి సామర్థ్యాన్ని పెద్ద ఎత్తున విస్తరిస్తోంది. ప్రస్తుతం కంపెనీ అమ్మకాల్లో 35 శాతం సీడీఎంఓ విభాగం ద్వారా సమకూరుతోంది.


గత మూడేళ్లుగా ఈ అమ్మకాలు ఏటా సగటున 33 శాతం చొప్పున పెరుగుతున్నాయి. 'ప్రస్తుతం మేము యాంటీ బాడీ కాంజుగేట్ (ఏడీసీ) పేలోడ్ స్పేస్ సీడీఎంఓ సామర్థ్యాలపై దృష్టి పెట్టాం. ఈ విషయంలో మాకు అంతర్జాతీయ గుర్తింపు ఉంది. మా టర్నోవర్ వృద్ధిలోనూ సీడీఎంఓ విభాగం కీలక పాత్ర పోషిస్తోంది' అని కోహన్స్ లైఫ్‌సైన్సెస్ ఎండీ డాక్టర్ ప్రసాద రాజు తెలిపారు.

### నెఫ్రోప్లస్ చేతికి ఫిలిప్పీన్స్ కంపెనీ

హైదరాబాద్ కేంద్రంగా డయాలసిస్ సేవలందించే నెఫ్రోప్లస్.. ఫిలిప్పీన్స్‌లో తన కార్యకలాపాలను మరింత విస్తరిస్తోంది. ఇందుకోసం ఆ దేశంలో ఆరు డయాలసిస్ కేంద్రాలు నడుపుతున్న రెనల్ థెరపీ సొల్యూషన్స్ ఇంక్ (ఆర్‌టీఎస్ఐ) అనే కంపెనీని కొనుగోలు చేసింది. నెఫ్రోప్లస్ వ్యవస్థాపకుడు, సీఈఓ విక్రమ్ ఉప్పల సోషల్ మీడియా వేదికగా ఈ విషయం ప్రకటించారు. అయితే ఆర్‌టీఎస్ఐను ఎంతకు కొనుగోలు చేసిందనేది మాత్రం ఆయన వెల్లడించలేదు. 2020 అక్టోబరులోనూ నెఫ్రోప్లస్.. ఫిలిప్పీన్స్‌కు చెందిన రాయల్ కేర్ డయాలసిస్ సెంటర్స్ ఇంక్ (ఆర్‌సీడీసీ) ఈక్విటీలో మెజారిటీ వాటా కొనుగోలు చేసింది. తాజాగా ఆర్‌టీఎస్ఐ కొనుగోలుతో ఆ దేశంలో నెఫ్రోప్లస్ డయాలసిస్ కేంద్రాల సంఖ్య 27కు చేరింది. నెఫ్రోప్లస్ ఇప్పటికే భారత్‌తో పాటు నేపాల్, ఉజ్బెకిస్థాన్, ఫిలిప్పీన్స్ దేశాల్లోని 230 నగరాల్లో 385 కేంద్రాల ద్వారా డయాలసిస్ సేవలు అందిస్తోంది.

## స్వల్ప లాభాలతో.. సరికొత్త గరిష్ఠాలకు

### మార్కెట్ సూచీలు మరింత ముందుకు..



ముంబై: భారత స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు గురువారం ట్రేడింగ్‌లో తీవ్ర ఊగిసలాటలకు లోనైనప్పటికీ, చివరికి స్వల్ప లాభాలతో సరికొత్త జీవిత కాల గరిష్ఠాలకు చేరుకోగలిగాయి. ఒక దశలో సెన్సెక్స్ 159.18 పాయింట్లు పెరిగి 74,245.17 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును నమోదు చేసింది. ట్రేడింగ్ ముగిసే సరికి, 33.40 పాయింట్ల లాభంతో 74,119.39 వద్ద స్థిరపడింది. సూచికిది సరికొత్త గరిష్ఠ ముగింపు కూడా. నిఫ్టీ సైతం ఒక దశలో 51.6 పాయింట్లు పెరిగి 22,525.65 వద్ద ఇంట్రాడే రికార్డును, చివర్లో 19.50 పాయింట్ల లాభంతో 22,493.55 వద్ద ఆల్‌టైం గరిష్ఠ ముగింపును నమోదు చేసింది. అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల సంకేతాలు, విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల కొత్త పెట్టుబడుల దన్నుతో మెటల్, ఎఫ్ఎంసీజీ రంగ షేర్లలో జరిగిన కొనుగోళ్లు మార్కెట్ సూచీలను మరింత ముందుకు నడిపించాయి.

సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 20 లాభపడ్డాయి. టాటా స్టీల్ షేరు 3.90 శాతం ఎగబాకి సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. టాటా మోటార్స్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, బజాజ్ ఫిన్‌సర్వ్ షేర్లు రెండు శాతానికి పైగా పెరిగాయి. ఎం అండ్ ఎం మాత్రం అత్యధికంగా 3.68 శాతం క్షీణించింది. మార్కెట్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్, యాక్సిస్ బ్యాంక్ షేర్లు ఒక శాతానికి పైగా నష్టపోయాయి. కాగా, బీఎస్ఈలోని స్మాల్‌క్యాప్ సూచీ 0.70 శాతం, మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.39 శాతం లాభపడ్డాయి. రంగాలవారీ సూచీల్లో మెటల్, క్యాపిటల్ గూడ్స్, కమోడిటీస్, ఎఫ్ఎంసీజీ ఒక శాతం 1.36 శాతం వరకు పెరిగాయి.

### ముక్కా ప్రొటీన్ లిస్టింగ్ అదరహో

ఫిష్ మీల్, ఫిష్ ఆయిల్ తయారీ కంపెనీ ముక్కా ప్రొటీన్స్ లిస్టింగ్‌కు ఇన్వెస్టర్ల నుంచి భారీ స్పందన లభించింది. గురువారం కంపెనీ షేర్లు స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదయ్యాయి. ఐపీఓ ధర రూ.28తో పోలిస్తే, బీఎస్ఈలో కంపెనీ షేరు 57.14 శాతం ప్రీమియంతో రూ.44 వద్ద లిస్టయింది. తొలి రోజు ట్రేడింగ్ నిలిచేసరికి 50.92 శాతం లాభంతో రూ.42.26 వద్ద ముగిసింది. దాంతో కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.1,267.80 కోట్లుగా నమోదైంది. సోమవారంతో ముగిసిన ముక్కా ప్రొటీన్ ఐపీఓకు సైతం అపూర్వ స్పందన లభించింది. ఇష్యూ సైజుతో పోలిస్తే 136.89 రెట్ల బిడ్లు లభించాయి.

### బంగారం భగ భగ

మరో రూ.500 పెరిగిన ధర

తులం రూ.65,650కి చేరిక

ఈ వేసవిలో భానుడితో పాటు బంగారమూ భగ్గుమంటోంది. ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల పసిడి (24 క్యారెట్లు) రేటు గురువారం రూ.500 పెరిగి రూ.65,650కి ఎగబాకింది. దేశీయంగా బంగారం ధరల్లో సరికొత్త రికార్డు స్థాయిది. వెండి కూడా పరుగు తీస్తోంది. కిలో ధర రూ.400 పెరుగుదలతో రూ.74,900కు చేరుకుంది. అంతర్జాతీయంగా ఈ విలువైన లోహాలకు డిమాండ్ పెరగడమే ఇందుకు కారణం. ఇంటర్నేషనల్ మార్కెట్‌లో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ రేటు సరికొత్త ఆల్‌టైం రికార్డు స్థాయి 2,161 డాలర్లకు చేరుకుంది. సిల్వర్ 24.10 డాలర్ల వద్ద ట్రేడైంది. ఈ ఏడాదిలో ప్రామాణిక వడ్డీ రేట్లను తగ్గించే అవకాశం ఉందని అమెరికన్ సెంట్రల్ బ్యాంకైన ఫెడరల్ రిజర్వ్ చైర్మన్ జెరోమ్ పావెల్ సంకేతాలివ్వడంతో అంతర్జాతీయ ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులను బాండ్ల నుంచి క్రమంగా విలువైన లోహాల్లోకి మళ్లిస్తుండటం ప్రస్తుత బులియన్ ర్యాలీకి ప్రధాన కారణం. అంతర్జాతీయ మార్కెట్లో భౌగోళిక రాజకీయ అనిశ్చితులతో పాటు సెంట్రల్ బ్యాంక్‌లు బంగారం నిల్వలను పెద్ద ఎత్తున పెంచుకుంటూ పోతుండటం కూడా గోల్డ్ డిమాండ్ పెరుగుదలకు కారణమవుతున్నాయని బులియన్ విశ్లేషకులు అన్నారు. బంగారం ధరలు మున్ముందు మరింత ర్యాలీ తీయవచ్చని.. ఈ ఏడాది చివరినాటికి తులం రూ.72,000కు చేరుకోవచ్చని కొందరు భావిస్తున్నారు.

### నేడు మార్కెట్లకు సెలవు

మహా శివరాత్రి సందర్భంగా స్టాక్ ఎక్స్ఛేంజీలైన బీఎస్ఈ, ఎన్ఎస్ఈలకు శుక్రవారం సెలవు. బులియన్, ఫారెక్స్ మార్కెట్లు కూడా పనిచేయవు. సోమవారం నుంచి మార్కెట్లు యథావిధిగా పనిచేస్తాయి.

### 7సీస్ ఎంటర్‌టైన్‌మెంట్‌కు అవార్డు

హైదరాబాద్ కేంద్రంగా ఉన్న 7సీస్ ఎంటర్‌టైన్‌మెంట్ లిమిటెడ్ ప్రతిష్ఠాత్మక యానిమేటెడ్ ఫ్రేమ్స్ (బీఏఎఫ్) అవార్డును దక్కించుకుంది. అత్యుత్తమ భారతీయ గేమ్స్ విభాగం (మేడిన్ ఇండియా)లో ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఫిక్కీ).. 7సీస్‌కు చెందిన రోలర్ కోస్టర్ సిమ్యులేటర్ గేమ్‌కు ఈ అవార్డును అందజేసింది. బెస్ట్ ఇండియన్ గేమ్ విభాగంలో కంపెనీకి అవార్డు లభించటం ఎంతో సంతోషంగా ఉందని, ఇప్పటికే రోలర్ కోస్టర్ గేమ్ 20 లక్షలకు పైగా డౌన్‌లోడ్స్‌కు చేరుకుందని 7సీస్ ఎండీ ఎల్ మారుతి శంకర్ తెలిపారు.

### బీఈఎంఎల్‌తో డీసీఐ ఒప్పందం

విశాఖపట్నం (ఆంధ్రజ్యోతి): బెంగళూరుకు చెందిన భారత్ ఎర్త్ మూవర్స్ లిమిటెడ్ (బీఈఎంఎల్)తో డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (డీసీఐ) గురువారం ఒప్పందం కుదుర్చుకుంది. డ్రెడ్జర్లకు అవసరమైన విడి భాగాల తయారీ, అభివృద్ధితో పాటు దేశీయంగా డ్రెడ్జర్ల రూపకల్పన కోసం ఈ ఒప్పందం చేసుకున్నట్టు డీసీఐ ఎండీ, సీఈఓ కెప్టెన్ దివాకర్ తెలిపారు.

● హిల్టన్ మెటల్ ఫోర్జింగ్ లిమిటెడ్.. డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో రూ.42 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.2.1 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో పోల్చితే ఆదాయం 44%, లాభం 68% వృద్ధి చెందింది. కాగా కంపెనీ రైల్వే ఫోర్జ్‌డ్ వ్యాగన్ వీల్ వ్యాపారంపై దృష్టిని పెట్టడంతో పాటు వార్షిక స్థాపిత సామర్థ్యాన్ని 48,000 వీల్స్‌కు పెంచాలని భావిస్తోంది.

## త్వరలో మొబైల్స్ ఎగుమతులు రూ.4.96 లక్షల కోట్లకు..

### కేంద్ర ఐటీ, కమ్యూనికేషన్స్ మంత్రి అశ్వినీ వైష్ణవ్



న్యూఢిల్లీ: మొబైల్ ఫోన్ల ఎగుమతిలో భారత్ దూసుకుపోతోంది. గత ఏడాది మన దేశం నుంచి 1,100 కోట్ల డాలర్ల (సుమారు రూ.91,000 కోట్లు) విలువైన మొబైల్ ఫోన్లు ఎగుమతయ్యాయి. వచ్చే కొద్ది సంవత్సరాల్లో ఇది ఐదింతలకుపైగా పెరిగి 5,000 కోట్ల డాలర్ల నుంచి 6,000 కోట్ల డాలర్ల వరకు (ప్రస్తుత మారకం రేటు ప్రకారం సుమారు రూ.4.13 లక్షల కోట్ల నుంచి రూ.4.96 లక్షల కోట్లు) పెరిగే అవకాశం ఉంది. ఢిల్లీలో జరిగిన ఫిన్‌టెక్స్ సదస్సులో కేంద్ర ఐటీ, కమ్యూనికేషన్ల మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఈ విషయం ప్రకటించారు. ఇదే సమయంలో ఎలక్ట్రానిక్స్ రంగంలో ప్రస్తుతం 10 లక్షలుగా ఉన్న ఉద్యోగాల సంఖ్య కూడా 25 లక్షలకు చేరుతుందన్నారు. పదేళ్ల క్రితం మనకు అవసరమైన మొబైల్ ఫోన్లలో 98 శాతం దిగుమతి చేసుకుంటే, ఇప్పుడది ఒక శాతానికి పడిపోయిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. జీడీపీ పరంగా 2014లో ప్రపంచంలో 11వ స్థానంలో ఉన్న మన దేశం ప్రస్తుతం ఐదో స్థానానికి ఎదిగిందన్నారు. 2027 నాటికి భారత ఆర్థిక వ్యవస్థ ఐదు లక్షల కోట్ల డాలర్ల జీడీపీతో ప్రపంచంలోనే మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించనుందని వైష్ణవ్ తెలిపారు. కాగా ఆర్థిక చట్టాలు దేశ అభివృద్ధికి దోహదం చేసేలా ఉండాలన్నారు. వరుసగా మూడో విడత అధికారం చేపడితే ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉండే తయారీ రంగంపై ప్రత్యేక దృష్టి పెడతామన్నారు.

### ఎయిర్‌టెల్‌లో జీక్యూజీ పెట్టుబడులు

**0.8 శాతం వాటా రూ.5,849 కోట్లకు కొనుగోలు**

న్యూఢిల్లీ: హిండెన్‌బర్గ్ నివేదిక దెబ్బకు కుదేలైన సమయంలో అదానీ గ్రూప్ సంస్థల్లో పెట్టుబడులు పెట్టి అనతి కాలంలోనే భారీగా లాభపడిన ప్రవాస భారతీయ ఇన్వెస్టర్, జీక్యూజీ పార్ట్‌నర్స్ చీఫ్ రాజీవ్ జైన్ తాజాగా మరో ప్రముఖ భారత కంపెనీలో ఇన్వెస్ట్ చేశారు. ప్రైవేట్ రంగ టెలికాం కంపెనీ భారతీ ఎయిర్‌టెల్‌లో 0.8 శాతం వాటాను రూ.5,849 కోట్లకు దక్కించుకున్నారు. ఎయిర్‌టెల్ ప్రమోటర్ గ్రూప్ కంపెనీ సింగపూర్ టెలీకమ్యూనికేషన్స్ (సింగ్‌టెల్) నుంచి జీక్యూజీ ఈ వాటాను చేజిక్కించుకుంది. ఓపెన్ మార్కెట్లో బ్లాక్ డీల్స్ ద్వారా ఈ షేర్ల కొనుగోలు లావాదేవీ జరిగింది. 0.8 శాతం వాటాకు సమానమైన 4.9 కోట్ల షేర్లను సగటున ఒక్కొక్కటి రూ.1,193.70 చొప్పున జీక్యూజీ కొనుగోలు చేసింది. ఈ డీల్ తర్వాత ఎయిర్‌టెల్‌లో సింగ్‌టెల్ వాటా 29.8 శాతం నుంచి 29 శాతానికి తగ్గింది. భారతీ గ్రూప్ చైర్మన్ సునీల్ భారతీ మిట్టల్ కుటుంబం, సింగ్‌టెల్.. భారతీ టెలికాం లిమిటెడ్ సహ-ఇన్వెస్టర్లుగా ఉన్నారు.

### ఇండిగోలో వాటా విక్రయించనున్న గంగ్వాల్

**3.3 శాతం వాటా రూ.3,700 కోట్లకు విక్రయం**

న్యూఢిల్లీ: ఇండిగో ఎయిర్‌లైన్స్ మాతృసంస్థ ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ లిమిటెడ్‌లో సహ ప్రమోటర్ రాకేశ్ గంగ్వాల్ స్వల్ప వాటాను విక్రయించనున్నట్లు తెలిసింది. కంపెనీలో 3.3 శాతం వాటాకు సమానమైన 1.28 శాతం వాటా షేర్లను ఒక్కొక్కటి రూ.2,925 చొప్పున మొత్తం రూ.3,700 కోట్లకు విక్రయించనున్నట్లు సమాచారం. వచ్చే సోమవారం ఓపెన్ మార్కెట్లో బ్లాక్ డీల్స్ ద్వారా ఈ షేర్ల విక్రయం జరగనుంది. గురువారం ఎన్ఎస్ఈలో ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ షేరు 0.98 శాతం పెరిగి రూ.3,100 వద్ద ముగిసింది.

**బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)**

| | 24 క్యారెట్లు | 22 క్యారెట్లు | కేజీ వెండి |
|---|---|---|---|
| హైదరాబాద్ | 65,560 ▲ | 60,010 ▲ | 78,500 ▲ |
| ముంబై | 64,955 ▲ | 59,499 ▲ | 72,265 ▲ |

**ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)**

| | | | |
|---|---|---|---|
| 7వ తేదీ | | విజయవాడ | 463 |
| హైదరాబాద్ | 469 | విశాఖపట్నం | 475 |
| 8వ తేదీ | | వరంగల్ | 471 |
| చిత్తూరు | 523 | | |
| గోదావరి | 463 | డజను గుడ్లు రూ.72 | |

**ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్**

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 107 | గోదావరి | 114 |
| వరంగల్ | 107 | విజయవాడ | 114 |
| కరీంనగర్ | 107 | గుంటూరు | 114 |
| మహబూబ్‌నగర్ | 107 | ఒంగోలు | 114 |
| కర్నూలు | 107 | చిత్తూరు | 110 |
| విశాఖపట్నం | 113 | | |

# తిరుపతి.. హాట్ హాట్!

- అసెంబ్లీ సీటుకు గట్టి పోటీ
- జనసేన తరపున రేసులో టీడీపీ నేత గంటా నరహరి
- తాజాగా తెరపైకి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ
- బలమైన అభ్యర్థి కోసం పవన్ అన్వేషణ

అమరావతి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తిరుపతి అసెంబ్లీ సీటు హాట్ హాట్‌గా మారింది. టీడీపీతో పొత్తులో భాగంగా ఈ స్థానం జనసేన ఖాతాలోకి వెళ్లింది. ఆ పార్టీ టికెట్ కోసం తొలుత స్థానిక నేత కిరణ్ రాయల్, హరిప్రసాద్ ముందంజలో ఉన్నారు. అయితే వైసీపీ తరఫున ఎమ్మెల్యే, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి కొడుకు అభినయ్‌రెడ్డి బరిలో నిలవడంతో.. అయన్ను దీటుగా ఎదుర్కోగల.. అంగబలం, అర్థబలం ఉన్న అభ్యర్థి కోసం జనసేనాని పవన్ కల్యాణ్ అన్వేషణ ప్రారంభించారు. ఈ క్రమంలో టీడీపీ నేత గంటా నరహరి పేరుపై కసరత్తు జరుగుతోంది. ఆయన కూడా జనసేన సీనియర్ నేతలతో సంప్రదింపులు జరుపుతున్నారు. తాజాగా టీడీపీ మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ తెరపైకి వచ్చారు. పవన్ అపాయింట్‌మెంట్ కోసం ప్రయత్నాలు సాగిస్తున్నారు. చిత్తూరు వైసీపీ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు టికెట్ ఇస్తారని నిన్నటిదాకా ప్రచారం జరిగింది. కానీ గురువారం జనసేనలో చేరిన ఆయనకు.. సీటిచ్చే పరిస్థితి లేదని పవన్ స్పష్టత ఇచ్చారు. గతంలో ప్రజారాజ్యంలో పనిచేసి ప్రస్తుతం టీడీపీలో ఉన్న ఇద్దరు నేతలు గురువారం జనసేనానిని కలిశారు. వీరికి కూడా ఆయన ఎలాంటి హామీ ఇవ్వలేదు. కానీ స్థానిక పరిస్థితులు, గెలుపు అవకాశాలు, ఇతర అంశాలపై వారితో చర్చించారు. తిరుపతిలో జనసేన గెలిచి తీరాలని ఆయన గట్టి పట్టుదలతో ఉన్నారు. బలమైన అభ్యర్థి ఎంపికకు రెండ్రోజుల క్రితం ప్రత్యేకంగా సర్వే కూడా నిర్వహించారు. ప్రజారాజ్యంలో పనిచేసిన నాయకులు, కార్యకర్తలు, కాపు సంక్షేమ సంఘ నాయకులు, ప్రస్తుతం జనసేనలో క్రియాశీలంగా వారికి ఫోన్లు చేసి వారి వారి అభిప్రాయాలు తీసుకున్నారు.

## పోలీసులను అడ్డుపెట్టుకొని బతుకుతున్న జగన్

- బాధితుల కోసం 73062 99999 నంబర్‌తో కాల్ సెంటర్



అమరావతి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి ప్రజలపై నమ్మకం లేక పోలీసులను అడ్డుపెట్టుకొని ప్రతిపక్ష పార్టీలను అణచాలని చూస్తున్నారని తెలుగుదేశం, జనసేన పార్టీలు ఆరోపించాయి. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ గురువారం ఇక్కడ టీడీపీ కేంద్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. జనసేన పార్టీ కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బంది నివాసాలపై బుధవారం రాత్రి పోలీసులు జరిపిన దాడులు, చేసిన సోదాలను వారు తీవ్రంగా ఖండించారు. కేవలం ప్రతిపక్ష పార్టీల వారిని భయపెట్టడానికే ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. 'టీడీపీ, జనసేన కార్యకర్తలు, సోషల్ మీడియా వారియర్లకు అధికార పార్టీకి సంబంధించిన వారు ఫోన్లు చేసి బెదిరిస్తున్నారు. పోలీసులతో ఫోన్లు చేయించి స్టేషన్‌కు రావాలని పిలిపిస్తున్నారు. ఇటువంటి బెదిరింపులను పట్టించుకోవద్దు. స్టేషన్‌కు రావాలని చెప్పినా వెళ్లాల్సిన అవసరం లేదు. బెదిరింపులకు గురైన వారికి న్యాయ సహాయం ఇవ్వడానికి టీడీపీ కేంద్ర కార్యాలయంలో ప్రత్యేకంగా ఒక కాల్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నాం. 73062 99999 నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలు ఏమైనా ఉంటే చెప్పవచ్చు' అని అచ్చెన్న తెలిపారు.

## మచిలీపట్నం బరిలో మరో కృష్ణుడు!

- వైసీపీ లోక్‌సభ ఇన్‌చార్జిగా సింహాద్రి చంద్రశేఖర్
- అవనిగడ్డకే సింహాద్రి రమేశ్‌బాబు.. రెండు పేర్లతో పదో జాబితా

అమరావతి-ఆంధ్రజ్యోతి/అవనిగడ్డ, మార్చి7: మచిలీపట్నం లోక్‌సభ స్థానానికి మరో వైసీపీ అభ్యర్థి తెరపైకి వచ్చారు. ఇదివరకు అవనిగడ్డ పార్టీ ఇన్‌చార్జిగా ప్రకటించిన సింహాద్రి చంద్రశేఖర్‌ను ఇప్పుడు లోక్‌సభ బరిలో నిలిపారు. ఇప్పటిదాకా లోక్‌సభ ఇన్‌చార్జిగా ఉన్న అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేశ్‌బాబును తిరిగి అవనిగడ్డకే పంపారు. వీరిద్దరి పేర్లతో గురువారం రాత్రి వైసీపీ పదో జాబితాను విడుదల చేసింది. తొలుత రమేశ్‌ను లోక్‌సభ ఇన్‌చార్జిగా ప్రకటించినా.. ఆయన ఇప్పటిదాకా నియోజకవర్గంలో కాలుపెట్టలేదు. సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ కొద్ది రోజుల్లో రానున్న తరుణంలో లోక్‌సభ అభ్యర్థి జనంలోకి వెళ్లకపోతే పార్టీకి నష్టం జరుగుతుందని.. చంద్రశేఖర్ పేరును సీఎం జగన్ ఖరారు చేశారని వైసీపీ వర్గాలు చెబుతున్నాయి. చంద్రశేఖర్‌ను మాజీ మంత్రి పేర్ని నాని గురువారం తాడేపల్లి పార్టీ కార్యాలయంలో మీడియాకు పరిచయం చేశారు. తనకు అవకాశమిచ్చిన జగన్‌కు ధన్యవాదాలు తెలుపుతున్నట్లు చంద్రశేఖర్ తెలిపారు.

# 'చేయూత'లో ఎన్నికల మోత

- ప్రభుత్వ కార్యక్రమంలో చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లపై విసుర్లు
- జగన్ ప్రసంగం తీరుతో విసుగెత్తిన కార్యకర్తలు



అనకాపల్లి జిల్లా పిసినికాడలో జరిగిన బహిరంగ సభలో చేయూత నమూనా చెక్కును లబ్ధిదారులకు అందజేస్తున్న సీఎం జగన్



సీఎం ప్రసంగం ప్రారంభించిన ఐదు నిమిషాలకే ప్రాంగణం నుంచి బయటకు వచ్చేస్తున్న మహిళలు

అనకాపల్లి/కశింకోట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): 'వైఎస్ఆర్ చేయూత' పథకం నాలుగో విడత నిధుల విడుదల కార్యక్రమం ఆద్యంతం వైసీపీ ఎన్నికల సభలా సాగింది. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తన ప్రసంగంలో టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌లపై విమర్శలకే పరిమితం కావడంతో జనం విసుగు చెందారు. అనకాపల్లి మండలం పిసినికాడలో గురువారం 'వైఎస్ఆర్ చేయూత' నాలుగో విడత నిధులు విడుదల కార్యక్రమం నిర్వహించారు. సభకు జనం. తరలింపు కోసం సుమారు 250 బస్సులు, వెయ్యికి పైగా ఆటోలు వినియోగించారు. అయినా సభ అనుకున్న తీరున జరగలేదు. జాతీయ రహదారికి సమీపంలో ఇరుకైన ప్రదేశంలో కార్యక్రమం ఏర్పాటుచేయడంతో వివిధ ప్రాంతాల నుంచి తరలించిన జనం రోడ్లపైనే వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఇక...చేయూత నిధులు విడుదల కార్యక్రమం అని చెప్పి ఏర్పాటుచేసిన సభలో సీఎం జగన్ తన ప్రసంగంలో టీడీపీ అధినేత, జనసేన అధినేతలపై విమర్శలు చేయడానికే అధిక ప్రాధాన్యత ఇచ్చారు. అనకాపల్లి అసెంబ్లీ వైసీపీ అభ్యర్థి భరత్‌కుమార్‌ను చూపిస్తూ.. ఇతడిని గెలిపించాలని సీఎం పిలుపునివ్వడంతో వేదికపై ఉన్న అధికారులు ఇబ్బంది పడ్డారు. సభకు రాకపోతే 'చేయూత' నిధులు అందవంటూ స్థానిక వైసీపీ నేతలు, వలంటీర్లు బెదిరించి అనకాపల్లి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచీ లబ్ధిదారులను బస్సులు, ఆటోల్లో సభకు తీసుకువచ్చారు.

### ట్రాఫిక్ బలిగొన్న టీచరమ్మ ప్రాణం!

సీఎం సభకు 250 ఆర్టీసీ బస్సులు వినియోగించడంతో రోజువారీ ప్రయాణికులు, ముఖ్యంగా పరీక్షలు రాస్తున్న ఇంటర్ విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. అనకాపల్లిలో ఉమ్మలాడ కూడలి నుంచి పిసినికాడ వరకు మూడు కిలోమీటర్ల మేర జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలను నిలిపివేశారు. ఈ కారణంగా అత్యవసర వైద్యం అవసరమైన అల్లూరి జిల్లా కన్నంపేటలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల టీచర్ జంపా గౌంతమ్మ (32) గుండెపోటుతో మృతిచెందారు.

### వచ్చే 14 రోజులు 'చేయూత' నిధుల జమ: సీఎం

అనకాపల్లి/కశింకోట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళలకు తమ ప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పించిందని సీఎం జగన్ అన్నారు. అనకాపల్లి మండలం పిసినికాడలో జరిగిన కార్యక్రమంలో కంప్యూటర్ బటన్ నొక్కి 'చేయూత' నాలుగో విడత కింద రూ.5,060.49 కోట్ల సాయాన్ని విడుదల చేశారు. ఒక్కో లబ్ధిదారు ఖాతాలో రూ.18,750 చొప్పున జమ చేయనున్నట్టు చెప్పారు. తన 58 నెలల పాలనలో మరే రాష్ట్రం చేయని విధంగా మహిళలకు 'చేయూత' అందించామని, ఇప్పటికే మూడు విడతలుగా రూ.18,750 చొప్పున ప్రతి మహిళకు రూ.56,250లు చొప్పున అందజేశామని, నాలుగో విడతగా అందించే మొత్తంతో రూ.75 వేలు అందినట్టవుతుందన్నారు. రానున్న 14 రోజులపాటు 'చేయూత' నిధుల జమ కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ పేర్లు చెబితే మహిళలకు మోసాలు, దగా, వంచన గుర్తుకొస్తాయని వ్యాఖ్యానించారు. చంద్రబాబుకు విశ్వసనీయత లేదని, పవన్ వివాహ వ్యవస్థకే ఓ కళంకమన్నారు.

# ప్రిజనరీకి విజనా!

- ఇది ప్రపంచంలో ఎనిమిదో వింత: లోకేశ్
- జగన్ చూపిన డిజైన్.. కోడికత్తి గ్రాఫిక్
- శంఖారావంలో యువ నేత ఎద్దేవా






శ్రీసత్యసాయి జిల్లా మడకశిరలో జరిగిన శంఖారావం సభకు హాజరైన జనం, ప్రసంగిస్తున్న లోకేశ్


పుట్టపర్తి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ప్రిజనరీ జగన్‌కు విజన్ ఉందని చెప్పడం ప్రపంచ ఎనిమిదో వింతని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ దుయ్యబట్టారు. గంజాయి, ఇసుక అక్రమ రవాణాలో ఆయనకు విజన్ ఉందన్నారు. 'ఆయన గ్రాఫిక్స్‌తో కొత్త భవనాన్ని చూపించాడు. ఒక డిజైన్ చూపిస్తే నేనే ఆశ్చర్యపోయా. దానిపై ఆరాతీస్తే అది కోడికత్తి గ్రాఫిక్ అని తేలింది' అని ఎద్దేవా చేశారు. శంఖారావం యాత్రలో భాగంగా లోకేశ్ గురువారం శ్రీసత్యసాయి జిల్లాలో పర్యటించారు. హిందూపురం, మడకశిర, పెనుకొండ నియోజకవర్గాల పరిధిలో ఏర్పాటు చేసిన సభల్లో ప్రసంగించారు. 'జగన్ పాలనలో విశాఖలో బస్‌షెల్టర్ కట్టారు. అది గట్టిగా గాలి వీస్తే కూలిపోయింది. ఫ్లోటింగ్ బ్రిడ్జి కడితే ఒక్క రోజులోనే పోయింది. విశాఖకు పరిశ్రమలంటూ సీఎం రోతపత్రిక కార్యాలయం నుంచి గ్రాఫిక్స్ పంపుతున్నారు. కోడికత్తి తప్ప.. వైసీపీ పాలకులకు ఏం తెలుసు' అని మండిపడ్డారు. చిత్తూరు జిల్లాను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి లూటీ చేశారని, ఇప్పుడు శ్రీసత్యసాయి జిల్లాపై కన్నేశారని చెప్పారు. ఇక్కడ కూడా లూటీ చేస్తారని, ఇసుక, మద్యం, గనులు మొత్తం తీసుకెళ్తారని.. ఆయన ఇక్కడకు వస్తే తరిమికొట్టాలని పిలుపిచ్చారు. రాష్ట్రంలో 26 వేల మంది బీసీలపై దాడులు జరిగాయని, చట్టాన్ని ఉల్లంఘించి ఇబ్బంది పెట్టిన అధికారులను వదిలిపెట్టనని, అందరి పేర్లు రెడ్‌బుక్‌లో ఉన్నాయని.. అందులో మొదట జైలుకు పంపేది పాపాల పెద్దిరెడ్డినేనని స్పష్టం చేశారు. తనపై 22 కేసులు పెట్టారని, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ మొదలుకుని హత్యాయత్నం సెక్షన్ల కింద కూడా నమోదు చేశారని అన్నారు. అయినా ఏమీ చేయలేక పోయారని అన్నారు. టీడీపీ, జనసేన మధ్య చిచ్చుపెట్టేందుకు వైసీపీ పేటీఎం బ్యాచ్ ప్రయత్నిస్తోందని, దీనిని గుర్తించి రెండు పార్టీల శ్రేణులు తిప్పికొట్టాలని కోరారు. సైకో జగన్‌ను ఏపీ నుంచి తరిమికొట్టాలన్నారు.

### బాబాయ్‌ని లేపేసింది..!

సొంత తల్లికి, చెల్లికి న్యాయం చేయని సీఎం జగన్.. ప్రజలకు ఏం చేస్తారని లోకేశ్ ప్రశ్నించారు. బాబాయ్ వివేకానందరెడ్డిని లేపేసింది జగన్‌రెడ్డి, ఎంపీ అవినాశ్‌రెడ్డి, భాస్కరరెడ్డి కాదా అని నిలదీశారు. 'ముందు గుండెపోటన్నారు. తర్వాత శవానికి కుట్లు వేశారు. హడావుడిగా అంత్యక్రియలు చేయాలని చూశారు. అప్పట్లో చంద్రబాబు చేతిలో గొడ్డలి పెట్టి నారాసుర రక్తచరిత్ర అన్నారు. అది అబద్ధమని తేలిపోయింది. ఇప్పుడు నిజం బయటకు వచ్చింది' అని అన్నారు. జగన్ చెల్లి సునీత నిజాలను బహిర్గతం చేశారని చెప్పారు. హంతకులు పాలకులయ్యారని, జగన్‌కి ఓటు వేయవద్దని ఆయన ప్రజలకు పిలుపిచ్చారు. 'టీడీపీ అధికారంలోకి రాగానే 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తాం. ప్రతి ఇంటికీ ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తాం. ప్రతి రైతుకు ఆర్థిక సాయంగా ఏడాదికి రూ.20 వేలు చెల్లిస్తాం. 18 ఏళ్ల నుంచి 59 ఏళ్ల మహిళలకు నెలకు రూ.1500 చొప్పున ఇస్తాం. ఎన్నికలకు ముందు తనకు బీసీలే బ్యాక్ బోన్ అని చెప్పిన జగన్.. అదే బీసీల వెన్ను విరిచారని మండిపడ్డారు. తొలిరోజు పర్యటన అనంతరం లోకేశ్ రాత్రికి పుట్టపర్తి చేరుకుని బసచేశారు. శుక్రవారం పుట్టపర్తి, కదిరి నియోజకవర్గాల్లో శంఖారావం సభల్లో పాల్గొంటారు.

# 17న చిలకలూరిపేటలో ఉమ్మడి సభ





- సంయుక్తంగా మేనిఫెస్టోను విడుదల చేయనున్న అధినేతలు

అమరావతి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మేనిఫెస్టో విడుదలకు ఈ నెల 17న చిలకలూరిపేటలో భారీ బహిరంగ సభ నిర్వహించాలని తెలుగుదేశం, జనసేన పార్టీలు నిర్ణయించాయి. ఈ సభను చరిత్రాత్మక స్థాయిలో లక్షల మందితో నిర్వహిస్తామని, రాష్ట్ర చరిత్రలో ఇదొక మైలురాయి సభగా నిలిచిపోతుందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ ప్రకటించారు. గురువారం వారిద్దరూ ఇక్కడ టీడీపీ కేంద్ర కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'ఇరు పార్టీల అధినేతలు... చంద్రబాబు, పవన్ కల్యాణ్ సమావేశమై చిలకలూరిపేటలో భారీ సభ నిర్వహణకు నిర్ణయం తీసుకొన్నారు. మేనిఫెస్టో విడుదలతో పాటు ఇరు పార్టీల సంయుక్త భవిష్యత్ కార్యాచరణను ఇందులో ప్రకటిస్తారు. టీడీపీ, జనసేన పార్టీలు పొత్తు పెట్టుకొన్న తర్వాత ఇరు పార్టీలు కలిసి 99 సీట్లకు అభ్యర్థులను ప్రకటించాయి. దీంతో వైసీపీ నేతలు రెండు పార్టీల మధ్య చిచ్చు పెట్టడానికి నానా రకాల ప్రయత్నాలు చేస్తున్నారు. అది వైసీపీ తరం కాదు. చిలకలూరిపేట సభకు రెండు పార్టీల కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని మా విజ్ఞప్తి' అని అచ్చెన్నాయుడు అన్నారు. 'సూపర్ సిక్స్ పేరుతో గతంలో పేదల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఆరు హామీలు ప్రకటించాం. చిలకలూరిపేట సభలో ప్రజల అభివృద్ధి కోసం మరో సూపర్ సిక్స్ హామీలు ప్రకటించబోతున్నాం' అని నాదెండ్ల మనోహర్ చెప్పారు. కాగా, ఆర్టీసీ ఎండీ వైఖరిపై అచ్చెన్న తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. వైసీపీ సభలకు ఆర్టీసీ బస్సులు ఇచ్చి ప్రతిపక్ష పార్టీల సభలకు ఇవ్వకపోవడంపై 'ఆర్టీసీ ఎండీకి వార్నింగ్ ఇస్తున్నాం. మేం ఎంత డబ్బు కట్టడానికైనా సిద్ధం. మాకు బస్సులు ఎందుకివ్వరు? దీనిపై ఎన్నికల కమిషన్‌కు, ఆర్టీసీ ఎండీకి లేఖ రాస్తాం' అన్నారు.

### పవన్ కూడా ఢిల్లీ వెళ్తున్నారు...

బీజేపీతో ఢిల్లీలో జరిగే చర్చల్లో టీడీపీతోపాటు జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ కూడా వెళ్తున్నారని మనోహర్ చెప్పారు. గురువారం రాత్రి ఆయన బయలుదేరి వెళ్తున్నారని తెలిపారు. 'ఈ పొత్తు కుదరకూడదని 15 రోజుల నుంచి కొందరు విశ్వ ప్రయత్నం చేస్తున్నారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా మంచే జరుగుతుంది. జనసేన పార్టీ ఎన్డీయే కూటమిలో భాగస్వామి. అందుకే టీడీపీని కూడా చేర్చాలని పనిచేసింది' అన్నారు. అన్నీ అనుకూలిస్తే చిలకలూరిపేట సభలో బీజేపీ నేతలు కూడా పాల్గొనే అవకాశం ఉందని పేర్కొన్నారు.

# గురజాలలోనే యరపతినేని!

- నరసరావుపేట బరిలో అరవిందబాబు
- ఆలూరు నుంచి వీరభద్రగౌడ్
- చిత్తూరు లోక్‌సభకు దగ్గుమళ్ల
- టీడీపీ నాయకత్వం ఖరారు!



యరపతినేని

అమరావతి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): అభ్యర్థుల ఎంపిక కసరత్తులో తెలుగుదేశం పార్టీ వేగం పెంచింది. ఖరారైన అభ్యర్థులకు అంతరంగికంగా సంకేతాలు పంపి పనిచేసుకోవాలని సూచిస్తోంది. పల్నాడు జిల్లా గురజాలలో మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావును తిరిగి నిలపాలని నిశ్చయించారు. ఒక దశలో ఆయన్ను నరసరావుపేట అసెంబ్లీ స్థానానికి పంపబోతున్నారని ప్రచారం జరిగింది. కానీ, గురజాలలో ఆయనపై అసంతృప్తితో ఉన్న కొందరు నేతలతో చంద్రబాబు మాట్లాడి సర్దుబాటు చేశారు. నియోజకవర్గంలో పని చేసుకోవాలని యరపతినేనికి సూచించినట్లు సమాచారం. నరసరావుపేటలో ప్రస్తుత ఇన్‌చార్జి డాక్టర్ అరవింద బాబువైపే టీడీపీ అధిష్ఠానం మొగ్గు చూపుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. కర్నూలు జిల్లా ఆలూరు అభ్యర్థిగా స్థానిక నేత వీరభద్ర గౌడ్ ఖరారైనట్లు సమాచారం. ఇంతకు ముందు ఈ సీటుకు కోట్ల సుజాత ఇన్‌చార్జిగా ఉన్నారు. ఆమె భర్త కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డికి ఈసారి డోన్ టికెట్ ఇవ్వాలని పార్టీ అధిష్ఠానం నిర్ణయం తీసుకోవడంతో ఆమె ఆలూరు నుంచి పక్కకు జరిగారు. చిత్తూరు లోక్‌సభ అభ్యర్థిగా దగ్గుమళ్ల ప్రసాదరావు ఖరారైనట్లు టీడీపీ వర్గాలు తెలిపాయి. ఆయన ఆదాయపు పన్ను శాఖలో ఉన్నత స్థానంలో పనిచేసి రిటైరయ్యారు. గుంటూరు జిల్లావాసి అయిన ఆయన బాపట్ల లోక్‌సభ సీటును ఆశిస్తూ వచ్చారు. ఆ సీటును ఎస్సీల్లో మాదిగ ఉప కులానికి ఇవ్వాలని టీడీపీ నాయకత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో దగ్గుమళ్లను చిత్తూరు పంపాలని నిర్ణయించారు. ఆయన కూడా అందుకు అంగీకరించారు. బాపట్ల లోక్‌సభ అభ్యర్థిపై ఇంకా నిర్ణయం జరగలేదు.

### నేతలకు అచ్చెన్నాయుడు బుజ్జగింపులు

పొత్తులో జనసేనకు ఇచ్చిన నియోజకవర్గాలకు చెందిన కొందరు టీడీపీ నేతలను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు గురువారం ఇక్కడకు పిలిపించి మాట్లాడారు. తాడేపల్లిగూడేనికి చెందిన వలవల మల్లికార్జునరావు (బాబ్జీ), తిరుపతి మాజీ ఎమ్మెల్యే మన్నూరు సుగుణమ్మ, తుడా మాజీ చైర్మన్ గొల్ల నరసింహ యాదవ్, అనంతపురం మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్‌చౌదరి, పాలకొండ మాజీ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ తదితరులు వీరిలో ఉన్నారు. 'ఒక పార్టీతో పొత్తు కుదుర్చుకున్నప్పుడు కొన్ని సీట్లు ఇవ్వాల్సి వస్తుంది. అనేక సమీకరణల ఆధారంగా సీట్ల ఎంపిక జరుగుతుంది. దీనికి మీరు సహకరించాలి. రాజకీయంగా మీ ప్రయోజనాలకు ఇబ్బంది లేకుండా పార్టీ చూసుకుంటుంది. గెలిపించి తీసుకొస్తే పార్టీ నాయకత్వం వద్ద మీ విలువ పెరుగుతుంది. అర్థం చేసుకుని సహకరించండి' అని ఆయన విజ్ఞప్తి చేశారు. వారు కూడా అంగీకారం తెలిపారని టీడీపీ వర్గాలు తెలిపాయి. కర్నూలు జిల్లా మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి తిక్కారెడ్డి కూడా అచ్చెన్నాయుడిని కలిశారు. అక్కడ ఆయన రాఘవేందర్ నుంచి పోటీ ఎదుర్కొంటున్నారు. తనకే అవకాశం కల్పించాలని తిక్కారెడ్డి కోరినట్లు సమాచారం.

# జగన్ గుర్తుపెట్టుకో!

## ఇది 2009 కాదు.. 2024

- రౌడీయిజానికి భయపడే వ్యక్తిని కాదు: పవన్



పవన్ కల్యాణ్ సమక్షంలో జనసేన పార్టీలో చేరిన చిత్తూరు వైసీపీ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

అమరావతి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): 'రాయలసీమ అంటే చదువుల నేల. చక్కటి పంటలు పండే ప్రాంతం. అలాంటి ప్రాంతం నేడు కొంత మంది వ్యక్తుల కబంధ హస్తాల్లో బందీ అయింది' అని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. గురువారం చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తన అనుచరులతో కలసి జనసేన పార్టీలో చేరారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో పవన్ వీరందరికీ పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. వచ్చే ఎన్నికల్లో జనసేన గెలుపునకు కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో మనందరం కలిసికట్టుగా పోరాటం చేయకపోతే మళ్లీ వైసీపీ అధికారంలోకి వస్తుందని, అదే జరిగితే ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం సీమ యువత పక్క రాష్ట్రాలకు, పక్క దేశాలకు వలసలు పోవాల్సిన దుస్థితి దాపురిస్తుందని హెచ్చరించారు. 'సీమలో సంఖ్యాబలం కలిగిన కులాలు చాలా ఉన్నా వైసీపీ నాయకులకు భయపడుతున్నామంటే దానికి కారణం మనలో ఐక్యత లేకపోవడమే. ఇదే కొనసాగితే జీవితాంతం జగన్ మనుషులకు ఊడిగం చేయాల్సి ఉంటుంది. ఈ పరిస్థితి మారాలి. 2008కు ముందు రాయలసీమలో తెగింపు చూశా. ఇప్పుడు భయపడే స్థాయికి అక్కడి ప్రజలు వెళ్లిపోయారు. అయితే జగన్ గుర్తుపెట్టుకోవాల్సింది ఇది 2009 కాదు.. 2024 అని. (అప్పట్లో ప్రజారాజ్యం పార్టీ నాటి పరిస్థితులను పరోక్షంగా పవన్ ప్రస్తావించారు). నేను రౌడీయిజం, గూండాయిజం, దాష్టీకాలకు భయపడే వ్యక్తిని కాదు. 2019 ఎన్నికల్లో ఓడిపోయి మంగళగిరి పార్టీ ఆఫీసులో కూర్చున్న నన్ను కలవడానికి కర్నూలు నుంచి సుగాలి ప్రీతి తల్లి వచ్చారు. 'అన్నా... సీమలో బలం ఉన్నవాడిదే రాజ్యం. సామాన్యులు బతికే పరిస్థితుల్లేవు. నా బిడ్డపై అత్యాచారం చేసి, హత్య చేసినా అడిగే దిక్కు లేదు. పోలీసులు కేసు తీసుకోవడం లేదు' అని కన్నీరు పెట్టుకున్నారు. నేనొస్తే న్యాయం జరుగుతుందని వేడుకున్నారు. రెండు చోట్ల ఓడిపోయిన నేను వెళ్తే ఏం జరుగుతుందని అనుకున్నా. కానీ కొన్ని రోజుల తర్వాత కర్నూలు వెళ్తే.. లక్షలాది మంది యువత తరలి వచ్చారు. సీమలో పోరాటం చేస్తే జనం కదిలి వస్తారు. అలాగే కొట్టే సాయి అనే జనసైనికుడిపై పోలీస్ అధికారిణి అకారణంగా చేయి చేసుకుంది. వెంటనే తిరుపతి వచ్చి అండగా నిలబడ్డాం. 2008 నుంచి ఆరణి శ్రీనివాస్ తెలుసు. అప్పటి రాజకీయ ప్రస్థానంలో మనతో పాటు కలిసి నడిచిన వ్యక్తి. దురదృష్టవశాత్తు అప్పట్లో కొద్ది ఓట్ల తేడాతో ఓడిపోయారు. ఈమధ్య ఆయన కలిసినప్పుడు ఎన్నికల ముందువచ్చారు కాబట్టి ఎటువంటి హామీ ఇవ్వలేనని స్పష్టంగా చెప్పా. ఆయన మాత్రం గతంలో మీతో చేయాలనుకున్న ప్రయాణం ఇప్పుడు చేస్తానన్నారు. అటువంటి మనస్తత్వం ఉన్న వ్యక్తి పార్టీలోకి రావడాన్ని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను. వైసీపీ నిజంగానే ప్రజాస్వామ్యబద్ధమైన పార్టీ అయితే ఆ పార్టీ కోసం నిలబడిన వ్యక్తినే ఎందుకు వేధిస్తారు? ఎమ్మెల్యే అయితే కారు ఇస్తాం... గన్‌మెన్‌ను ఇస్తాం తప్ప నిర్ణయాలు తీసుకునే అధికారం మాత్రం ఇవ్వమంటున్నారు.. ఇంతకాడికి అధికారం ఎందుకు..?' అని పవన్ ప్రశ్నించారు.

### అండగా నిలిచేవారు కావాలి

'ఎర్రచందనం స్మగ్లర్లు, శ్రీవారి సొత్తు కాజేసే వాళ్లను భుజాలపై మోయాలంటే ఎలా? రౌడీయిజానికి రాయలసీమ పెట్టింది పేరులా వైసీపీ నాయకులు మార్చేశారు. సీమలో కొంతమంది నాయకులు అయితే మా నియోజకవర్గానికి ఎవరైనా వచ్చి రాజకీయాలు చేస్తే చూస్తూ ఊరుకోం అన్నట్లు మాట్లాడుతున్నారు. ఇలాంటి వాళ్లను తరిమికొట్టడానికి యువత వ్యూహాలు రచించాలి. వైసీపీ నాయకుడికి సోషల్ మీడియాలో కేజీఎఫ్, పుష్ప స్థాయిలో ఎలివేషన్లు ఇస్తున్నారు. చిన్న సంస్కృత శ్లోకం చెప్పలేని ఆయన, పంచ్ డైలాగులు కొడుతున్నారు' అని పవన్ ఎద్దేవా చేశారు. 'పవన్ అక్కడ పోటీచేయాలి, ఇన్ని సీట్లు డిమాండ్ చేయాలని సలహాలు ఇచ్చేవాళ్లు వైసీపీలోకి వెళ్లిపోయారు. ఈరోజు మనకు కావాల్సింది అవకాశవాదులు కాదు. అండగా నిలబడే వ్యక్తులు. ప్రాణాలకు తెగించి రాజకీయాల్లోకి వచ్చాను. తెలుగు జాతిని నా కుటుంబం అనుకొని వచ్చాను. ఒక్కసారి అండగా నిలబడండి. అభివృద్ధి అంటే ఎలా ఉంటుందో చేసి చూపిస్తాం. పోలీసులు ఎలాంటి సెర్చ్ వారెంట్ లేకుండా జనసేన సిబ్బంది నివసించే అపార్ట్‌మెంట్‌లోకి చొరబడి సోదాలు చేశారు. వైసీపీ నాయకులకు కొమ్ముకాస్తూ పోలీసులు అప్రజాస్వామికంగా వ్యవహరించారు. మీరు చేసిన పని అంత తేలిగ్గా మరిచిపోం. వచ్చేది జనసేన-టీడీపీ ప్రభుత్వమే. మా ప్రభుత్వంలో తప్పు చేసినవారు ఎంతటి స్థాయి వ్యక్తి అయినా శిక్షిస్తాం' అని పవన్ హెచ్చరించారు. వైసీపీ ఎంతోమంది నాయకులను నమ్మించి మోసం చేసిందని, తానూ బాధితుడినేనని ఎమ్మెల్యే ఆరణి చెప్పారు. ఆయనతో పాటు వైసీపీ నాయకులు అరణి శివకుమార్, బాలాజీ తదితరులు జనసేనలో చేరారు.

# ఎన్నికల షెడ్యూల్‌కు ముందే రోజా తాయిలాలు!

- నగరిలో టీచర్లకు చీరలు, కానుకలు

తిరుపతి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల షెడ్యూలు విడుదలయ్యాక తాయిలాల పంపిణీకి అడ్డంకులుంటాయని భావించారో ఏమో.. నగరి నియోజకవర్గంలో మంత్రి రోజా ఇప్పుడే తాయిలాల పంపిణీకి శ్రీకారం చుట్టారు. గురువారం పుత్తూరులోని షాదీ మహల్‌కు నియోజకవర్గంలోని ఉమెన్స్‌డే సందర్భంగా ప్రభుత్వ మహిళా టీచర్లందరినీ రప్పించారు. వారికి చీరలు, గిఫ్ట్ బాక్సులు అందజేశారు. హాజరుకాని ఉపాధ్యాయినులపై చర్యలుంటాయని అధికారులు బెదిరించడంతో వారంతా తరలివచ్చారు. అలాగే బుధవారం నగరిలోని తన నివాసానికి నియోజకవర్గవ్యాప్తంగా ఉన్న మీడియా ప్రతినిధులను కుటుంబాలతో సహా రోజా ఆహ్వానించారు. ఎందుకు పిలిచారో తెలిసినందున కొందరు విలేకరులు ముఖం చాటేశారు. మరికొందరు మాత్రం వెళ్లారు. వారికి మంత్రి టిఫిన్ పెట్టించి.. పంచె, టవల్, చీర, స్వీట్ బాక్సు, గిఫ్ట్ బాక్సు అందజేశారు. నగదు కవర్లు కూడా అందజేశారని ప్రచారం జరుగుతోంది. మెప్మా, వెలుగు సిబ్బందిని కూడా ఆహ్వానించి చీరలు, గిఫ్ట్ బాక్సులు, స్వీట్ బాక్సులతో పాటు సెంటిమెంటుగా గాజులు కూడా పంపిణీ చేసినట్లు సమాచారం. ఎన్నికలవేళ మద్దతు కోసం మంత్రి పడరాని పాట్లు పడుతున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

హోదాపై ఏపీకీ, ఫ్యామిలీలో నాకూ

# జగన్ వెన్నుపోటు

- హోదా సాధన ప్రతిజ్ఞ సభలో షర్మిల భావోద్వేగం



భావోద్వేగంతో కన్నీరు పెట్టిన షర్మిల

అమరావతి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక హోదా అంశంలో తల్లిలాంటి ఆంధ్రప్రదేశ్‌కూ, కుటుంబంలో తనకూ సీఎం జగన్ వెన్నుపోటు పొడిచారని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. రాష్ట్రాన్ని మోసం చేసిన బీజేపీ, ఆ పార్టీకి మద్దతు ఇస్తున్న జగన్... ఫోర్ ట్వంటీలేనన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా లేకపోవడాన్ని జీర్ణించుకోలేకపోతున్నానంటూ షర్మిల భావోద్వేగానికి గురై కన్నీళ్లు పెట్టుకున్నారు. దీంతో, రాష్ట్ర కాంగ్రెస్ నేతలు ఒక్కసారిగా చలించిపోయారు. షర్మిలను అనునయించారు. ఆగ్రహంతో ఊగిపోతూ 'జగన్ డౌన్ డౌన్' అంటూ నినాదాలు చేశారు. 'షర్మిల సింహం' అంటూ బిగ్గరగా అరిచారు. మంగళగిరిలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసే అసెంబ్లీ, లోక్‌సభ ఆశావహులతో ఏర్పాటుచేసిన ప్రత్యేక హోదా ప్రతిజ్ఞ సభలో ఈ దృశ్యాలు కనిపించాయి. ప్రత్యేక హోదా సాధన కోసం కట్టుబడి ఉంటామంటూ అందరితో షర్మిల ప్రతిజ్ఞ చేయించారు. విభజన పూర్తయి పదేళ్లయినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏపీకి న్యాయం చేయలేకపోయాయన్నారు. విభజన హామీలు, ప్రత్యేక హోదా పూర్తి కాకపోవడంతో ఏపీకి రూ.12నుంచి 15 లక్షల కోట్ల మేర నష్టం జరిగిందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాష్ట్రానికి ఇంత అన్యాయం చేస్తే ఎవరూ పోరాటం చేయడం లేదని షర్మిల ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యేక హోదా అంశాన్ని మరిచిపోయేలా అప్పట్లో టీడీపీ ప్రభుత్వం, ఇప్పుడు జగన్ చేశారని అసహనం వ్యక్తం చేశారు. రాష్ట్రానికి ఇదేం ఖర్మని వాపోయారు. రాష్ట్రంలో ఒక్క ఎంపీ, ఎమ్మెల్యే సీటు గెలవకపోయినా, రాష్ట్ర ప్రభుత్వాన్ని బీజేపీయే పాలిస్తోందని షర్మిల అన్నారు. ఒక్క రాజధానికే దిక్కులేదుగానీ మూడు రాష్ట్రాలు కడతారట అంటూ జగన్‌ను ఉద్దేశించి ఎద్దేవా చేశారు. రాజధాని లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను మార్చేశారని మండిపడ్డారు. హోదా రాలేదని.. పోలవరం పూర్తికాలేదని, రైల్వేజోన్ లేదంటూ గత ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం వైఫల్యాలను ఎండగట్టారు. ఇన్నేళ్లలో విభజన హామీల్లో ఒక్కటీ నెరవేరలేదన్నారు. బీజేపీ అంటే - బాబు జగన్ పార్టీగా మారిపోయిందని షర్మిల వ్యాఖ్యానించారు. "ప్రత్యేక హోదాయే ఏపీకి ఊపిరి. ఉద్యమాలు జరగకపోతే హోదా రాదు. ఏపీకి ప్రత్యేక హోదా కోసం కాంగ్రెస్ పోరాడుతుంది" అని షర్మిల ప్రకటించారు.

## ఎస్‌బీఐ మోదీ బ్యాంకు కాదు

- ఎలక్టోరల్ బాండ్ల వివరాలు బహిర్గతం చేయాలి: షర్మిల

విజయవాడ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): 'ఎస్‌బీఐ మోదీ బ్యాంకు కాదు. అది ప్రజల బ్యాంక్' అని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల వ్యాఖ్యానించారు. మోదీని, బీజేపీని కాపాడేందుకు ఎస్‌బీఐ ఎత్తులు వేస్తోందని ధ్వజమెత్తారు. ఎలక్టోరల్ బాండ్ల వివరాలను ఎస్‌బీఐ తక్షణమే బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. విజయవాడ గాంధీనగరంలోని ఎస్‌బీఐ వద్ద గురువారం ఆమె ధర్నా చేపట్టారు. ఎలక్టోరల్ బాండ్ల ద్వారా ఏయే పార్టీకి ఎంతెంత విరాళాలు వెళ్లాయన్న విషయం బహిర్గతం చేయాలని సుప్రీంకోర్టు కొద్దిరోజుల క్రితం ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఇప్పటి వరకు ఎస్‌బీఐ ఆ పని చేయలేదని విమర్శించారు. ఈడీ, సీబీఐ వంటి సంస్థలను ఉపయోగించి కార్పొరేట్ కంపెనీలపై దాడులు చేయించి తర్వాత వాటిని దారికి తెచ్చుకుందని బీజేపీపై మండిపడ్డారు. వారు దారికి రాగానే రూ. కోట్లు ఎలక్టోరల్ బాండ్ల రూపంలో విరాళాలుగా తీసుకుందన్నారు. దీన్ని రహస్యంగా ఉంచాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. ఎస్‌బీఐ ప్రజల బ్యాంకుగా కాకుండా మోదీ బ్యాంకుగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఈడీ, సీబీఐ మోదీ సంస్థలు కాదని, ప్రభుత్వ సంస్థలని చెప్పారు. ఈ బాండ్ల వివరాలను ఎందుకు బయటపెట్టడం లేదో ఎస్‌బీఐ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మోదీని రక్షించడానికే ఎస్‌బీఐ ఈ వివరాలను బయట పెట్టడానికి జూన్ వరకు సమయం కావాలని అడిగిందన్నారు. కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రులు పల్లంరాజు, జేడీ శీలం తదితరులు పాల్గొన్నారు.

## స్వేచ్ఛా ప్రపంచంలోకి సాయిబాబా

» నాగ్‌పూర్ జైలు నుంచి విడుదల



నాగ్‌పూర్, మార్చి 7: మాజీ ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబ నాగ్‌పూర్ సెంట్రల్ జైలు నుంచి విడుదలయ్యారు. మావోయిస్టులతో సంబంధాలున్నాయనే కేసులో బాంబే హైకోర్టు రెండ్రోజుల కిందే ఆయనను నిర్దోషిగా తీర్పునిచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఆయన గురువారం జైలు నుంచి విడుదలై స్వేచ్ఛా ప్రపంచంలోకి అడుగుపెట్టారు. జైలు బయట వేచిచూస్తున్న తన కుటుంబ సభ్యులను కలుసుకున్నారు. ఈ సందర్భంగా సాయిబాబ మీడియాతో మాట్లాడుతూ.. 'ఇంత క్రూరమైన జైలు జీవితం అనుభవించి ప్రాణాలతో బయటకు రావడం నిజంగా ఆశ్చర్యంగా ఉంది. వీల్‌చైర్ నుంచి కదల్లేకపోయాను. సొంతంగా కనీసం టాయిలెట్‌కు కూడా వెళ్లలేని పరిస్థితి. జైల్లో నరకం అనుభవించాను' అని ఆవేదన చెందారు. తనపై పెట్టిన కేసును ఓ కల్పిత కేసుగా కొట్టిపారేశారు. 'సాక్ష్యాలు, ఆధారాలు లేకుండా అన్యాయంగా మాపై కేసులు పెట్టారు. ఉన్నత న్యాయస్థానం ఇదే విషయాన్ని చెప్పింది. దాదాపు 10 ఏళ్లు.. నన్ను, మరికొందరిని జైల్లో బంధీ చేశారు. ఆ సమయాన్ని తిరిగి ఎవరిస్తారు..?' అని ప్రశ్నించారు. 'నా ఆరోగ్యం చాలా క్షీణించింది. నేను ఇప్పుడు ఎక్కువగా మాట్లాడలేను. వైద్య చికిత్స తర్వాత మీతో అన్ని విషయాలు మాట్లాడుతా..' అని చెప్పారు.

## 'సీస్పేస్'.. కేరళ సర్కారు ఓటీటీ ప్లాట్‌ఫామ్

న్యూఢిల్లీ, మార్చి 7: కేరళ ప్రభుత్వం ఓటీటీ(ఓవర్ ద టాప్) రంగంలో అడుగుపెట్టింది. దేశంలోనే తొలిసారిగా సీస్పేస్ పేరిట ఓ.. ఓటీటీ ప్లాట్‌ఫామ్‌ను గురువారం ప్రారంభించింది. రాష్ట్ర సీఎం పినరయి విజయన్ చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది. దీంతో భారతదేశంలో ఓ ప్రభుత్వం ఆధ్వర్యంలో పనిచేసే తొలి ఓటీటీగా సీస్పేస్ నిలిచింది. కేఎస్ఎఫ్‌డీసీ(కేరళ స్టేట్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) నేతృత్వంలోని సీస్పేస్‌లో ప్రస్తుతం 35 సినిమాలు, ఆరు డాక్యుమెంటరీలు, ఓ షార్ట్ ఫిలిం ప్రేక్షకులకు అందుబాటులో ఉన్నాయి. ఈ కంటెంట్‌ను చూడాలంటే ప్రేక్షకులు ఒక్కో సినిమాకు రూ.75 చొప్పున చెల్లించాలి.

# 370 రద్దుతో సంకెళ్లు తెగాయ్!

## స్వేచ్ఛావాయువులు పీలుస్తున్న జమ్మూకశ్మీరు: ప్రధాని.. అభివృద్ధిలో కొత్త శిఖరాలకు చేరుతోంది

» రాష్ట్రాన్ని 2 కేంద్రపాలిత ప్రాంతాలు చేశాక తొలిసారి శ్రీనగర్‌లో పర్యటన

» రూ.5 వేల కోట్ల ప్రాజెక్టులకు శ్రీకారం

శ్రీనగర్, మార్చి 7: రాజ్యాంగంలోని 370 అధికరణ రద్దుతో జమ్మూకశ్మీరు సంకెళ్లు తెగిపోయాయని ప్రధాని మోదీ అన్నారు. స్వేచ్ఛావాయువులు పీలుస్తోందని.. అభివృద్ధిలో నూతన శిఖరాలను అందుకుంటోందని చెప్పారు. 'వికసిత్ భారత్-వికసిత్ జమ్మూకశ్మీరు' పేరిట గురువారమిక్కడ నిర్వహించిన ర్యాలీలో ఆయన ప్రసంగించారు. 2019లో 370 రద్దు, రాష్ట్రాన్ని జమ్మూకశ్మీరు, లదాఖ్ అనే రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా మార్చాక ఆయన శ్రీనగర్ రావడం ఇదే మొదటిసారి. వ్యవసాయ-ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చే రూ.5 వేల కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులను ఆయన ఈ సందర్భంగా ప్రారంభించారు. వీటితో జమ్మూకశ్మీరు మరింత పురోగతి సాధిస్తుందన్నారు. ప్రజల హృదయాలు గెలుచుకోవడానికి తాను ఇక్కడకు వచ్చానని తెలిపారు. 370 రద్దుతో కశ్మీరీ యువతకు తమ ప్రతిభను చాటుకునే అవకాశం లభించిందని.. కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకుంటున్నారని తెలిపారు. వారికి కొత్త అవకాశాలు లభిస్తున్నాయని చెప్పారు. 'ఇవాళ అందరికీ సమాన హక్కులు, సమాన చాన్సులు వస్తున్నాయి. జమ్మూకశ్మీరు దేశానికి మణికిరీటంలాంటిది. పర్యాటక రంగ అభివృద్ధి, రైతుల సాధికారత, యువ నాయకత్వంతో ఈ ప్రాంతం అభివృద్ధి పథాన నడుస్తుంది. ఇది కేవలం ఓ ప్రాంతం కాదు. దేశానికి తలవంటిది. ఇక్కడ 40 పర్యాటక ప్రాంతాలను గుర్తించాం' అని వెల్లడించారు. జమ్మూకశ్మీరు కుటుంబ రాజకీయాలకు బలైందని.. నేషనల్ కాన్ఫరెన్స్, కాంగ్రెస్ కుటుంబ రాజకీయాలపైనే దృష్టిపెట్టాయని.. అవినీతిని ప్రోత్సహించాయని ధ్వజమెత్తారు. తనకు కుటుంబం లేదని ఆర్జేడీ అధినేత లాలూప్రసాద్ యాదవ్ చేసిన వ్యాఖ్యలను మోదీ మళ్లీ ప్రస్తావించారు.



శ్రీనగర్‌లో ఓ స్టాల్‌ను సందర్శించిన మోదీ

యావత్ జమ్మూకశ్మీరు ప్రజలు తన కుటుంబ సభ్యులేనన్నారు. ఈ ప్రాంత అభివృద్ధికి ఏమైనా చేస్తానన్నారు. ప్రజలకు మహాశివరాత్రితో పాటు రంజాన్ మాస శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రసంగాన్ని ముగించారు. ప్రధాని ప్రారంభించిన అభివృద్ధి ప్రాజెక్టుల్లో రూ.1,400 కోట్ల విలువైన 'స్వదేశీ దర్శన్', 'ప్రసాద్' స్కీంలు, హజ్రత్‌బాల్ దర్గా సమగ్రాభివృద్ధి పథకాలు కూడా ఉన్నాయి. కొత్తగా జమ్మూకశ్మీరు ప్రభుత్వ ఉద్యోగులుగా నియమితులైన 1,000 మందికి మోదీ నియామక పత్రాలు అందజేశారు.

### శంకరాచార్య హిల్‌కు మోదీ ప్రణామం

శ్రీనగర్ పర్యటనలో మోదీ తొలుత ఇక్కడి ప్రసిద్ధ 'శంకరాచార్య హిల్'కు చేతులు జోడించి ప్రణామం చేశారు. ఆ ఫొటోలను ఆయన 'ఎక్స్'లో పోస్టు చేశారు. శ్రీనగర్‌లోని జబర్వాన్ కొండలపైన ఆదిశంకరాచార్య ఆలయం ఉంది. ఏటా ఏప్రిల్‌లో ఆలయ ప్రతిబింబం దాల్ సరస్సులో కనువిందు చేస్తుంది. కాగా, తన 'మిత్రుడు నజీంతో చిరస్మరణీయ సెల్ఫీ' అంటూ మోదీ సోషల్ మీడియాలో ఆసక్తికరమైన పోస్టు పెట్టారు. 'నజీం చేసే గొప్ప పని నన్ను ఎంతగానో ప్రభావితం చేసింది' అని ట్వీట్ చేశారు. పుల్వామాకు చెందిన నజీం 2018 నుంచి తేనె వ్యాపారం చేస్తున్నారు.

## కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు 4% డీఏ

» 50 శాతానికి చేరనున్న కరువు భత్యం.. జనవరి నుంచి వర్తింపు

» 'ఈశాన్యం'లో పారిశ్రామికాభివృద్ధికి రూ.10వేల కోట్లతో 'ఉన్నతి'

» కేంద్ర కేబినెట్ నిర్ణయాలు

న్యూఢిల్లీ, మార్చి 7: సాధారణ ఎన్నికల ముంగిట వివిధ వర్గాలపై కేంద్రం ప్రభుత్వం వరాల జల్లు కురిపించింది. గురువారం కేబినెట్ భేటీ అనంతరం ఈ వివరాలను కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు కరువు భత్యం (డీఏ)ను 4శాతం పెంచారు. ఏడో కేంద్ర వేతన సంఘం సిఫారసులమేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం డీఏ 46% ఉండగా పెంపు తర్వాత 50 శాతానికి చేరనుంది. ఈ ఏడాది జనవరి1 నుంచి ఇది అమల్లోకిరానుంది. దీంతో 49.18 లక్షల మంది ఉద్యోగులు, 67.95 లక్షలమంది పింఛనర్లకు లబ్ధి జరగనుంది. డీఏ పెంపుతో ఏటా ఖజానాపై రూ.12,869 కోట్ల భారం పడనుంది. మరోవైపు డీఏ పెంపు రవాణా భత్యం, క్యాంటీన్ అలవెన్స్, డిప్యుటేషన్ అలవెన్స్ 25% పెరిగాయి. ఇంటి అద్దె భత్యం శ్లాబుల వారీగా 27% నుంచి 30కి, 19 నుంచి 20కి, 9 నుంచి 10 శాతానికి చేరింది. గ్రాట్యుటీ ప్రయోజనాల పరిమితిని రూ.20 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచారు. కాగా, కృత్రిమ మేధ (ఏఐ)లో అభివృద్ధి, పరిశోధనలకు రూ.10,372 కోట్లతో ఇండియా ఏఐ మిషన్‌ను కేంద్రం నెలకొల్పనుంది. ఈ నిధులతో ఐదేళ్లలో ప్రభుత్వం-ప్రైవేటు భాగస్వామ్యంతో యువతకు శిక్షణ, ఆవిష్కరణ కేంద్రాల ఏర్పాటు, కంప్యూటింగ్ మౌలిక వసతులను కల్పించనున్నారు. ఉజ్వల పథకం కింద నిరుపేద మహిళలకు అందిస్తున్న రూ.300 రాయితీని కేంద్రం వచ్చే ఏడాది మార్చి 31వరకు పొడిగించారు. పది కోట్ల కుటుంబాలకు ప్రయోజనం చేకూర్చే ఈ పథకంతో రూ.12 వేల కోట్ల భారం పడనుంది. ఇక ఈశాన్య భారత్‌లో పరిశ్రమల స్థాపనను ప్రోత్సహించేందుకు 'ఉన్నతి' పేరిట రూ.10,037 కోట్లతో పారిశ్రామికాభివృద్ధి పథకాన్ని ప్రకటించింది. ముడి జనపనార మద్దతు ధరను క్వింటాకు రూ.285 పెంచారు. దీంతో క్వింటా ధర రూ.5,335కు చేరనుంది. గోవా అసెంబ్లీలో షెడ్యూల్ తెగ (ఎస్టీ)లకు రిజర్వేషన్లు కల్పించే బిల్లు పెట్టేందుకు ఆమోదం తెలిపింది. కాగా ఐదోతరం స్టెల్త్ ఫైటర్ విమానాలకు సంబంధించి డీఆర్‌డీఓ ప్రతిపాదనను భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ ఆమోదించింది. దీనికి రూ.15 వేల కోట్లు వ్యయం అవుతుందని అంచనా. సైన్యం, కోస్ట్ గార్డుకు కొత్తగా 34 ధ్రువ్ హెలికాప్టర్లు సమకూర్చే ప్రతిపాదనకూ కమిటీ ఆమోదం తెలిపింది.

## 30 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తాం: రాహుల్

న్యూఢిల్లీ, మార్చి 7: లోక్‌సభ ఎన్నికల్లో తమకు అధికారమిస్తే దేశంలో డిగ్రీ లేదా డిప్లొమా ఉన్న 25 ఏళ్లలోపు వయసున్న ప్రతి ఒక్కరికీ ఏటా రూ.లక్ష అందిస్తామని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తెలిపారు. దేశంలో ఖాళీగా ఉన్న 30 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తామన్నారు. గురువారం భారత్ జోడో న్యాయ్ యాత్రలో భాగంగా రాజస్థాన్‌లోని బాన్స్‌వాడలో ఓ ర్యాలీలో ఆయన మాట్లాడుతూ.. యువతే లక్ష్యంగా 'యువ న్యాయ్' పేరిట అయిదు గ్యారెంటీలను ప్రకటించారు. యువతకు ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేట్ కంపెనీల్లో అప్రెంటిస్‌షిప్ అవకాశాలు కల్పిస్తామని, అందుకు చట్టం తీసుకొస్తామన్నారు. అప్రెంటిస్‌షిప్‌లో ఏడాది శిక్షణ ఇస్తామని, ఆ సమయంలో రూ. లక్ష స్టైపెండ్ ఇస్తామని ప్రకటించారు. పేపరు లీకేజీలను అరికట్టేందుకు పటిష్ఠ చట్టం తీసుకొస్తామని వెల్లడించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రభుత్వమే నేరుగా పోటీ పరీక్షలను నిర్వహిస్తుందని చెప్పారు. ట్రక్కు డ్రైవర్లు, డెలివరీ బాయ్స్, కార్పెంటర్లు, మెకానిక్‌లు.. వంటి గిగ్ వర్కర్లకు సామాజిక భద్రతకు చట్టం చేస్తామన్నారు. రూ.5 వేల కోట్ల స్టార్టప్ నిధిని ఏర్పాటు చేస్తామని తెలిపారు.

# జగన్ హ్యాండ్సప్

» ఐదేళ్లూ ఉద్యోగులకు ఉసూరే

» 'కోడ్'కు ముందూ అదే కఠినవైఖరి

» ఉద్యోగుల్ని గాలికొదిలేసిన సర్కార్

» సీఎస్‌తో చివరి భేటీలోనూ నిరాశే

» ఆర్థిక అంశాలపై 'మాటల్లేవ్'

» చర్చల మొదట్లోనే సీఎస్ స్పష్టీకరణ

» సర్కారు తీరుతో నేతలు అవాక్కు

» ఇది మరో ఉత్తుత్తి సమావేశమే..

» ఉద్యోగవర్గాల్లో తీవ్ర అసంతృప్తి



జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ మీటింగ్‌లో మాట్లాడుతున్న సీఎస్ జవహర్‌రెడ్డి

అమరావతి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): అంతన్నాడు ఇంతన్నాడు.... అన్నట్లు గత ఎన్నికల ముందు ఉద్యోగిపక్షపాతినంటూ డబ్బా కొట్టిన జగన్, అయిదేళ్లలో తన నిజస్వరూపాన్ని బయటపెట్టేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం తన వల్ల కాదని చేతులెత్తేశాడు. రేపో మాపో ఎన్నికల కోడ్ వచ్చేస్తున్న సమయంలోనూ ఉద్యోగులకు తానేమీ చేయలేనని తేల్చేశారు. ఆర్థిక సంబంధమైన విషయాల్లో 'మాటల్లేవ్... మాట్లాడుకోవటాల్లేవ్' అని గురువారం ఉద్యోగ సంఘాల జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి తేల్చేశారు. దీంతో ఉసూరుమంటూ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నేతలు వెనుదిరిగారు. వారం పదిరోజుల్లో ఎన్నికల కోడ్ రానుండడంతో ఉద్యోగ సంఘాలతో జరిగే చివరి సమావేశం ఇదే కావచ్చు. అందువల్ల ఈ సమావేశంలో జరిగే చర్చల్లో ఉద్యోగులకు ఏదైనా శుభవార్త చెబుతారేమోనని ఉద్యోగ,ఉపాధ్యాయ సంఘాల నేతలు ఎంతో ఆశతో సమావేశంలో పాల్గొన్నారు. ఐఆర్ ఎంతో కొంత ఇస్తారేమో....ఆ మాట ఏదైనా చెబుతారేమో... ఐదేళ్ల నుంచి అన్యాయం జరిగినా చివర్లో అయినా దింపుడు కల్లం ఆశగా ఏదైనా చెబుతారేమోనని ఆశగా ఎదురు చూశారు. కానీ...సమావేశం ప్రారంభం కాగానే "ఆర్థికేతర డిమాండ్లపైనే మాట్లాడండి... ఆర్థిక డిమాండ్లు వద్దు.. ఆర్థిక డిమాండ్లపై ఇప్పటికే మంత్రుల కమిటీ చెప్పిందే ఫైనల్" అని సీఎస్ సెలవిచ్చారు. దీంతో ఉద్యోగ సంఘ నేతల నోట్లో పచ్చివెలక్కాయ పడ్డట్టైంది. గతంలో చాలా సమావేశాలు నిర్వహించినా, వాటి వల్ల ఫలితం లేకపోయినా.... ఆర్థిక డిమాండ్లు లేదంటే ఆర్థికేతర డిమాండ్లు మాత్రమే మాట్లాడాలని చెప్పలేదని ఉపాధ్యాయ సంఘాల నేతలు గుర్తు చేసుకున్నారు. ఆర్థికేతర అంశాలు మాట్లాడమన్నారు కదా అని గతంలో పరిష్కారం కాని ఆర్థికేతర అంశాలను ప్రస్తావించారు. వాటిపైనా స్పష్టత కరువైంది. కొన్ని పరిష్కరించాం....మరికొన్ని పరిశీలిస్తున్నాం... మరికొన్ని తప్పకుండా చేస్తాం.. అంటూ సీఎస్, ఆర్థికశాఖ అధికారులు హామీలు ఇచ్చారు. పాత డిమాండ్లపైనే చర్చ జరిగింది. కొన్ని శాఖల్లో కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ చేశామని అధికారులు సెలవిచ్చారు. దీంతో ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలు పెదవి విరిచాయి.

ఈ సమావేశం వల్ల ఎలాంటి ఉపయోగంలేదని వాపోయారు. ఇలా ఎలాంటి స్పష్టత లేకుండానే సమావేశం ముగిసింది. ఈ సమావేశంలో ఏపీ ఎన్జీవో సంఘం అధ్యక్షుడు శివారెడ్డి, ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, యూటీఎఫ్ అధ్యక్షులు వెంకటేశ్వర్లు, ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు సూర్యనారాయణ, ఎస్టీయూ అధ్యక్షుడు సాయిశ్రీనివాస్, ఏపీటీఎఫ్ అధ్యక్షుడు హృదయరాజు, ఏపీ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు బాలాజి తదితరులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం నేతలు సచివాలయంలో మీడియాతో మాట్లాడారు.

### అడిగిన రెండింటిపైనా స్పష్టత లేదు: ఏపీ జేఏసీ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు

"అడిషనల్ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్, 2004కు ముందు ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు ఓపీఎస్ అమలుపై స్పష్టత ఇవ్వాలని కోరాం. దీనిపై సమావేశంలో స్పష్టత ఇవ్వలేదు. ఎక్కువమంది ఉద్యోగులు ఉన్న విద్యాశాఖలో క్రమబద్ధీకరణ చేయకపోవడం బాధాకరం. మెడికల్ హెల్త్ కార్డులపై త్వరలో ప్రభుత్వం నిర్ణయం తీసుకోనున్నట్లు చెప్పారు. సీఎంఎఫ్ఎస్‌పై ఆర్థికశాఖలో గ్రీవెన్స్ ఏర్పాటు చేస్తామన్నారు.

### 12వ పీఆర్సీలో ఐఆర్ ఇవ్వాలని కోరాం: ఏపీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షులు శివారెడ్డి...

"నాన్ ఫైనాన్స్ సమస్యలు పరిష్కరించాలని సమావేశంలో కోరాం. మెడికల్ డిపార్ట్‌మెంట్‌లో సీఏఎస్‌వోలను నియమించాలని కోరగా స్పష్టత రాలేదు. 12వ పీఆర్సీలో ఐఆర్ ఇవ్వాలని కోరాం. 11 పీఆర్సీలో ఇవ్వాల్సిన ఆరియర్స్ త్వరితగతిన ఇవ్వాలని కోరాం" అని శివారెడ్డి అన్నారు. ఏపీఎన్జీవో నేత చౌదరి పురుషోత్తం నాయుడు మాట్లాడుతూ.. 2004 ముందు నియామకాలు పొందిన సీపీఎస్ ఉద్యోగులకు ఓపీఎస్ అమలు చేయాలని కోరామన్నారు.

### ఆర్థికేతర డిమాండ్లే అంటే ఎలా?: హృదయరాజు

"ఆర్థికపరమైన డిమాండ్లు కాకుండా ఆర్థికేతర డిమాండ్లపై మాత్రమే చర్చించాలని సీఎస్ జవహర్‌రెడ్డి కోరడం ఏమిటి? ఎన్నికల కోడ్ వచ్చేలోపు ఉద్యోగులు, ఉపాధ్యాయుల డిమాండ్లపై సీఎం సానుకూలంగా స్పందించాలి"

### స్పష్టత లేదు: ఎస్టీయూ సాయి శ్రీనివాస్

జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో ఏ డిమాండ్‌పైనా ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ రాలేదు. నిరాశ చెందాం"

### అసంపూర్తిగా : యూటీఎఫ్ వెంకటేశ్వరరావు

"ఈ రోజు జరిగిన చర్చలు అసంతృప్తితో ముగిశాయి. చర్చలపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాం"

### ఆర్థికేతర డిమాండ్లపైనా..: ఏపీటీఎఫ్ చిరంజీవి

"ఆర్థికేతర డిమాండ్లలో దేనిపైనా ప్రభుత్వం స్పష్టతఇవ్వలేదు. గత ఐదు సంవత్సరాలుగా ఉద్యోగులకు సంబంధించిన ఏ సమస్య పరిష్కారం కాలేదు"

### ఐఆర్‌పై స్పష్టత ఇవ్వడంలేదు: కృష్ణయ్య

12వ పీఆర్సీలో ఐఆర్ కావాలని కోరితే జగన్ ప్రభుత్వం ఇవ్వడంలేదు. నేరుగా పీఆర్సీ ఇస్తామని చెబుతున్నారు.

## కలిసి గెలుద్దాం

(మొదటి పేజీ తరువాయి)

సాయంత్రం 5 గంటలకు ఢిల్లీకి చేరుకున్నారు. రాత్రి 8గంటలకు జనసేన అధిపతి పవన్ కల్యాణ్ కూడా వచ్చారు. ఇద్దరూ కలిసి రాత్రి 10.30 గంటలకు అమిత్‌షాతో ఆయన నివాసంలో భేటీ అయ్యారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా కూడా చర్చల్లో పాల్గొన్నారు. గంటన్నర పాటు ఈ భేటీ జరిగింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. తమకు వీలైనన్ని ఎక్కువ లోక్‌సభ స్థానాలు కేటాయించాలని షా, నడ్డా కోరారు. వాటిని గెలిపించుకునేందుకు గట్టిగా కృషి చేద్దామన్నారు. 8 నుంచి 10 లోక్‌సభ స్థానాలు తమకు కేటాయించాలని కోరినట్లు తెలిసింది. "అసెంబ్లీలో మీరు సాధ్యమైనన్ని సీట్లు గెలిచి అధికారంలోకి రావాలని మాకు తెలుసు. లోక్‌సభలో కనీసం 370 స్థానాలు నెగ్గాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. అందువల్ల ప్రతి మిత్రపక్షం నుంచి సాధ్యమైనన్ని ఎక్కువగా అడుగుతున్నాం" అని బీజేపీ నేతలు చెప్పినట్లు తెలిసింది. అయితే.. బీజేపీ ఆశిస్తున్నన్ని స్థానాలు కాకుండా 4 లోక్‌సభ, 6అసెంబ్లీ సీట్లలో పోటీ చేస్తే గెలిచే అవకాశాలు కచ్చితంగా ఉన్నాయని చంద్రబాబు, పవన్ పేర్కొన్నట్లు సమాచారం. ఆ తర్వాత ఒక రాజ్యసభ స్థానాన్ని కూడా కేటాయించవచ్చునని చెప్పినట్లు తెలిసింది. గెలవలేని సీట్లు తీసుకోవడంవల్ల అక్కడ వైసీపీకి ప్రయోజనం కలుగుతుందని అభిప్రాయపడినట్లు సమాచారం. శుక్రవారం కూడా చర్చలు కొనసాగే అవకాశం ఉంది. షాను కలిసేముందు పార్టీ నేతలు రామ్మోహన్ నాయుడు, కనకమేడల, రఘురామ, వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, లావు కృష్ణదేవరాయలు తదితరులతో చంద్రబాబు చర్చలు జరిపారు.

**రాష్ట్ర బీజేపీ నేతలతో సమీక్ష...:** అమిత్ షా, నడ్డా, రాష్ట్ర సంస్థాగత వ్యవహారాల కార్యదర్శి మధుకర్... రాష్ట్ర బీజేపీ నేతలతో బుధవారమే సమావేశమయ్యారు. ఏపీలో ఎన్నిసీట్లకు పోటీ చేయాలన్న విషయంపై పొద్దుపోయేదాకా చర్చించారు. విజయావకాశాలు ఉన్న సీట్ల గురించి స్పష్టమైన అంచనాకు రావాలని ఆదేశించారు. దీంతో రాష్ట్ర బీజేపీ నేతలు గురువారం మరోమారు సమావేశమయ్యారు. పొత్తులో భాగంగా టీడీపీని 10లోక్‌సభ, 20 అసెంబ్లీ సీట్లు అడగాలని ప్రతిపాదించినట్లు సమాచారం. నర్సాపురం ఎంపీ అభ్యర్థిగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, ప్రముఖసినీనటుడు కృష్ణంరాజు సతీమణి పేరును ప్రస్తావించినట్లు సమాచారం. శుక్రవారం కూడా ఢిల్లీలోనే ఉండాలని, చంద్రబాబు, పవన్‌తో చర్చల తర్వాత మళ్లీ పిలిపిస్తామని రాష్ట్ర నేతలకు పార్టీ పెద్దలు చెప్పినట్లు తెలిసింది. పోటీ చేయబోయే స్థానాలపై స్పష్టత వచ్చిన వెంటనే అభ్యర్థుల పేర్లతో సిద్ధంగా ఉండాలని చెప్పినట్లు సమాచారం.



*Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.*

# ఘనంగా మహిళా దినోత్సవం


సభలో ప్రసంగిస్తున్న డీఆర్ఎం పాటిల్


కేబీఎన్ కాలేజీలో షీల్డులు బహూకరిస్తున్న ఉమాదేవి


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఆసుపత్రి డాక్టర్లు

## ఆయుష్‌లో మహిళా ఆరోగ్య అవగాహన సదస్సు

**అజిత్‌సింగ్‌నగర్, మార్చి 7:** ఆయుష్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం గురువారం ఘనంగా జరిగింది. నగరంలోని ఓ హోటల్‌లో మహిళా ఆరోగ్య అవగాహన సదస్సును నిర్వహించారు. బిజినెస్ నెట్‌వర్కింగ్ ఇంటర్నేషనల్ (బీఎన్ఐ) సభ్యులైన మహిళా వ్యాపారవేత్తలు, పారిశ్రామికవేత్తలు పాల్గొన్న ఈ సదస్సులో ప్రముఖ గైనకాలజిస్ట్ కె.గీతాదేవి ప్రసంగించారు. ప్రీవెంటివ్ ఉమెన్ హెల్త్‌కేర్ అనే అంశంపై మహిళలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వయస్సును బట్టి ఏ సమయంలో క్యాన్సర్ నిరోధక వ్యాక్సిన్లు తీసుకోవాలని తెలియజేశారు. అనంతరం డాక్టర్ ఇంద్రజ మాట్లాడుతూ మహిళలు గైనకాలజికల్ అంశంపై ఎదుర్కొంటున్న సమస్యలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. అనంతరం ఆసుపత్రి చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ జయలక్ష్మీ మాట్లాడుతూ ఆయుష్ హాస్పిటల్‌లో అందించే వైద్య సదుపాయాలను వివరించారు. అనంతరం మహిళలకు ఆటల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. డాక్టర్ పద్మ పర్వతనేని వందన సమర్పణ చేయగా 200 మంది వ్యాపారవేత్తలు, పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

**వన్‌టౌన్, మార్చి 7:** మహిళా ఉద్యోగులు కుటుంబ బాధ్యతలు నిర్వహిస్తునే ఉద్యోగ బాధ్యతలనూ సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గురువారం సబ్‌కలెక్టర్ కార్యాలయం సమావేశపు హాలులో జరిగిన సభకు ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మరో ముఖ్య అతిథి సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ విజయకృష్ణన్ మాట్లాడుతూ మహిళలు తమ ఆలోచనలకు తగ్గట్టుగా తమ వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుకోవాలన్నారు. అమరావతి జేఏసీ స్టేట్ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మహిళలు నేటి కాలంలో అంతరిక్షంలోకి దూసుకువెళుతున్నారన్నారు. అనంతరం క్రీడలు, సాంస్కృతిక ప్రదర్శనల్లో గెలుపొందిన వారికి బహుమతి ప్రదానం చేశారు. ఏపీ జేఏసీ అమరావతి మహిళా విభాగం చైర్‌పర్సన్ పారే లక్ష్మి, ప్రధాన కార్యదర్శి పొన్నూరి విజయలక్ష్మితో పాటు క్యాపిటల్ సిటీ చైర్‌పర్సన్ పి.శ్రీదేవి, ప్రధాన కార్యదర్శి ఎం.వాణి, అమరావతి జేఏసీ నేతలు పలిశెట్టి దామోదరరావు, రామకృష్ణ, వై.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

**రైల్వే డివిజన్ కార్యాలయంలో..**

నగరంలోని రైల్వే డివిజన్ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ పాల్గొని మాట్లాడుతూ డివిజన్‌కు మహిళా ఉద్యోగులే గర్వకారణమన్నారు. వారు చిత్తశుద్ధి, అంకితభావంతో అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. ఏడీఆర్ఎం ఎం శ్రీకాంత్ మాట్లాడుతూ శారీరక, సామాజిక అడ్డంకులు లేకుండా మహిళా ఉద్యోగులు పురుషులతో సమానంగా సవాళ్లను అధిగమించి పనిచేస్తున్నారని కితాబిచ్చారు. అనంతరం మహిళా సాధికారితపై కూచిపూడి నృత్యం, నాటక ప్రదర్శన నిర్వహించారు. స్కౌట్స్ గైడ్స్ విద్యార్థులు సమాజంలో మహిళల ప్రాముఖ్యతను తెలియజేస్తూ నృత్య ప్రదర్శననిచ్చారు. అనంతరం పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

**కేబీఎన్ కళాశాలలో..**

ప్రపంచవ్యాప్తంగా అన్ని రంగాల్లోనూ మహిళలు తమ ప్రతిభను చాటుతున్నారని జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ జి.ఉమాదేవి అన్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖ, కేబీఎన్ కాలేజీ ఉమెన్స్ స్టడీ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం మహిళా దినోత్సవాన్ని కళాశాల ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలకు విద్యా, వైద్య రంగాల్లో ప్రభుత్వం చేయూతనిస్తుందన్నారు. కార్పొరేటర్ బోయి సత్యబాబు మాట్లాడుతూ మహిళలు లేని సమాజం శూన్యమన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు, డిస్ట్రిక్ట్ లీగల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ కొడాలి, సీడబ్ల్యూసీ సభ్యురాలు అనురాధ, సీహెచ్ రాధాకుమారి, సైకాలజిస్ట్ కృష్ణకుమారి, కళాశాల ఐక్యూ ఏసీ కో ఆర్డినేటర్ కృష్ణవేణి, ఉమెన్స్ స్టడీ సెంటర్ కన్వీనర్ విశైలజ, అధ్యాపకురాలు కల్మ బేగం పాల్గొన్నారు.

**ఇంజనీరింగ్ కాలేజీలో..**

ఇంటర్నర్ కంప్లెయన్స్ కమిటీ విభాగం కన్వీనర్ డాక్టర్ రమాదేవి పర్యవేక్షణలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పొట్టి శ్రీరాములు చలువాది మల్లిఖార్జునరావు ఇంజనీరింగ్ కాలేజీలో ఘనంగా నిర్వహించారు. ఫిజిషియన్ డాక్టర్ మేదరమెట్ల మంజుభార్గవి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రతి మహిళా తన తల్లి నుంచి మంచి, చెడులను గ్రహించాలని ధైర్యంగా ముందుకు సాగాలన్నారు. కళాశాల సెక్రటరీ పరుచూరి లక్ష్మణస్వామి, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జే.లక్ష్మీనారాయణ తమ సందేశాలిచ్చారు. డాన్స్ పోటీలు, ర్యాంప్ వాక్, మ్యూజికల్ చైర్స్ నిర్వహించారు.

**కేడీసీసీ కార్యాలయంలో..**

కృష్ణాజిల్లా సహకార కేంద్ర బ్యాంక్ ప్రాంతీయ కేంద్ర కార్యాలయంలో గురువారం జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం బ్యాంక్ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ భారతీయ మహిళలు ప్రపంచ మహిళలందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. బ్యాంక్ జనరల్ మేనేజర్ నన్నపనేని రంగబాబు, బ్యాంక్ చీఫ్ మేనేజర్లు గీతాభారతి, సాహితీ, స్వరూప, సౌమ్య పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా బ్యాంక్ మహిళా ఖాతాదారులు మాగంటి అన్నపూర్ణ, మైలవరపు నాగమణి, యరమనేని ఆదిలక్ష్మి బ్యాంకు ఉద్యోగులు స్వరూప, మరియమ్మ, మాధవి, సావిత్రిని సత్కరించారు.

**హెల్త్ వర్సిటీలో..**

**ప్రభుత్వాసుపత్రి:** నగరంలోని డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మహిళా ప్రతినిధులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ కోరుకొండ బాబ్జీ సమాజంలో మహిళల ప్రాధాన్యతపై ప్రసంగించారు. రిజిస్ట్రార్ శ్రీనివాసరావు, డాక్టర్ సుమితా శంకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**వీఎంసీలో..**

**చిట్టినగర్:** వీఎంసీ ఆవరణలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. కమిషనర్ స్వప్నిల్ దినకర్ హాజరై మాట్లాడుతూ మహిళలు ఎక్కడున్నా అంకితభావంతో పనిచేస్తారని, వీఎంసీ ప్రగతికి మహిళా ఉద్యోగులు, కార్మికులు ఎంతో తోడ్పతున్నారన్నారు. అదనపు కమిషనర్లు కె.సత్యవతి, ఎమహేష్, పి.రత్నావళి, డిప్యూటీ కమిషనర్ సృజన, రమ్య కీర్తన పాల్గొన్నారు. అనంతరం మహిళా అధికారులు, కార్మికులను ఘనంగా సత్కరించారు.


మహిళా దినోత్సవ సభలో మాట్లాడుతున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్


డాక్టర్ మేదరమెట్ల మంజుభార్గవిని సత్కరిస్తున్న కాలేజీ మహిళా అధ్యాపకులు


ఎన్టీఆర్ భవన్ వద్ద మహిళా దినోత్సవంలో పాల్గొన్న మహిళా నేతలు

## చంద్రబాబుతోనే మహిళా సాధికారత

● టీడీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు చెన్నుపాటి ఉషారాణి

**వన్‌టౌన్, మార్చి 7:** మహిళలకు సాధికారత రావాలన్న, అభివృద్ధి జరగాలన్నా చంద్రబాబును తిరిగి అధికారంలోకి తీసుకురావాలని టీడీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు చెన్నుపాటి ఉషారాణి అన్నారు. గురునానక్ కాలనీలోని నియోజకవర్గ టీడీపీ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో కేశినేని శివనాథ్ (చిన్ని) సహకారంతో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్తు, యువత భవిత బాగుపడాలంటే సైకో పోవాలి-సైకిల్ రావాలనే నినాదాన్ని విస్తృతంగా తీసుకువెళ్లాలని కోరారు. జడ్పీ మాజీ చైర్ పర్సన్ గద్దె అనురాధ, బొండా సుజాత, జనసేన జనరల్ సెక్రటరీ టి.అనితలు ముఖ్య అతిథులుగా పాల్గొని మహిళా సంక్షేమానికి నాడు ఎన్టీఆర్ గట్టి పునాది వేశారని చంద్రబాబు డ్వాక్రా సంఘాలను తీసుకువచ్చి మహిళా సాధికారితకు పెద్ద పీట వేశారన్నారు. మాదాల చిన్నతల్లి, కె.నాగమణి, దాసరి ఉదయశ్రీ, సుకాశి సరిత, మహిళా కార్పొరేటర్లు అపర్ణ, కాంతి, మాజీ కార్పొరేటర్లు మల్లేశ్వరి, సరిత, జ్యోతి, మహిళా సర్పంచ్ మన్నె సాత్విక, మహిళా నాయకురాలు నందతో పాటు తెలుగు మహిళలు, జనసేన వీరమహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలతో నివాళులర్పించారు.

## అన్నదాన విభాగంలో మరోసారి ఎల్‌పీజీ పైపులైన్ లీక్

● ఇద్దరికి గాయాలు

**వన్‌టౌన్, మార్చి 7:** దుర్గగుడిలోని వంటశాలలో గురువారం ఉదయం ఎల్‌పీజీ గ్యాస్‌లైన్ మరోసారి లీకయి ఇద్దరు వర్కర్లకు తీవ్రగాయాలయ్యాయి. మహిళా వర్కర్ కుమారి కాళ్లకు గాయాలు కాగా, మరో వర్కర్ జగదీష్ చేతులకు గాయాలయ్యాయి. వెంటనే వీరిని దేవస్థానం అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వంటశాలలో చాలాకాలం నాటి గ్యాస్‌పైపులతోనే కాలక్షేపం చేస్తున్నారే తప్ప మార్చడం జరగలేదు. ఫలితంగా పైపులు విపరీతంగా అరిగి ఇబ్బందులు తలెత్తాయి. ఈనెల 2న తొలిసారిగా పైపులైన్ లీక్ కావడంతో అన్నదాన విభాగంలో అన్న ప్రసాదం స్వీకరించే భక్తులకు భోజనాలు అందక ఇబ్బందులకు గురయ్యారు. ఆ సమయంలో వంటను నిలిపేసి తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. మళ్లీ గురువారం ఉదయం 8 గంటల ప్రాంతంలో వంట పనివారు పనుల్లో నిమగ్నమై ఉండగా ఒక్కసారిగా గ్యాస్ లీకయింది. దీంతో సమీపంలో ఉన్న కుమారి, జగదీష్‌కు గాయాలయ్యాయి. పైపులైన్లను పూర్తిస్థాయిలో మార్చాల్సిన అవసరాన్ని ఉద్యోగులు నొక్కి చెబుతున్నారు.

## తొలగిన ముద్రగడ, హరిరామజోగయ్య ముసుగులు

**విద్యాధరపురం:** ముద్రగడ పద్మనాభం, చేగొండి హరిరామజోగయ్య ముసుగులు తొలిగాయని టీ డీపీ రాష్ట్ర కార్యదర్శి కొత్త నాగేంద్రకుమార్ అన్నారు. ఆటోనగర్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ యన మాట్లాడారు. ఐదేళ్లుగా ఏరోజూ జగన్మోహనరెడ్డిని ప్రశ్నించని ముద్రగడ పద్మనాభం, హరిరామజోగయ్య తమ లేఖల ద్వారా చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌ను ప్రశ్నించడాన్ని గమనిస్తున్నామన్నారు. పవన్‌కల్యాణ్‌ను పవర్ షేరింగ్ అడగమంటున్నారని జోగయ్య కుమారుడు సూర్యప్రకాష్‌కు జగన్మోహన్‌రెడ్డి పవర్‌షేరింగ్ ఇస్తున్నాడని పార్టీ మారాడా అని ప్ర శ్నించారు. ముద్రగడ పద్మనాభానికి పవర్‌షేరింగ్ ఇ స్తున్నారా అని నిలదీశారు. పవన్‌కల్యాణ్, చంద్రబాబు సమాజంలోని కాపులు, అన్ని కులాల అభ్యున్నతికి పోరాడుతూ ఒకే మాటపై ఉన్నారన్నారు.

## గుడివాడ గుట్కా గూట్లే గురించి చెబుతున్న గూగుల్!

**విద్యాధరపురం:** గుడివాడ గుట్కా గూట్లే అంటే గూగుల్‌ను అడిగినా చెబుతుందని తెలుగు మహిళా ఉపాధ్యక్షురాలు షేక్ ఆషా, కృష్ణాజిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు తలశిల స్వర్ణలతల ఎమ్మెల్యే కొడాలినానిని ఉద్దేశించి విమర్శించారు. గురువారం ఆటోనగర్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పా టు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ చంద్రబాబును అసభ్యపదజాలంతో కొడాలి నాని విమర్శించడం సిగ్గుచేటన్నారు. ఫ్లాట్‌ఫారంపై టైర్లు అమ్ముకునే నాని ఇష్టానుసారం మాట్లాడితే చెప్పుదెబ్బలు తప్పవన్నారు. అతను ఎవరి దగ్గర టీ కప్పులు మోసాడో గుర్తుంచుకోవాలన్నారు. సైకో జగన్‌రెడ్డి గుడివాడ సీటివ్వడేమోనన్న భయంతో నోటికి వచ్చినట్లు ఇష్టానుసారం మాట్లాడుతున్నాడన్నారు. టీడీపీ, జూనియర్ ఎన్టీఆర్ వేర్వేరు కాదని కొడాలి నాని తెలుసుకోవాలన్నారు. వెనిగండ్ల రాము చేతిలో భారీ మెజారిటీతో ఓడిపోతున్నారని జోస్యం చెప్పారు.

## ప్రజాస్వామ్యంలో దౌర్జన్యాలకు స్థానం లేదు

**గుణదల,:** ప్రజాస్వామ్యంలో దౌర్జన్యాలకు స్థా నం లేదని టీడీపీ సీనియర్ నేత ఆళ్ల వెంకట గోపాలకృష్ణ అన్నారు. ఎనికేపాడులో టీడీపీ గన్నవరం ని యోజకవర్గం అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు గురువా రం చేపట్టిన నిరసన దీక్షా శిబిరంలో పాల్గొన్న గోపాలకృష్ణ మీడియాతో మాట్లాడుతూ టీడీపీ నేతలపై వైసీపీ నేతలు చేయించిన బహిరంగ దాడులు, కోర్టు ఆవరణలో చేసిన దాడులను ఖండిస్తూ చేసిన శిబి రం వద్ద వల్లభనేని వంశీ కవ్వింపు చర్యలకు పాల్పడటం దారుణమన్నారు. సెటిల్మెంట్ దందాలకు పే రుగాంచిన గన్నవరం ఎంపీపీ అనగాని రవి స్థానిక టీడీపీ నేతలపై అవాకులు చవాకులు పేలటాన్ని ఖండించారు. టీడీపీ అధికారంలోకి రావడం ఖాయమని ప్రభుత్వం రాగానే యార్లగడ్డ సమక్షంలో రంగ న్న గూడెం, సింగన్న గూడెం గ్రామంలో అర్హత ఉన్న 180 మందికి ఇళ్ల స్థలాలు ఇస్తామని తెలిపారు.

# త్వరలో కృష్ణా రివర్ ఫ్రంట్ అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం

**కృష్ణలంక, మార్చి 7:** ముఖ్యమంత్రి చేతులమీదుగా కృష్ణా కరకట్ట రెండు, మూడో దశల రక్షణ గోడలతో పాటు రివర్ ఫ్రంట్ అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం జరగనున్న నేపథ్యంలో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. గురువారం ఆయన వీఎంసీ కమిషనర్ స్వప్నిల్, వివిధ శాఖల అధికారులతో కలిసి గురువారం కృష్ణలంక, రాణిగారితోట ప్రాంతాన్ని సందర్శించారు. రిటైనింగ్ వాల్స్‌తో పాటు వీఎంసీ చేపడుతున్న పార్కు, సుందరీకరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ కరకట్ట ప్రాంత ప్రజలు ముంపు బారిన పడకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రక్షణ గోడల ప్రాజెక్టును చేపట్టి విజయవంతంగా ముందుకు తీసుకెళ్లడం జరుగుతోందని ఇందులో భాగంగా రూ.360 కోట్లతో నిర్మించిన రెండు, మూడో దశల రక్షణ గోడలకు కొద్ది రోజుల్లో సీఎం ప్రారంభోత్సవం చేస్తారన్నారు.

2.25 కి.మీ మేర పద్మావతి ఘాట్-కోటినగర్ రిటైనింగ్ గోడలతో పాటు సమీపంలో వీఎంసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న పార్కును ప్రారంభిస్తారన్నారు. 2021, మార్చి 31న సీఎం శంకుస్థాపన చేసి ఆవిష్కరించిన శిలాఫలకం ప్రాంతాన్ని పచ్చదనంతో ఆహ్లాదకరంగా తీర్చిదిద్దడం జరుగుతోందన్నారు. జలవనరులు, నగరపాలక సంస్థ, రెవెన్యూ తదితర విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేసి సీఎం పర్యటనకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఢిల్లీరావు ఆదేశించారు. కేసీ డివిజన్ వీఈఆర్ కృష్ణారావు, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## నేటి నుంచి పారిశ్రామిక ఇంజనీరింగ్ ప్రదర్శన

**ఆటోనగర్ (పెనమలూరు), మార్చి 7:** నేటి నుంచి మూడు రోజుల పాటు లబ్బీపేటలోని ఎస్ఎస్ కన్వెన్షన్‌లో భారీ పారిశ్రామిక ఇంజనీరింగ్ ప్రదర్శన నిర్వహిస్తున్నట్టు ఇండోర్ ఇన్ఫోలైన్ ప్రతినిధులు తెలిపారు. గురువారం ఆటోనగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ఏపీ ఎంఎస్ఎంఈ పరిశ్రమల అసోసియేషన్, చిన్న మధ్యతరహా పరిశ్రమల అసోసియేషన్ మద్దతిస్తున్న ఈ ప్రదర్శన భారత ప్రభుత్వ మంత్రిత్వ శాఖ గుర్తింపు పొందిందన్నారు. ఈ ఎగ్జిబిషన్‌కు 10వేల మంది హాజరవుతారని అంచనా వేస్తున్నారు. ఈసమావేశంలో సంస్థ ఎండీ ఆర్‌కే అగర్వాల్, ఏపీఎంఎస్ఎంఈ ఇండస్ట్రీస్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు బాయన వెంకట్రావు, కార్యదర్శి రామచంద్రరావు, ప్రెసిడెంటు దుర్గాప్రసాద్, ట్రెజరర్ జేవీఎస్ఆర్కే ప్రసాద్, ఏ నరసింహరావు, నాగేశ్వరరావు, రామకృష్ణ పాల్గొన్నారు.



ప్రదర్శన సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు


ఎంపికైన త్రోబాల్ టీమ్‌తో డీఎస్‌డీవో అజీజ్, సులోచన

## త్రోబాల్ ప్రీమియర్ లీగ్‌కు అమరావతి ఎటాకర్స్

**విజయవాడ స్పోర్ట్సు, మార్చి 7:** బెంగాల్‌లో ఈ నెల 11 నుంచి 15 వరకు జరిగే త్రోబాల్ ప్రీమియర్ లీగ్‌కు రాష్ట్ర మహిళా జట్టును ఎంపిక చేసినట్టు రాష్ట్ర త్రోబాల్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఈదా సులోచన తెలిపారు. ఆరు టీమ్‌లు బరిలో దిగుతుండగా, ఏపీ టీమ్ అమరావతి ఎటాకర్స్ పేరుతో బరిలో మన అమ్మాయిలు బరిలో దిగుతున్నారన్నారు. ఎంపికైన టీమ్‌కు ఐజీఎంసీలోని డీఎస్‌డీవో ఎస్ఏ అజీజ్, త్రోబాల్ అడ్వైజర్ వి.సత్యనారాయణ, ఏపీ స్టేట్ ప్రెసిడెంట్ టి.మురళీరాజు, స్టేట్ జనరల్ సెక్రటరీ ఎండీ.గౌస్ మహిళా క్రీడాకారులకు జెర్సీలను పంపిణీ చేసి ఆల్ ది బెస్ట్ చెప్పారు.

త్రోబాల్ టీమ్ ఇదే.. పి.సౌమ్య, పి.జోషిత, కె.సరపయూ, కె.శాంతి ప్రియ, కె.జోషిత, కె.శ్రావ్య, ఆర్.సంధ్య, కె. నాగ సాయి విఽథిల, జి.మౌనిక, ఎం.శ్రీ వైష్ణవి, భారత్ మల్లిక్ మనసిమా రౌత్, రితు, పూజ, మనిషా.

# దుర్గగుడిలో సూపరింటెండెంట్లు, ఏఈవోల విభాగాలు మార్పు

**వన్‌టౌన్, మార్చి 7:** దుర్గగుడిలో పలువురు సూపరింటెండెంట్లు, ఏఈవోలను అంతర్గత బదిలీలు చేస్తూ ఈవో రామారావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. దుర్గగుడిలో మెయిన్ స్టోర్సు, పూజలు, పండుగలు, ధర్మపథం విభాగాల్లోని, అన్నదానం, కొండదిగువన కౌంటర్లను పర్యవేక్షిస్తున్న కేవీ దుర్గాప్రసాద్‌ను గణాంకాలు, ఐటీ రిటర్న్స్, స్క్రూటినీ జీఎస్‌టీ రిటర్న్‌లు, అన్నదానం, ఐటీ రిటర్న్‌లు, కొండ కింది కౌంటర్ల పర్యవేక్షణలకు బదిలీచేశారు. ఆడిట్ జనరల్, చీరలు, ఉపాలయాలు, వసతుల విభాగంలో పనిచేస్తున్న పి.భాగ్యజ్యోతిని మెయిన్ స్టోర్స్, ఆడిట్., జనరల్, చీరల విభాగానికి బదిలీ చేశారు. గణాంకాలు, స్టేషనరీ, ఎంపీ ఫారాలు, ఆర్‌టీఐ యాక్ట్ విభాగాల్లో పనిచేస్తున్న పీ సునీతను స్టేషనరీ, ఎంవీ ఫారాలు, ఆర్‌టీఐ యాక్ట్, పూజలు, ఉత్సవాలు, ధర్మపథం విభాగాలకు బదిలీ చేశారు. శానిటేషన్, దత్తత దేవాలయాలు, కొండపై కౌంటర్ల పర్యవేక్షణలో పనిచేస్తున్న కే శ్రీనివాసరావు (చందు)ను శానిటేషన్ దత్తత దేవాలయాలు, ఉపాలయాలు, వసతుల విభాగానికి బదిలీ చేశారు. అన్నదానం, భూములు, లీజులు, లీగల్, ఆర్‌టీఐ యాక్ట్, పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ (పీఆర్‌వో)గా పనిచేస్తున్న ఏఈవో బి వెంకటరెడ్డిని భూములు, లీజులు, లీగల్, ఆర్ టీఐ యాక్ట్, పబ్లిక్ రిలేషన్లు (పీఆర్‌వో), ఎస్టాబ్లిష్ మెంట్, వేదపాఠశాల, ప్రొవిజన్ స్టోర్, శానిటేషన్, సెక్యూరిటీ సూపర్‌విజన్, హోమ్‌గార్డులు, ప్రైవేట్ సెక్యూరిటీలో పనిచేస్తున్న ఏఈవో చంద్రశేఖర్‌ను అన్నదానం, ప్రసాదం,ప్రిపరేషన్, శానిటేషన్, వేదపాఠశాల విభాగాలకు బదిలీ చేశారు. ట్రస్ట్‌బోర్డుల విభాగాల్లో పనిచేస్తున్న ఏఈవో రమేష్ బాబును ఎస్టాబ్లిష్‌మెంట్, ప్రొవిజన్ స్టోర్, ఫెస్టివల్, పూజలు, మెయిన్ టెంపుల్, సబ్‌టెంపుల్, ట్రస్ట్‌బోర్డు, సెక్యూరిటీ విభాగం, హోమ్‌గార్డులు, ప్రైవేట్ సెక్యూరిటీ విభాగానికి బదిలీ చేశారు.

## మహిళ అనుమానాస్పద మృతి కేసులో వీడిన మిస్టరీ

**బంగారం కోసం స్వంత మేనమామ, అతడి భార్య చేతిలో హతమైన మహిళ**

**పెనమలూరు, మార్చి 7:** మహిళ అనుమానాస్పద మృతి కేసులో మిస్టరీని పెనమలూరు పోలీసులు ఛేదించారు. బంగారం కోసం ఆమె మేనమామ, అతడి భార్య ఆ మహిళను దారుణంగా హత్య చేసి ఒంటిపై బంగారం ఒలుచుకొని ఉడాయించగా రెండు రోజుల్లోనే పెనమలూరు సీఐ తన సిబ్బందితో కలిసి నిందితులను అదుపులోకి తీసుకొని రిమాండుకు తరలించారు. సీఐ రామారావు, ఎస్సైలను ఉన్నతాధికారులు అభినందించారు. గోసాల వైకుంఠపురానికి చెందిన పీతా జయలక్ష్మి మేనమామ చేకూరి ప్రకాష్, అతడి భార్య జ్యోతి కానూరు వినాయక్‌నగర్ వాసులు. వీరిద్దరూ పీతా జయలక్ష్మి ఒంటిపైనున్న బంగారంపై కన్నేశారు. ఈనెల 1న జయలక్ష్మి ఇంటికి వచ్చిన ప్రకాష్, జ్యోతి తమకు వణుకూరు సమీపంలోని కార్పొరేట్ వెంచర్‌లో ఒక ప్లాట్ వచ్చిందని, చూసి వద్దామని మాయమాటలు చెప్పి ఆటోలో తీసుకెళ్లారు. ఆరోజు సాయంత్రం నుంచి జయలక్ష్మి ఫోన్ స్విచాఫ్ అయింది. 4న వణుకూరులోని ఏనుగుల కోడు వద్ద ఉన్న కార్పొరేటు వెంచరులో గుర్తు తెలియని మహిళ మృతదేహం ఉందన్న సమాచారంతో పోలీసులు వెళ్లి మహిళ మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టానికి పంపారు. మృతి చెందిన మహిళ ఫొటోను సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయగా ఆమె కుమారుడు కాళిదాసు గుర్తించి పోలీసులకు తన తల్లిని ముద్దాయిలు తీసుకెళ్లిన విషయం చెప్పాడు. దీంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని తమదైన శైలిలో ప్రశ్నించగా నేరం ఒప్పుకొని తామే జయలక్ష్మి ఒంటిపైనున్న బంగారం కోసం హత్య చేసినట్లు, దోచుకొన్న బంగారాన్ని కానూరులోని ముత్తూట్ ఫైనాన్సులో తాకట్టు పెట్టి రూ.లక్ష తీసుకున్నట్టు అంగీకరించారు. కేసు నమోదు చేసిన పోలీసులు వారిని రిమాండుకు తరలించారు.



## నైపుణ్యాలు మెరుగు పరుచుకుంటే ఉన్నతస్థానం

**మొగల్రాజపురం, మార్చి 7:** అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలంటే విద్యార్థులు సమర్థంగా సాంకేతిక నైపుణ్యాలు, భావవ్యక్తీరణ, నాయకత్వ లక్షణాలు అలవరచుకోవాలని నేషనల్ ఇన్ఫర్‌మెటిక్స్ (ఎన్ఐసీ) ఏపీ శాఖ అడిషనల్ అధికారి ఎస్ మధుసూదన్‌రావు చెప్పారు. పీబీ సిద్ధార్థ కళాశాల స్టూడెంట్స్ అఫ్ అసోసియేషన్ ఆఫ్ కంప్యూటర్ సైన్సు ఆధ్వర్యంలో బ్లిట్జ్ క్రీగ్ 2024 సాంకేతిక, సాంస్కృతిక పోటీలను గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ స్వీయ నిర్వహణ, కంప్యూటర్ నైపుణ్యాలు, విశాల దృక్పథం, వృత్తి విలువలు, ఆధ్యాత్మికత వంటి పన్నెండు సూత్రాలను మార్పులకనుగుణంగా ముందుకు వెళ్లాలని సూచించారు. కళాశాల డీన్ రాజేష్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్, కంప్యూటర్ సైన్సు విభాగాధిపతి డాక్టర్ టీఎస్ రవికిరణ్, కళాశాల ఉపాధి శిక్షణా విభాగాధికారి కావూరి శ్రీధర్, పోటీల కన్వీనర్ కోనేరు సుధీర్‌లు మాట్లాడుతూ పోటీల్లో పాల్గొంటేనే సామర్థ్యాలు బయట పడతాయన్నారు. అనంతరం పేపర్, పోస్టర్ ప్రజంటేషన్, డేటాథాన్, టెక్నికల్ క్విజ్, నిధి అన్వేషణ, స్పాట్ ఫొటోగ్రఫీ, మిస్టర్ అండ్ మిస్ బ్లిట్జ్ క్రీగ్ పోటీలు నిర్వహించారు. సాయంత్రం జరిగిన ముగింపు సభలో కోడ్ జ్ఞాన్ సొల్యూషన్స్ వ్యవస్థాపకులు యు.సాయిరాం, వైశ్యా బ్యాంకు చీఫ్ మేనేజర్ వీవీవీ గుప్తా ముఖ్య అతిథులుగా విచ్చేసి పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. విద్యార్థులు, నృత్యాలు, ఫ్యాషన్ షో నిర్వహించారు. కంప్యూటర్ సైన్సు విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## డీసీపీగా అధిరాజ్‌సింగ్ రాణా


కలెక్టర్‌ను కలిసిన డీసీపీ అధిరాజ్‌సింగ్ రాణా

**విజయవాడ:** నగర డీసీపీగా అధిరాజ్‌సింగ్ రాణా గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన స్థానంలో పనిచేసిన కృష్ణకాంత్ పాటిల్‌ను తిరుపతి జిల్లా ఎస్పీగా బదిలీ చేసిన విషయం తెలిసిందే. విజయనగరంలోని ఏపీఎస్పీ ఐదో బెటాలియన్ కమాండెంట్‌గా పనిచేస్తున్న అధిరాజ్‌సింగ్ రాణా ఇక్కడికి డీసీపీగా బదిలీపై వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం పోలీసు కమిషనర్ టి.కాంతిరాణాను మర్యాదపూర్వకంగా కలిశారు. నగరంలోని సెంట్రల్, నార్త్, వెస్ట్‌జోన్‌లోని ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, స్పెషల్‌బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్లు ఆయన్ను కలిసి అభినందనలు తెలిపారు.

## నగరంలో 'వెయ్ దరువెయ్' చిత్రబృందం సందడి

**పటమట:** ప్రముఖ దర్శకుడు పూరీ జగన్నాథ్ సోదరుడు హీరో సాయిరామ్ శంకర్ గురువారం నగరంలో సందడి చేశారు. తాను నటించిన వెయ్ దరువెయ్ చిత్రం ఈ నెల 15న విడుదల సందర్భంగా ప్రమోషన్‌లో భాగంగా గురునానక్ కాలనీ రోడ్డులోని ఒక హోటల్‌లో చిత్ర యూనిట్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హీరో సాయిరామ్‌శంకర్ మాట్లాడుతూ ఈ చిత్రం పూర్తిస్థాయి కామెడీ, యాక్షన్ చిత్రమని అన్ని వర్గాలను ఆకట్టుకుంటుందన్నారు. చిత్రం ట్రైలర్ టీజర్‌కు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన వస్తోందన్నారు. ఈ నెల 15న ప్రేక్షకుల ముందుకు రాబోతుందని, ప్రముఖ నటులు సునీల్ నటన హైలెట్‌గా ఉంటుందన్నారు. తన సోదరుడు పూరి జగన్నాథ్ దర్శకత్వంలో నటించే అవకాశం వస్తే తప్పక నటిస్తానన్నారు. ఈ చిత్రాన్ని 38 రోజుల్లోనే నిర్మించామని నిర్మాత దేవరాజ్ కొత్తూరు చెప్పారు. సంగీత దర్శకుడు భీమ్స్ అందించిన పాటలు ప్రేక్షకులను ఉర్రూతలూగిస్తాయని, ప్రభాస్ శ్రీను, సత్యం రాజేష్ నటించారని తెలిపారు. జబర్దస్త్ కార్తీక్ పాల్గొన్నారు.

## రాజకీయ కుట్రలో భాగమే పోలీసుల తనిఖీలు

**వన్‌టౌన్:** జనసేన పార్టీ కేంద్ర కార్యాలయ సిబ్బంది నివాసముంటున్న అపార్ట్‌మెంట్ సముదాయాన్ని పోలీసులు తనిఖీ చేయడం రాజకీయ కుట్రలో భాగమేనని జనసేన పార్టీ నగరాధ్యక్షుడు, పశ్చిమ ఇన్‌చార్జి పోతిన మహేష్ గురువారం ఒక ప్రకటనలో అన్నారు. వైసీపీ నేతలు, సీఎం చెప్పినట్టు చేయడమంటే పోలీసు అధికారులేమైనా కిరాయి మనుషులా అని ప్రశ్నించారు. జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం సిబ్బంది ఉంటున్న అపార్ట్‌మెంట్ తనిఖీపై డీజీపీ, గుంటూరు జిల్లా ఎస్పీ తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. రాబోయే ఎన్నికల్లో వైసీపీ ఓటమి తప్పదని హెచ్చరించారు. తాడేపల్లి జయహో బీసీ సభ విజయవంతం కావడంతో పవన్‌కల్యాణ్‌పై జగన్‌రెడ్డికి, ఆయన పార్టీ నేతలకు అక్కసు పెరిగే ఇలాంటి దాడులకు పాల్పడుతున్నారన్నారు.

**అత్యంత దుర్మార్గం: కోగంటి**

జనసేన పార్టీ సిబ్బంది నివాసముంటున్న అపార్ట్‌మెంట్‌పై పోలీసులు దాడి చేయడం అత్యంత దుర్మార్గమైన చర్యని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి కోగంటి రామారావు గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. రాత్రి 10 గంటల సమయంలో జనసేన సిబ్బంది ఉంటున్న అపార్ట్‌మెంట్‌కు పోలీసులకు వెళ్లాల్సిన అవసరమేంటని ప్రశ్నించారు. ఇలాంటి దాడులకు జనసేన-టీడీపీ నేతలు, కార్యకర్తలు భయపడే ప్రసక్తి లేదని రాబోయే ఎన్నికల్లో టీడీపీ-జనసేన ఉమ్మడి ప్రభుత్వమే వస్తుందన్నారు.

## మహిళల రక్షణకు అత్యధిక ప్రాధాన్యం: డీజీపీ

అమరావతి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మహిళల రక్షణ కోసం పోలీసు శాఖ అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని డీజీపీ కేవీ రాజేంద్రనాథ్ రెడ్డి చెప్పారు. మంగళగిరిలోని రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయంలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ బాస్ మాట్లాడుతూ మహిళలపై వేధింపుల నుంచి రక్షణ కోసం దిశ యాప్.. ఫిర్యాదులకు దిశ పోలీసుస్టేషన్లు ఏర్పాటు చేశామని తెలిపారు. మహిళలపై నేరాలకు పాల్పడిన వారికి త్వరగా శిక్ష పడేలా జిల్లా స్థాయి అధికారి పర్యవేక్షణలో దర్యాప్తు చేయించి బాధ్యులను జైలుకు పంపుతున్నట్లు వివరించారు. డీఆర్‌డీవో, ఇస్రో, చంద్రయాన్ తదితర దేశం గర్వించే పనుల్లో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. ఎన్నో కేసులను ఛేదించడంలో ప్రతిభ చూపిన ఫోరెన్సిక్, సైబర్ విభాగాల మహిళా ఉద్యోగులకు ఈ సందర్భంగా డీజీపీ బహుమతులు అందజేశారు. ఆరుసార్లు హిమాలయాల్ని అధిరోహించిన డీజీపీ కార్యాలయ జేఏవో పద్మావతిని ప్రత్యేకంగా అభినందించారు.

## జగన్ దళిత వ్యతిరేకి : వర్ల

అమరావతి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): 'జగన్ దళిత వ్యతిరేకి. ఆయన పక్కన దళితులు కూర్చుంటే ఆయనకు గిట్టదు' అని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వర్ల రామయ్య ఆరోపించారు. గురువారం టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రకాశం జిల్లా వెలిగొండ సభలో వైసీపీ ఇన్‌చార్జ్ తాడిపత్రి చంద్రశేఖర్, మంత్రి ఆదిమూలం సురేశ్‌ను వేదిక నుంచి కిందికి దింపి జగన్ నేరం చేశారన్నారు. ఆ స్థానాల్లో తన వర్గీయులైన వైవీ సుబ్బారెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మలను కూర్చోబెట్టారన్నారు. జగన్ పక్కన దళితులు కూర్చోవడం ఇష్టం లేకనే లేపి కిందికి పంపారన్నారు.

## చేయూత కాదు.. చేతివాటం: పంచుమర్తి

అమరావతి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మాటల్లో అక్క చెల్లెమ్మలంటూ కల్లబొల్లి కబుర్లు చెప్పే జగన్ మహిళలను నట్టేట ముంచుతున్నారని ఒక ప్రకటనలో ఎమ్మెల్సీ పంచుమర్తి అనూరాధ ఆరోపించారు. అనకాపల్లి చేయూత సభలో జగన్ మహిళలను ఉద్ధరించినట్లు పచ్చి అబద్ధాలు చెప్పడం సిగ్గుచేటన్నారు. జగన్ చెప్పే కల్లబొల్లి మాటలు నమ్మేందుకు ప్రజలు సిద్ధంగా లేరని, రాబోయే ఎన్నికల్లో జగన్ ప్రభుత్వాన్ని మహిళలే గద్దె దించుతారన్నారు.

## మహిళల్లో ఆత్మగౌరవం నింపుతాం: చంద్రబాబు

అమరావతి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా టీడీపీ అధినేత చంద్రబాబు మహిళలకు ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. మహిళలంటే సమాజంలో సగం జనాభా మాత్రమే కాదు, సమాజ శక్తిలో సగం అని పేర్కొన్నారు. అందుకే మహిళలను తోబుట్టువుల్లా చూసిన ఏకైక పార్టీ తెలుగుదేశం అని గుర్తు చేశారు. మహిళల ఆత్మగౌరవాన్ని నిలబెట్టి వారిలో ఆత్మ విశ్వాసం నింపి, ఆర్థిక స్వావలంబనకు నిరంతరం పని చేసింది టీడీపీనేనన్నారు. మీ అందరి మద్దతుతో త్వరలో ఏర్పడే టీడీపీ-జనసేన ప్రభుత్వంలో మీకు అభివృద్ధి, భద్రత కల్పిస్తామని చంద్రబాబు అన్నారు.

## పెదకూరపాడులో లైవ్ వెబ్‌కాస్టింగ్ నిర్వహించాలి

- ఈసీకి ఎంఏ షరీఫ్, మాజీ ఎమ్మెల్యే శ్రీధర్ లేఖలు

అమరావతి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా పెదకూరపాడు నియోజకవర్గంలోని సున్నితమైన పోలింగ్‌బూత్‌ల వద్ద భారీ బందోబస్తు ఏర్పాటుచేసి లైవ్ వెబ్‌కాస్టింగ్ నిర్వహించాలని ఎన్నికల ప్రధానాధికారికి మండలి మాజీ చైర్మన్ ఎంఏ షరీఫ్, మాజీ ఎమ్మెల్యే శ్రీధర్ లేఖలు రాశారు. నియోజకవర్గంలోని శాంతిభద్రత సమస్యలు తలెత్తే 25 ప్రాంతాల్లో భారీ బందోబస్తు పెట్టి నిరంతరం వెబ్‌కాస్టింగ్ నిర్వహించాలని కోరారు. శాంతియుతంగా ఎన్నికలు నిర్వహణకు పల్నాడు జిల్లా కలెక్టర్, ఎస్పీలకు ఎన్నికల అధికారి తగు ఆదేశాలివ్వాలంటూ శాంతిభద్రతల సమస్యల జాబితాను జత చేసి అందించారు.

## ఆరు వారాల్లో జగన్ సర్కారు కూలడం ఖాయం

- రఘురామరాజు

న్యూఢిల్లీ, మార్చి 7(ఆంధ్రజ్యోతి): 'మరో ఆరు వారాల్లో ప్రజా వ్యతిరేక జగన్ సర్కార్ కూలిపోవడం ఖాయం. తనను వ్యతిరేకించే వారిపై దౌర్జన్యాలకు పాల్పడుతూ, వారిని నీచమైన భాషలో దూషిస్తూ, తల్లిని, చెల్లిని తిట్టించే దుష్ట సంస్కృతికి చరమగీతం పాడడం ఎంతో దూరంలో లేదు. అటువంటి వారికి సమాధి కట్టడానికి ఎన్నికలే పునాది అవుతాయి' అని నరసాపురం ఎంపీ రఘురామకృష్ణరాజు అన్నారు. గురువారం రచ్చబండ కార్యక్రమంలో భాగంగా ఆయన మీడియాతో మాటాడారు. 'రాష్ట్రంలో రెండేసి ఓట్లు ఉన్న వారి ఓట్లను తొలగించాలని, ఓటర్ల జాబితాలో దొంగ ఓట్లు నమోదు చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ రాష్ట్రపతికి ఈమెయిల్ ద్వారా ఫిర్యాదు చేసిన వ్యక్తి ఇంట్లోకి ఒక రౌడీ ముఠా చొరబడి దౌర్జన్యం చేసింది. ఐపీ అడ్రస్ ఆధారంగా సజ్జల గ్యాంగ్ అతని ఇంటి మీదికి వెళ్లి, చంపేస్తామని బెదిరించడం వారి దౌర్జన్యాలకు పరాకాష్ఠ. ఎంతమందిని బెదిరించగలరు? ఎంతమందిని చంపగలరు?' అని ఎంపీ అన్నారు.

## మా డిమాండ్లను మేనిఫెస్టోల్లో పెట్టాలి

- రాజకీయ పార్టీలకు పరిశ్రమల సమాఖ్య విజ్ఞప్తి

అమరావతి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): పరిశ్రమలకు పెండింగ్ ప్రోత్సాహకాలు, రీయింబర్స్‌మెంట్ అంశాలతోసహా ప్రధానమైన డిమాండ్లను రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలు (వైసీపీ, టీడీపీ, జనసేన, బీజేపీ) ఎన్నికల మేనిఫెస్టోల్లో చేర్చాలని ఆంధ్రప్రదేశ్ పరిశ్రమల సమాఖ్య విజ్ఞప్తి చేసింది. రాష్ట్రంలోని పరిశ్రమలు, వ్యాపార సంస్థల సమగ్ర అభివృద్ధికి మెరుగైన పారిశ్రామిక విధానాలతోపాటు ప్రత్యేక బడ్జెట్ ఉండాలంటూ కొన్ని సూచనలు చేసింది. ఏపీఐఐసీ ద్వారా పరిశ్రమలకు సరసమైన ధరలకు భూములు కేటాయించాలని, పరిశ్రమల విద్యుత్ రేట్లను పొరుగు రాష్ట్రాల స్థాయికి తగ్గించాలని, పొరుగు రాష్ట్రాలతో పోటీ పడేందుకు ఇంధన చార్జీలూ తగ్గించాలని కోరింది. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో భాగంగా అన్ని కేటగిరీల లైసెన్సులకు కనీసం ఐదేళ్లపాటు ఎన్‌వోసీ జారీ చేయాలని, బ్యూరోక్రటిక్ వేధింపులను తగ్గించి.. జిల్లా పరిశ్రమల కేంద్రాలు ప్రభావవంతంగా పనిచేసేలా పునర్నిర్మించాలని డిమాండ్ చేసింది. అన్ని జిల్లాల్లో మహిళా పారిశ్రామికవేత్తల పార్కులను అభివృద్ధి చేయాలని కోరింది.

## 13న వివిధ లబ్ధిదారులతో ప్రధాని ముఖాముఖి

అమరావతి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఔట్ రీచ్ ప్రోగ్రాంలో భాగంగా వివిధ జాతీయ పథకాల లబ్ధిదారులతో ఈనెల 13న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వర్చువల్‌గా మాట్లాడతారని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి తెలిపారు. గురువారం అమరావతి సచివాలయం నుంచి సీఎస్, కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ.. ఎన్‌ఎస్ఎస్డీసీ, ఎన్ఎస్కేఎఫ్‌డీసీ, ఎన్సీసీఎఫ్టీసీ, నమస్తే పథకాల కింద నూతన రుణ గ్రహీతలతో ప్రధాన మంత్రి మాట్లాడతారని చెప్పారు. కాగా 20240-25 ఆర్మీ రిక్రూట్‌మెంట్‌పై సీఎస్ సమీక్ష నిర్వహించారు. వచ్చే నవంబరులో గుంటూరు ఆర్మీ రిక్రూట్‌మెంట్ ఆఫీస్ పరిధిలోని 13 జిల్లాల్లో ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ జరుగుతుందని తెలిపారు.

## భారతీయుల మూలాలెక్కడివి?

- 50వేల ఏళ్ల క్రితం ఆఫ్రికా నుంచి వచ్చినవారితో పాటు మూడు సమూహాల్లో మన మూలాలు
- ఎయిమ్స్ సహా పలు ప్రముఖ వర్సిటీలకు చెందిన పరిశోధకుల బృందం చేసిన రిసెర్చ్‌లో వెలుగులోకి

న్యూఢిల్లీ, మార్చి 7: భారతీయులు ఎక్కడి నుంచి వచ్చారు? మన పూర్వీకుల మూలాలు ఎక్కడివి? ఈ ప్రశ్నలకు సమాధానాలు కనుక్కోవడానికి గతంలో చాలా పరిశోధనలే జరిగాయి. తాజాగా.. పాపులేషన్ జెనెటిసిస్ట్ ప్రియా మూర్జానీ నేతృత్వంలో ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, మిషిగన్ వర్సిటీ, పెరెల్‌మ్యాన్ స్కూల్ ఆఫ్ మెడిసిన్, యూనివర్సిటీ ఆఫ్ సదరన్ క్యాలిఫోర్నియా అండ్ యూసీ బర్కిలీ పరిశోధకులు చేసిన పరిశోధనల్లో మన మూలాలకు సంబంధించి పలు సంచలన అంశాలు వెలుగులోకి వచ్చాయి. ఈ బృందం మనదేశంలోని అన్ని ప్రాంతా లు, భాషలు, తెగలకు చెందిన 2762 మంది జన్యునమూనాలు సేకరించి, పరిశీలించి, భారతీయుల్లో అత్యధికుల మూలాలు.. 50 వేల ఏళ్ల క్రితం ఆఫ్రికా నుంచి వచ్చినవారితోపాటు, ఇరాన్‌కు చెందిన రైతులు, గడ్డి మైదానాలను దాటివచ్చిన యురేసియన్ పశువుల కాపరులు, దక్షిణాసియాలోని వేటగాళ్ల సమూహాల్లో ఉన్నట్టు పేర్కొంది. వీరిలో ఇరానియన్ రైతులు క్రీ.పూ.4700 నుంచి క్రీపూ.3000 నడుమ, యురేసియన్ పశువుల కాపర్లు క్రీ.పూ.3000 తర్వాత ఇక్కడికి వలస వచ్చినట్టు వెల్లడించింది. అలాగే. తాము పరిశీలించిన 2700 జీనోమ్‌లలో నియాండర్తల్స్, డెనిసోవన్ల జన్యువులు కూడా ఉన్నట్టు వివరించింది. భారతదేశంలో డెనిసోవన్లకు సంబంధించిన ఎలాంటి జాడలూ, శిలాజాలూ లేకున్నా వారి జన్యువులు భారతీయుల్లో ఉండడం గమనార్హం. అలాగే.. ఆధునిక భారతీయుల జన్యువులు ఎవరితో ఎక్కువ శాతం సరిపోలుతాయో తెలుసుకునేందుకు డీఎన్‌ఏ నమూనాలను విశ్లేషించగా.. ప్రస్తుత తజకిస్థాన్ ప్రాంతంలోని సరాజమ్ ప్రాంతంలోని రైతులతో బాగా దగ్గరి పోలికలు ఉన్నట్టు వెల్లడైంది.

# కేజీబీవీల్లో కలెక్షన్ల కలకలం!

- ఎంటీఎస్ పరిధిలోకి తీసుకువచ్చేలా ఉత్తర్వులిప్పిస్తాం...
- టీచర్ల నుంచి డబ్బుల వసూళ్లకు సంఘ నేత శ్రీకారం
- ప్రతి కేజీబీవీ నుంచి రూ.2.8 లక్షలు వసూలు టార్గెట్
- ప్రభుత్వంలో కీలక వ్యక్తుల సహకారం ఉందని మెసేజ్
- సమగ్ర శిక్ష ఉన్నతాధికారుల ఫిర్యాదుతో విచారణ
- దేవరాపల్లి కేజీబీవీ సీఆర్‌టీ తొలగింపు... కేసు నమోదు

విశాఖపట్నం/అనకాపల్లి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో కలెక్షన్ల కలకలం రేగింది. వీటిలో పనిచేస్తున్న కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్లను మినిమం టైమ్ స్కేల్ పరిధిలోకి తీసుకువచ్చేలా ఉత్తర్వులు తెస్తానంటూ టీచర్ల సంఘ నేత ఒకరు వసూళ్లకు శ్రీకారం చుట్టారు. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టి అనకాపల్లి జిల్లా దేవరాపల్లి కేజీబీవీలో తెలుగు సీఆర్‌టీగా పనిచేస్తున్న ఎస్‌బీటీఎస్ దేవి (కేజీబీవీ టీచర్ల సంఘం నేత)ని విధుల నుంచి తొలగించారు. రాష్ట్రంలోని 352 కేజీబీవీల్లో టీచర్లు కాంట్రాక్టు ప్రాతిపదికపైనే పనిచేస్తున్నారు. ఏడాదికి ఒకసారి వీరి సర్వీస్‌ను పునరుద్ధరిస్తుంటారు. కాంట్రాక్టు టీచర్ల పోరాటం ఫలితంగా ఇటీవల వీరి జీతాలు స్వల్పంగా పెంచారు. ప్రస్తుతం కేజీబీవీ ప్రిన్సిపాల్‌కు రూ.32వేలు, సీఆర్‌టీలకు రూ.27 వేలు ఇస్తున్నారు. అయితే ఎంటీఎస్ పరిధిలోకి వెళితే జీతాలు పెరగడమే కాకుండా సర్వీస్‌లో బ్రేక్ ఉండదని సంఘ నేతగా ఉన్న దేవి నమ్మబలికారు. త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ వెంటనే డబ్బులు ఇవ్వాలని, ప్రతి స్కూలు నుంచి ఒకరిద్దరు వసూలు బాధ్యత తీసుకోవాలని అన్ని జిల్లాల కేజీబీవీ టీచర్లకు చెందిన వాట్సాప్ గ్రూపుల్లో ఆమె మెసేజ్‌లు పెట్టారు. ఇందుకు ప్రభుత్వంలో అత్యంత కీలక వ్యక్తుల సహకారం ఉందని, అనుకున్న మొత్తం చూపించగలిగితే మరుసటిరోజు సాయంత్రానికి ఎంటీఎస్ వర్తింపజేస్తూ ఆదేశాలు వస్తాయని ఆ మెసేజ్‌లో పేర్కొన్నారు. ఒక్కో కేజీబీవీ నుంచి రూ.2.8 లక్షలు వంతున రూ.కోట్లలో వసూలు చేసేందుకు సిద్ధమయ్యారు. దీనిపై సమాచారం అందుకున్న సమగ్రశిక్షా అభియాన్ ఉన్నతాధికారులు సీఎం పేషీకి ఫిర్యాదు చేశారు. వసూళ్ల వ్యవహారం వాస్తవమేనని విచారణలో తేలింది. ప్రభుత్వ పెద్దల ఆదేశాల మేరకు దేవిని విధుల నుంచి తొలగిస్తూ బుధవారం రాత్రి అనకాపల్లి డీఈవో/ సమగ్రశిక్ష ఎక్స్ అఫిషియో ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ ఎం.వెంకట లక్ష్మమ్మ ఉత్తర్వులు జారీ చేశారు. దేవిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని అనకాపల్లి డీఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు దేవిపై అనకాపల్లి రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, కేజీబీవీ సంఘ నేతగా ఉన్న దేవిపై అనేక ఆరోపణలు ఉన్నాయి. ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా సమగ్రశిక్షా అభియాన్ ఉద్యోగులు చేపట్టిన ఆందోళన సందర్భంగా ప్రభుత్వానికి ఆమె అనుకూలంగా వ్యవహరించారని అప్పట్లో ఉద్యోగులు ఆరోపించారు. ఎస్ఎస్ఏ ప్రధాన కార్యాలయంలో ఒక కీలక అధికారి ఆశీస్సులతో కేజీబీవీలపైనా దేవి పెత్తనం చెలాయిస్తున్నారని చెబుతుంటారు. ఉత్తరాంధ్ర పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థికి మద్దతుగా గతేడాది దసపల్లా హోటల్‌లో కేజీబీవీ టీచర్లతో ఆమె సమావేశం నిర్వహించారు.



అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రం పాడేరులో జగన్ మేనత్త వైఎస్ విమలారెడ్డిని సత్కరిస్తున్న పాస్టర్లు

## చేతికో ట్యాగ్.. కవర్

- జగన్ మేనత్త విమలారెడ్డి ఆధ్వర్యంలో పాస్టర్లతో భేటీ
- రవాణా ఖర్చుల పేరిట తలా 1000 పంపిణీ
- వెంట వచ్చిన సాధారణ సభ్యులకు రూ.500
- పరోక్షంగా వైసీపీకి మద్దతుగా పలువురు ప్రసంగం

పాడేరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి మద్దతుగా ఆయన మేనత్త వైఎస్ విమలారెడ్డి అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రమైన పాడేరులో పాస్టర్లతో సమావేశం నిర్వహించారు. గురువారం స్థానిక ఫంక్షన్ హాలులో 'అల్లూరి జిల్లా సేవకుల సదస్సు' పేరిట ఈ సమావేశం ఏర్పాటు చేశారు. ఆమె రాజకీయ ప్రస్తావన తీసుకురాకపోయినా, క్రిస్టియన్ మైనారిటీ సంఘాల పెద్దలుగా ఉన్న జాన్ వెస్లీ, జాన్సన్‌లు పరోక్షంగా వైఎస్ జగన్‌కు మద్దతుగా ప్రసంగించారు. ప్రస్తుత ప్రభుత్వం క్రైస్తవులకు అనుకూలంగా ఉందని, భవిష్యత్తులో సైతం ఇదే ప్రభుత్వం అధికారంలో ఉంటే మంచి జరుగుతుందని పేర్కొన్నారు. సమావేశానికి హాజరైన పాస్టర్లకు రవాణా ఖర్చుల పేరిట తలా రూ.వెయ్యి, వారి వెనుక వచ్చిన సాధారణ సభ్యులకు రూ.500 చొప్పున పంపిణీ చేశారు. డబ్బులు పంపిణీ కార్యక్రమం కోసం (ఒకసారి తీసుకున్నవారు రెండోసారి తీసుకోకుండా) ప్రతి ఒక్కరి చేతికి ట్యాగ్ వేశారు. సమావేశం అనంతరం ఆ ట్యాగ్‌ను కట్ చేసిన తర్వాత వారికి డబ్బులున్న కవరు అందజేశారు. జిల్లాలోని పాస్టర్లందరినీ ఈ సమావేశానికి ఆహ్వానించినప్పటికీ కొందరు రాలేదు. పాడేరు, జి.మాడుగుల, హుకుంపేట, డుంబ్రిగుడ, అరకులోయ మండలాల నుంచి సుమారు వెయ్యి మంది వరకు హాజరు కాగా, వారిలో మూడొంతులు సాధారణ సభ్యులు, ఒక వంతు పాస్టర్లు ఉన్నారు.

# 'మైనార్టీ'లో మాయాజాలం!

- బై ట్రాన్స్‌ఫర్ విధానంలో అనర్హులకు అందలం
- ఇతర శాఖల ఉద్యోగులకు అడ్డగోలుగా పదవులు
- నాన్ గెజిటెడ్ ఉద్యోగులతో గెజిటెడ్ పోస్టుల భర్తీ
- మంత్రి పేషీలోని ఇద్దరు అధికారుల చేతివాటం
- అండగా సచివాలయంలో మిడిల్ లెవల్ అధికారి
- పోస్టింగ్‌కు లక్షల్లో వసూలు చేసినట్లు ఆరోపణలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర మైనార్టీ సంక్షేమశాఖ అక్రమ నియామకాలకు అడ్డాగా మారింది. ఇతర శాఖల నుంచి అనర్హులను తీసుకొచ్చి నిబంధనలకు విరుద్ధంగా గెజిటెడ్ హోదా పోస్టుల్లో నియమించారు. ఈ వ్యవహారంలో మంత్రి పేషీ సిబ్బంది పాత్ర ఉండటం తీవ్ర విమర్శలకు దారి తీసింది. ఈ అడ్డగోలు నియామకాలు జనవరిలో జరగ్గా విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మైనార్టీ సంక్షేమ శాఖలో నాలుగు అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ) పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇవన్నీ గెజిటెడ్ పోస్టులు. ఆ శాఖలో అర్హులు ఉంటే వాటిలో మూడింటిని పదోన్నతుల ద్వారా లేదా అపాయింట్‌మెంట్ బై ట్రాన్స్‌ఫర్ (ఇతర శాఖల నుంచి తీసుకోవడం) ద్వారా, ఒక పోస్టును డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ విధానంలో గ్రూప్-1 నోటిఫికేషన్ ఇచ్చి ఏపీపీఎస్సీ ద్వారా భర్తీ చేయాల్సి ఉంది. అయితే మొత్తం నాలుగు పోస్టులనూ నిబంధనలకు విరుద్ధంగా అపాయింట్‌మెంట్ బై ట్రాన్స్‌ఫర్ విధానంలో భర్తీ చేసేశారు. మరోవైపు ఏ శాఖలో అయినా ఖాళీ పోస్టులను శాశ్వత ప్రాతిపదికన ఇతర శాఖల ఉద్యోగులతో భర్తీ చేసేటప్పుడు సమాన స్థాయి అధికారులను మాత్రమే నియమించాలనే నిబంధన ఉంది. అయితే మైనార్టీ సంక్షేమ శాఖలో రెండు ఏడీ పోస్టులు విద్యాశాఖలో పనిచేస్తున్న అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ల (నాన్ గెజిటెడ్)తో, మరో రెండింటిని మైనార్టీ సంక్షేమశాఖ పేషీ అధికారులతో నింపేశారు. అయితే విద్యాశాఖ నుంచి వచ్చిన ఇద్దరి నుంచి మంత్రి పేషీలో అధికారులతో పాటు రాష్ట్ర సచివాలయంలో ఆ శాఖలో చక్రం తిప్పే మిడిల్ లెవల్ అధికారి సైతం రూ.లక్షల్లో వసూలు చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

### అనర్హులకు అందలం

మైనార్టీ సంక్షేమ శాఖ పేషీలో డిప్యూటీ సీఎంకు అడిషనల్ పీఎస్‌గా విధులు నిర్వర్తించే మహమ్మద్ గౌస్ పీర్ కడప మున్సిపల్ కార్పొరేషన్ లో మేనేజర్ పోస్టింగ్. ఆయనది నాన్ గెజిటెడ్ పోస్టు. నిబంధనలకు విరుద్ధంగా ఆయనకు శాఖలో ఏడీ పోస్టు కట్టబెట్టారు. ఏపీ దూదేకుల కార్పొరేషన్‌కి ఎండీగా కూడా ఆయన్ను నియమించారు. ఒక నాన్ గెజిటెడ్ అధికారిని ఏకంగా కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అదేవిధంగా మైనార్టీ సంక్షేమశాఖ మంత్రికి పీఎస్‌గా విధులు నిర్వర్తిస్తున్న నిజాముద్దీన్ ఇరిగేషన్ శాఖలో గెజిటెడ్ సూపరింటెండెంట్‌గా పని చేస్తున్నారు. ఆయన్ను కూడా శాఖలో ఏడీ పోస్టులో నియమించారు. ఉర్దూ అకాడమీ సెక్రటరీగా పోస్టింగ్ ఇచ్చి, మళ్లీ అక్కడ నుంచి మార్చి ఏపీ స్టేట్ మైనార్టీ కమిషన్ సెక్రటరీగా నియమించారు. ఈ హోదాలో నియమితులయ్యే వారు సచివాలయ సర్వీసులోని జాయింట్ సెక్రటరీ, అడిషనల్ సెక్రటరీ స్థాయి అధికారులై ఉండాలి. అయినా కూడా అడ్డదారులు తొక్కి అనర్హులకు అందలం వేశారు.

### జిల్లా అధికారుల నియామకంలోనూ అక్రమాలు

జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారుల నియామకంలోనూ అక్రమాలు చోటు చేసుకున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆరుగురిని జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారులుగా డిప్యుటేషన్‌పై నియమించినట్లు తెలిసింది. ఈ నియమకాల్లో కూడా శాఖ పేషీలోని అధికారులు, మిడిల్ లెవల్ అధికారితో చేతులు కలిపి ఒక్కొక్కరి నుంచి రూ.లక్షల్లో వసూలు చేసినట్లు తెలుస్తోంది. ఇటీవల వరకు మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శిగా వ్యవహరించి, స్వచ్ఛంద పదవీ విరమణ చేసి వైసీపీలో చేరిన అధికారితో ఈ మిడిల్ లెవల్ అధికారికి సన్నిహిత సంబంధాలు ఉండడంతో శాఖలో ఈయన ఆడింది ఆటగా సాగుతోందనే ఆరోపణలు ఉన్నాయి. ఈ అడ్డగోలు నియామకాలకు సంబంధించి కింది స్థాయిలో విధులు నిర్వర్తించే మహిళా ఉద్యోగులను వేళాపాళా లేకుండా ఫైల్ పెట్టాలంటూ వేధించినట్లు రాష్ట్ర సచివాలయంలో చర్చ జరుగుతోంది. అయితే అపాయింట్‌మెంట్ బై ట్రాన్స్‌ఫర్ పేరుతో శాఖలో జరిగిన నియామకాలు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రికి తెలియకుండా జరిగాయా? లేక మంత్రి ఆమోదంతోనే జరిగాయా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

## జనసేన ప్రచారానికి ఎన్ఆర్ఐ విరాళం

- 30 ఇన్నోవా వాహనాలను సమకూర్చిన ఉదయభాస్కర్

తిరుపతి అర్బన్, మార్చి 7: అమెరికాలోని అట్లాంటాలో స్థిరపడ్డ కొట్టే ఉదయభాస్కర్ జనసేన ప్రచారానికి 30 ఇన్నోవా వాహనాలను అందజేశారు. తిరుపతిలోని అలిపిరి మార్గంలో ఈ వాహనాలకు గురువారం ఉదయం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్ మాట్లాడుతూ... ఈ వాహనాలను జనసేన పోటీ చేసే నియోజకవర్గాల్లో ప్రచారానికి వినియోగిస్తామన్నారు. జనసేన చిత్తూరు గౌరవాధ్యక్షుడు కృష్ణయ్య, అధికార ప్రతినిధి కీర్తన తదితరులు పాల్గొన్నారు.

# బిల్లు చెల్లించకుండానే లాక్కున్నారు..!

- హిందూపురం తహసీల్దార్ ఆఫీసులో నూతన భవనం నిర్మాణం
- బిల్లులు చెల్లించకపోవడంతో తాళాలు వేసిన కాంట్రాక్టరు
- జేసీ ఆదేశాలతో పగులగొట్టిన అధికారులు
- అయినా కొత్త తాళం వేసుకున్న కాంట్రాక్టరు



కాంట్రాక్టర్‌తో గొడవకు దిగిన డీటీ, రెవెన్యూ సిబ్బంది

హిందూపురం అర్బన్, మార్చి 7: శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం తహసీల్దారు కార్యాలయ ఆవరణంలో నిర్మించిన నూతన భవనాన్ని అధికారులు దౌర్జన్యంగా స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించారు. బిల్లులు చెల్లించేదాకా భవనాన్ని అప్పగించేది లేదని కాంట్రాక్టర్ బాలాజీ అడ్డుకోవడంతో ఆయనతో రెవెన్యూ అధికారులు, సిబ్బంది వాగ్వాదానికి దిగారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో హిందూపురం తహసీల్దారు కార్యాలయ భవన నిర్మాణానికి రూ.90 లక్షలతో టెండర్లు పిలిచారు. ఈ పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ బాలాజీ, 2018లో పనులను ప్రారంభించారు. మొదటి దశలో రూ.30 లక్షలు బిల్లు చెల్లించారు. ఆ తరువాత నిర్మాణ పనులను కాంట్రాక్టర్ దాదాపు పూర్తి చేశారు. ఆ సమయంలో ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో సమస్య మొదలైంది. మిగిలిన బిల్లులను ప్రభుత్వం చెల్లించలేదు. దీంతో బిల్లు వచ్చాక భవనాన్ని అప్పగిస్తానని కాంట్రాక్టర్ అధికారులకు చెప్పారు. వారు సరే అన్నారు. ఈ నేపథ్యంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ ఆదేశాల మేరకు డిప్యూటీ తహసీల్దారు వెంకటేశ్వరులు, ఆర్ఐ తదితరులు భవనం తాళాలను పగులగొట్టి స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించారు. విషయం తెలుసుకున్న కాంట్రాక్టర్ బాలాజీ అడ్డుగా నిలిచారు. ఆయనతో రెవెన్యూ అధికారులు, సిబ్బంది వాగ్వాదానికి దిగారు. భవనంపై తమకు సర్వహక్కులు ఉన్నాయని, ఎన్నికల విధుల నిర్వహణకు స్వాధీనం చేసుకుంటామని ప్రకటించారు. దౌర్జన్యంగా తాళం పగులగొట్టారు. మునిసిపల్ కార్మికులతో భవనాన్ని శుభ్రం చేయడానికి ప్రయత్నం చేశారు. అయినా కాంట్రాక్టర్ పట్టు విడువలేదు. బిల్లులు చెల్లిస్తేనే భవనాన్ని స్వాధీనపరుస్తానని చెబుతూ.. మరోమారు భవనానికి తాళం వేసుకున్నారు.

## ఎండీయూ ఆపరేటర్లకు ఆథరైజేషన్లు!

- జారీ చేయాలని కలెక్టర్లకు ప్రభుత్వం ఆదేశం
- కోర్టులో పెండింగ్ ఉండగా ఎలా ఇస్తారంటున్న డీలర్లు

అమరావతి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): రేషన్ సరుకులను ఇంటింటికీ పంపిణీ చేస్తున్న మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్(ఎండీయూ) ఆపరేటర్లకు ఆథరైజేషన్లు(అధికార పత్రాలు) జారీ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. వారిపై భౌతిక దాడులు జరగకుండా నివారించేందుకు జిల్లా ఎస్పీలు పోలీసు రక్షణ కల్పించాలని నిర్దేశించింది. ఈ మేరకు అన్ని జిల్లాల కలెక్టర్లకు పౌరసరఫరాల శాఖ కమిషనర్ హెచ్.అరుణ్‌కుమార్ సర్క్యులర్ జారీ చేశారు. కొంతమంది రేషన్ డీలర్లు, వారి కుటుంబసభ్యులు, బంధువులే ఎండీయూ ఆపరేటర్లుగా వ్యవహరిస్తున్నట్లు ఫిర్యాదులు అందాయని, అలాంటివారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని ఆ సర్క్యులర్‌లో పేర్కొన్నారు. విశాఖపట్నంలో పెండింగ్ ఉన్న ఎండీయూ ఆపరేటర్లకు ఈనెల 20వ తేదీలోపు ఆథరైజేషన్ల జారీని పూర్తి చేయడానికి ఆ జిల్లా సబ్‌కలెక్టరు, ఆర్డీవోలు, డీఎస్‌వోలు ఏర్పాట్లు చేయాలని కమిషనర్ ఆదేశించారు.

### రేషన్ డీలర్ల అభ్యంతరం

ఎండీయూ ఆపరేటర్లకు ఆథరైజేషన్ పత్రాలను జారీ చేయడాన్ని రేషన్ డీలర్లు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఈ అంశంపై ఇప్పటికే హైకోర్టులో కేసు వేయగా, విచారణలో ఉంది. కోర్టు తీర్పు వెలువడకుండానే ఎండీయూ ఆపరేటర్లకు ఆథరైజేషన్లు ఇవ్వాలంటూ ప్రభుత్వం సర్క్యులర్ జారీ చేయడాన్ని డీలర్లు తప్పుబడుతున్నారు. జాతీయ ఆహార భద్రత చట్టం ప్రకారం.. ఇంటర్ విద్యార్హత, నోటిఫికేషన్, రోస్టర్ పద్ధతిని పాటిస్తూ రాత పరీక్ష, ఇంటర్వ్యూలో ఉత్తీర్ణులైనవారిని రేషన్ డీలర్లుగా నియమించారని, ఇలా ఎంపికైనవారి నుంచి రూ.25 వేలు డిపాజిట్ కట్టించుకుని డీలర్లకు ఆథరైజేషన్లు ఇచ్చారని చెబుతున్నారు. కాబట్టి రేషన్ సరుకుల పంపిణీకి డీలర్లకు తప్ప ఎండీయూ ఆపరేట్లకు ఆథరైజేషన్‌లు ఇవ్వడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు.

## ఎమ్మెల్సీ అనంతబాబుపై చర్యలు తీసుకోవాలి

- లేకపోతే సీఎం కార్యాలయాన్ని ముట్టడిస్తాం: ఫారూక్ సిబ్లీ

కర్నూలు, మార్చి 7: దళిత డ్రైవర్ సుబ్రహ్మణ్యంను హత్య చేసిన ఎమ్మెల్సీ అనంతబాబును ఆ పదవి నుంచి తొలగించి, అతడిపై చర్యలు తీసుకోవాలని మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఫారూఖ్ సిబ్లీ డిమాండ్ చేశారు. గురువారం ఆయన కర్నూలు నగరంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన్‌లో మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి, సమతా సైనిక్ దళ్ సంయుక్తంగా నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఫారూఖ్ సిబ్లీ మాట్లాడుతూ, డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్యకేసును సీబీఐకి అప్పగించాలన్నారు. లేనిపక్షంలో తాడేపల్లిలోని సీఎం జగన్ క్యాంపు కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సమతా సైనిక్ దళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లి సురేంద్రబాబు తదితరులు హాజరయ్యారు.

# గుప్త నిధుల అడ్డా ఎన్నికల బాండ్లు

- జాతీయపార్టీలకు గుప్త మార్గాల్లో రూ.1,832 కోట్లు
- 2022-23లో పార్టీలకు అందిన విరాళాల ఆధారంగా నివేదిక విడుదల చేసిన ఏడీఆర్

న్యూఢిల్లీ, మార్చి 7: జాతీయ పార్టీలకు గుప్త మార్గా ల్లో అందిన నిధుల్లో 82.42% ఎన్నికల బాండ్ల రూపంలోనే లభించాయని స్వతంత్ర ప్రజాస్వామ్య వేదిక ఏడీఆర్ (అసోసియేషన్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్) తెలిపింది. 2022-23 సంవత్సరానికి జాతీయ పార్టీలు ఈసీకి సమర్పించిన విరాళాల జాబితా, ఆడిట్ నివేదికలను పరిశీలిస్తే ఈ విషయం తెలిసిందని వివరించింది. ఆ ఏడాది ఈ పార్టీలకు అందిన విరాళాల్లో మొత్తం రూ.1,832.88 కోట్లు గుప్త మార్గంలో అందగా, అందులో రూ.1,510 కోట్లు ఎన్నిల బాండ్ల రూపంలో లభించాయని తెలిపింది. బీజేపీ, కాంగ్రెస్, సీపీఎం, బీఎస్పీ, ఆప్, నేషనల్ పీపుల్స్ పార్టీల (ఎన్‌పీపీ) ఆడిట్, ఇతర ఆర్థిక వివరాలపై సేకరించిన సమాచారం ఆధారంగా ఏడీఆర్ తన నివేదికను తయారుచేసింది. దీనిని అనుసరించి.. ఎన్నికల బాండ్ల ద్వారా నిధులు అందుకు న్న పార్టీల్లో బీజేపీ ముందు వరుసలో ఉంది. 2022-23లో జాతీయ పార్టీలు ఆర్జించిన మొత్తం ఆదాయంలో బీజేపీ కి రూ.1,400 కోట్లు (76.39%) ఈ రూపంలోనే లభించాయని తెలిపింది. ఇక.. కాంగ్రెస్‌కు రూ.315.11 కోట్లు (17.19%) లభించాయని ఏడీఆర్ పేర్కొంది. వలంటరీ కంట్రిబ్యూషన్లు/కూపన్ల అమ్మకం/ఎన్నికల బాండ్లు, గుప్త మార్గాల్లో తమకు రూపాయి కూడా అందలేదని బీఎస్పీ ప్రకటించిందని వెల్లడించింది. అయితే, బ్యాంకు వడ్డీ, సభ్యత్వ రుసుం, స్థిరాస్తి అమ్మకాలు తదితర మార్గాల్లో బీఎస్పీకి రూ.29.27 కోట్ల ఆదాయం లభించిందని పేర్కొంది. కూపన్ల అమ్మకం ద్వారా తమకు రూ. 136.79 కోట్లు లభించాయని కాంగ్రెస్, సీపీఎం తెలిపాయని పేర్కొంది. ఎన్నికల బాండ్ల వినియోగంలో జాతీయ పార్టీల ప్రస్తావన ప్రముఖంగా కనిపించినా, ప్రాంతీయ పార్టీలూ గణనీయమైన స్థాయిలోనే ఈ నిధులను పొందుతున్నాయని ఏడీఆర్ వెల్లడించింది.



సచివాలయం మెట్లపై బైఠాయించిన కేఏ పాల్

## సచివాలయంలో కేఏ పాల్ బైఠాయింపు

- ఈసీ భేటీలకు ప్రజాశాంతి పార్టీని పిలవలేదని నిరసన

అమరావతి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): పేరు లేని పార్టీలను ఎన్నికల కమిషన్ ఆహ్వానించి, ప్రజాశాంతిని పిలవకపోవడంపై ఆపార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం సచివాలయంలో జరిగిన సమావేశానికి తమకు ఆహ్వానం లేకపోవడంపై ప్రశ్నించడానికి ఆయన సచివాలయానికి వచ్చారు. అయితే ఎన్నికల ప్రధాన అధికారిని కలవటానికి అనుమతి లేదని భద్రతా సిబ్బంది అడ్డుకున్నారు. దీంతో ఆయన ఐదో బ్లాక్ ముందు బైఠాయించి, నిరసన తెలిపారు. ఎన్నికల సంఘం సమావేశాలకు తన పార్టీకి ఆహ్వానం లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 'దేశంలో స్వచ్ఛంగా, స్వేచ్ఛగా ఎన్నికలు జరగాలి. లేకపోతే ఎన్నికలను బహిష్కరించడానికి ప్రజలు సిద్ధం కావాలి' అని పిలుపు ఇచ్చారు.

# అక్కడి ఘటనలపై మోదీ నోరు మెదపరు!


- మాకు మాత్రం పాఠాలు చెబుతారు
- యూపీ, మణిపూర్‌లలో మహిళలపై దారుణమైన అకృత్యాలు
- పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ విమర్శలు

కోల్‌కతా, మార్చి 7: బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మహిళలపై జరిగే అకృత్యాల గురించి నోరు మెదపని ప్రధానమంత్రి నరేంద్రమోదీ.. బెంగాల్ విషయంలో మాత్రం తమకు పాఠాలు చెబుతున్నారని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినాయకురాలు మమతా బెనర్జీ విమర్శించారు. సందేశ్‌ఖాలీ ఘటనలపై బీజేపీ పెద్ద ఎత్తున పుకార్లను వ్యాపింపజేస్తోందని, వాస్తవానికి దేశంలోనే మహిళలకు పశ్చిమ బెంగాల్ అత్యంత సురక్షిత ప్రాంతమని మమత తెలిపారు. గురువారం కోల్‌కతాలో 'మహిళల హక్కులకు కట్టుబడి ఉన్నాం' అనే పేరుతో తృణమూల్ నిర్వహించిన మహిళా ర్యాలీలో మమత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అన్యాయాలు, అకృత్యాల గురించి తమకు తెలిసినప్పుడు వాటిపై కచ్చితంగా చర్యలు తీసుకుంటామని, తమ పార్టీకి చెందిన వారు తప్పు చేసినా వదిలిపెట్టమని హెచ్చరించారు. ప్రధాని మోదీని పరోక్షంగా ప్రస్తావిస్తూ.. 'నిన్న ఇక్కడికి వచ్చి మహిళల మీద బెంగాల్‌లో జరుగుతున్న అకృత్యాల గురించి మాకు బోధనలు చేశారు. కానీ, యూపీలో మహిళల మీద అత్యంత దారుణమైన అత్యాచారాలు జరుగుతున్నాయి. మణిపూర్‌లో మన బిడ్డలను రేప్ చేసి కాల్చి చంపుతున్నారు. దీనికి బీజేపీ సిగ్గుపడాలి' అని మమత పేర్కొన్నారు. సందేశ్‌ఖాలీ తుఫాను బెంగాల్‌ను ఊపేస్తుందని, లోక్‌సభ ఎన్నికల్లో తృణమూల్‌ను ఓడించటంలో నారీశక్తి కీలక పాత్ర పోషిస్తుందని బుధవారం ఆ రాష్ట్ర పర్యటన సందర్భంగా ప్రధాని మోదీ హెచ్చరించిన విషయం తెలిసిందే. మరోవైపు, కోల్‌కతా హైకోర్టు న్యాయమూర్తి పదవికి రాజీనామా చేసి బీజేపీలో చేరిన జస్టిస్ అభిజిత్ గంగోపాధ్యాయ బెంగాల్‌లో ఎక్కడి నుంచి పోటీ చేసినా ఓడిస్తామని మమత ప్రకటించారు. రాష్ట్రంలో మతవిద్వేష రాజకీయాలను తాను అనుమతించను కాబట్టే బీజేపీ వాళ్లకు తనపై ఆగ్రహమని మమత విమర్శించారు. కాగా, గురువారం సందేశ్‌ఖాలీకి వెళ్తున్న బీజేపీ మహిళా నేతలను పోలీసులు కోల్‌కతా శివార్లలో అడ్డుకోవడంతో వారు నిరసన తెలిపారు.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
diksuchi@andhrajyothy.com
విజయవాడ ● శుక్రవారం 8 మార్చి 2024

# టీఎస్ ఐసెట్ నోటిఫికేషన్

తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి(టీఎస్‌సీహెచ్ఈ)- ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(టీఎస్ ఐసెట్) 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీని ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్, అనుబంధ కళాశాలల్లో ఎంబీఏ, ఎంసీఏ ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలు కల్పిస్తారు. ఈ పరీక్షని వరంగల్‌లోని కాకతీయ యూనివర్సిటీ నిర్వహిస్తోంది. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. పరీక్ష సిలబస్, మాక్ టెస్ట్‌ల వివరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.



### ఎంబీఏ, ఎంసీఏ కోర్సులు అందిస్తున్న యూనివర్సిటీలు

- ఉస్మానియా యూనివర్సిటీ, హైదరాబాద్
- కాకతీయ యూనివర్సిటీ, వరంగల్
- మహాత్మాగాంధీ యూనివర్సిటీ, నల్లగొండ
- పాలమూరు యూనివర్సిటీ, మహబూబ్‌నగర్
- శాతవాహన యూనివర్సిటీ, కరీంనగర్
- తెలంగాణ యూనివర్సిటీ, నిజామాబాద్
- డా.బీఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ, హైదరాబాద్
- ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ, హైదరాబాద్
- జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ, హైదరాబాద్

**అర్హత:** ఎంబీఏలో ప్రవేశానికి ద్వితీయశ్రేణి మార్కులతో బీఏ/బీకాం/బీఎస్సీ/బీబీఏ/బీబీఎం/బీసీఏ/బీఈ/బీటెక్/బీఫార్మసీ ఉత్తీర్ణులై ఉండాలి.

- ఎంసీఏలో ప్రవేశానికి మేథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా ఇంటర్ ఉత్తీర్ణతతోపాటు కనీసం 50 శాతం మార్కులతో బీసీఏ/బీఎస్సీ/బీకాం/బీఏ పూర్తిచేసి ఉండాలి.
- ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు; డిస్టెన్స్/ఓపెన్ డిస్టెన్స్ లెర్నింగ్ విధానాల్లో డిగ్రీ చదివినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. డిగ్రీ స్థాయిలో కనీసం 50 శాతం మార్కులు తప్పనిసరి.
- అభ్యర్థుల వయసు 2024 మార్చి 5 నాటికి 19 ఏళ్లు నిండి ఉండాలి. గరిష్ఠ వయోపరిమితి నిబంధనలు లేవు.

**టీఎస్ ఐసెట్ వివరాలు:** దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. అన్నీ మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలే ఇస్తారు. పరీక్ష సమయం రెండున్నర గంటలు. మొత్తం మార్కులు 200. ఈ పరీక్షలో మూడు సెక్షన్‌లు ఉంటాయి. అనలిటికల్ ఎబిలిటీ సెక్షన్‌లో డేటా సఫిషియెన్సీ నుంచి 20 ప్రశ్నలు, ప్రాబ్లం సాల్వింగ్ (సిరీస్, డేటా అనాలిసిస్, కోడింగ్ అండ్ డీకోడింగ్, డేట్, టైం, అరేంజ్‌మెంట్) అంశాల నుంచి 55 ప్రశ్నలు; మేథమెటిక్ ఎబిలిటీ సెక్షన్‌లో అర్థమెటికల్ ఎబిలిటీ నుంచి 35, ఆల్జీబ్రిక్ అండ్ జామెట్రికల్ ఎబిలిటీ నుంచి 30, స్టాటిస్టికల్ ఎబిలిటీ నుంచి 10 ప్రశ్నలు; కమ్యూనికేషన్ ఎబిలిటీ సెక్షన్‌లో మీనింగ్స్, సినోనమ్స్-ఆంటోనమ్స్, వర్బ్(టెన్స్-వాయిస్), ఫ్రేజల్ వర్బ్స్-ఇడియమ్స్, ఆర్టికల్స్-ప్రిపోజిషన్స్, కంప్యూటర్ టర్మినాలజీ, బిజినెస్ టర్మినాలజీ అంశాల నుంచి ఒక్కోదానిలో 5 ప్రశ్నలు, కాంప్రహెన్షన్ నుంచి 15 ప్రశ్నలు అడుగుతారు. కమ్యూనికేటివ్ ఎబిలిటీ ప్రశ్నలను ఆంగ్ల మాధ్యమంలో మాత్రమే ఇస్తారు. మిగిలిన ప్రశ్నలను ఇంగ్లీష్-తెలుగు, ఇంగ్లీష్-ఉర్దూ మాధ్యమాల్లో ఇస్తారు. ఈ పరీక్షలో అర్హత సాధించాలంటే కనీసం 25 శాతం మార్కులు రావాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఈ నిబంధన వర్తించదు.

#### ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.750; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.550
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 30
- **కరెక్షన్ విండో ఓపెన్:** మే 17 నుంచి 20 వరకు
- **హాల్‌టికెట్స్ డౌన్‌లోడింగ్:** మే 28 నుంచి
- **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, నల్లగొండ, కోదాడ, మహబూబ్‌నగర్, సత్తుపల్లి, సంగారెడ్డి, ఆదిలాబాద్, నిజామాబాద్, నర్సంపేట్, వరంగల్, కర్నూలు, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం.
- **టీఎస్ ఐసెట్ తేదీలు:** జూన్ 4, 5
- **వెబ్‌సైట్:** https://icet.tsche.ac.in

# నిట్ వరంగల్‌లో పీజీ, పీహెచ్‌డీ

*వరంగల్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్ వరంగల్)- ఎంబీఏ, ఎంటెక్(సెల్ఫ్ ఫైనాన్స్), పీహెచ్‌డీ జులై సెషన్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి విడివిడిగా నోటిఫికేషన్‌లు విడుదల చేసింది. దేశవ్యాప్తంగా ఆసక్తి గల అభ్యర్థులందరూ దరఖాస్తు చేసుకోవచ్చు. ● వెబ్‌సైట్: www.nitw.ac.in*

### ఎంబీఏ

సంస్థ ఆధ్వర్యంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్(డీఓఎంఎస్) ఈ ప్రోగ్రామ్‌ని నిర్వహిస్తుంది. ఇది రెండేళ్ల వ్యవధి గల ఫుల్ టైమ్ ప్రోగ్రామ్. ఇందులో నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా ఫండమెంటల్ కోర్సులు, ల్యాబ్స్, నాన్ క్రెడిట్ కోర్సులు, సమ్మర్ ట్రెయినింగ్, ప్రాజెక్ట్ వర్క్‌లు ఉంటాయి. క్యాట్/మ్యాట్/జీమ్యాట్ వ్యాలిడ్ స్కోర్, అకడమిక్ ప్రతిభ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి మెరిట్ ప్రకారం ప్రవేశాలు కల్పిస్తారు. మొత్తం 77 సీట్లు ఉన్నాయి.

**అర్హత:** గుర్తింపు పొందిన కాలేజీ నుంచి ప్రథమ శ్రేణి మార్కులతో ఏదేని బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 55 శాతం మార్కులు చాలు. క్యాట్/మ్యాట్/జీమ్యాట్ వ్యాలిడ్ స్కోర్ తప్పనిసరి.

**దరఖాస్తు ఫీజు:** జనరల్, ఈడబ్ల్యూఎస్, ఓబీసీ అభ్యర్థులకు రూ.1600; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.800

**ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 16

**గ్రూప్ డిస్కషన్స్, పర్సనల్ ఇంటర్వ్యూలకు ఎంపికైన అభ్యర్థుల షార్ట్‌లిస్ట్ విడుదల:** ఏప్రిల్ 30

**గ్రూప్ డిస్కషన్స్, పర్సనల్ ఇంటర్వ్యూలు:** మే 20 నుంచి 22 వరకు

**ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** మే 31

### పీహెచ్‌డీ

ఫుల్ టైం, పార్ట్ టైం విధానాల్లో ప్రోగ్రామ్ అందుబాటులో ఉంది. మొత్తం 13 కేటగిరీల్లో అడ్మిషన్స్ నిర్వహిస్తారు. ఫుల్ టైం ప్రోగ్రామ్‌లో ఇన్‌స్టిట్యూట్ ఫెలోషిప్, ప్రభుత్వ ఫెలోషిప్, ప్రాజెక్ట్ ఫెలోస్, స్పాన్సర్డ్, ఎక్స్‌టర్నల్, సెల్ఫ్ ఫైనాన్సింగ్ తదితర కేటగిరీలు; పార్ట్ టైం ప్రోగ్రామ్‌లో పర్మినెంట్ ఫ్యాకల్టీ కేటగిరీలు ఉన్నాయి. అకడమిక్ ప్రతిభ, అనుభవం, జాతీయ పరీక్ష స్కోర్ (గేట్/నెట్/ఇన్‌స్పయిర్) ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు రాత పరీక్ష, ఇంటర్వ్యూ నిర్వహించి మెరిట్ ప్రకారం అర్హులకు ప్రవేశాలు కల్పిస్తారు. ఫుల్ టైం పీహెచ్‌డీ ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. డాక్టోరల్ కమిటీ అనుమతి మేరకు మరో ఏడాది పొడిగించే వీలుంది.

**విభాగాలు:** సివిల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, మెటలర్జికల్ అండ్ మెటీరియల్స్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, బయోటెక్నాలజీ, మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, మేనేజ్‌మెంట్ స్టడీస్

**అర్హత:** సంబంధిత స్పెషలైజేషన్‌తో ఎంఈ/ఎంటెక్/ఎమ్మెస్సీ/ఎంఎస్-రీసెర్చ్ ఉత్తీర్ణులై ఉండాలి. డిగ్రీ, పీజీ స్థాయిల్లో ప్రథమశ్రేణి మార్కులు ఉండాలి. ఇంజనీరింగ్ విభాగాలకు కనీసం 75 శాతం మార్కులతో బీఈ/బీటెక్ పూర్తిచేసి గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉన్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్‌కు ఏదేని డిగ్రీతోపాటు పీజీ(ఇంగ్లిష్); మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగానికి రెండేళ్ల పీజీడీఎం/సీఏ/సీఎస్/ఐసీడబ్ల్యూఏఐ ఉత్తీర్ణులై ఉండాలి. విభాగాన్ని అనుసరించి గేట్/జెస్ట్/యూజీసీ నెట్/సీఎస్ఐఆర్ నెట్/ఇన్‌స్పయిర్/డీబీటీ జేఆర్ఎఫ్/జీప్యాట్/ఐసీఎంఆర్/ఐడీఆర్‌బీటీ/క్యాట్/జీమ్యాట్ అర్హత ఉండాలి. పార్ట్ టైం ప్రోగ్రామ్‌లో చేరేవారికి ఈ అర్హత తప్పనిసరి కాదు. నిట్ వరంగల్ సహా ఇతర ప్రభుత్వ/ప్రైవేట్ అకడమిక్ సంస్థల్లోని లెక్చరర్లు/ప్రొఫెసర్లు, పీఎస్‌యూల్లో పనిచేస్తున్నవారు, ప్రముఖ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సంస్థలు/ల్యాబొరేటరీల ఉద్యోగులు పార్ట్ టైం ప్రోగ్రామ్‌నకు అప్లయ్ చేసుకోవచ్చు. వీరికి నిబంధనల మేరకు కనీసం మూడేళ్ల అనుభవం తప్పనిసరి. నిట్ వరంగల్ ఫ్యాకల్టీ మెంబర్లకు రాత పరీక్ష నుంచి మినహాయింపు వర్తిస్తుంది.



**దరఖాస్తు ఫీజు:** జనరల్, ఈడబ్ల్యూఎస్, ఓబీసీ అభ్యర్థులకు రూ.1600; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.800 **చివరి తేదీ:** ఏప్రిల్ 3

**రిటెన్ టెస్ట్‌కు ఎంపికైన అభ్యర్థుల షార్ట్‌లిస్ట్ విడుదల:** ఏప్రిల్ 16

**రిటెన్ టెస్ట్/ఇంటర్వ్యూలు:** ఏప్రిల్ 29 నుంచి మే 2 వరకు

**ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** మే 14

### ఎంటెక్(సెల్ఫ్ ఫైనాన్స్)

ఇది ఫుల్ టైమ్ రెసిడెన్షియల్ ప్రోగ్రామ్. అకడమిక్ మెరిట్ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు రిటెన్ టెస్ట్/ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు. రిటెన్ టెస్ట్ గేట్ సిలబస్ ఆధారంగా ఉంటుంది. ఈ ప్రోగ్రామ్‌లో చేరే అభ్యర్థులకు రిజర్వేషన్‌లు వర్తించవు. వర్కింగ్ పర్సన్స్- పనిచేస్తున్న సంస్థ నుంచి 'నో అబ్జెక్షన్' సర్టిఫికెట్‌ను తప్పనిసరిగా సబ్మిట్ చేయాలి.

**విభాగాలు-స్పెషలైజేషన్‌లు:**

- **సివిల్ ఇంజనీరింగ్:** ఇంజనీరింగ్ స్ట్రక్చర్స్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్, జియో ఇన్ఫర్మాటిక్స్, జియో టెక్నికల్ ఇంజనీరింగ్, వాటర్ రిసోర్సెస్ ఇంజనీరింగ్, ట్రాన్స్‌పోర్టేషన్ ఇంజనీరింగ్, కన్‌స్ట్రక్షన్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్
- **ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్:** పవర్ ఎలక్ట్రానిక్స్ అండ్ డ్రైవ్స్, పవర్ సిస్టమ్స్ ఇంజనీరింగ్, స్మార్ట్ ఎలక్ట్రిక్ గ్రిడ్
- **ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ & కెమికల్ ఇంజనీరింగ్ (జాయింట్ కోర్సు):** కంట్రోల్ అండ్ ఆటోమేషన్
- **మెకానికల్ ఇంజనీరింగ్:** థర్మల్ ఇంజనీరింగ్, మాన్యుఫాక్చరింగ్ ఇంజనీరింగ్, కంప్యూటర్ ఇంటిగ్రేటెడ్ మాన్యుఫాక్చరింగ్, మెషిన్ డిజైన్, ఆటోమొబైల్ ఇంజనీరింగ్
- **ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్:** ఎంబెడెడ్ అండ్ మెషిన్ లెర్నింగ్ సిస్టమ్, వీఎల్ఎస్ఐ సిస్టమ్స్ డిజైన్, అడ్వాన్స్‌డ్ కమ్యూనికేషన్ సిస్టమ్స్
- **మెటలర్జికల్ అండ్ మెటీరియల్స్ ఇంజనీరింగ్:** మెటీరియల్స్ టెక్నాలజీ, వెల్డింగ్ టెక్నాలజీ అండ్ నాన్ డిస్ట్రక్టివ్ టెస్టింగ్
- **కెమికల్ ఇంజనీరింగ్:** కెమికల్ ఇంజనీరింగ్, సస్టయినబుల్ ఎనర్జీ జెనరేషన్ అండ్ స్టోరేజ్ టెక్నాలజీస్
- **కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్:** కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ
- బయోటెక్నాలజీ

**అర్హత:** విభాగం-స్పెషలైజేషన్‌ను అనుసరించి సంబంధిత సబ్జెక్టులతో బీఈ/బీటెక్/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. డిగ్రీ స్థాయిలో జనరల్ అభ్యర్థులకు ప్రథమ శ్రేణి మార్కులు; రిజర్వ్‌డ్ వర్గాల అభ్యర్థులకు 55 శాతం మార్కులు ఉండాలి.

**దరఖాస్తు ఫీజు:** రూ.1600

**ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 30

**రిటెన్ టెస్ట్/ఇంటర్వ్యూకి ఎంపికైన అభ్యర్థుల షార్ట్ లిస్ట్ విడుదల:** మే 14

**రిటెన్ టెస్ట్/ఇంటర్వ్యూ:** జూన్ 3 నుంచి 6 వరకు

**ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** జూన్ 14

# జాబ్ కార్నర్

## గోవా షిప్‌యార్డ్‌లో టెక్నికల్ అసిస్టెంట్‌లు

ఖాళీలు 106

గోవా షిప్‌యార్డ్ లిమిటెడ్...శాశ్వత ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. అసిస్టెంట్ సూరింటెండెంట్(హెచ్‌ఆర్): **2 పోస్టులు**
2. అసిస్టెంట్ సూపరిటెండెంట్(హిందీ ట్రాన్స్‌లేటర్): **1 పోస్టు**
3. అసిస్టెంట్ సూపరింటెండెంట్(సీఎస్): **1 పోస్టు**
4. టెక్నికల్ అసిస్టెంట్(ఎలక్ట్రికల్): **4 పోస్టులు**
5. టెక్నికల్ అసిస్టెంట్(ఇన్‌స్ట్రుమెంటేషన్): **1 పోస్టు**
6. టెక్నికల్ అసిస్టెంట్(మెకానికల్):**4 పోస్టులు**
7. టెక్నికల్ అసిస్టెంట్(షిప్ బిల్డింగ్): **20 పోస్టులు**
8. టెక్నికల్ అసిస్టెంట్(సివిల్): **1 పోస్టు**
9. టెక్నికల్ అసిస్టెంట్(ఐటీ): **1 పోస్టు**
10. ఆఫీస్ అసిస్టెంట్ - క్లరికల్ స్టాఫ్: **32 పోస్టులు**
11. ఆఫీస్ అసిస్టెంట్(ఫైనాన్స్/ఐఏ): **6 పోస్టులు**
12. పెయింటర్: **20 పోస్టులు**
13. వెహికల్ డ్రైవర్: **5 పోస్టులు**
14. రికార్డ్ కీపర్: **3 పోస్టులు**
15. కుక్(ఢిల్లీ ఆఫీస్): **1 పోస్టు**
16. కుక్: **2 పోస్టులు**
17. ప్లంబర్: **1 పోస్టు**
18. సేఫ్టీ స్టీవర్డ్: **1 పోస్టు**

**అర్హత:** పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో బీబీఏ, గ్రాడ్యుయేట్, ఇంజనీరింగ్ పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లొమా, డిగ్రీ, బీఏ, బీఎస్‌డబ్ల్యూ.

**దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 27

**వెబ్‌సైట్:** https://goashipyard.in/

## ఢిల్లీ పోలీస్, సీఏపీఎఫ్‌లో ఎస్ఐ ఉద్యోగాలు

ఖాళీలు 4187

స్టాఫ్ సెలెక్షన్ కమిషన్... ఢిల్లీ పోలీస్, సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్(సీఏపీఎఫ్)లో సబ్ ఇన్‌స్పెక్టర్ నియామక పరీక్ష-2024కు సంబంధించిన నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ పరీక్ష ద్వారా ఢిల్లీ పోలీస్ విభాగంతో పాటు కేంద్ర సాయుధ బలగాలైన(సీఏపీఎఫ్), బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్, ఐటీబీపీ, ఎస్ఎస్‌బీలో సబ్ ఇన్‌స్పెక్టర్ ఉద్యోగాలు భర్తీ చేస్తారు.

#### ఖాళీల వివరాలు

1. సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్(బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్, ఐటీబీపీ, ఎస్ఎస్‌బీ)లో సబ్ ఇన్‌స్పెక్టర్(జీడీ): **4,001 పోస్టులు**
2. ఢిల్లీ పోలీస్ విభాగంలో సబ్ ఇన్‌స్పెక్టర్(ఎగ్జిక్యూటివ్) - పురుషులు: **125 పోస్టులు**
3. ఢిల్లీ పోలీస్ విభాగంలో సబ్ ఇన్‌స్పెక్టర్(ఎగ్జిక్యూటివ్)- మహిళలు: **61 పోస్టులు**

**అర్హత:** గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి బ్యాచిలర్ డిగ్రీతో పాటు నిర్దిష్ట శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి.



**వయోపరిమితి:** 2024 ఆగస్టు 1 నాటికి 20-25 సంవత్సరాల మధ్య ఉండాలి.

**జీతభత్యాలు:** నెలకు రూ.35,400 - రూ.1,12,400

**ఎంపిక ప్రక్రియ:** సీబీటీ రాత పరీక్ష, శారీరక దారుఢ్య పరీక్ష(పీఈటీ)/ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్(సీఎస్‌టీ), డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ తదితరాల ఆధారంగా ఎంపిక చేస్తారు.

**దరఖాస్తు రుసుము:** రూ.100. ఎస్సీ/ఎస్టీ/మహిళలు/ఎక్స్-సర్వీస్‌మన్ అభ్యర్థులకు ఫీజు చెల్లింపు నుంచి మినహాయింపు ఉంది.

**తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** గుంటూరు, కర్నూలు, రాజమండ్రి, తిరుపతి, విశాఖపట్నం, విజయవాడ, కాకినాడ, నెల్లూరు, చీరాల, విజయనగరం, హైదరాబాద్, వరంగల్, కరీంనగర్.

**ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 28

**కంప్యూటర్ ఆధారిత పరీక్ష తేదీలు:** 2024 మే 9, 10, 13

**వెబ్‌సైట్:** https://ssc.gov.in/

## డీఆర్‌డీవోలో జేఆర్ఎఫ్‌లు

న్యూఢిల్లీలోని డీఆర్‌డీవో - సైంటిఫిక్ అనాలసిస్ గ్రూప్... ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

**ఖాళీలు:** 19

**అర్హత:** సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్, ఎంఈ/ఎంటెక్, ఎమ్మెస్సీ ఉత్తీర్ణతతో పాటు నెట్/గేట్ స్కోరు సాధించి ఉండాలి.

**వేతనం:** నెలకు రూ.37,000

**వయోపరిమితి:** 28 ఏళ్లు మించకూడదు

**ఇంటర్వ్యూ తేదీ:** మార్చి 18

**వెబ్‌సైట్:** www.drdo.gov.in/

## టీహెచ్ఎస్‌టీఐలో ప్రాజెక్ట్ టెక్నికల్ ఆఫీసర్లు

గురుగ్రామ్‌లోని బ్రిక్‌కు చెందిన ట్రాన్స్‌లేషనల్ హెల్త్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఇన్‌స్టిట్యూట్(టీహెచ్ఎస్‌టీఐ)...ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

1. ప్రాజెక్ట్ రీసెర్చ్ సైంటిస్ట్-1: **1 పోస్టు**
2. ప్రాజెక్ట్ టెక్నికల్ ఆఫీసర్: **1 పోస్టు**
3. ప్రాజెక్ట్ రీసెర్చ్ సైంటిస్ట్-3: **1 పోస్టు**
4. ప్రాజెక్ట్ టెక్నికల్ సపోర్ట్-3:**1 పోస్టు**

**అర్హత:** డిగ్రీ, లైఫ్ సైన్స్ విభాగంలో పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

**జీతం:** పోస్టును అనుసరించి రూ.35,000 నుంచి రూ.78,000 చెల్లిస్తారు.

**వయోపరిమితి:** రాత పరీక్ష, స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా ఉంటుంది.

**ఇంటర్వ్యూ తేదీలు:** మార్చి 19, 20, 27

**వేదిక:** టీహెచ్ఎస్‌టీఐ, ఎన్‌సీఆర్ బయోటెక్ సైన్స్ క్లస్టర్, 3వ మైల్‌స్టోన్, ఫరీదాబాద్- గురుగ్రామ్, ఎక్స్‌ప్రెస్‌వే, ఫరీదాబాద్.

**వెబ్‌సైట్:** https://thsti.res.in/

# లిటిల్స్





## దేశం- ఇండోనేషియా

- ఇండోనీషా, మలయ్ ద్వీపాల సముదాయంలో ఉండే దేశం ఇండోనేషియా. మనదేశంతో పాటు చైనా, ఆస్ట్రేలియాల మధ్య ఇండియన్, పసిఫిక్ మహాసముద్రాలలో విస్తరించి ఉందీ దేశం.
- ఈ దేశ రాజధాని పేరు జకర్తా.
- భూమిమీద ఒక్కశాతం భూమి ఉండే ఈ దేశంలో ప్రపంచంలోని పదిశాతం చెట్లు, 12 శాతం జంతువులు, 17 శాతం పక్షులూ ఇక్కడే ఉన్నాయి.




- 'కార్ప్స్ లిల్లీ' అనే పువ్వు ప్రపంచంలోనే అతి పెద్దది. 27 కోట్ల జనాభా ఉండే ఈ దేశంలో 700 భాషలు ఉన్నాయి.
- పంక జయా అనే ప్రాంతం భూమిమీద అతి ఎత్తయిన ఐలాండ్. సముద్ర మట్టానికి 4884 మీటర్ల ఎత్తులో ఉంది.
- 17,504 ఐలాండ్స్ సముదాయమే ఇండోనేషియా.
- 9వ శతాబ్దంలో కట్టిన బుద్ధిజం టెంపుల్ ప్రపంచంలోనే అతి పెద్ద బుద్ధిస్ట్ టెంపుల్.
- 1512 సంవత్సరంలో మొదటిసారిగా పోర్చుగీసు నావికుడు ఫ్రాన్సిస్కో సెరారో ఈ దేశానికి వెళ్లాడు. ఆ తర్వాత డచ్, బ్రిటీష్ వాళ్లు ఇక్కడి వెళ్లారు.
- నెదర్లాండ్స్‌నుంచి స్వాతంత్ర్యం పొందింది 1945లోనే అయితే డిసెంబర్ 1949లో యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ ఇండోనేషియాగా ఆవిర్భవించింది.
- ఇండోనేషియా అనగానే మనదేశంలో చాలా మందికి గుర్తొచ్చే ప్రాంతం 'బాలి'.
- ప్రపంచంలోనే అతి పెద్ద గోల్డ్‌మైన్ ఇక్కడే ఉంది.
- ఇక్కడ ఫుట్‌బాల్ అభిమానులు ఎక్కువ. డచ్ ఈస్ట్ ఇండీస్ పేరుతో ఓ ఫుట్‌బాల్ టీమ్ తయారైంది. 1938 సంవత్సరంలో ఫిఫా వరల్డ్ కప్‌కు ఎంపికైన తొలి సౌతీస్ట్ దేశం ఇదే.

### దారి కనుక్కోండి



### ఎన్ని పక్షులు ఉన్నాయి?



### సరైన నీడ ఏది?



### డైలీ సుడోకు - 249

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | 2 | | | 4 | 5 | | | 7 |
| 4 | 8 | 9 | 2 | 1 | 7 | | | |
| | 6 | | | | | | | |
| | | 7 | | 3 | 9 | | 6 | |
| 5 | | | 4 | | 6 | | | 3 |
| | 1 | | 7 | 5 | | 4 | | |
| | | | | | | | 7 | |
| | | | 5 | 7 | 2 | 6 | 9 | 1 |
| 1 | | | 9 | 8 | | | 3 | |

సుడోకు - 248 సమాధానం

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 9 | 1 | 4 | 5 | 6 | 7 | 2 | 8 | 3 |
| 6 | 5 | 8 | 3 | 2 | 9 | 7 | 4 | 1 |
| 2 | 3 | 7 | 8 | 4 | 1 | 6 | 5 | 9 |
| 7 | 9 | 6 | 4 | 1 | 2 | 8 | 3 | 5 |
| 1 | 4 | 3 | 7 | 8 | 5 | 9 | 6 | 2 |
| 5 | 8 | 2 | 6 | 9 | 3 | 1 | 7 | 4 |
| 4 | 7 | 1 | 9 | 3 | 8 | 5 | 2 | 6 |
| 8 | 6 | 9 | 2 | 5 | 4 | 3 | 1 | 7 |
| 3 | 2 | 5 | 1 | 7 | 6 | 4 | 9 | 8 |

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.